www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
16 అనంతపురం
ఆదివారం 6 ఆగస్టు 2017


వెల్లివిరిసిన భక్తిభావం



ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో వ్రతం చేస్తున్న మహిళలు

గరుడ వాహనంపై ఊరేగిన నెట్టికంటి..
పోటెత్తిన మురడీ, నేమకల్లు
కిక్కిరిసిన ఖాదీశుడి ఆలయం
'అనంత'లో నేత్రపర్వంగా ఏడు శనివారాల వ్రతం

8



సేవ కోసం వచ్చి... ప్రాణాలు విడిచి..

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) చేస్తున్న సేవా కార్యక్రమాలను చూసి తమ వంతు సాయం చేయడానికి వచ్చిన సేవా తత్పరుల జీవితం అనుకోని విధంగా ముగిసింది. ఆర్డీటీ అంటే జిల్లాలో సేవకు పెట్టింది పేరు. అలాంటి సంస్థకు చేయూతనివ్వడానికి వచ్చిన స్పెయిన్ దేశస్థులు చిత్తూరు జిల్లా మదనపల్లి- పుంగనూరు రోడ్డులో యాతాలవంక సమీపంలో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందారు. వారి మరణంతో ఆర్డీటీలో విషాదచాయలు అలుముకున్నాయి. ఈనెల 1న స్పెయిన్ దేశానికి చెందిన ఫెరోజ్ మోరినా వీసెంటే ఆధ్వర్యంలో 13 మంది ఆర్డీటీకి వచ్చారు. ఇక్కడ క్షేత్రస్థాయిలో ఆ ట్రస్ట్ సేవలను పరిశీలించారు. ఈ క్రమంలోనే స్పెయిన్‌కు తిరుగుప్రయాణంలో భాగంగా పాండిచ్చేరికి వెళ్లి అక్కడ సైడ్ సీన్స్ చూసి, చెన్నైకు చేరుకొని స్పెయిన్‌కు వెళ్లాలని ఆ బృందం నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు ప్రైవేటు ట్రావెల్‌లో బయలుదేరారు. ఇంతలోనే మృత్యువు కంటైనర్ రూపంలో వారిలో నలుగురిని కబళించింది.





చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు

మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

వివరాలు 6 లో

- చిత్తూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం
- నలుగురు స్పెయిన్ దేశస్థుల దుర్మరణం..
- వారితో పాటు వ్యాన్ డ్రైవర్ మృతి
- మరో తొమ్మిది మందికి గాయాలు
- క్షతగాత్రులకు బెంగళూరులో చికిత్సలు
- ఆర్డీటీలో విషాదం
- తరలి వెళ్లిన ఆర్డీటీ ప్రముఖులు

పండిట్ల రీ కౌన్సెలింగ్

పూర్తి

సర్వర్ సమస్యతో నత్తనడకన ప్రక్రియ

752 మందికి పోస్టింగ్‌లు

మిగులు ఉపాధ్యాయులు 61 మంది

- డీఈఓ పూల్‌లో నిల్వ..

వివరాలు 16లో...



కౌన్సెలింగ్‌లో తమ వంతు కోసం వేచి ఉన్న ఉపాధ్యాయులు

వామ్మో! సిగరెట్లు

- ప్రత్యక్ష దోపిడీ
- రోజూ రూ.21 లక్షలకు పైగా అక్రమార్జన
- అమాంతంగా సిగరెట్ ధరల పెంపు
- ఏడాదిలోనే రెండు సార్లు పొగరాయుళ్లకు చుక్కలు
- నెలకు రూ.70 కోట్ల సిగరెట్లు ఊదేస్తున్న వైనం
- ఒక్కో ప్యాక్‌పై రూ.23 అదనపు వసూలు
- ముద్రించిన ధరకు, అమ్మకపు ధరకు పొంతన లేని వైనం
- చిత్తుపేపర్‌పై రాసిన రాతలే బిల్లులట
- కృత్రిమ కొరత సృష్టించి మరీ అమ్మకాలు
- 30శాతంపైగా జీరో వ్యాపారం
- పట్టించుకోని పన్నుల శాఖ అధికారులు

వివరాలు 12

పొగ తాగడం.. ఒక అలవాటు.. బలహీనత.. దాన్నే సిగరెట్ల వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఎంతగా అంటే కళ్లు తిరిగేంతగా.. కృత్రిమ కొరత సృష్టిస్తూ.. అనధికారికంగా ధర పెంచుతూ.. జేబులు నింపుకుంటున్నారు. జనం అలవాటునే కాదు.. ప్రభుత్వ అసమర్థతను, అధికారుల అవినీతిని కూడా అలుసుగా తీసుకుని జీరో వ్యాపారం చేస్తున్నారు. ప్రభుత్వానికి పన్నులు ఎగవేస్తున్నారు. బిల్లులు లేకుండా చిత్తుకాగితాలపై సరుకు సరఫరా చేస్తూ.. దర్జాగా దొంగ పని చేస్తున్నారు. అందరికీ సవాల్ విసురుతున్నారు. పొగమత్తులో వినియోగదారులు, మామూళ్లమత్తులో అధికారులు జోగుతున్నంతకాలం వ్యాపారుల పని మూడు పువ్వులు.. ఆరు కాయలే..



7

మేమెక్కరమేనా.. కల్తీ చేస్తుండేది?

విజిలెన్స్ అధికారుల ఎదుట ప్రేమ్‌జీ ఫ్యాక్టరీ నిర్వాహకురాలి ఆవేదన..

మార్కెట్‌లోకొచ్చే ప్రతి వస్తువూ

కల్తీనే!



వస్తువులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గనుల శాఖలో కలకలం

- ఒకేసారి ఇద్దరు ఏడీల ఔట్
- విధుల్లో నిర్లక్ష్యమే కారణం
- ఏడీ వెంకటరావును సరెండర్ చేసిన కలెక్టర్
- విజిలెన్స్ ఏడీ శంకర్‌నారాయణ సస్పెన్షన్

అనంతపురం జిల్లాపరిషత్తు: గనులు, భూగర్భ శాఖలో ఒకేసారి ఇద్దరు ఉన్నతాధికారులపై వేటు వేయడం జిల్లాలో కలకలం సృష్టించింది. ఓ అధికారిని సరెండర్ చేయగా.. మరొకరిని సస్పెండ్ చేశారు. గనులశాఖ అనంతపురం రెగ్యులర్ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ) వెంకటరావును జిల్లా కలెక్టర్ వీరపాండ్యన్ సరెండర్ చేసి..ఆ శాఖ ఉన్నతాధికారుల వద్ద రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. అలాగే గనుల శాఖ విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ) శంకర్ నారాయణను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు కీలక అధికారులపై వేటు పడడంతో ఆ శాఖవర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. అధికారిక ఉత్తర్వులు సోమవారం వెలువడుతాయని ఆశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజబాబు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యమే కారణం..

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే వారిపై చర్యలకు ఉప్రకమించినట్లు తెలుస్తోంది. మూడు రోజులక్రితం జిల్లా కలెక్టర్ వీరపాండ్యన్ గనుల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. అంతకుముందే సంబంధిత నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని ఇసుక కమిటీ కన్వీనర్ అయిన అనంతపురం ఏడీ వెంకటరావును ఆదేశించారు. సమావేశానికి తాడిపత్రి ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డితో పాటు వెంకటరావు కూడా హాజరయ్యారు. జిల్లాలో ఇసుక రీచ్‌ల పరిస్థితి ఎలా ఉంది?, అవసరమైన ఇసుక ఎన్ని రీచ్‌లలో ఉంది? కొత్తగా ఎన్ని రీచ్‌లు అందుబాటులో ఉన్నాయి? తదితర వివరాలుఆరా తీశారు. అయితే ఇసుక రీచ్‌లు, ఎంత ఇసుక ఉందనే వివరాలు అందజేయడంలో ఏడీ వెంకటరావు విఫలమైనట్లు తెలిసింది. ఆ సమయంలో కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఉన్నతాధికారికి ఆ వివరాలు తెలియకపోతే ఎలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో సరెండర్ చేస్తానని హెచ్చరించారు. అనుకున్నట్లుగానే కలెక్టర్ ఆయనను సరెండర్ చేసి ఆ శాఖ ఉన్నతాధికారుల వద్ద రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. ఆయన స్థానంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజబాబును ఇన్‌చార్జి ఏడీగా నియమిస్తూ గనుల శాఖ కార్యదర్శి శ్రీధర్ ఆదేశాలిచ్చారు.

రూ.60 కోట్ల జరిమానాకు డిమాండ్ నోటీసు ఇవ్వలేదని

విజిలెన్స్ ఏడీ సస్పెన్షన్

తనిఖీ చేసిన క్వారీ యజమానులకు డిమాండ్ నోటీసు పంపడంలో అలసత్వం వహించినందుకు గాను విజిలెన్స్ ఏడీ శంకర్ నారాయణపై సస్పెన్షన్ వేటు వేశారు. జిల్లాలో గనుల శాఖ విజిలెన్స్ ఏకైక కార్యాలయం గుత్తిలో ఉంది. అక్కడ అసిస్టెంట్ డైరెక్టర్, అసిస్టెంట్ జియాలజిస్టులు ఉన్నతాధికారులు. ఈ విజిలెన్స్ అధికారులకు అనంతపురం, కర్నూలు జిల్లాల్లో తనిఖీలు చేపట్టే అధికారం ఉంది. ఆ శాఖ వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు....కర్నూలు జిల్లా డోన్ సమీపంలోని క్వార్జ్ క్వారీలో అక్రమాలు జరుగుతున్నట్లు ఆరు నెలల క్రితం ఆ శాఖ ఉన్నతాధికారులకు సమాశారం అందింది. ఆ మేరకు తనిఖీలు చేపట్టాని విజిలెన్స్ ఏడీ శంకరనారాయణను ఆదేశించారు. వారి ఆదేశాలతో ఆ అధికారి తనిఖీలు చేపట్టారు. సంబంధిత నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. వాటిని పరిశీలించిన ఆ అధికారులు రూ.60కోట్ల వరకు జరిమానా విధించారు. సంబంధిత క్వారీ యజమానులకు జరిమానా చెల్లించాలని డిమాండ్ నోటీసును మూడు నెలల తరువాత ఉన్నతాధికారులు ఏడీకి పంపారు. కానీ రెండు నెలలు గడిచినా ఆయన ఆ క్వారీ యజమానులకు పంపకుండా ద్నా పక్కన పెట్టేసినట్లు తెలిసింది. ఆయన నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన గనుల శాఖ కార్యదర్శి శ్రీధర్ శనివారం ఏడీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విజిలెన్స్ ఏడీ స్థానంలో తాడిపత్రి రెగ్యులర్ ఏడీ వెంకటేశ్వర్‌రెడ్డిని లేదా కర్నూలు జిల్లా బనగానపల్లి ఏడీ వెంకటరెడ్డిని నియమించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. అయితే ఇందుకు తాడిపత్రి ఏడీ సుముఖంగా లేనట్లు తెలిసింది.

10 రోజుల్లో బయోమెట్రిక్ యంత్రాలు : డీడీ




హాజరైన వార్డన్లు, మాట్లాడుతున్న డీడీ రమాభార్గవి

అనంతపురం సెంట్రల్: 'వసతి గృహాల్లో ప్రతిదీ లెక్కచూపాల్సి ఉంటుంది. అందుకను గుణంగానే బడ్జెట్ కేటాయింపులుంటాయ్.. ప్రధానంగా విద్యార్థులు, సిబ్బందికి బయోమెట్రిక్ తప్పనిసరిగా అమలు చేయాల్సిందే..' అని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రమాభార్గవి పేర్కొన్నారు. స్థానిక వసతిగృహ సర్కిల్‌లో వార్డన్లతో శనివారం ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... బయోమెట్రిక్ హాజరు అమలు చేయడంలో సాకులు చెబితే కుదరదన్నారు. మరో 10 రోజుల్లో నూతన బయోమెట్రిక్ యంత్రాలు అందజేస్తామన్నారు. ప్రణాళిక ప్రకారం హాజరు నమోదు చేయాల్సిందేనని ఆదేశించారు. అలాగే వసతి గృహాలకు నూతన మెనూ వచ్చిందని, దాని అమలుకు శ్రీకారం చుట్టాలన్నారు. బయోమెట్రిక్ యంత్రాలు సరిగ్గా పనిచేయకపోవడంతో ఇబ్బందికరంగా ఉందని వార్డన్లు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన ఆమె సమస్యలు తలెత్తకుండా నూతన బయోమెట్రిక్ యంత్రాలు అందిస్తామని, ఉదయాన్నే హాజరు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏబీసీడబ్ల్యూలు మల్లికార్జున, రామాంజనేయులు, నరసయ్య, పృధ్వీక, క్రిష్ణయ్య, వార్డన్లు రామచంద్రారెడ్డి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ'

అనంతపురం కలెక్టరేట్: జిల్లావ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రకృతి వ్యవసాయం సలహాదారుడు విజయ్‌కుమార్ సూచించారు. అన్ని జిల్లాల అధికారులతో శనివారం ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ-2 ఖాజామొహిద్దీన్, జేడీఏ శ్రీరామమూర్తితోపాటు ఏడీఏలు, ప్రకృతి వ్యవసాయం అమలు జరిగే 26 మండలాల వ్యవసాయ అధికారులు హాజరయ్యారు. అన్ని క్లస్టర్లల్లో నిర్దేశించిన మేరకు ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అక్టోబర్ 5-9వరకు రాయలసీమ జిల్లాలతోపాటు నెల్లూరు, ప్రకాశం రైతులకు అనంతలో సుభాష్‌పాలేకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణకార్యక్రమం నిర్వహించాలన్నారు. ఆ మేరకు ముందస్తుగా ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీడీఏ సురేంద్రబెనర్జీ, ఆత్మా పీడీ నాగన్న పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రూప్-3 పరీక్ష

- పకడ్బందీగా నిర్వహించాలి
- డీఆర్ఓ మల్లీశ్వరి ఆదేశం

అనంతపురం కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం నుంచి రెండు రోజులపాటు గ్రూప్-3 పంచాయతీ సెక్రటరీ పోస్టులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఆర్ఓ మల్లీశ్వరి తెలిపారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో పరీక్షనిర్వహణ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఆదివారం జిల్లాలోని 12 కేంద్రాల్లో 1735 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. ఈనెల 7న ఆరు కేంద్రాల్లో 899 మంది అభ్యర్థులు మొత్తం 2,634 మంది పరీక్షకు హాజరవుతున్నారన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఆయా కేంద్రాల్లో పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్ తీసుకొని రావాలన్నారు. వెరిఫికేషన్ కోసం పాస్‌పోర్టు, పాన్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, ప్రభుత్వ ఉద్యోగి కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర వాటిలో ఏదో ఒకటి తీసుకురావాలన్నారు.

ఉదయం పరీక్షకు 8 నుంచి 9 గంటల్లోపు , మధ్యాహ్నం పరీక్షకు 1.30 గంటల నుంచి 2.30 వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నామన్నారు. ఈమేరకు పక్కాగా నిబంధనలు అమలు జరిగేలా చూడాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ల నుంచి పరీక్షల సమయంలో పరీక్షకేంద్రాల వరకు ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎస్కేయూలో యోగా డిప్లమో కోర్సులు

వీసీ ఆచార్య రాజగోపాల్

ఎస్కేయూ: ఎస్కేయూలో 2017-18 విద్యాసంవత్సరం నుంచే సెల్ఫ్‌ఫండింగ్ విధానంలో యోగా సర్టిఫికెట్, డిప్లమో కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు వైస్ చాన్సలర్ ఆచార్య రాజగోపాల్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి సిలబస్ సిద్ధం చేయాలని ఆదేశాలు జారీచేశారు. వర్సిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో వీసీ రాజగోపాల్ అధ్యక్షతన శనివారం స్పోర్ట్స్ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను స్టేడియం గ్రౌండ్‌లోకి ఆహ్వానించి వారిచేత వివిధ గేమ్స్, స్పోర్ట్స్ ఆడించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. వర్సిటీలో ఫిజికల్ ఫిట్‌నెస్ కార్యక్రమాలు ముమ్మరం చేయాలన్నారు. స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ను కరికులమ్‌లో అంతర్భాగం చేయాలని సూచించారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య లజపతిరాయ్ మాట్లాడుతూ.. వర్సిటీలో క్రీడాసంస్కృతి పెంపొందించడానికి సెలబ్రిటీస్‌ను వర్సిటీకి ఆహ్వానించి విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలన్నారు.

అనంతరం క్రీడా కార్యదర్శి డాక్టర్ జెస్సీ 2017-18 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇంటర్ కాలేజీ టోర్నమెంట్ షెడ్యూల్ వివరాలు ప్రకటించారు. 19వ తేదీ నుంచి 21 వరకు ధర్మవరం కేహెచ్‌జీడీసీలో చెస్, బాల్‌బ్యాడ్మింటన్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, యోగా, త్రోబాల్, 29 నుంచి 31 వరకు అనంతపురం ఎస్ఎస్‌బీఎన్‌లో ఖోఖో, బ్యాడ్మింటన్, జూడో అండ్ తైక్వాండో, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, 8 నుంచి 10వ తేదీ వరకు ఉరవకొండ జీడీఎల్‌లోహాకీ, హ్యాండ్‌బాల్, వాలీబాల్, బాక్సింగ్, ఫెన్సింగ్, 6 నుంచి 8వ తేదీ వరకు అనంతపురం జీడీసీలో బాల్‌బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖో..ఖో, బ్యాడ్మింటన్, హాకీ, జూడో, తైక్వాండో, ఫెన్సింగ్, టెన్నిస్, యోగా, చెస్, త్రోబాల్, క్రికెట్, 26 నుంచి 3వ తేదీ వరకు అనంతపురం ఎస్ఎస్‌బీఎన్‌లో క్రికెట్ టోర్నమెంట్ అండ్ సాఫ్ట్ బాల్, 7 నుంచి 8వ తేదీ వరకు ఎస్కేయూ కళాశాల అథ్లెటిక్ మీట్ నిర్వహించనున్నారు.

నేటి నుంచి పౌరాణిక నాటకోత్సవాలు

అనంతపురం టౌన్: ఏపీ భాషా సాంస్కృతికశాఖ, శ్రీకృష్ణదేవరాయ నాటక కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పౌరాణిక నాటకోత్సవాలు నిర్వహించనున్నట్లు కళాసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌వలి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 7 గంటలకు ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. ఆదివారం కడదరగుంట, 8న అరవకూరు, 10న తాడిపత్రి, 11న జిల్లాపరిషత్ ఆవరణలోని చమన్‌సాబ్ కళావేదికలో నాటకాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కళాభిమానులందంలలూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఆలయ సమాచారం

కసాపురం

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు అభిషేకాలు, అలంకారాలు, పూజా కార్యక్రమాలు. 5 గంటలకు సర్వదర్శనం. ఉదయం 10 గంటల నుంచి 11-30 గంటల వరకూ ప్రత్యేక పూజలు. మధ్యాహ్నం 12 గంటలకు మహానివేదన, మహా మంగళ హారతి. అనంతరం ఆలయం మూసివేత. మధ్యాహ్నం 2 గంటలకు ఆలయంలో పూజల పునఃప్రారంభం. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం రాత్రి 8 గంటలకు మహామంగళ హారతి.



ఖాద్రి

శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 6 న ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు శ్రీవారి దర్శనం. 7.30 నుంచి 10 గంటల వరకు అభిషేకాలు. 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీవారి దర్శనం. సాయంత్రం 4.30 గంటల నుంచి రా త్రి 9 గంటల వరకు స్వామివారి దర్శనం ఉంటుంది.



మినీ లోకం



తలదించుకుని చదివితే..
తలెత్తుకుని బతుకుతారు: ఎస్పీ



ఎంజీఎంలో నోట్ పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ఎస్పీ అశోక్ కుమార్

- చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే
- పాఠశాలలకు క్రీడాసామగ్రి, పుస్తకాల వితరణ

హిందూపురం అర్బన్: విద్యార్థులు తలదించుకుని ఏకాగ్రతతో చదివితే జీవితంలో తలెత్తుకుని బతుకుతారని ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. దత్తత తీసుకున్న ప్రభుత్వ పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప గొప్ప వ్యక్తులందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనన్నారు. అబ్దుల్‌కలామ్, అంబేద్కర్ లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు చదవాలన్నారు. పట్టుదల, ఏకాగ్రత ఉంటే ఎంతటి స్థానాన్నైనా సాధించగలరని సూచించారు. వీధిలైట్ల కింద చదువుకుని ఉన్నత స్థానాలు, ఉన్నత పదవులు సాధించిన వారెందరో ఉన్నారన్నారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అలాగే చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమేనన్నారు. క్రీడలతో చురుగ్గా, ఉల్లాసంగా ఉండడమే కాకుండా, దేహదారుఢ్యం పెంపొందుతుందన్నారు. రోటరీక్లబ్ సహకారంతో ఎంజీఎం పాఠశాల, కొట్నూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా బాలికల పాఠశాలల్లో విద్యార్థులకు నోటుపుస్తకాలు, క్రీడా సామగ్రి అందించారు. కార్యక్రమంలో డీఎస్పీ కరీముల్లాషరీఫ్, సీఐలు ఈదుర్ బాష, రాజగోపాలనాయుడు, రోటరీక్లబ్ అధ్యక్షకార్యదర్శులు రాజశేఖర్, శివయ్య, పాంచజన్య శ్రీనివాసులు, రాయల్‌గోపాల్, రామచంద్రారెడ్డి, ఎంజీఎం హెచ్ఎం జీవరత్నమ్మ, ఏహెచ్ఎం బాలకంబన్న, పీడీ లోకనాథ్, కొట్నూరు హెచ్ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు భారతి, జగన్‌మోహన్, రామకృష్ణ, శ్రీనివాసులు, సుజాత, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ 'అనంత'ం : ఆండ్రూ ఎన్‌రిచ్

స్టిక్ ఫర్ ఇండియా శిక్షణ శిబిరం ప్రారంభం

అనంతపురం స్పోర్ట్స్: జిల్లాలో ప్రతిభకు కొదువ లేదని ఆండ్రూ ఎన్‌రిచ్ పేర్కొన్నారు. స్టిక్ ఫర్ ఇండియా ప్రాజెక్టు శిక్షణశిబిరానికి స్పెయిన్ నుంచి ఐదుగురు వలంటీర్లు అనంతపురానికి విచ్చేశారు. స్టిక్ ఫర్ ఇండియా ప్రాజెక్టు పది సంవత్సరాలుగా స్పెయిన్ మాజీ క్రీడాకారుడు ఆండ్రూ ఎన్‌రిచ్ సారథ్యంలో కొనసాగుతోంది. అనంతపురానికి ప్రతి ఏడాదీ విచ్చేసి అకాడమీని సందర్శించడంతో పాటు అనంతపురం, ధర్మవరం ప్రాంతాల్లో పర్యటిస్తారు. ఇందులో భాగంగా శనివారం ఆయన మాట్లాడుతూ తాను పది సంవత్సరాలుగా అనంతపురానికి విచ్చేస్తున్నానని, ఇక్కడి హాకీ క్రీడాకారుల్లో పరిణత ఉందన్నారు. భవిష్యత్తులో అకాడమీ నుంచి భారత జట్టు ప్రాతినిధ్యం వహించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. తాను ప్రస్తుతం స్పెయిన్ మహిళాజట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తున్నానని తెలిపారు. జిల్లాలో ఆర్డీటీ చేస్తున్న సేవముందు తాము చేసే పని చాలా చిన్నదన్నారు. ఎన్‌రిచ్‌తో పాటు ఆలబర్ట్, జోర్డి, జోర్డిఫిటో, జేవీ విచ్చేశారు.

ప్రస్తుతానికి వీరంతా స్పెయిన్ జూనియర్, సబ్ జూనియర్ మహిళా జట్లకు కోచ్‌లుగా వ్యవహరిస్తున్నారు. వీరు అనంతపురంతో పాటు నెరిమెట్ల, వెంకటాద్రిపల్లె, చిగిచెర్ల, పెడబల్లి, పుట్టపర్తి ప్రాంతాలను పర్యవేక్షిస్తారు. అనంతరం 10వ తేదీ స్పెయిన్‌కు వెనుతిరిగి వెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ హాకీ అకాడమీ కో-ఆర్డినేటర్ విజయబాబు, అబ్దుల్ ఘని, కోచ్‌లు లక్ష్మీనారాయణ, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ క్రూరత్వం జనానికి తెలిసిపోయింది

- మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

అనంతపురం అర్బన్: ప్రతిపక్షనేత జగన్ క్రూరత్వం ఏ పాటిదో జనానికి తెలిసిపోయిందని మాజీ మంత్రి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లెరఘునాథరెడ్డి పేర్కొన్నారు. సీఎం చంద్రబాబును కాల్చిచంపాలని జగన్ చేసిన వ్యాఖ్యలపై శనివారం ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.లక్షకోట్లు దోపిడీ చేసిన జగన్‌ను ఎన్నిసార్లు నడిరోడ్డుపై కాల్చి చంపాలని ప్రశ్నించారు. ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలు తెలుగు ప్రజలను అవమానపరిచే విధంగా ఉన్నాయన్నారు. జగన్ భాష, సంస్కృతి, ప్రవర్తన ఫ్యాక్షనిజాన్ని తలపిస్తున్నాయన్నారు. జగన్‌లాంటి వ్యక్తి అధికారంలోకి వస్తే ప్రజల భద్రతకు ముప్పు తప్పదన్నారు. ప్రవర్తన ఇలాగే ఉంటే భవిష్యత్తులో ప్రతిపక్ష హోదా కాదు కదా... డిపాజిట్లు కూడా రావన్నారు. అప్పుడు అమరావతి పురవీధుల్లో జగన్ పిచ్చికుక్కల్లా తిరగడం తథ్యమన్నారు.

నంద్యాల ఉప ఎన్నికల్లోనే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. జగన్‌కు భవిష్యత్తులో రాజకీయ సన్యాసం తప్పదని ఎద్దేవాచేశారు. అధికారం కోసం ఆవేశపడే వ్యక్తి ఏనాడూ మనుగడ సాగించిన చరిత్రలేదని గుర్తుచేశారు. అవినీతి నుంచి జగన్ తప్పించుకోలేరని, జైలుకూడు తప్పదన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ : కలెక్టర్ వీరపాండ్యన్

అనంతపురం కలెక్టరేట్: వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ వీరపాండ్యన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సంబంధిత అధికారులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మరో వారం రోజుల్లో 1.55 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీఓ, ఈఓఆర్డీ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఏపీఓ, ఏపీఎం, ఏఈఓలను భాగస్వాములను చేయాలన్నారు. ఒక్కో అధికారికి రెండు, మూడు గ్రామ పంచాయ తీలప్పగించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు నోడల్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారని, పూర్తి బాధ్యత వీరిపైనే ఉం టుందన్నారు. నిర్మాణానికి అవసరమైన సామగ్రిని 9వ తేదీ సిద్ధం చేసుకోవాలని, 10న పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. ప్రతి రోజూ 21,700 నిర్మాణాలు పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఇందులో ఎలాంటి అవకతవకలు జరిగినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పురోగతిపై ప్రతిరోజూ టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తామని, సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ ఈ హరేరాంనాయక్, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు పాల్గొన్నారు.

పాఠకులకు సూచన:
క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు.** పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
- మేనేజర్

ఆంధ్రజ్యోతి
కళ్యాణదుర్గం
4
ఆదివారం 06, ఆగస్టు 2017
● కళ్యాణదుర్గం ● కంబదూరు ● బ్రహ్మసముద్రం ● శెట్టూరు ● కుందుర్పి

అందని శ్రీరామిరెడ్డి తాగునీరు : ఇబ్బందుల్లో గ్రామస్థులు

శెట్టూరు: మండల పరిధిలోని అయ్యగార్లపల్లికి గత 20 రోజులుగా శ్రీరామిరెడ్డి తాగునీరు అందకపోవడంతో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామసులు వాపోయారు. శెట్టూరు నోముగడ్డ వంక సమీపంలో పైప్‌లైన్ తుప్పుపట్టడంతో భారీగా లీకేజీలు ఏర్పడి గ్రామానికి నీరు చేరడం లేదని శ్రీరామిరెడ్డి తాగునీరు సరఫరా చేసే సిబ్బంది పేర్కొంటున్నారు. అయితే గ్రామస్తులు మాత్రం తాగునీరు అందకపోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మత్తులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రన్న బీమా పేదలకు వరం : ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం టౌన్: పేదల ఆరోగ్యానికి, కుటుంబ భద్రతకు టీడీపీ ప్రభుత్వంతోనే భరోసా అని ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో చంద్రన్న బీమా పథకం కింద మంజూరైన చెక్కులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా చంద్రన్న బీమా, ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మూడేళ్లలోనే దాదాపు ఐదు కోట్ల రూపాయలు పంపిణీచేశామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.15ల ప్రీమియంతో రూ.5లక్షల ప్రమాద బీమాను అందజేస్తున్న ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అదేవిధంగా వివిధ రకాల అనారోగ్యాలతో


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉన్నం

బాధపడుతూ వైద్య చికిత్సలు పొందిన వారికి ఆర్థిక తోడ్పాటును ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విరివిగా అందజేయడం జరుగుతుందన్నారు. చంద్రన్న బీమా పథకం పేదల కు వరంలాంటిదన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని ప్రతిఒక్కరు గుర్తించాలన్నారు. చంద్రన్న బీమా పథకంలో 31కుటుంబాలకు మంజూరైన రూ. 11లక్షల 64వేల ఆర్థికసాయం మంజూరు పత్రాలను ఆయా కుటుంబాల సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఆర్‌జీ శివశంకర్, జడ్పీటీసీ కొల్లాపురప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, డిష్ మురళి, దొడగట్ట నారాయణ, రామమోహన్ యాదవ్, హనుమంతరెడ్డి, సత్తి, వెలుగు సిబ్బంది, బీమా మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

లోకల్ గైడ్

localguide

ఎమ్మెల్యే డైరీ

కళ్యాణదుర్గం టౌన్: శాసనసభ్యులు, ఉన్నం హనుమంతరాయ చౌదరి ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

కళ్యాణదుర్గం మార్కెట్‌లో కూరగాయల ధరలు



టమోట 40, పచ్చిమిర్చి 40, వంకాయలు 60, లావుమిర్చి 50, ఎర్రగడ్డలు 20, ఆలుగడ్డలు 20, బెండ 30, బీరకాయలు 30, బీన్స్ 40, కాకర 40, చౌడె కాయలు 30, క్యాబేజి 30, బీట్‌రూట్ 40, క్యారెట్ 60

కళ్యాణదుర్గంలో మాంసం ధరలు

మటన్ : 340, చికెన్ : 180, నాటుకోడి : 260
చేపలు : 120, కోడి గుడ్లు(డజన్) : 48

కళ్యాణదుర్గం సినిమాలు

సౌభాగ్య : పిడా, వెంకటేశ్వర : నక్షత్రం
నూర్‌ముబారక్ : గౌతమ్‌నంద

మీసేవ కేంద్రాల్లోనే టైటిల్ డీడ్ లభ్యం


రైతులకు టైటిల్ డీడ్ పత్రాలను అందజేస్తున్న నిర్వాహకులు

బ్రహ్మసముద్రం: రైతుల భూముల వివరాలకు సంబంధించిన టైటిల్ డీడ్‌లు, పట్టాదారు పాసుపుస్తకాలను ఇకనుంచి మీసేవ కేంద్రాల ద్వారానే అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వం రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకూడదన్న ఉద్దేశంతో మీసేవ కేంద్రాల్లోనే 1-బి, అడంగల్‌తో పాటు పట్టాదారు పాసుపుస్తకాలు కూడా లభ్యమయ్యేలా చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే వేపులపర్తిలోని మీసేవ కేంద్రంలో శనివారం రైతులకు టైటిల్ డీడ్‌లను అందజేశారు. మీసేవ కేంద్రాల ద్వారా టైటిల్ డీడ్‌లు లభ్యం కావడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మీసేవ నిర్వాహకులు చన్నమల్ల మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గుర్తించి మీసేవ కేంద్రాల్లోనే పనులు చేపట్టడం సంతోషకరమన్నారు.

పక్కా గృహాల లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు

శెట్టూరు: మండల పరిధిలోని లక్ష్మంపల్లి, ఖైరేవు గ్రామాల్లో శనివారం ఆయా గ్రామ సర్పంచులు లక్ష్మి, గొర్ల జయమ్మల అధ్యక్షతన పక్కా గృహాల లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలను నిర్వహించారు. ఈ గ్రామసభలకు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనాథ్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ రామమోహన్, ఎంఈఓ శ్రీధర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగావారు ప్రజాసాధికారిక సర్వేలో పక్కా ఇల్లులేదని నమోదు చేసుకున్న లబ్ధిదారులను గుర్తించి అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు గ్రామసభలను నిర్వహిస్తున్నామన్నారు.


గ్రామసభలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీధర్

అర్హులందరికీ పక్కా గృహాలు

కంబదూరు: అర్హులైన వారందరికి ఎన్టీఆర్ పక్కా గృహాలను మంజూరుచేస్తామని, అందుకోసమే ప్రతి పంచాయతీలోను గ్రామసభను నిర్వహిస్తున్నామని తహసీల్దార్ రఫీక్ అహమ్మద్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని చెన్నంపల్లి పక్కా గృహాల మంజూరుపై గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు చెన్నంపల్లి రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి చక్రి, ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు.

ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరి

కంబదూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న ప్రతి చిన్నారికి ఎంఆర్ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయాలని వైద్యాధికారి కళ్యాణ్‌కుమార్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో జరుగుతున్న ఎంఆర్ వ్యాక్సిన్ కేంద్రాన్ని వైద్యాధికారితో పాటు ఎంపీహెచ్ఈఓలు, సూపర్‌వైజర్లు ఆకస్మికంగా తనిఖీచేశారు. తొమ్మిది నెలల నుండి 15సంవత్సరాల పిల్లలందరికి ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయాలన్నారు. ప్రతి రెండవ వారం తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ కుమార వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు మహమ్మద్ రఫి, సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కళ్యాణదుర్గం రూరల్: చంద్రన్న సంచార చికిత్స వాహనాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం నాయకులు నారాయణస్వామి, మంజునాథ్, శివ, తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు 151మేరకు వేతనాలను చెల్లించాలన్నారు. చంద్రన్న సంచార చికిత్స పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని, అక్రమ బదిలీలను ఆపాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరుతూ లేఖల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కుందుర్పి: మండల పరిధిలోని అపిలేపల్లి, బెన్నెర్లపల్లి, వడ్డుపాళ్యం గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. శ్రావణ శనివారం సందర్భంగా ఆలయాల్లో ఉదయం నుండి గంగపూజ, పుష్పాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయాలకు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకపోతే చర్యలు : ఉన్నం

కళ్యాణదుర్గం: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకపోతే తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి హెచ్చరించారు. శనివారం భైరవానితిప్ప ప్రాజెక్టును సందర్శించడానికి వెళుతూ, మార్గమధ్యంలో బ్రహ్మసముద్రం మండలం సంతేకోనాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని తింటూ పప్పు నీళ్ల చారులా ఉండటాన్ని గమనించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంత నీళ్ల పప్పు చేసి విద్యార్థులకు పెడితే ఎలా అంటూ వంట ఏజెన్సీలను ప్రశ్నించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కందిపప్పు, ఇతర దినుసులు వేయాలన్నారు. ఇలాంటి భోజనం పెడితే విద్యార్థులకు పోషక ఆహారం అందుతుందా అంటూ అక్కడే ఉన్న ఉపాధ్యాయులను ప్రశ్నించారు. అనంతరం పదవ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. మన రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, దేశ ప్రధానిల పేర్లేమిటని విద్యార్థులను ప్రశ్నించారు. అలాగే మన జిల్లాకి చెందిన మంత్రుల పేర్లేమిటని ప్రశ్నించి, వారి నుంచి సమాధానం రాబ


మధ్యాహ్న భోజనాన్ని ఆరగిస్తున్న ఎమ్మెల్యే

ట్టారు. బాగా చదువుకొని అటు పాఠశాలకు, ఇటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచిపేరు తేవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ రాష్ట్ర యువనాయకులు ఉన్నం మారుతి చౌదరి, జడ్పీ మాజీ సభ్యులు ఆర్‌జీ శివశంకర్, సర్పంచ్ కోనాపురం దండు సత్యనారాయణ, చన్నమల్లప్ప, తదితరులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

తల్లిపాలు అమృతంతో సమానం : సీడీపీఓ

కళ్యాణదుర్గం రూరల్ (హులికల్లు): తల్లిపాలు అమృతంతో సమానమని సీడీపీఓ గీతాంజలి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని హులికల్లు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓతో పాటు సూపర్‌వైజర్ సుశీలమ్మలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ముర్రుపాలు బిడ్డకు వ్యాధినిరోధక శక్తిని ఇస్తాయని, మొదటి టీకాగా పనిచేస్తాయని, పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సావిత్రమ్మ, హనుమక్క, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలను సూపర్‌వైజర్ చంద్రమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం మండలంలోని సూగేపల్లి, యనకల్లు, గుడిపల్లి, ముప్పలకుంట, గుండిగానపల్లి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సామూహిక సీమంతాలతో పాటు అన్నప్రాసన కార్యక్రమాలను చేపట్టారు.

కంబదూరు: తల్లిపాలతోనే బిడ్డకు రోగనిరోధక శక్తి పెరగడమే కాకుండా ఆరోగ్యంగా జీవిస్తారని ఇన్‌చార్జ్ సీడీపీఓ హేమ తెలిపారు. శనివారం మండల పరిధిలోని పి ఐపార్లపల్లి, మంద అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్ణమ్మ, రామలింగమ్మ, ఆరోగ్యకార్యకర్త యల్లమరాజు పాల్గొన్నారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న అధికారులు

కళ్యాణదుర్గం టౌన్: పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణతో పాటు భావితరాల భవిష్యత్తుకు భరోసా అని సబ్ డీఎఫ్ఓ శ్యామూల్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పాపంపల్లి ఉన్నత పాఠశాలలో వనం - మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతగా మొక్కల సంరక్షణ చేపట్టడంతో పాటు తల్లిదండ్రులకు పచ్చదనం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ రాజాసింగ్, సిబ్బంది రామచంద్రనాయక్, వెంకటేశ్వర్లు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రేపు మండ్లీ మల్లేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకం

కుందుర్పి: మండల కేంద్రంలోని మండ్లీ మల్లేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు స్వర్ణలత ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు తెలిపారు. కుందుర్పి గ్రామ శివార్లలోని చెరువు కట్ట కింద వెలసిన శ్రీ మండ్లీ మల్లేశ్వర దేవాలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా ఆలయంలో ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేపడతామన్నారు. అదేవిధంగా ఉదయం గంగపూజ, పుష్పాభిషేకం, క్షీరాభిషేకంతో పాటు రుద్రాభిషేకాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ పూజా కార్యక్రమాలకు భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

రాయదుర్గం సమాచారం

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం


వ్రతం ఆచరిస్తున్న మహిళలు

బొమ్మనహాళ్ : స్థానిక వెంకటేశ్వరాలయంలో రెండవ శనివారం భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతాన్ని ఆచరించారు. ప్రధాన అర్చకులు వైద్యం శ్రీకృష్ణ కంఠీరవాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక దుస్తులతో మహిళలు ఏడు శనివారాల వ్రతాన్ని చేశారు. ఉదయం నుంచి ఆలయంలో స్వామివారికి పవిత్ర గంగాజలాభిషేకం, పంచామృతాభిషేకం, ప్రత్యేకాలంకరణ, పుష్పమాలాధారణ, ఆకు పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో మహిళలచే ఏడు శనివారాల వ్రతాన్ని ఆచరింపజేశారు. భక్తులకు, మహిళలకు ఏడు శనివారాల వ్రతం ఫలితాలను తెలియజేశారు. అనంతరం మహామంగళహారతి, ప్రసాద వినియోగాలు, భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు.

బాలికల విద్య ప్రోత్సాహానికి హాస్టళ్లు


హాస్టల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ

కణేకల్లు : బాలికల విద్యను ప్రోత్సహించి వారు అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం మోడల్ స్కూలులో హాస్టల్ గదులను నిర్మించిందని ఎంపీపీ షేక్ ఫాతిమాబీ, సర్పంచ్ కౌసల్య పేర్కొన్నారు. శనివారం కణేకల్లు పట్టణంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన మోడల్ స్కూలు హాస్టల్‌ను వీరు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ 9వ తేదీ నుంచి హాస్టల్ వసతి పూర్తిస్థాయిలో విద్యార్థినులకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు గౌసబీ, నరసింహులు, మనోహర్, పీడీ రమేష్, జూనియర్ అసిస్టెంట్ జమీర్, షేక్ ముజ్జు పాల్గొన్నారు.

ఈ సేవాలోనే పాస్ పుస్తకాలు

బొమ్మనహాళ్ : ఇకపై రైతులకు తమ పొలం పట్టాదారు పాస్ పుస్తకాల కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదని తహసీల్దార్ శివయ్య అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఈ పాస్ పుస్తకం విధానాన్ని శనివారం ప్రారంభించారు. 25 నిమిషాల్లోనే ఈ పాస్ బుక్ పద్ధతిలో ఈ సేవ కేంద్రంలో పత్రాన్ని రైతులకు అందజేశారు. కార్యక్రమంలో డీటీ గురుప్రసాద్, ఆర్ఐ ఎంఎం వీరేష్, ఈ సేవా నిర్వాహకులు నాగేష్, రైతులు పాల్గొన్నారు.

రెండు గ్రామాలకు జింక్ పంపిణీ

బొమ్మనహాళ్ : మండల పరిధిలోని ఉప్పరహాళ్, ఏళంజి గ్రామాలకు చెందిన రైతులకు జింక్‌ను పంపిణీ చేసినట్లు ఏవో అహ్మద్ బాషా తెలిపారు. ఉప్పరహాళ్, ఏళంజి గ్రామాలకు చెందిన 120 మంది రైతులకు 3.6 టన్నుల జింక్‌ను, పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటనారాయణ, ఎంపీఈవోలు ఇలియాజ్, అనిల్, ధనుశ్రీ, నాగరత్న, అవినాష్ పాల్గొన్నారు.

ఉంతకల్లులో ఇంటింటి సర్వే

బొమ్మనహాళ్ : గ్రామాల్లోని ప్రతి కుటుంబంలోనూ పసిపిల్లలు, వ్యాక్సినేషన్, విషజ్వరాలు తదితర అంశాలపై సర్వే నిర్వహిస్తున్నట్లు హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు తెలిపారు. శనివారం ఉంతకల్లులో ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రదీప్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ మల్లమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బండూరులో ర్యాలీ : ఎంఆర్ వ్యాక్సినేషన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్‌అసిస్టెంట్ శశికళ, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెల్టుషాపుల రద్దుపై గ్రామసభలో తీర్మానం

గుమ్మఘట్ట : ప్రభుత్వం బెల్టుషాపులను పూర్తిగా నిర్మూలించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో వారం రోజులుగా ఎక్సైజ్ పోలీసులు గ్రామాల్లో మద్యం బెల్టుషాపులను అరికట్టేందుకు శ్రీకారం చుట్టారు. సర్పంచ్, ఎంపీటీసీల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ తీర్మానాలు చేశారు. గ్రామాల్లో బెల్టు షాపులు ఎవరైనా నిర్వహిస్తే ఎక్సైజ్ పోలీసులకు వివరాలు తెలియజేయాలన్నారు.

వేళకు బస్సులు నడపండి

బొచ్చుపల్లిలో విద్యార్థుల ఆందోళన


ఆందోళన చేస్తున్న విద్యార్థులు

శెట్టూరు: మండల పరిధిలోని బొచ్చుపల్లిలో శనివారం ఆర్టీసీ బస్సు సమయానికి నడపాలంటూ విద్యార్థులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గతంలో సమాయానికి అనుగుణంగా బస్సును నడిపేవారు. ఇదే బస్సు ప్రస్తుతం శెట్టూరు మీదుగా వెళ్లడంతో తాము కళాశాలలకు సమయానికి వెళ్లలేకపోతున్నామని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు వాపోతున్నారు. కళాశాలలో కూడా బయోమెట్రిక్ హాజరు ఉండడంతో సకాలంలో చేరుకోలేకపోతున్నామన్నారు. పలుమార్లు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో ఆందోళన చేపట్టామని విద్యార్థులు తెలిపారు. ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారలు స్పందించి కళాశాలల సమయానికి అనుగుణంగా బస్సును నడపాలని కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కుందుర్పి: మండల కేంద్రంలోని మాలవీధిలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని నివారించాలని కాలనీ వాసులు మహదేవ, శ్రీనివాసులు పేర్కొన్నారు. కాలనీలో గత ఐదు నెలలుగా తాగునీటి ఎద్దడి నెలకొన్నా పంచాయతీ అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.

కాలనీలో తాగునీటి సమస్య ఉందని ఖాళీ బిందెలతో కార్యాలయానికి వెళ్లి నీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీఓ నాగరాజుకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. మాలవీధికి పంచాయతీ నీటితో పాటు శ్రీరామిరెడ్డి, సత్యసాయి నీరు సరఫరా కావడంలేదని కాలనీవాసులు మండిపడ్డారు. నీటి ఎద్దడి గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నారు. తాగునీటి కోసం గ్రామశివార్లలోని వ్యవసాయ బోరుబావులను ఆశ్రయించాల్సి ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఉచిత సామూహిక వివాహాలకు దరఖాస్తు చేసుకోండి

అమ్మ సేవా సమితి

కళ్యాణదుర్గం రూరల్: పేద కుటుంబాల్లో వెలుగు నింపేందుకు అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 17న ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు అమ్మ సేవా సమితి అధ్యక్షులు తలారి జయప్రకాష్ పేర్కొన్నారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరిల సహకారంతో ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నామని, ఇదే కోవలో ఈ ఏడాది పెద్దఎత్తున వివాహాలు చేయడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆగస్టు 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వయస్సుకు సంబంధించిన ధృవీకరణ పత్రాలతో కుటుంబసభ్యులతో కలిసి వివరాలను తెలియజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9440741993 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉచిత సామూహిక వివాహాలకు

దరఖాస్తు చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్: పేద కుటుంబాల్లో వెలుగు నింపేందుకు అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 17న ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు అమ్మ సేవా సమితి అధ్యక్షులు తలారి జయప్రకాష్ పేర్కొన్నారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఎంపీ జేసీ దివారకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరిల సహకారంతో ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నామని, ఇదే కోవలో ఈ ఏడాది పెద్దఎత్తున వివాహాలు చేయడానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆగస్టు 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వయస్సుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో కుటుంబసభ్యులతో కలిసి వివరాలను తెలియజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9440741993 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ


రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈఓ

కళ్యాణదుర్గం టౌన్: పట్టణంలోని సౌత్ సెంట్రల్ ప్రభుత్వ పాఠశాలను ఎంఈఓ విజయకుమారి శనివారం తనిఖీచేశారు. పాఠశాలలో విధులకు ప్రధానోపాధ్యాయుడు సక్రమంగా హాజరుకావడం లేదని ఎంఈఓకు ఫిర్యాదు అందటంతో ఆమె శనివారం పరిశీలించగా, ప్రధానోపాధ్యాయుడు పాఠశాలలో లేకపోవడం, హాజరు పట్టీలో సంతకం ఉండడంతో ఆమె మెమో జారీచేస్తున్నట్లు తెలుపడంతో పాటు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

ఎన్టీఆర్ గృహకల్ప లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామసభలు

గుమ్మఘట్ట : కలుగోడు, గోనబావి, మారెంపల్లి పంచాయతీల పరిధిలో నిరుపేదలైన లబ్ధిదారులను ఎన్టీఆర్ గృహకల్ప కింద ఇళ్ల మంజూరు కోసం అధికారులు శనివారం గ్రామసభలు నిర్వహించి ఎంపిక కార్యక్రమం చేపట్టారు. మూడు రోజులుగా గ్రామాలన్నింటిలో ఎంపిక కార్యక్రమాన్ని చేపడుతున్నారు. కలుగోడు గ్రామంలో తహసీల్దార్ అఫ్జల్‌ఖాన్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రిజ్వానా బేగం, వీఆర్వో అనుమేష్‌రావు తదితరులు గ్రామసభలకు హాజరై లబ్ధిదారులను ఎంపికచేశారు. మారెంపల్లి పంచాయతీ పరిధిలో పంచాయతీ విస్తరణాధికారి కొండయ్య, వీఆర్వో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి కొల్లప్ప, గోనబావిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మమత, వీఆర్వో రుద్రముని, కార్యదర్శి లింగరాజు హాజరై లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టారు.

బొమ్మనహాళ్‌లో : అర్హులైన పేదలందరికీ ఎన్టీఆర్ ఇళ్ల కేటాయింపు కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శివయ్య, ఎంపీడీవో గంగన్న, ఎంఈవో భీమప్ప తెలిపారు. శనివారం మూడు టీమ్‌లు సిద్ధరాంపురం, కురువళ్లి, సింగేపల్లి, గోనేహాళ్, కళ్లుహోళలలో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు వాణీ జగన్నాథరెడ్డి, సర్పంచ్‌లు రామన్న, సుదర్శన్‌రెడ్డి, నీలమ్మ, చంద్రకళ, పవిత్ర, ఏఈలు లక్ష్మీ నారాయణ, వెంకటేశులు, కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్, మురిడప్ప, వీఆర్వోలు వంశీకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

కణేకల్లులో : హౌసింగ్ లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలు శనివారం మండలంలో సజావుగా సాగాయి. సొల్లాపురం, పూలచెర్ల, బ్రహ్మసముద్రం గ్రామాల్లో అధికారులు పర్యటించి గతంలో సాధికారిక సర్వేలో ఎవరైతే పక్కా గృహాలు కావాలని అర్జీలు ఇచ్చి ఉంటారో వారి జాబితాను పరిశీలించి నివేదికను తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీవాణి, ఎంపీడీవో రెహానాబేగమ్, ఎంఈవో బసవరాజు పాల్గొన్నారు.



కలుగోడు, బొమ్మనహాళ్‌లో గ్రామసభలు నిర్వహిస్తున్న అధికారులు

సేవ కోసం వచ్చి.. ప్రాణాలు విడిచి...

అనంతపురం, ఆంధ్రజ్యోతి : చిత్తూరు జిల్లాలోని మదనపల్లి-పుంగనూరు రోడ్డులో యాతాల వంక సమీపంలో శనివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు స్పెయిన్ దేశస్తులు దుర్మరణం చెందారు. ఈ ఘటనతో అనంతపురంలోని రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డీటీ)లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఐదు దశాబ్దాల ట్రస్టు చరిత్రలో ఇలాంటి సంఘటన ఎప్పుడూ జరగలేదని చర్చించుకుంటూ బాధను వ్యక్తం చేశారు. ఎంతో మంది స్పెయిన్ దేశస్తులు ఆర్‌డీటీకి వచ్చి ట్రస్టు సేవలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అభినందించేవారని, వీసెంటే బృందం ఆర్‌డీటీ సేవలను అభినందించిందంటూ ట్రస్ట్ ఉద్యోగులు గుర్తు చేసుకున్నారు. తాజాగా ఆగస్టు 1న స్పెయిన్ దేశానికి చెందిన ఫెరోజ్ మోరినా వీసెంటే ఆధ్వర్యంలో 13 మంది ఆర్‌డీటీకి వచ్చారు. ఇక్కడ క్షేత్ర స్థాయిలో ఆ ట్రస్ట్ సేవలను పరిశీలించారు. ఈ క్రమంలోనే స్పెయిన్‌కు తిరుగుప్రయాణంలో భాగంగా పాండిచ్చేరికి వెళ్లి అక్కడ సైడ్ సీన్స్ చూసి, చెన్నైకు చేరుకొని స్పెయిన్‌కు వెళ్లాలని ఆ బృందం నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు ప్రైవేటు ట్రావెల్‌లో బయలుదేరారు. ఇంతలోనే మృత్యువు కంటైనర్ రూపంలో వారిలో నలుగురిని కబళించింది.



సంఘటనాస్థలంలో కలెక్టర్, ఎస్పీ

ప్రమాదంలో నలుగురు స్పెయిన్ దేశస్తులు చనిపోయారని, మిగిలిన తొమ్మిది మంది గాయపడ్డారని స మాచారం అందుకున్న ఆర్‌డీటీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అన్నేఫెర్రర్ నిర్ఘాంతపోయారు. కొంత సేపు ఆమె తేరుకోలేకపోయారు. అదే విధంగా ఆర్‌డీటీ చైర్మన్ తిప్పేస్వామితోపాటు ఆ ట్రస్ట్‌లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ప్రమాదం పట్ల తీవ్ర బాధను వ్యక్తం చేశారు. వెను వెంటనే చైర్మన్ తిప్పేస్వామి మరికొందరు ఉద్యోగులతోకలిసి హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఇదే క్రమంలో ఆర్‌డీటీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అన్నేఫెర్రర్ బెంగళూరుకు వెళ్లారు. బెంగళూరులోని బాపిస్టు ఆస్పత్రికి చేరుకొని గాయాలతో చికిత్స పొందుతున్న స్పెయిన్ దేశస్తులను పరామర్శించారు. వారికి సహాయ చర్యల్లో పాలుపంచుకున్నారు.

అంతేకాకుండా ఆర్‌డీటీకి చెందిన డాక్టర్లు, పలువురు స్పానిస్ ట్రాన్స్‌లేటర్లు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా... ఆర్‌డీటీ స్థాపించిన తర్వాత ఇలాంటి సంఘటన జరగలేదని ఆర్‌డీటీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ అన్నేఫెర్రర్ ఆంధ్రజ్యోతితో ఆవేదన వ్యక్తం చేశారు. స్పెయిన్ ఎంబసీతో మాట్లాడి వారికి అవసరమైన సహాయక కార్యక్రమాలు చేపడతామన్నారు. బెంగళూరులో చికిత్స పొందుతున్న వారి బంధువులు, స్పెయిన్ నుంచి వచ్చే వరకు ప్రత్యేక సహాయక కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు మెరుగైన చికిత్స

- అందరినీ బెంగళూరుకు రెఫర్ చేసిన వైద్యులు
- మృతదేహాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



చికిత్సపొందుతున్న క్షతగాత్రులు



మదనపల్లె అర్బన్: మదనపల్లె-పుంగనూరు మార్గంలోని యాతాలవంక వద్ద శనివారం జరిగిన ఘోరరోడ్డుప్రమాదంలో నలుగురు స్పెయిన్ దేశస్థులు, అనంతపురం జిల్లాకు చెందిన టెంపో ట్రావెలర్ డ్రైవర్ మృతిచెందారు. అయితే ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మరో ఎనిమిదిమందిని చికిత్స నిమిత్తం 108 వాహనాల్లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్లు, వైద్యసిబ్బంది బాధితులకు మెరుగైన చికిత్స అందించారు. సమాచారం అందుకున్న సబ్‌కలెక్టర్ వెట్రిసెల్వి, డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. దీంతో అప్రమత్తమైన డీఎస్పీ తమ సిబ్బందితో కలిసి ప్రత్యేక అంబులెన్స్ వాహనాల్లో బాధితులందరినీ బెంగళూరు ఏసియన్ కొలంబియో ఆసుపత్రికి రెఫర్ చేశారు. మిగిలిన ఆరుగురిని ఇతర ఆసుపత్రుల్లో చేర్పించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న, ఎస్పీ రాజశేఖరబాబు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అనంతరం ఘటనపై సిబ్బందిని విచారించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బత్తలపల్లెలోని ఆర్డీటీ ఆసుపత్రిని సందర్శించేందుకు వచ్చి..తిరుగు ప్రయాణంలో నలుగురు స్పెయిన్ దేశస్థులు, ఒక టెంపో ట్రావెలర్ డ్రైవర్ మృతిచెందడం బాధాకరమన్నారు. ఘటనపై క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నట్లు చెప్పారు. రోడ్డు వెడల్పుగా ఉన్నా..ఘటన జరగడం దారుణమన్నారు. అనంతరం ఎస్పీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ ఓవర్‌స్పీడు కారణంగానే ప్రమాదం జరిగిందన్నారు.

పోస్టుమార్టానికి వీడియో కవరేజీ

మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన వారి మృతదేహాలకు ప్రత్యేక వైద్యబృందం, పోలీస్, రెవెన్యూ అధికారులతో పాటు వీడియో కవరేజీ మధ్య పోస్టుమార్టం నిర్వహించాలని కలెక్టర్, ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఒక డీఎస్పీ, నలుగురు సీఐలు, ఎస్ఐ, తహసీల్దార్, ఐదుగురు ఆర్‌ఐలు, ఐదుగురు వీఆర్వోలు, ఐదుగురు డాక్టర్లు, ఒక వీడియోమన్ సమక్షంలో డాక్టర్లు ఐదు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, ఒక్కో మృతదేహానికి అరగంట చొప్పున ఐదింటికి సుమారు మూడుగంటల సమయం పట్టింది. అనంతరం కదిరి నుంచి వచ్చిన ఆర్డీటీ సిబ్బంది మృతదేహాలను ప్రత్యేక అంబులెన్స్ వాహనాల్లో ఇక్కడి నుంచి అనంతపురం, బెంగళూరుకు తీసుకెళ్లారు.

తొలుత ఇబ్బందిపడ్డ డాక్టర్లు, అధికారులు...

గాయపడిన వారంతా స్పెయిన్ దేశస్థులు కావడంతో భాష తెలియక తొలుత డాక్టర్లు, అధికారులు ఇబ్బంది పడ్డారు. హిందీ, ఇంగ్లీష్‌లో మాట్లాడినా వారికి ఏమాత్రం అర్థం కాలేదు. వారు మాట్లాడే భాష వీరికి అర్థం కాలేదు. కాగా సమాచారం అందిన వెంటనే ఆర్డీటీకి సంబంధించిన ఓ వ్యక్తి హుటాహుటిన ఆసుపత్రికి చేరుకోవడంతో అతడి ద్వారా అందరూ విషయం తెలుసుకున్నారు.

మృతదేహాలను పరిశీలించిన ప్రజా ప్రతినిధులు...

సమాచారం అందిన వెంటనే టీడీపీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొడవలి శివప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు దొమ్మలపాటి రమేష్, షాజహాన్‌బాషా, మాజీ ఎమ్మెల్సీ బీ నరేష్‌కుమార్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ కాటకొండ గుర్రప్ప నాయుడు, కిసాన్ మోర్చా జాతీయ అధికార ప్రతినిధి చల్లపల్లె నరసింహారెడ్డి, నాయకులు బొమ్మనచెరువు శ్రీరాములు, కే మల్లికార్జున నాయుడు, రాటకొండ మధుబాబు, లయన్స్ భాస్కర్‌నాయుడు తదితరులు ఆసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు.



నుజ్జు నుజ్జయిన వాహనం, క్షతగాత్రులను తరలిస్తూ..

ఎక్కడో పుట్టి.. పుంగనూరులో అసువులు బాశారు!

- సందర్శనలు పూర్తికాకముందే ఆయుష్షు తీరిపోయింది
- అందరి స్పందన అభినందనీయం

పుంగనూరు: ఉన్నత చదువులు చదివి.. భారతదేశంలో నిర్వహించే సేవా కార్యక్రమాలు, పుణ్యక్షేత్రాలు దర్శించాలని ఎంతో ఆనందంగా వచ్చిన విదేశీయులను రోడ్డుప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. స్వదేశానికి భిన్నంగా ఇండియాలో అమలవుతున్న విద్య, వైద్యం, తదితర సేవా కార్యక్రమాలను పరిశీలిస్తూ ప్రాముఖ్యం కలిగిన ఆధ్యాత్మిక క్షేత్రాలను దర్శించి తరించాలని ఉత్సాహంగా ఈ నెల 1న భారత్‌కు 12 మంది స్పెయిన్ దేశస్థులు వచ్చారు. అనంతపురం జిల్లా బత్తలపల్లిలో ఆర్డీటీ ఆధ్వర్యంలో వైద్యశాలలు, విద్యాలయాలు, వికలాంగులకు విద్యా, వైద్య వసతులు, ఆనాథలు, వృద్ధుల పోషణతో పాటు పేద ప్రజలను ఆదుకోవడానికి సంస్థ చేస్తున్న వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించి స్పెయిన్ బృందం సంతృప్తి చెందినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి ఆర్డీటీ కార్యాలయంలో బస చేసిన విదేశీ బృందం అనంతపురంలో ట్రావెల్ టెంపోను అద్దెకు తీసుకుని శనివారం తెల్లవారు జామున నాలుగు గంటల ప్రాంతంలో తిరువణ్ణామళైకు పయనమయ్యారు. మదనపల్లె దాటగానే పుంగనూరు మండలం ఈడిగపల్లె సమీపంలోని దర్గా(యాతాలవంక) మలుపుకు రాగానే కంటైనర్ లారీ వేగంగా వచ్చిం ది. ముందే మలుపు, రోడ్డుకిరువైపులా చెట్లు ఉండడంతో ఎదురుగా వాహనాలు కనిపించకపోవడం, కొద్దిగా పల్లంతో పాటు రోడ్డు ఇరుకుగా ఉన్న పరిస్థితుల్లో చెన్నై నుంచి ముంబై వెళుతున్న కంటైనర్ లారీ వేగంగా వస్తూ మలుపులో కట్ చేయలేక రోడ్డు కుడివైపుకు వెళుతూ ఎదురుగా వస్తున్న టెంపో ట్రావెల్‌ను ఢీ కొంది. ప్రమాదానికి కొద్ది నిమిషాల ముందుకూడా విదేశీయులు ఎంతో సంతోషంగా గడిపారు. అకస్మాత్తుగా ప్రమాదం జరగడం, వాహనం నుజ్జునుజ్జు కావడంతో ఏమి జరిగిందో తెలియక నిశ్చేష్టులయ్యారు. క్షణాల్లోనే వారు రక్తపు మడుగులా తయారై చెల్లాచెదరుగా పడిపోయారు. వాహనంలో కొందరు అపస్మారక స్థితిలోకి చేరుకోగా మరి కొందరు తీవ్ర రక్తస్రావంతో దుర్మరణం పాలయ్యారు. ప్రమాదస్థలంలో దర్గా ఎదురుగా విద్యుత్ స్తంభం ఉండడంతో ట్రావెల్ టెంపో దానికి ఆనుకుని ఆగిపోయింది. విద్యుత్ స్తంభం లేకపోయి ఉంటే వాహనాన్ని ఢీ కొన్న వేగానికి ట్రావెల్ టెంపో పక్కనే లోతుగా ఉన్న పొలంలోకి బోల్తాపడి మరింత ఘోరం జరిగి ప్రాణాలు పోయేవని అందరూ భావిస్తున్నారు. కంటైనర్ లారీ భారీగా ఉండడంతో వేగం నియంత్రించి కట్ చేయలేక ట్రావెల్ టెంపోను ఢీ కొనడం వల్ల లారీ కుడివైపు దెబ్బతినింది. ప్రమాదం జరగ్గానే కంటైనర్ డ్రైవర్ పరారయ్యాడు. పెద్దగా శబ్దం రావడంతో యాతాలవంక, ఈడిగపల్లె ప్రాంతాల వాసులతోబాటు పొలాల్లోని రైతులు, కూలీలు సంఘటనా స్థలానికి పరుగులుతీశారు. ట్రావెల్ టెంపో నుంచి రక్తం రోడ్డుపై కారుతుండడం గమనించి.. వాహనంలోని క్షతగాత్రులను కాపాడేందుకు స్థానికులు ఎంత ప్రయత్నించినా డోర్లు తెరుచుకోలేదు. ప్రమాదం జరిగిన వెంటనే పుంగనూరు సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ హరిప్రసాద్ ప్రమాద స్థలానికి చేరుకున్నారు. విదేశీయులైన 12 మంది లగేజీని వాహనంపై నుంచి కిందకుదించి పోలీసులు భద్రపరిచారు. గునపాలు, రాడ్లతో స్థానికులు, పోలీసులు ప్రమాద వాహన అద్దాలు, టాప్, డోర్లు బద్దల కొట్టి అందులోని క్షతగాత్రులను బయటకు తీశారు. 108, పోలీసు వాహనాల్లో చికిత్సల కోసం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడికక్కడే అనంతపురానికి చెందిన డ్రైవర్ సాదిక్‌అలీ(40), స్పెయిన్ దేశస్థులైన మహిళలు లోఫెజ్‌నెవోరో మరియా నైవ్స్(62), మొరాన్ మొలినిల్లో జోస్ఫా(65), పురుషులు ఫెరజ్ మరోనా విసెంట్(50), ఫెడ్‌రోసా గిజోన్ ఫ్రాంచిస్కో(31) మృతి చెందగా శవపరీక్ష నిమిత్తం ముగ్గురి మృతదేహాలను పుంగనూరు వైద్యశాలకు తరలించారు. మరో ఇద్దరైన విసెంట్, పెపాలు మదనపల్లె వైద్యశాలలో మృతి చెందారు. ప్రమాద విషయాన్ని పోలీసులు చిత్తూరు ఎస్పీ రాజశేఖర్‌బాబు, కలెక్టర్ ప్రద్యుమ్నల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే అమరావతిలో ఉన్న సీఎం చంద్రబాబునాయుడుకు విషయం తెలియగానే యుద్ధప్రాతిపదికన సహాయక కార్యక్రమాలు, మృతదేహాలకు సత్వర శవ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ను ఆదేశించారు. దీంతో వెంటనే ఆయన పూతలపట్టు, తిరుపతి పర్యటన రద్దు చేసుకుని హుటాహుటిన ఈడిగపల్లె చేరుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందజేయాలని సీఎం ఆదేశించడంతో ఎస్పీ ప్రత్యేక చర్యలు తీసుకుని గాయపడ్డవారికి చికిత్స చేయించడానికి బెంగళూరు కొలంబియో వైద్యశాలకు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి ద్వారా తరలించారు. కలెక్టర్, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆర్డీటీ ఉన్నతాధికారులు, స్పెయిన్ ఎంబసీ అధికారులతో చర్చించారు. మృతదేహాలను బెంగళూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో భద్రపరిచేందుకు చర్యలు తీసుకున్నారు.

వేర్వేరుచోట్ల రైలు కింద పడి ముగ్గురి మృతి


మృతిచెందిన నాగరాజు

గుంతకల్లుటౌన్: వేర్వేరుచోట్ల శనివారం రైలు కింద పడి ముగ్గురు మరణించారు. ఇద్దరు ప్రమాదవశాత్తూ రైలు కిందపడగా, ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో రైలు నుంచి జారి పడి పట్టణానికి చెందిన ఇజంతకర్ నాగరాజు (54) శనివారం ఉదయం మృతిచెందాడు. పట్టణంలోని 60 అడుగుల రోడ్డు ఏడో క్రాస్‌కు చెందిన ఇతడు.. తన కుమారుడు చక్రవర్తితో కలసి శనివారం తెల్లవారుజామున బెంగళూరు వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. ఐదో నెంబరు ప్లాట్‌ఫారంపై కాచిగూడ-యశ్వంతపుర్ ఎక్స్‌ప్రెస్ రైలెక్కి కూర్చున్నారు. రైలు ఎక్కడికెళ్తుందని తోటి ప్రయాణికులను అడిగాడు. బెంగూళురు వెళ్తుందని చెప్పడంతో గాబరా పడి దిగడానికి ఉద్యుక్తుడయ్యాడు. మొదట కుమారుడిని రైలు నుంచి దించాడు. తరువాత తాను దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి రైలు కింద పడ్డాడు. ప్రమాదంలో అతడి ఎడమ కాలు తెగిపోయింది. గాయపడిన అతడిని 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలు తరలించేందుకు సిద్ధం చేస్తుండగా మృతిచెందాడు. జీఆర్పీ పోలీసులు కేసు నమాదుచేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి..

గుంతకల్లు నంచర్ల రైల్వే స్టేషన్ సమీపాన శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి (35) రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. ఇతడు నల్లటి చొక్కా, గోధుమ రంగు ఫ్యాంటును ధరించాడు. తల, వీపు భాగాల్లో బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య..

పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ప్రాంతానికి చెందిన శ్రావణ్‌రాం (24) రైలు కిండపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దశరథరాం కుమారుడైన ఇతడు బీటెక్ పూర్తి చేశాడు. ఇంట్లోనే ఉంటూ అన్‌లైన్ బిజినెస్ చేసుకుంటుండేవాడు. శుక్రవారం రాత్రి 8 గంటలకు సెకండ్ షో సినిమాకని తండ్రికి చెప్పి వెళ్లాడు. రాత్రి 12 గంటలకు తల్లికి ఫోన్ చేసి, స్నేహితుల ఇంట్లో పడుకుంటానని చెప్పాడు. రాత్రి హనుమాన్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి, ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టాల పక్కన పడివున్న మృతదేహాన్ని శనివారం ఉదయం గ్యాంగ్‌మెన్ గమనించి స్టేషన్ మాస్టరుకు సమాచారం అందించారు. స్టేషన్ మాస్టర్.. జీఆర్పీ పోలీసులకు తెలపగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రావణ్‌రాం ఆత్మహత్య చేసుకుని ఉంటాడని జీఆర్పీ పోలీసులు తెలిపారు. అందుకు కారణాలు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

బుక్కరాయసముద్రం: మండలంలో వేర్వేరుచోట్ల రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మరణించారు. ఒకరు గాయపడ్డారు. మండల కేంద్రంలోని గాందీనగర్ వద్ద శుక్రవారం మూడు చక్రాల బైక్ బోల్తాపడి వికలాంగ టీచర్ షేక్ షాహిదాబేగం (45) మృతి చెందగా.. మరో ఉపాధ్యాయురాలు శ్రీదేవి గాయపడ్డారు. నార్పలకు చెందిన షాషిదాబేగం స్థానికంగా ఉన్న ప్రభుత్వ బాలుర పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తుండేది. టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌కు శుక్రవారం అనంతపురానికి మరో టీచర్ శ్రీదేవితో కలిసి వచ్చింది. అనంతరం నార్పలకు మూడు చక్రాల బైక్‌లో వీరిద్దరూ వెళ్తుండగా బుక్కరాయసముద్రం గాంధీనగర్ వద్ద అదుపు తప్పి, బోల్తా పడింది. ప్రమాదంలో టీచర్లిద్దరూ గాయపడ్డారు. వారిని అనంతపురంలోని ఓ ప్రైవేటు అస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం బెంగుళూరు తరలిస్తుండగా శనివారం వేకువజామున మార్గమధ్యలో షాహిదాబేగం మృతిచెందారు. ప్రమాదంపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

వడియంపేట వద్ద లారీ డ్రైవర్..


బుక్కరాయసముద్రం మండలంలోని వడియంపేట గ్రామం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి లారీని వెనుక నుంచి మరొకటి ఢీకొనడంతో డ్రైవర్ రాజు (34) మరణించాడు. ఇతడిది చిత్తూరు జిల్లా మదనపల్లి. సొంత పట్టణం నుంచి హైదరాబాద్‌కు టమోటాల లోడుతో బయల్దేరాడు. వడియంపేట వద్ద ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. వెనుక వస్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ రాజు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ప్రమాదంపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్‌లోకొచ్చే ప్రతి వస్తువూ కల్తీనే!

మేమొక్కరమేనా.. కల్తీ చేస్తుండేది?

విజిలెన్స్ అధికారుల ఎదుట

ప్రేమ్‌జీ ఫ్యాక్టరీ నిర్వాహకురాలి ఆవేదన..




అమ్మకానికి సిద్ధంగా వున్న మసాలా పొడులు, వాటి శాంపిళ్లను సీజ్ చేస్తున్న అధికారులు, ప్రేమ్ జీ ఫ్యాక్టరీ నిర్వాహకుడు హనుమంతయ్య

ఆంధ్రజ్యోతి, అనంతపురం: 'మేమొక్కరమేనా కల్తీ చేస్తుండేది? మార్కెట్‌లోకి వచ్చే ప్రతి వస్తువూ కల్తీ అవుతోంది' అంటూ ఓ ఫ్యాక్టరీ నిర్వాహకుడి భార్య ఆవేదన చెందడం తనిఖీలకు వెళ్లిన విజిలెన్స్ అధికారులను నివ్వెరపరచింది. తనిఖీల్లో ఆహారాన్ని కల్తీ చేస్తున్నట్లు తేలడంతో ఫ్యాక్టరీని సీజ్ చేశారు. దీంతో ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

విజిలెన్స్, ఆహారకల్తీ శాఖాధికారులు సంయుక్తంగా శనివారం అనంతపురం నగర సమీపంలోని తడకలేరు వద్దగల ప్రేమ్‌జీ ఫ్యాక్టరీపై దాడులు చేశారు. విజిలెన్స్ సీఐ రెడ్డప్ప, డీసీటీఓ చెన్నయ్య, ఆహారకల్తీ నియంత్రణ శాఖాధికారులు నాగేశ్వరరావు, రవిశంకర్.. సిబ్బందితో కలిసి హనుమంతయ్య నిర్వహిస్తున్న శనగ, ధనియాలు, మిరప పొడుల తయారీ కేంద్రంలో తనిఖీలు చేపట్టారు. ఇందులో నివ్వెరపోయే విషయాలు వెలుగు చూశాయి. బఠానీలు, బియ్యం, పప్పులు, శనగలు కలిపి శనగపిండి తయారు చేస్తున్నారు. ధనియాల పొడి, మిరప పొడిలోనూ కల్తీ చేస్తున్నారు. ఈ కల్తీ పొడులను తయారు చేసి, ప్రేమ్‌జీ శనగపిండి, మిరప, ధనియాల పొడులుగా మార్కెట్‌లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇందుకు అనుమతి కూడా లేకపోవడం గమనార్హం. మూడేళ్లుగా ప్రేమ్‌జీ కల్తీ పొడులు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అధికారుల తనిఖీల్లో ఈ విషయాలన్నీ బయటపడ్డాయి. ఆహార కల్తీ నియంత్రణ శాఖాధికారులు ఆ పొడుల ప్యాకెట్ల శాంపిళ్లను తీసుకున్నారు. వాటిని ల్యాబ్‌కు పంపనున్నారు. ఫ్యాక్టరీకి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేశారు. కల్తీ పొడులు తయారు చేసి, ప్రజల ఆరోగ్యాలతో ఎందుకు చెలగాటమాడుతున్నావని ఫ్యాక్టరీ యజమాని హనుమంతయ్యను ప్రశ్నించగా... మార్కెట్‌లో పోటీ కారణంగా తక్కువ ధరకు ఇచ్చేందుకు కల్తీ చేయాల్సి వస్తోందని చెప్పడం శోచనీయం. ఆయన భార్య మరో అడుగు ముందుకేశారు. 'మేమొక్కరమేనా కల్తీ చేస్తుండేది... మార్కెట్‌లోకి వచ్చే ప్రతి వస్తువూ కల్తీ అవుతోంద'ని రోదిస్తూ చెప్పడం విచారకరం.

ఇద్దరు దొంగల అరెస్టు

విద్యుత్, రాగి వైర్లు, డ్రిప్ సామగ్రి, రెండు వాహనాల స్వాధీనం


నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

ఆంధ్రజ్యోతి అనంతపురం: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్, రాగి, డ్రిప్ వైర్లతోపాటు సబ్‌మెర్సిబుల్ మోటార్లను అపహరిస్తున్న ఇద్దరిని సీసీఎస్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కణేకల్లు మండలం హనకనహల్‌కు చెందిన గలగల మారుతీరెడ్డి, అనంతపురంలోని లెనిన్‌నగర్‌కు చెందిన షేక్‌మస్తాన్‌వలిని పట్టుకుని, టన్ను విద్యుత్ వైరు, 160 కిలోల రాగి, 20 కట్టల డ్రిప్ వైర్లతో పాటు సబ్‌మెర్సిబుల్ మోటారు, రెండు లగేజీ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4 లక్షలు ఉంటుందని అంచనా. శనివారం సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీసీఎస్ సీఐలు ఆంజనేయులు, ఇస్మాయిల్, ఆత్మకూరు సీఐ శివనా రాయణస్వామి, ఎస్ఐ నాగేంద్రప్రసాద్‌తో కలిసి సీసీఎస్ డీఎస్పీ నాగసుబ్బన్న నిందితుల అరెస్టు వివరాలు వెల్లడించారు.

దొంగల నేపథ్యం...

పోలీసులు అరెస్టు చేసిన నిందితుల్లో ఒకడైన మారుతీరెడ్డి ప్రస్తుతం బుక్కరాయసముద్రం మండలం భద్రంపల్లిలో నివాసముంటున్నాడు. పదో తరగతి వరకు చదువుకున్నాడు. విద్యుత్‌లైన్లను లాగే పనులు చేసే కాంట్రాక్టర్ వద్దకు కూలీగా వెళ్లేవాడు. ఆ పనుల్లో మిగిలిన వృథా వైరు, ఇతర సామగ్రిని తీసుకొచ్చి, అనంతపురంలోని గుజిరీ దుకాణాల్లో అమ్మేవాడు. ఈ క్రమంలోనే గుజిరీ వ్యాపారైన షేక్ మస్తాన్‌వలితో పరిచయం ఏర్పడింది. వృథా సామగ్రి అమ్మడం, కొనడం వల్ల పెద్దగా లాభాలు లేవని ఇద్దరూ భావించారు. దీనికితోడు తాగుడు తదితర వ్యసనాలు తీర్చుకునేందుకు సరిపడా డబ్బు ఉండేది కాదు. ఆ మేరకు సంపాదన లేకపోయింది. దీంతో విద్యుత్‌వైర్లు అపహరించాలని నిర్ణయించుకున్నారు. అప్పటికే షేక్ మస్తాన్‌వలి దగ్గర మినీ వ్యాన్ ఉండేది. దానిని చోరీలకు వినియోగించుకోవాలని నిర్ణయించుకున్నారు. వ్యాన్‌కు (ఏపీఎస్‌పీడీసీఎల్) అని విద్యుత్ శాఖ బోర్డు తగిలించుకున్నారు. విద్యుత్ సిబ్బంది వలె వెళ్తే.. ఎవరూ అనుమానించరని ఆ బోర్డు తగిలించుకున్నారు. ఇద్దరూ విద్యుత్ స్తంభాలకున్న కరెంట్ వైర్లను దర్జాగా కట్‌చేసి, అపహరించేవారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి, అందులోని రాగి వైరును చోరీ చేశారు. రైతుల పొలాల్లోనూ డ్రిప్ వైర్లను అపహరించారు. ఇలా కూడేరు, శింగనమల, బెళుగుప్ప, తనకల్లు, గోరంట్ల, పెనుకొండ, యల్లనూరు, శెట్టూరు, బుక్కపట్నం తదితర ప్రాంతాల్లో ఏడాదిన్నరగా చోరీలు చేస్తున్నారు.

పట్టుబడ్డారిలా...

జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, డ్రిప్ వైర్లు చోరీ అవుతుండటంతో బాధితులు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ మాల్యాద్రి పర్యవేక్షణలో సీసీఎస్ డీఎస్పీ నాగసుబ్బన్న ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి, దొంగలపై నిఘా పెట్టారు. ఇందులో భాగంగానే పక్కా సమాచారం మేరకు కూడేరు మండలం కమ్మూరు క్రాస్ వద్ద నిందితులిద్దరినీ అరెస్టు చేయడంతో విద్యుత్ వైర్ల చోరీ గుట్టు రట్టయింది. దొంగలను అరెస్టు చేయడంలో చొరవ చూపిన సిబ్బందిని ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ అభినందించారు.


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న విద్యుత్ వైర్లు, సామగ్రి

వేర్వేరుచోట్ల ఇద్దరి ఆత్మహత్య

ముదిగుబ్బ/విడపనకల్లు: జిల్లాలో వేర్వేరుచోట్ల శనివారం ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. ముదిగుబ్బ మండలం రాళ్లనంతపురం గ్రామానికి చెందిన వివాహిత అంజినమ్మ (40) విషపు గుళికలు మింగి, మరణించింది. కుటుంబ సమస్యల కారణంగా విరక్తి చెంది ఆమె ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటుందని బంధువులు తెలిపారు. ఈమె భర్త శ్రీరాములు పదేళ్ల క్రితమే వదిలిపెట్టి వెళ్లిపోయాడనీ, అప్పట్నుంచీ మానసికంగా క్షోభిస్తుండేదన్నారు. కుమార్తె శిరీష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

తాగుడు మానుకోవాలన్నందుకు..

తాగుడు మానుకుని, సంసారం పట్టించుకోవాలని తల్లి, భార్య మందలించడంతో మనస్తాపం చెంది, విడపనకల్లు మండలం హావళిగి గ్రామానికి చెందిన మౌనేష్ (34) ప్రాణం తీసుకున్నాడు. మౌనేష్ తాగుడుకు బానిసై, సంసారాన్ని పట్టించుకోలేదని, కుటుంబ సభ్యులు గొడవ పడేవారని బంధువులు తెలిపారు. శనివారం సాయంత్రం తాగి ఇంటికి రావడంతో మౌనేష్ తల్లి, భార్య రోజు తాగివచ్చి సంసారాన్ని పట్టించుకోక పోతే ఎలా అంటూ గట్టిగా మందలించినట్లు తెలిపారు. దీంతో మనస్తాపం చెందిన మౌనేష్ ఇంట్లోనే ఒంటిపై కిరోసిన్ పోసుకుని, నిప్పంటించుకున్నాడన్నారు. కుటుంబ సభ్యులు గమనించి, కాపాడే లోపే మృతిచెందాడు. దీనిపై పాల్తూరు ఎస్ఐ మహమ్మద్ ఖాన్‌ను అడగ్గా.. తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

ఇల్లు రాసివ్వలేదని భార్య హత్య


భర్త చేతిలో హతమైన వెంకటేశ్వరి

ధర్మవరంఅర్బన్: ఇల్లు తన పేరిట రాయలేదని పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలో భార్య వెంకటేశ్వరి(38)ని శనివారం ఉదయం అతి కిరాతకంగా హత్య చేశాడు భర్త బలిజ ప్రసాద్. ప్రసాద్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రానురాను తాగుడుకు బానిసై, తరచూ భార్యతో గొడవ పడుతుండేవాడు. వీరి ఇల్లు భార్య వెంకటేశ్వరి పేరుమీద ఉంది. ఆ ఇంటిని తన పేరిట రాసివ్వాలంటూ రోజూ రాత్రి సమయాల్లో తాగి వచ్చి, భార్యను వేధించేవాడు. శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఉండటంతో వెంకటేశ్వరి అన్న ఇంటికెళ్లి, రాత్రికి తిరిగొచ్చింది. రాత్రి కూడా ఇంటి విషయమై గొడవ పడినట్లు సమాచారం. ఇల్లు రాసివ్వనందుకు ఆగ్రహించిన ప్రసాద్.. నిద్రిస్తున్న వెంకటేశ్వరి తలపై రాయితో మోది చంపి ఉండొచ్చని ఆమె బంధువులు పేర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వెల్లివిరిసిన భక్తిభావం



శ్రీవారి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

కిక్కిరిసిన ఖాద్రీశుడి ఆలయం

కదిరిటౌన్: శ్రావణమాసపు రెండో శనివారం కావడంతో ఖాద్రీ లక్ష్మీనరసింహాస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. జిల్లాతోపాటు కర్ణాటక నుంచి కూడా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది. భక్తులు తలనీలాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఎన్నడూలేని విధంగా తెల్లవారుజామున 5 గంటల నుంచే శ్రీవారికి అభిషేకాలు గావించి, అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు చర్యలు తీసుకున్నారు.





ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు



గరుడ వాహనంపై ఊరేగుతున్న ఆంజనేయ స్వామి

గరుడ వాహనంపై ఊరేగిన శ్రీనెట్టికంటి

గుంతకల్లు రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి శ్రావణ మాస రెండో శనివారాన్ని పురస్కరించుకుని రాత్రి గరుడ వాహనంపై ఊరేగారు. ఆలయంలోని స్వామి మూలవిరాట్టుకు వేకువజామునే జల, పంచామృతాభిషేకాలు గావించారు. విశేషపుష్పాలతో బంగారు కవచాన్ని అలంకరించి, వజ్రకిరీటాన్ని ధరింప జేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులను అదుపు చేయడానికి ఆలయ అధికారులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, హోంగార్డులు, పోలీసు సిబ్బంది నానా తంటాలు పడ్డారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఆలయ ప్రధాన ద్వారం, ముఖ మంటపాల వద్ద పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం శ్రీసీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి, గరుడ

● పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తులు

వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి, ఆలయ ప్రాకారోత్సం ఘనంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు గరుడాచార్యులు, వేదపండితులు రామకృష్ణ అవధాని, అనంతపద్మనాభశర్మ, అర్చకులు రాఘవాచార్యులు, చక్రవర్తి, కళాధర్‌స్వామి పాల్గొన్నారు.



కసాపురం ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

రామభక్తా.. నమో.. నమః..



ప్రత్యేకాలంకరణలో మురడీ ఆంజనేయుడు

డి హీరేహాళ్: శ్రావణ రెండో శనివారం, శని త్రయోదశిని పురస్కరించుకుని జిల్లాలోని ప్రముఖ ఆంజనేయస్వామి ఆలయాలైన కసాపురం, మురడీ, నేమకల్లులో భక్తులు కిక్కిరిసిపోయారు. మురడీ ఆంజనేయస్వామి ఆలయంలో వేలాది మంది భక్తులు.. 'జై హనుమా.. వాయుపుత్రా.. పాహిమాం.. పాహిమాం..' అంటూ కీర్తించారు. జిల్లా నలుమూలలతోపాటు కర్ణాటక ప్రాంతంలోని అనేక ప్రదేశాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి, స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి భక్తులు దాదాపు కిలోమీటరు దూరం వరకూ క్యూ కట్టారు. స్వామికి ఉదయం ఆర్చకులు అనంతశయన, రామాంజనేయులు, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం గంగపూజ, పన్నీరు, పంచామృతాభిషేకాలు గావించారు. అనంతరం స్వామిని ప్రత్యేక పుష్పమాలలతో అలకరించి, వెండికవచం తొడిగారు. అకు పూజలు చేశారు. దివ్వశోభాయమానంగా భక్తులకు స్వామి దర్శనమిచ్చారు. స్వామిని దర్శించుకున్న భక్తుల్లో కళ్యాణదుర్గం డీఎస్పీతో పాటు కర్ణాటక ప్రముఖలు ఉన్నారు. భక్తులకు అన్నదానం, ప్రసాదం అందించారు.

నేత్రపర్వంగా ఏడుశనివారాల వ్రతం

అనంతపురం టౌన్: శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని అనంత నగరంలోని ఆర్‌ఎఫ్ రోడ్డు లక్ష్మీ వెంకటేశ్వరస్వామి, రామ్‌నగర్, హౌసింగ్‌బోర్డులోని వెంకటేశ్వర దేవాలయాల్లో ఏడు శనివారాల వ్రతాలను నేత్రపర్వంగా ఆచరించారు. ఐదో శనివారం ఆయా ఆలయాల్లో వేకువజామునే వెంకటేశ్వరస్వామికి నిర్మాల్య విసర్జన గావించారు. పంచామృతాభిషేకాలు, అర్చనలు, తోమాలసేవలు, విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామివారి ఉత్సవమూర్తికి వివిధ పుష్పాలంకరణలు చేసి వేదమంత్రోచ్చారణ నడుమ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళా భక్తులు విశేషంగా హాజరై భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు గావించారు. వ్రతాన్ని సామూహికంగా ఆచరించారు. మధ్యాహ్నం భక్తులకు పెద్దఎత్తున అన్నదానం చేశారు. సాయంత్రం ఆయా ఆలయాల ఆవరణాల్లో భక్తులు సామూహిక విష్ణుసహస్రనామ పారాయణాలు పఠించారు.



ఆర్‌ఎఫ్ రోడ్డు లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో వ్రతం చేస్తున్న దృశ్యం... ఏడు శనివారాల వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు



నేమకల్లులో...



ప్రత్యేకాలంకరణలో వెండికవచధారుడు

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి ప్రధాన అర్చకులు అ నిల్‌కుమార్ స్వామి, సంతోష్‌కుమార్‌స్వామి, మురళి ఆధ్వర్యంలో స్వామివారికి పవిత్ర జల, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, ప్రత్యేకాలంకరణ, ఆకుపూజలు నిర్వహించారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు వివిధ పుష్పమాలలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం మహామంగళ హారతి, ప్రసాద వినియోగాలు గావించారు. భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆలయంలో దీపారాధన, ప్రత్యేక భజనలు నిర్వహించారు.

నేడు స్నేహితుల దినోత్సవం

చెరిగిపోని బంధం

లోకం తెలియని నాడు..
చేరువవుతుంది..
చెలిమి చేస్తుంది..
దగ్గరవుతుంది..

చేతిలో చెయ్యేసి..
ఆటలో అండగా నిలుస్తుంది..
ఓటమిలో వెన్నంటే ఉంటూ..
గెలుపు దాకా.. నడిపిస్తుంది..

చికు.. చికు.. రైలులో..
చివరి పెట్టెవుతుంది..
మనం కూత పెడితే..
అది పొగ వదులుతుంది..

ఆనందం వస్తే..
రెట్టింపు చేస్తుంది..
కష్టం వస్తే..
కన్నీళ్లు తుడుస్తుంది..

పసి వయసులో జత కడుతుంది..
చివరిదాకా తోడుంటుంది..
తరిగిపోని బలిమిగా..
చెరిగిపోని చెలిమిగా..

బీ.. ఫ్రెండ్స్.. ఫారెవర్..





అంతటా
సందడే.. సందడి..
సోషల్ మీడియాలో
శుభాకాంక్షల
వెల్లువ..


ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కొంటున్న యువతులు

స్నేహం... రెండక్షరాల చిన్న పదం. వర్ణింపశక్యం కాని గొప్ప కావ్యం. తరాల అంతరాలు... జీవితాల నేపథ్యాలు... సాంఘిక అసమానతలు చూడలేని, చూడరాని అతిగొప్ప దృశ్య కావ్యం. ఇది పూర్తిగా స్వార్జితం. ఎవరంతట వారు సంపాదించుకునేది. నిస్వార్థమైనది. చెరిగిపోనిది. కుటుంబం తర్వాత మన జీవితాల్లో అతి ముఖ్యమైన భాగం స్నేహితులమయమైపోతుంది. ఆదివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

వృత్తిరీత్యా పోటీపడుతుంటాం

స్నేహితుల దినోత్సవం చాలా విలువైనది. 1990లో ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో అధ్యాపకులుగా చేరాం. నాటి నుంచి నేటికీ మా స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నాం. సంతోషం, బాధ రెండింటినీ సంతోషంగా పంచుకుంటాం. కొన్ని సందర్భాల్లో ఒకరు వాదిస్తే మరొకరు సర్దుకుంటుంటాం. వృత్తి విషయానికొస్తే మాత్రం పోటీ పడుతుంటాం. పండుగల సమయంలో ఇరు కుటుంబాలు కలిసి సంతోషంగా గడుపుతాం. ఆర్థిక ఇబ్బందిల్లోనూ ఒకరికొకరు సహకరించుకుంటుంటాం.

- వెంకటరమణ (అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్), ప్రభాకర్‌రాజు (ప్రొఫెసర్, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల)



అనంతపురం టౌన్: స్నేహమనే పదానికి అసలైన అర్థం నిజమైన స్నేహితుడు లభించినపుడే తెలుస్తుంది. లోకంలోని అన్ని బంధాలకన్నా ఫ్రెండ్‌షిప్‌కున్న ప్రాధాన్యం అంతా.. ఇంతా.. కాదు. ఎదుటివాడిలోని కోపాన్ని, లోపాన్ని భరించేవాడినే నిజమైన స్నేహితుడంటారు. గురువులా దారిచూపి, తప్పు చేసినపుడు మందలించే వ్యక్తి నిజమైన స్నేహితుడు. మంచి స్నేహితుల మధ్య ఎలాంటి మొహమాటాలు, రహస్యాలు ఉండవు. అవసరమైనపుడు నిస్సంకోచంగా ఒకరికొకరు తమ కష్టసుఖాలు పంచుకుంటారు. కష్ట సమయంలో కలత చెందిన మనసుకు వెన్నెలలా చల్లదనాన్ని, ప్రశాంతతను కలిగించే దివ్యౌషధం స్నేహం. అవసరమైనపుడు కనీసం మాటసాయం చేయడానికైనా ఆప్తమిత్రుడున్నాడనే భావన కష్టాల తీవ్రతను తగ్గిస్తుంది. వారితో చర్చించి, సమస్యకు పరిష్కారం కనుక్కోవాలనే ఆలోచన కూడా కలిగిస్తుంది. రోజూ మాట్లాడుకోకున్నా అవసరమైనపుడు ఓదార్పు, ధైర్యం కలిగించేవాడున్నాడనే నమ్మకం... కొండంత ధైర్యాన్ని, మనసుకు ఉపశమనాన్ని ఇస్తుంది. అందుకే నిజమైన స్నేహితుడు కంటికి దూరమైనా మనసుకు దగ్గరగానే ఉంటాడు అంటారు. కుటుంబ సభ్యులతో కూడా చెప్పుకోలేని సమస్యలను ఆత్మీయ స్నేహితులతో చర్చించుకుంటుంటాం. పరిచయమైనోళ్లందరినీ స్నేహితులనలేం. ప్రతిదానికీ ముందు, వెనుక ఉన్నట్లే స్నేహం విషయంలోనూ ముందుజాగ్రత్త, నమ్మకం చాలా ముఖ్యం. నిజమైన స్నేహితులను గుర్తించాలి. మోసగాళ్లను దూరం పెట్టాలి. యువతీయువకులే కాక లోకజ్ఞానం పెద్దగా తెలియని చిన్నారులు కూడా స్నేహితుల దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా చేసుకుంటారు. దీంతో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం పెద్ద క్రేజ్‌గా మారింది. స్నేహితులను కలవడానికి ప్రతిఒక్కరూ ఎంతో ఉత్సాహం చూపుతున్నారు. స్నేహితుల ఇళ్లకు వెళ్లి, ఫ్రెండ్‌షిప్ బ్యాండు కడుతుంటారు. స్నేహంలోని సరిగమలను ఆస్వాదిస్తూ, చిన్నా పెద్దా భేదాల్లేకుండా స్నేహ మధురిమలను కలకాలం కాపాడుకోవాలని మనసారా కోరుకుందాం.

కలకాలం గుర్తుండే తీపి గుర్తు స్నేహం

జీవితంలో ఎప్పటికీ గుర్తుంచుకోదగ్గ తీపిగుర్తే స్నేహం. వెల కట్టలేనిది ఈ బంధం. కష్టం, సుఖం ఏదైనా మన వెన్నంటే ఉండి ప్రోత్సహించేవాడే అసలైన స్నేహితుడు. నా (జనార్దన్) వివాహ విషయంలో మా కుటుంబాలు సహకరించకపోతే స్నేహితుడు ప్రతాప్ పెళ్లి పెద్దగా నిలిచి, వివాహం చేశాడు. తర్వాత మా ఇరు కుటుంబాలతో మాట్లాడి, సర్దిచెప్పి నా జీవితం కష్టాల పాలవకుండా కాపాడాడు.

- జనార్దన్, ప్రతాప్



మా ఇద్దరి భావాలూ ఒక్కటే

మా మధ్య ఆరో తరగతిలో స్నేహం ఏర్పడింది. ఆ రోజునుంచి ఇద్దరం ఒకే స్కూల్, ఒకే కాలేజీలో చదువుతూ వస్తున్నాం. ఏ విషయంలోనైనా ఇద్దరి భావాలూ ఒకేలా ఉంటాయి. సొంత అక్కాచెల్లెళ్లు ఎలావుంటారో కానీ... మేం అంతకన్నా ఆప్యాయంగా ఉంటాం. ప్రపంచమంతా ఒకెత్తు అయితే.. మా ఇద్దరి స్నేహం ఒకెత్తు. ఫ్రెండ్‌షిప్‌డేను తలచుకుని, స్నేహ బంధానికున్న విలువను పెంచాలి.



- హర్షిత, రూప (డిగ్రీ తృతీయ సంవత్సరం, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల)

కుటుంబ సభ్యులను మరిపిస్తుంది..

మేమిద్దరం హిందూపురంలోని బాలయేసు కాలేజీలో ఇంటర్మీడియట్‌లో కలుసుకున్నాం. మా ఇద్దరి ఆశయాలు ఒక్కటే. అందుకే మా స్నేహం నేటికీ కొనసాగుతోంది. ప్రస్తుతం అనంతపురంలలో హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాం. మా స్నేహం కుటుంబాలకు దూరంగా ఉన్నామనే బాధను మరిపిస్తోంది. చదువుపరంగా ఒకరికొకరు సలహాలిచ్చుకుంటుంటాం. మా ఇరు కుటుంబాల పెద్దలు సైతం మాలాగే కలిసిపోతారు.

- రూప, వనజ (ఎమ్మెస్సీ మొదటి సంవత్సరం)



సబ్సిడీ రుణం పేరుతో టోకరా

పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

సోమందేపల్లి: సబ్సిడీ రుణాలు ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తి రూ.1.52లక్షలకు టోకరా వేసినట్లు మండలంలోని చాకర్లపల్లికి చెందిన శాంతమ్మ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె మాట్లాడుతూ.. ఇటీవల ఓ వ్యక్తి తనకు ఫోన్ చేసి, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.7.5లక్షల సబ్సిడీ రుణం ఇప్పిస్తానని నమ్మబలికాడంది. రూ.2లక్షల వరకు బ్యాంకు ఖాతాలో జమ చేయాల్సిందిగా నెంబర్ ఇచ్చాడని చెప్పుకొచ్చింది. ఆ మేరకు ఇప్పటి వరకు రూ.1.52 లక్షలు జమ చేశానంది. కొంతకాలంగా ఆ వ్యక్తి అందుబాటులోకి రావట్లేదని పేర్కొంది. ఆ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. ప్రజలు ఇలాంటి మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

అగ్రిగోల్డ్ ఆస్తులపై సీఐడీ విచారణ

గుంతకల్లురూరల్: మండలంలోని దోసలుడికి గ్రామ రస్తాలో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తులపై సీఐడీ బృందం శనివా రం విచారణ చేపట్టింది. కర్నూలుకు చెందిన సీఐడీ సీఐ కృష్ణారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సుంకన్న మాట్లాడుతూ.. ప్రజల నుంచి అక్రమంగా డిపాజిట్లను వసూలు చేసి ఉడాయించిన అగ్రిగోల్డ్ నిర్వాహకులపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందేనన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అగ్రిగోల్డ్ నిర్మాహకులు కొనుగోలు చేసిన లేఔట్లు, ఇతర ఆస్తులకు సంబంధించిన ఈసీలు తదితర అంశాలపై విచారణ చేపట్టామన్నారు. సంస్థ ఆస్తులకు సంబంధించిన వివరాలను ఎంపీడీఓ కార్యాలయంలోని పంచాయతీ కార్యదర్శి రామలింగప్పను అడిగి, తెలుసుకున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ కొనసాగుతుందన్నారు.

2024 ఒలింపిక్స్‌కు పారిస్ ఆతిథ్యం

కరెంట్ అఫైర్స్


రామచంద్రారెడ్డి ఉప్పుల

అంతర్జాతీయం

పాక్ ఆపద్ధర్మ ప్రధానిగా అబ్బాసీ

పాకిస్థాన్ ఆపద్ధర్మ ప్రధానిగా పెట్రోలియం, సహజ వనరుల శాఖ మాజీ మంత్రి షహీద్ ఖాకన్ అబ్బాసీ జూలై 29న నియమితులయ్యారు. ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్ మోసం, అవినీతికి పాల్పడ్డారని ఆ దేశ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఫలితంగా అతడిపై అనర్హత వేటు పడింది. పనామా పత్రాల కుంభకోణం వ్యవహారంలో షరీఫ్‌తోపాటు కుటుంబ సభ్యులపై దాఖలైన వ్యాజ్యానికి సంబంధించి అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఈ తీర్పు వెలువ రించింది. తదుపరి ప్రధానిగా షరీఫ్ తమ్ముడు, పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రి షెహనాజ్ షరీఫ్ బాధ్యతలు చేపట్టనున్నారు. 45 రోజుల పాటు అబ్బాసీ తాత్కాలిక ప్రధానిగా పనిచేస్తారు.

టిబెట్‌లో ఎక్స్‌ప్రెస్ మార్గం ప్రారంభం

ప్రపంచంలోనే ఎత్తయిన పీఠభూమి టిబెట్‌లో చైనా ఎక్స్‌ప్రెస్ రహదారిని ప్రారంభించింది. కింఘై ప్రావిన్స్‌లోని గాంగ్హై కౌంటీని పుష నగరంతో కలుపుతూ దీన్ని నిర్మించారు. 634.8 కి.మీ. పొడవైన ఈ మార్గం నిర్మాణానికి 25.6 వేల కోట్లను చైనా ఖర్చు చేసింది. సగటున 4 వేల మీటర్ల ఎత్తులో ఈ రహదారి ఉంటుంది. రహదారిలో 36 శాతం మంచునేల పెర్మాఫ్రాస్ట్‌పై నిర్మించారు. ఈ మార్గం ద్వారా యుషు, షినింగ్‌ల మధ్య ప్రయాణ సమయం 8 గంటలకు తగ్గింది.

చైనా గోడ కింద హైస్పీడ్ సొరంగ రైలు మార్గం

గ్రేట్ వాల్ ఆఫ్ చైనా కింద హైస్పీడ్ సొరంగ రైలు మార్గాన్ని చైనా నిర్మించనుంది. 2022 శీతాకాల ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వనున్న బీజింగ్, ఝూంగ్ జియాకు నగరాలను అనుసంధానించేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టింది. ఇందులో భాగంగా మహాకుడ్యానికి చెందిన బాడలింగ్ భాగం కింద 12 కి.మీ. పొడవైన సొరంగాన్ని తవ్వనున్నారు. గోడ కిందే 102 మీటర్ల లోతున 36 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో రైల్వే స్టేషన్‌ను నిర్మించనున్నారు. ఈ మార్గంలో గంటకు 350 కి.మీ. వేగంతో రైళ్లు ప్రయాణించనున్నాయి.

చైనా చేతికి శ్రీలంక రేవు

వ్యూహాత్మక హంబంటోటా రేవులో 70 శాతం వాటాను చైనాకు విక్రయిస్తూ శ్రీలంక నిర్ణయం తీసుకొంది. ఈ మేరకు 110 కోట్ల డాలర్ల ఒప్పందంపై జూలై 29న శ్రీలంక నౌకాయాన మంత్రి మహింద సమరసింఘే, కొలంబోలో చైనా రాయబారి జియాన్ లియాంగ్‌లు సంతకం చేశారు. నష్టాల్లో ఉన్న ఈ రేవును చైనా ప్రభుత్వ ఆధ్వర్యంలోని చైనా మర్చంట్ పోర్ట్ హోల్డింగ్స్‌కు అప్పగిస్తారు. 99 ఏళ్ల పాటు ఈ లీజు ఒప్పందం కొనసాగుతుంది. ఈ ఒప్పందంపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది.

ఇరాన్ అధ్యక్షుడిగా రోహానీ ప్రమాణం



ఇరాన్ అధ్యక్షుడిగా హసన్ రోహానీ ఆగస్టు 3న ప్రమాణ స్వీకారం చేశారు. రోహానీ 2013లో మొదటిసారి అధ్యక్షుడయ్యారు. 2015 అణు ఒప్పందం విషయంలో, ప్రపంచ దేశాల ఆంక్షల తొలగింపులో ఈయన కీలక పాత్ర పోషించారు. 2017 మేలో జరిగిన ఎన్నికల్లో రోహానీ 57 శాతం ఓట్లు సాధించి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

లష్కరే కమాండర్ దుజానా హతం

లష్కరే తోయిబా టాప్ కమాండర్ అబు దుజానాను ఆగస్టు 1న భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాకిస్థాన్ జాతీయుడైన దుజానాను, అతని అనుచరుడు ఆరిఫ్ నబీదార్‌ను భద్రతా బలగాలు హతమార్చాయి. దుజానా దక్షిణ కశ్మీర్‌లో లష్కరే తోయిబా చీఫ్ కమాండర్, ఏ+++ హోదా ఉగ్రవాది. 2013లో అబు ఖాసీం మరణించాక దుజానా లష్కరే టాప్ కమాండర్‌గా ఉన్నాడు.

క్రీడలు

హంగేరియన్ గ్రాండ్‌ప్రి విజేత వెటెల్

ఫెరారీ డ్రైవర్ సెబాస్టియన్ వెటెల్ హంగేరియన్ గ్రాండ్‌ప్రి విజేతగా నిలిచాడు. ఈ విజయంతో వెటెల్ ఎఫ్ 1 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తన ఆధిక్యాన్ని 14 పాయింట్లకు పెంచుకున్నాడు. జూలై 30న బుడాపెస్ట్‌లో జరిగిన రేసులో వెటెల్ మొదటి స్థానంలో, ఫెరారీకే చెందిన రైకోనెన్ రెండో స్థానంలో నిలిచాడు.

2024 ఒలింపిక్స్‌కు పారిస్ ఆతిథ్యం



2024 ఒలింపిక్స్‌కు ఫ్రాన్స్ రాజధాని పారిస్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ ఏడాది సెప్టెంబరు 13న పెరూలోని లిమాలో జరిగే సమావేశంలో 2024కి పారిస్, 2028కి లాస్ ఏంజిల్స్‌ను ఎంపిక చేసినట్లు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐఒసి) ప్రకటిస్తుంది. 2020 ఒలింపిక్స్‌కు టోక్యో ఆతిథ్యం ఇవ్వనుంది. 2024 ఒలింపిక్స్‌కు పారిస్, లాస్ ఏంజిల్స్ పోటీ పడగా, 1924లో తొలిసారి ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చి వందేళ్లవుతున్న సందర్భంగా పారిస్‌కు అవకాశం ఇచ్చారు. వింటర్ ఒలింపిక్స్ 2022లో బీజింగ్‌లో జరుగుతాయి.

అవార్డులు

ఆచార్య కృష్ణకు జాతీయ ప్రతిభా అవార్డు

హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 'సెంటర్ ఫర్ ఎర్త్ అండ్ స్పేస్ సైన్సెస్'లో ఆచార్యుడిగా పనిచేస్తున్న కె.ఎస్.కృష్ణ ప్రతిష్ఠాత్మకమైన జాతీయ ప్రతిభా అవార్డును అందుకొన్నారు. భూశాస్త్ర మంత్రిత్వ శాఖ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జూలై 27న ఈ అవార్డును అందజేశారు. ఈ సంవత్సరం జియో సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం నుంచి డా.కె.ఎస్ కృష్ణ ఎంపికయ్యారు. 1984లో గోవాలోని సముద్ర అధ్యయన జాతీయ సంస్థలో శాస్త్రవేత్తగా చేరి, ముఖ్య శాస్త్రవేత్త స్థాయికి ఎదిగిన ఆయన హెచ్‌సియు ఆహ్వానం మేరకు ఇటీవలే ఆచార్యుడిగా చేరారు. ఎన్ఐఓలో చేసిన పరిశోధనలకు కృష్ణ ప్రతిభా అవార్డుకు ఎంపికయ్యారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ

ఉత్తర కొరియా క్షిపణి పరీక్ష




ఉత్తర కొరియా నెల రోజుల్లో రెండోసారి ఖండాంతర క్షిపణిని పరీక్షించింది. 2017 జూలై 28న 'హ్వాసాంగ్-14' అనే క్షిపణిని ప్రయోగించింది. ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్ దీన్ని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ క్షిపణి 3724.9 కిలోమీటర్ల ఎత్తుకు చేరి 998 కి.మీ. ప్రయాణించింది. తూర్పు తీరానికి చేరువలో సముద్రంలో పడిపోయింది. దీని పరిధి 10 వేల కి.మీ. ఉత్తర కొరియా, రష్యా, ఇరాన్‌లపై ఆంక్షలు విధిస్తూ అమెరికా సెనెట్ ఒక తీర్మానం చేసిన మరుసటి రోజే కొరియా ఈ పరీక్షలను జరిపింది. 750 కిలోల వార్ హెడ్‌తో ఈ క్షిపణి న్యూయార్క్, వాషింగ్టన్ నగరాలను చేరగలదు.

తొలి మానవ రహిత యుద్ధ ట్యాంక్ 'మంత్ర'

భారత్ తొలి మానవ రహిత యుద్ధ ట్యాంక్ 'మంత్ర'ను రూపొందించింది. చెన్నై సమీపంలోని అవడిలోని ట్యాంక్ పరిశ్రమలో దీన్ని తయారు చేశారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా 'కంబాట్ వెహికిల్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్'లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీన్ని ప్రదర్శించారు. ఈ యుద్ధ ట్యాంక్‌లు మూడు రకాలు. నిఘా, మందుపాతరల గుర్తింపునకు వీటిని ఉపయోగించనున్నారు.

స్మృతి

ప్రొఫెసర్ పి.ఎం.భార్గవ
ప్రముఖ శాస్త్రవేత్త, సీసీఎంబీ వ్యవస్థాపక



డైరెక్టర్ ప్రొఫెసర్ పుష్పమిత్ర భార్గవ ఆగస్టు 1న హైదరాబాద్‌లో మరణించారు. 1928లో రాజస్థాన్‌లోని ఆజ్మీర్‌లో జన్మించిన ఆయన లక్నో యూనివర్సిటీ నుంచి ఆర్గానిక్ కెమిస్ట్రీలో పట్టా పొందారు. సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేశారు. 1950-53 మధ్య ఐఐసీటీలో, 1953-56 మధ్య విస్కాన్సన్ వర్సిటీలో పనిచేశారు. 1986లో పద్మవిభూషణ్ అవార్డు పొందారు. సీసీఎంబీ వ్యవస్థాపక సంచాలకుడిగా 1977లో బాధ్యతలు స్వీకరించి 1990 వరకూ కొనసాగారు.

స్వయం ఉపాధి


మైనంపాటి శ్రీనివాసరావు
బిజినెస్ కన్సల్టెంట్
సెల్: 9866119816

మయోనైజ్ అంటే క్రీమీగా చిక్కగా ఉండే సాస్ / డ్రెస్సింగ్ పదార్థమని అందరికీ తెలుసు. దీన్ని వెజిటబుల్ నూనెలు, కోడిగుడ్డు సొన, నిమ్మరసం లేదా వెనిగర్, సీజనింగ్ లేదా ప్రిజర్వేటివ్స్‌తో తయారు చేస్తారు. శాకాహారుల కోసం కోడిగుడ్డు లేకుండా కూడా తయారు చేస్తారు. ఈ సాస్ తెలుపు, పసుపు వర్ణాల మిశ్రమంగా కనిపిస్తుంది. రుచిలో కొంచెం తియ్యదనం ఉంటుంది.

వాడకం

మయోనైజ్‌ను ప్రధానంగా ఆహార పదార్థాల తయారీలో, వినియోగంలో విస్తృతంగా వాడతారు. సలాడ్స్, శాండ్‌విచ్‌లు బర్గర్స్ తయారీలో కూడా ఎక్కువగా ఉపయోగిస్తారు. మందుల తయారీ, పెయింట్స్, కోటింగ్స్,

మయోనైజ్



మేకప్ ఉత్పత్తులు, డిటర్జెంట్స్ తయారీలో కూడా వినియోగిస్తారు. బేకరీ ఉత్పత్తులు, కాన్ఫెక్షనరీ ఉత్పత్తుల తయారీలో విస్తృతంగా వాడుతు న్నారు. ఆహార పదా ర్థాలకు పరిమ ళాన్ని అందించి ఆకర్షణీయంగా కనిపించేందుకు కూడా మయోనైజ్‌ను వినియోగిస్తారు.

చరిత్ర

ఈ సాస్‌ను 1756లో ఫ్రెంచ్ చెఫ్ Due de Richelieu కనుగొన్నారు. ఆ తరవాత ప్రపంచ వ్యాప్తంగా వివిధ ముడిపదార్థాలతో పలు రుచులతో దీన్ని తయారు చేస్తున్నారు. అమెరికాలో అత్యధిక పరిమాణంలో వినియోగించే కండిమెంట్‌గా ఇది గుర్తింపు పొందింది.

ఇండియన్ మార్కెట్

2014 నివేదిక ప్రకారం మన దేశంలో మయోనైజ్ మార్కెట్ పరిమాణం రూ.350 నుంచి 400 కోట్ల వరకు ఉందని తెలుస్తోంది. ఏటా 25 శాతం వరకు వృద్ధి పొందుతోంది.

దేశీయ మార్కెట్ వృద్ధికి కారణాలు

మారుతున్న పట్టణ ప్రజల జీవన విధానం, పట్టణాల నుంచి నగరాలకు పాకుతున్న ఆధునిక జీవన శైలీ, ఆన్‌లైన్ స్టోర్స్, సూపర్ మార్కెట్స్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉండటం, విదేశీ ప్రయాణాలు పెరగడం వంటి కారణాల వల్ల మయోనైజ్ సాస్‌కు డిమాండ్ పెరుగుతోంది.

తయారీకి కావల్సిన యంత్ర పరికరాలు

● హై స్పీడ్ మిక్సర్ ● ట్రాన్స్‌ఫర్ పంపు ● హోమోజినైజర్ ● న్యూమాటిక్ ఫిల్లర్. ● బ్యాండ్ సీలర్ ● స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు ● టేబుల్

ముడి పదార్థాలు

మయోనైజ్ సాస్‌ను మూడు రకాలుగా తయారు చేస్తారు.
● గుడ్డు సొనతో తయారుచేసిన మయోనైజర్ ● ఎగ్‌లెస్ లేదా వెజిటబుల్ మయోనైజర్ ● హెర్బల్ మయోనైజర్. వీటికి ప్రధానంగా సోయాబీన్ ఆయిల్, ఆవనూనె, వైట్ వెనిగర్, ఉప్పు, ఇంగువ, తులసి నూనె, కరివేపాకు నూనె, గుడ్లు, ప్రిజర్వేటివ్ వంటివి అవసరం.

తయారీ విధానం

సహజంగా కలిసే లక్షణాలు లేని రెండు లేదా అంత కంటే ఎక్కువ వంట నూనెలను హైస్పీడ్ మిక్సర్‌లో నిదానంగా కలుపుతారు. మధ్య మధ్యలో ఇతర ముడి పదార్థాలను నిర్ణీత పరిమాణంలో కలుపుతూ గట్టి పేస్ట్ లా తయారు చేస్తారు. ఈ పేస్ట్‌నే మయోనైజర్ లేదా మాయో అని పిలుస్తారు. దీన్ని పెట్ బాటిల్స్, ప్లాస్టిక్ పౌచ్‌ల్లో ప్యాక్ చేసి మార్కెట్‌కు తరలిస్తారు.

ఆరోగ్య ప్రాముఖ్యం

మయోనైజ్ అనేది ఒక సమతులాహార పదార్థం. ఇది పదార్థాలకు రంగు, రుచి, సువాసనలను అదించడమే కాకుండా ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. ఇందులో ఉండే సోయాబీన్ ఆయిల్, ఆవ నూనెల్లోని ఆల్ఫా లినోలిక్ యాసిడ్, అత్యావశ్యక ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ బితోపాటు అనేక రకాల విటమిన్లు, ఖనిజాలు శరీరానికి అరోగ్యాన్ని అందిస్తాయి.

మార్కెటింగ్

చైనీస్ రెస్టారెంట్స్, పిజ్జా, బర్గర్ తయారీ సంస్థల్లో నేరుగా మార్కెట్ చేసుకోవచ్చు. గృహ వినియోగదారుల కోసం సూపర్ మార్కెట్లు, కిరాణా దుకాణాల ద్వారా మార్కెటింగ్ చేసుకోవాలి. ఇటీవల ఆన్‌లైన్ వ్యాపారం వృద్ధి చెందుతోంది. కాబట్టి సంబంధిత వ్యాపార సంస్థలతో ఒప్పందాలు చేసుకొన్నట్లయితే లాభదాయకంగా ఉంటుంది.

పరిశ్రమ వివరాలు: పరిశ్రమ సామర్థ్యం: గంటకు 100 కిలోలు
పరిశ్రమ వ్యయం: రూ. 25 లక్షలు

What was the time taken by car..

QUANTITATIVE APTITUDE

Direction (1-5) : What approximate value should come in place of the question mark (?) in the following questions? (You are not ex-pected to calculate the exact value.)

1. 34.95% of 499.99 – 20.24% of 1599 + ? = 59.99
(1) 415 (2) 435 (3) 485 (4) 205 (5) 465

2. 7839.03 ÷ 6.99% of 879.9 + 618.14 = ?
(1) 512 (2) 664 (3) 774 (4) 744 (5) 894


3. $\sqrt{2499} \times \sqrt{730} \div \sqrt{899} = ?$
(1) 55 (2) 56 (3) 48 (4) 52 (5) 45

4. $\frac{1}{7}(6785.2 \div 9.999 \times 9.5 + 8967.89 \div 9) = ?$
(1) 2015 (2) 1112 (3) 1965 (4) 1895 (5) 1785

5. $\sqrt[3]{5831} \times 39.86 + \sqrt{15129} + 22022.2 \div 11 = ?^2$
(1) 42 (2) 59 (3) 48 (4) 33 (5) 53

Direction (6-10): Study the following line graph and table carefully and answer the given questions.

Line graph shows the speed of two Cars P and Q in five different days and table shows the distance covered by two Cars in five different days.



Distance travelled in kms.		
Days	**P**	**Q**
Mon	100	200
Tues	140	120
Wed	150	160
Thur	120	180
Fri	90	180

6. How much time did Car P take to complete its journey on Friday?
(1) 1 hr (2) 3 hrs (3) 5 hrs (4) 2 hrs
(5) None of these

7. What was the time taken by Car Q on Wednesday?
(1) 16 hrs (2) 15 hrs (3) 19 hrs (4) 17 hrs
(5) None of these

8. What was the average time taken by Car P in all the five days?
(1) 10 hrs (2) 21 hrs (3) 15 hrs (4) 12 hrs
(5) None of these

9. What was the average distance travelled by Car P and Q on Thursday?
(1) 120 km (2) 180 km (3) 300 km (4) 150 km
(5) None of these

10. What was the difference between time taken by Car Q on Wednesday and Car P on Friday?
(1) 30 hrs (2) 11 hrs (3) 6 hrs (4) 12 hrs
(5) None of these

Direction (11-15) : What should come in place of the question mark (?) in the following number series ?

11. 16 37 75 140 ? 416
(1) 240 (2) 247 (3) 250 (4) 230 (5) 220

12. 50 44 52 80 134 220 ?
(1) 344 (2) 264 (3) 256 (4) 244 (5) 324

13. 1115 608 355 229 166.5 ?
(1) 134.50 (2) 135 (3) 135.30
(4) 135.75 (5) None of these

14. 220 219 223 196 212 (?)
(1) 138 (2) 87 (3) 127 (4) 327
(5) None of these

15. 62 74 98 134 182 ?
(1) 232 (2) 233 (3) 222 (4) 223
(5) None of these

16. Ramesh sells 56 litre milk and water mixture, where ratio between milk and water is 5 : 2. He replaces 21 litre milk and water are mixture with a milk, water and honey mixture in the ratio of 3 : 2 : 2, then he pours the newly formed mixture completely in a container that contains some water and honey mixture, where ratio between water and honey is $a : b$. If the final ratio between milk, water and honey is 17 : 9 : 4, then what is the value of $a : b$?
(1) 7 : 2 (2) 1 : 1 (3) 3 : 2 (4) 3 : 1
(5) None of these

17. Javed and Bipin started a business in partnership investing ₹ 30,000 and ₹ 25,000



B. Krishna Kishore
Senior Faculty
Dimensions Coaching
Centre, Guntur.

RRB, PO's Special

respectively. After five months, Deepak joined them with ₹ 12,000. If Bipin's share in total profit is ₹ 15,000 at the end of 10 months from the starting of the business, then find the share of Deepak in profit.
(1) ₹ 3500 (2) ₹ 3600 (3) ₹ 4200 (4) ₹ 4500
(5) None of these

18. A tank of capacity 60 litres has two inlets(of same capacity) and one outlet pipes . When all the three are opened together, it takes 8 min to fill the cistern. If the outlet flow rate is increased 1.5 times, the tank is never filled. Find the minimum flow rate of the outlet for this to happen.
(1) $\frac{45}{4}$ litres/min (2) 15 litres/min
(3) 12 litres/min (4) 16 litres/min
(5) $\frac{27}{2}$ litres/min

Hints & Solutions

(1-5) :

1. (4) 34.95% of 499.99 – 20.24% of 1599 + ? = 59.99
$\Rightarrow \frac{35}{100} \times 500 - \frac{20}{100} \times 1600 + ? \approx 60$
$\Rightarrow 175 - 320 + ? = 60$
$\Rightarrow ? = 320 + 60 - 175 = 205$

2. (4) 7839.03 ÷ 6.99% of 879.9 + 618.14 = ?
$\Rightarrow ? = 7839 \div \frac{7}{100} \times 880 + 618$
$= 7839 \times \frac{100}{880 \times 7} + 618$
$= 127.25 + 618 = 745.25 \approx 744$

3. (5) $\sqrt{2499} \times \sqrt{730} \div \sqrt{899}$
$\approx 50 \times 27 \div 30 = 45$

4. (2) $\frac{1}{7}(6785.2 \div 9.999 \times 9.5 + 8967.89 \div 9)$
$\approx \frac{1}{7}(6785 \div 10 \times 10 + 8968 \div 9)$
$= \frac{1}{7}(6785 + 996.44)$
$= \frac{1}{7} \times 7781.44 = 1111.63 \approx 1112$

5. (5) $\sqrt[3]{5831} \times 39.86 + \sqrt{15129} + 22022.2 \div 11 = ?^2$
$\Rightarrow ?^2 \approx 18 \times 40 + 123 + 22022 \div 11$
$\Rightarrow ?^2 = 720 + 123 + 2002$
$\Rightarrow ?^2 = 2845 = 53.33 \approx 53$

(6-10) :

6. (3) Required time $= \frac{90}{18} = 5$ hrs.

7. (1) Required time $= \frac{160}{10} = 16$ hrs.

8. (2) Required average
$= \frac{\frac{100}{5} + \frac{140}{7} + \frac{150}{3} + \frac{120}{12} + \frac{90}{18}}{5}$
$= \frac{20 + 20 + 50 + 10 + 5}{5} = \frac{105}{5} = 21$ hrs.

9. (4) Required average
$= \frac{120 + 180}{2} = \frac{300}{2} = 150$ km

10. (2) Required difference
$= \frac{160}{10} - \frac{90}{18} = 16 - 5 = 11$ hrs.

(11-15) :

11. (2) The number series is :
16 37 75 140 **247** 416
+21 +38 +65 +107 +169
+17 +27 +42 +62
+10 +15 +20

12. (1) The number series is :
$1^3 + 7^2 = 50$
$2^3 + 6^2 = 44$
$3^3 + 5^2 = 52$
$4^3 + 4^2 = 80$
$5^3 + 3^2 = 134$
$6^3 + 2^2 = 220$
$7^3 + 1^2 =$ **344**

13. (4) The number series is :
1115 608 355 229 166.5 **135.75**
–507 –253 –126 –62.5 –30.75
+254 +127 +63.5 +31.75

14. (2) The number series is :
$220 + (1)^3 = 219$
$219 + (2)^3 = 223$
$223 + (-3)^3 = 196$
$196 + (4)^3 = 212$
$212 + (-5)^3 =$ **87**

15. (5) The number series is :
62 + 12 = 74
74 + (12 × 2) = 98
98 + (12 × 3) = 134
134 + (12 × 4) = 182
182 + (12 × 5) = **242**

16. (2) Ramesh sells 56 litre milk and water mixture, where milk: water = 5 : 2.
∴ Amount of milk = 40 litre & water = 16 litre
He replaces 21 litre milk and water mixture.
Amount of milk removed = 15 litre & water removed = 6 litre.
New amount of milk = (40 – 15) = 25 litre
New amount of water = (16 – 6) = 10 litre
He adds milk, water and honey mixture in the ratio of 3 : 2 : 2 (21 litre).
Amount of milk added = 9 litre
Amount of water added = 6 litre
Amount of honey added = 6 litre
New amount of milk, water and honey are respectively 34 litre, 16 litre, 6 litre.
It is poured in a container that contains some water honey mixture where water: honey = $a : b$.
Then we can say, the container initially contains ak litre & bk litre of water & honey respectively.
So, 34 : (16 + ak): (6 + bk) = 17 : 9 : 4 = 34 : 18 : 8
$\Rightarrow ak = 2$ litre & $bk = 2$ litre
$\Rightarrow a : b = 1 : 1$

17. (2) Ratio of share in profit = 3000 × 10 : 25000 × 10 : 12000 × 5
Total amount $= \frac{61}{25} \times 15000 = ₹\ 36600$
Share of Deepak in profit $= \frac{6}{61} \times 36600$
= ₹ 3600

18. (2) Given, tank of capacity 60 litres has two inlets and one outlet.
Let the flow rate of inlet be 'a' litres/min and flow rate of outlet be 'b' litres/min
Now, when all the three are opened together, it takes 8 min to fill the cistern.
$\Rightarrow 8(2a - b) = 60$
$\Rightarrow 2a - b = \frac{15}{2}$ ....(i)
Given, if the outlet flow rate is increased 1.5 times, the tank is never filled.
Thus, the flow rate of outlet becomes greater than the inlet.
$\Rightarrow 1.5\ b \geq 2\ a$
$\Rightarrow b \geq \frac{4a}{3}$
Thus, minimum $b = \frac{4a}{3}$
Substituting in equation (i)
$\Rightarrow 2a - \frac{4a}{3} = \frac{15}{2}$
$\Rightarrow \frac{2a}{3} = \frac{15}{2}$
$\Rightarrow a = \frac{45}{4}$ litres/min
$= 4 \times \frac{45}{12} = 15$ litres/min
Thus, $b = \frac{4a}{3}$

ఉద్యోగాలు

హెచ్‌ఎఎల్

బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఎఎల్)- **గ్రాడ్యుయేట్ ఇంజనీర్ అప్రెంటిస్‌షిప్ & డిప్లొమా టెక్నీషియన్స్ అప్రెంటిస్‌షిప్** కోసం దరఖాస్తులు కోరుతోంది.
గ్రాడ్యుయేట్ ఇంజనీర్స్ విభాగాలు: ఏరోనాటికల్/ ఏరోస్పేస్ / కెమికల్/ సివిల్/ కంప్యూటర్ ఇంజనీరింగ్/ కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ / ఇన్ఫర్మేషన్ & ఇంజనీరింగ్/ ఐటి/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రికల్ & కమ్యూనికేషన్/ ఏవియోనిక్స్/ ఎలక్ట్రానిక్స్& టెలి కమ్యూనికేషన్స్/ ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్/ టెలికమ్యూనికేషన్) /మెకానికల్/ ఇండస్ట్రియల్/ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్/ ప్రొడక్షన్ / మెటలర్జీ & మెటీరియల్ సైన్స్/ ఫౌండ్రీ టెక్నాలజీ
అర్హత: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉండాలి.
డిప్లొమా టెక్నీషియన్స్ అప్రెంటిస్ విభాగాలు: ఏరోనాటికల్/ మెకానికల్/ ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్/సివిల్/ కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ /ఇన్ఫర్మేషన్ సైన్స్ & ఇంజనీరింగ్/ కమర్షియల్ ప్రాక్టీస్ / మెటలర్జీ ఇంజనీరింగ్
అర్హత: ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణత + ప్రొవిజనల్ డిగ్రీ సర్టిఫికెట్ ఉండాలి
ట్రైనింగ్ వ్యవధి: ఏడాది
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 22, 2017
వెబ్‌సైట్: http://115.254.50.170/tti

ఎంజిఎన్‌ఆర్‌ఇజిఏ

మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఏ) పథకం కోసం కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నారు.
మొత్తం ఖాళీలు: 77
పోస్టుల వారీ ఖాళీలు: జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ 69, అకౌంట్ అసిస్టెంట్ 8
అర్హత: డిప్లొమా/ గ్రాడ్యుయేషన్/ ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి
వయసు: 21 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతనం(నెలకు): జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.8,000, అకౌంట్ అసిస్టెంట్‌కు రూ.13,000
ఎంపిక: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
వెబ్‌సైట్: dungarpur.rajasthan.gov.in

రైల్‌టెల్ కార్పొరేషన్

రైల్‌టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 50
పోస్టులు: ప్రాజెక్ట్ డైరెక్టర్/ ఎంటర్‌ప్రైజ్ ఆర్కిటెక్ట్ 2, సీనియర్ ఆర్కిటెక్ట్(ఒఎస్/ సర్వర్/ హార్డ్‌వేర్) 2, సీనియర్ ఆర్కిటెక్ట్ 1 (డేటాబేస్ అడ్మిన్), సీనియర్ ఇఆర్‌పి టెక్నో ఫంక్షనల్ (ఒరాకిల్) 1, టెక్నికల్ లీడ్(శాప్/ డాట్‌నెట్/ ఆండ్రాయిడ్ అప్లికేషన్స్/ జావా డెవలపర్/ నెట్ వర్క్ బ్యాండ్ విడ్త్) 14, టెక్నికల్ కన్సల్టెంట్ 25, ఆఫీస్ అడ్మిన్ (కో ఆర్డినేటర్ /ట్రైనింగ్ మేనేజర్) 2
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంసిఏ/ బిసిఏ
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 22, 2017
వెబ్‌సైట్: www.railtelindia.com

అడ్మిషన్స్

గీతం యూనివర్సిటీ

గీతం యూనివర్సిటీ-స్కూల్ ఆఫ్ నర్సింగ్ **బిఎస్సీ (నర్సింగ్)** కోర్సులో ప్రవేశం కోసం నిర్వహించే **'గీతం నర్సింగ్ అడ్మిషన్ టెస్ట్ (జినాట్)- 2017'**కు ప్రకటన విడుదల చేసింది. ఈ కోర్సుకు ఇటీవలే ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ గుర్తింపు లభించింది.
సీట్ల సంఖ్య: 100
అర్హత: 45 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ (బైపిసి) లేదా ఇంటర్మీడియెట్ ఒకేషనల్ నర్సింగ్ కోర్సు.
జినాట్-2017 పరీక్ష తేదీ: ఆగస్టు 28, 2017
దరఖాస్తు ఫీజు: రూ.300
దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 14, 2017
వెబ్‌సైట్: www.gitam.edu

వామ్మో..! సిగ'రేట్లు'

(అనంతపురం జిల్లాపరిషత్తు/కదిరి రూరల్)

జిల్లా జనాభా 40లక్షలకు పైమాటే. అందులో మహిళలను మినహాయిస్తే 20లక్షలకు పైగా పురుషులుంటారు. వారిలో సుమారు 3లక్షల మంది సిగరెట్లు తాగుతారని అంచనా. చైన్ స్మోకర్లు రోజుకు రెండు మూడు ప్యాక్‌లు లాగించేస్తారు. అంటే వారు 20నుంచి 30 వరకు సిగరెట్లు పీల్చేస్తారన్నమాట. సగటున ఒక్కో పొగరాయుడు రోజుకు 7 సిగరెట్లు తాగుతాడనుకుంటే.. 3లక్షల మంది రోజుకు 21లక్షల సిగరెట్లు కాలుస్తారు. ఒక్కో సిగరెట్ ధర రూ.8 నుంచి రూ.16వరకు ఉంది. సగటున రూ.11లతో లెక్కిస్తే 21లక్షల సిగరెట్లపై రూ.2.31కోట్ల వ్యయమవుతుంది. ఇందులో ఒక్కో సిగరెట్‌పై రూ.1అదనపు దోపిడీని లెక్కిస్తే రూ.21లక్షలు తేలుతోంది. ఇలా మొత్తమ్మీద నెలకు రూ. 70కోట్ల విలువైన సిగరెట్లు ఊదేస్తున్నారు. ఈలెక్కన అక్రమార్జన కూడా నెలకు రూ.6.30కోట్లు. దీన్నిబట్టి పొగమాటున జరుగుతున్న దోపిడీ అంతాఇంతా కాదు.

సిగరెట్ విక్రయాలపై ప్రత్యక్ష దోపిడీ జరుగుతోంది. పొగరాయుళ్లకు వ్యాపారులు చుక్కలు చూపిస్తున్నారు. దమ్ము కొట్టాలనే ఆలోచన వచ్చేసరికి జేబులు తడుముకోవాల్సి వస్తోంది. సిగరెట్ ధరలు అమాంతంగా పెంచేశారు. దీంతో చాలామంది ఆ అలవాటు వదులుకోలేక.. జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఈ బలహీనతను వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కంపెనీ స్థాయిలో ధరలు పెంచకపోయినా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. సిగరెట్లు స్టాక్ లేవంటూ పాత ప్యాక్‌లనే అధిక ధరలకు విక్రయించి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఇలా జిల్లాలో సిగరెట్ అమ్మకాల్లో భారీ దోపిడీ జరుగుతోంది. ప్రతిరోజూ రూ.1.75 కోట్ల నుంచి రూ.2.30కోట్ల వరకు సిగరెట్ అమ్మకాలు జరుగుతున్నాయి. వాటిలో 30శాతం జీరో బిజినెస్ జరుగుతోందనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అంటే ప్రతిరోజూ రూ.60లక్షల వరకు అక్రమ వ్యాపారమే. హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాల నుంచి అక్రమంగా వాటిని ఇక్కడికి తరలించి విక్రయాలు జరుపుతున్నారు. డీలర్ నుంచి సబ్ డీలర్‌కు, అక్కడి నుంచి అంగళ్లు, టీ కేఫ్‌లకు వెళ్లే సరికి ధర అమాంతంగా పెరిగిపోతోంది. పైగా అదనపు దోపిడీకి పాల్పడుతున్నారు. ఇక సిగరెట్ల అమ్మకాల సమయంలో బిల్లులు ఏమాత్రం కనిపించవు. చీటీలపై రాసిన రాతలే. సంబంధిత సబ్ డీలర్లు వేలాది రూపాయల విలువ చేసే సిగరెట్లు అందించి ఆ లెక్కల రాతలు రాసేసి వెళ్లిపోతుంటారు. జీరో వ్యాపారంతో అటు ప్రభుత్వానికి కూడా భారీగా నష్టం చేకూరుతోంది. ఇటు పొగరాయుళ్లకూ తిప్పలు తప్పడం లేదు. వాటిపై చర్యలు చేపట్టాల్సిన పన్నుల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలున్నాయి.

ఒక్కో ప్యాక్‌పై రూ.23ల అదనపు వసూళ్లు

సిగరెట్లపై ప్రతి ఏడాదీ ధర పెంచేస్తున్నారు. సాధారణంగా బడ్జెట్ సమావేశాల సమయంలో ధర పెంచుతారు. అయితే వ్యాపారులు రెండు నెలలు ముందుగానే ఒక్కో సిగరెట్‌పై రూ.1కిపైగా పెంచేస్తారు. అంటే 10 సిగరెట్లున్న ప్యాక్‌పై రూ.10లు బాదుడే. బడ్జెట్‌లో పెంచిన ధరలకు వీటికి పోలిక ఉండదు. 2005లో గోల్డ్‌ఫ్లాక్ (కింగ్‌సైజ్) రూ.3లు, స్మాల్‌సైజ్ రూ.2లు ఉండేవి. తొలుత ఏడాదికోసారి 50పైసలు చొప్పున పెంచేవారు. ఆరేళ్ల క్రితం నుంచి ఏడాదికి రూ.1 చొప్పున పెంచుతున్నారు. ప్రస్తుతం గోల్డ్ ఫ్లాక్ కింగ్‌సైజ్ సిగరెట్ ధర రూ.16లకు విక్రయిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ఈ ధర రూ.17లుగా ఉంటోంది. అంటే ఈ 12 సంవత్సరాల్లో రూ.13లు పెరిగిందన్నమాట. ఈ ఏడాదే అమాంతంగా రెండు పర్యాయాలు రూ.2లు పెంచేశారు. బడ్జెట్‌లో పెంచిన ధరలకు, కంపెనీ ముద్రించే ధరలకు ఎక్కడా పొంతన ఉండదు. కింగ్‌సైజ్ రూ.139లు ఉన్న సిగరెట్ ప్యాక్‌ను ప్రస్తుతం రూ.160లకు విక్రయిస్తున్నారు. కింగ్‌సైజ్‌లో లైట్స్‌దీ అదే ధరే. ప్యాక్‌గా తీసుకుంటే హోల్‌సేల్‌లో రూ.150కు, బయట అయితే రూ.155కు విక్రయిస్తారు. సింగిల్‌గా అయితే రూ.16లు పెట్టి కొనాల్సిందే. స్మాల్‌సైజ్ గోల్డ్‌ఫ్లాక్ ఎంఆర్‌పీ రూ.89లు అయితే.. ఒక్కో సిగరెట్ రూ.11లు చొప్పున రూ.110లకు విక్రయిస్తున్నారు. విల్స్‌ఫ్లాక్ ప్యాక్ రూ.57లయితే ఒక్కో సిగరెట్ రూ.8చొప్పున రూ.80లకు విక్రయిస్తున్నారు. 1000 ప్యాక్‌లపై రూ.23వేలు, 10వేల ప్యాక్‌లపై రూ.2.30లక్షలు అదనపు వసూళ్లతో భారీగా సంపాదిస్తున్నారు. ఇలా దోపిడీ ప్రత్యక్షంగానే జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పట్టించుకోవాల్సిన పన్నుల శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

చీటీ రాతలే బిల్లులట..

వస్తు సేవల పన్ను(జీఎస్టీ)అమల్లోకి వచ్చి నెల రోజులయింది. ఇన్‌వాయిస్‌లతో పాటు ఈ-వే బిల్లులు కూడా తప్పనిసరిగా జత చేయాల్సిందేనని ఆదేశాలు సైతం అందాయి. రూ.200కు పైగా సరుకులు కొంటే బిల్లులు ఇవ్వాల్సిందేనని దుకాణాదారులకు కూడా సూచించారు. కానీ సిగరెట్ వ్యాపారులు మాత్రం తాము చెప్పిందే వేదం అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. సిగరెట్ ప్యాక్‌పై ఎంఆర్‌పీ మాత్రమే మనకు కనిపిస్తుంది. డీలర్ నుంచి సబ్ డీలర్‌కు.. అక్కడి నుంచి దుకాణాలకు.. అంగళ్లకు, టీ కేఫ్‌లకు వచ్చే వరకు ఎక్కడా బిల్లులు కనిపించవంటే ఆశ్చర్యం కలగక మానదు. సైకిళ్లపై వచ్చి దుకాణదారులకు సిగరెట్లు అందజేసే సబ్ డీలర్లు తమ పని తాము కానిచ్చేస్తున్నారు. చిత్తు కాగితంపై సిగరెట్ల లెక్కలు రాసి వారికిచ్చేసి వెళ్లిపోతారు. ఇదంతా మట్కా రాతల మాదిరిగా ఉంటుంది. ఎన్ని సిగరెట్లు.. ఎంత డబ్బు.. అంతే ఉంటుందక్కడ. కమీషన్ ఇవ్వడమే ఎక్కువైనట్లు వారు కూడా ఏమీ పట్టించుకోవడం లేదు. బిల్లులు లేకుండానే దోపిడీకి పాల్పడుతున్నారు.

కృత్రిమ కొరత సృష్టించి మరీ..

'కంపెనీ నుంచి సిగరెట్లు రావడం లేదు. స్టాకు లేదు. కాబట్టి ధరలు పెరుగుతాయి..' అని ముందే హెచ్చరిస్తారు. ఫిబ్రవరిలో బడ్జెట్ సందర్భంగా ఒక్కో సిగరెట్‌పై రూపాయి పెంచారు. ఇప్పుడు కృత్రిమ కొరత సృష్టించారు. దీంతో మరో రూపాయి పెంచేశారు. స్టాకు లేదని చెప్పి పాత వాటినే విక్రయిస్తున్నారు. 15రోజులుగా ఇదే పద్ధతి అవలంబించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నా రు. ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాదిలోనే రూ.2లు పెంచేయడం ద్వారా వారి అక్రమార్జన ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పొగరాయుల జేబులకు మాత్రం చిల్లు లు తప్పడం లేదు.

ఎమ్మార్పీకి తిలోదకాలు

ఎమ్మార్పీకి అధీకృత డీలర్లే తిలోదకాలిస్తున్నారు. తొలుత కృత్రిమ కొరత సృష్టించి ఆ తరువాత ధరలు పెంచేస్తున్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు చిల్లర వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీంతో వారు మరింత ధర పెంచి విక్రయించాల్సి వస్తోంది. సిగరెట్ల వ్యాపారంలో ఐటీసీ కంపెనీదే గుత్తాధిపత్యం. ఈ కంపెనీ బ్రాండ్లే సుమారు 90 శాతం మార్కెట్ వాటా కలిగి ఉన్నాయి. బడ్జెట్ పేరుతో గత మార్చిలో కొరత సృష్టించి ధరలు పెంచేశారు. జూలై1 నుంచి జీఎస్టీ అమలులోకి రావడంతో మూడు రోజుల తరువాత, హోల్‌సేలర్లకు, చిల్లర వ్యాపారులకు సరఫరా నిలిపివేశారు. దీంతో వ్యాపారులు బెంగళూరు, చెన్నై వంటి నగరాల నుంచి సరుకు తెప్పించుకుని కొంతమేరకు ధర పెంచి విక్రయించాల్సి వచ్చింది. ఆ తరువాత అధీకృత డీలర్ల వద్ద పనిచేస్తున్న గుమాస్తాలే అధిక ధరలకు సిగరెట్లు విక్రయిస్తున్నారు.

ఇదేమిటని అడిగితే త్వరలోనే పెరిగిన ఎమ్మార్పీతో కొత్త సరుకు వస్తుందని చెబుతున్నారు. కానీ, ప్రస్తుతం రిటైలర్లకు విక్రయిస్తున్న ధర కూడా ఎమ్మార్పీ కంటే ఎక్కువగానే ఉంది. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు ఎలా అమ్ముతారంటూ రిటైలర్లు ప్రశ్నిస్తుండగా, తమ ధర ఇంతేనని, ఇష్టం ఉంటే తీసుకోండి.. లేదంటే లేదని డీలర్ల గుమాస్తాలు తెగేసి చెబుతున్నారు. దీంతో చిరువ్యాపారులకు ఏం చేయాలో పాలు పోవడం లేదు. ప్రభుత్వం వైపు నుంచి అడిగే వారు లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి వసూలు చేస్తున్నారు.

కానరాని ధరల పట్టికలు

సిగరెట్ ప్యాకెట్ ధర, విడిధర ఎంతో ఐటీసీ కంపెనీ ముద్రించిన పట్టికను రిటైలర్లు ప్రదర్శించాలి. కానీ, ఎక్కడా అవి కనిపించవు. రిటైలర్లను అడిగితే డీలర్లు ఇవ్వడం లేదని, డీలర్లను అడిగితే కంపెనీ నుంచి రావడం లేదనే సమాధానం వస్తోంది.

గత నెలతో పోలిస్తే ప్రస్తుత ధరలు ఇలా ఉన్నాయి.

సిగరెట్ బ్రాండ్	ఎమ్మార్పీ (ఒక ప్యాక్‌కు)	గతంలో చిల్లర వ్యాపారికి ఇచ్చిన ధర	ప్రస్తుత ధర
గోల్డ్‌ఫ్లేక్ కింగ్	రూ. 139	రూ. 127	రూ. 145
గోల్డ్‌ఫ్లేక్	రూ.89	రూ.81	రూ.91
విల్స్‌ఫ్లేక్	రూ.60	రూ.54	రూ.62

దిగి వచ్చిన చికెన్ ధర

- కిలో కోడి రూ.60కి తగ్గిన వైనం
- శ్రావణమాసం.. అధిక ఉత్పత్తే కారణం



పురంలోని ఓ షాపులో చికెన్ విక్రయాలు


హిందూపురం టౌన్: ఒక్కసారిగా చికెన్ ధర దిగివచ్చింది. కిలో రూ. 60కి పడిపోయింది. దీంతో కోళ్ల పరిశ్రమ కుదేలైంది. ధరలు పతనం కావడంతో కోళ్ల పరిశ్రమ యజమానులకు ముచ్చెమటలు పడుతున్నాయి. వారం క్రితం వరకు ధరలు ఆశాజనకంగా ఉండేవి. శ్రావణమాసం ప్రారంభం కావడంతో కిలో కోడి ధర రూ.60కి తగ్గిపోయింది. హిందూపురంలో 10రోజుల క్రితం వరకు కిలో చికెన్ రూ.220 వరకు ధర పలికింది. అయితే శ్రావణమాసం ప్రారంభం కావడంతో పాటు కోళ్ల ఉత్పత్తి అధికంగా ఉండడంతో ధరలు తగ్గినట్లు తెలిసింది. ఇతర ప్రాంతాల్లో చికెన్ కిలో ధర రూ.120లు ఉండగా హిందూపురంలో మాత్రం రూ.150వరకు విక్రయిస్తున్నారు. అలాగే కోడి ధర కూడా రూ.60 ఉండగా హిందూపురంలో రూ.79కి అమ్ముతున్నారు. ఏది ఏమైనా శ్రావణమాసం ప్రారంభం కావడంతో కోడి ధర తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ ధరలు మరో నెలపాటు ఇలాగే ఉండవచ్చునని వ్యాపారులు పేర్కొంటున్నారు. ధరలు తగ్గడంవల్ల మాంసం ప్రియులు ఆనందం వ్యక్తం చేస్తుండగా కోడిపరిశ్రమ యజమానులు మాత్రం ఆందోళన చెందుతున్నారు.

ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన



ఓటు వినియోగించుకున్న విద్యార్థులు

అనంతపురం సప్తగిరిసర్కిల్ : విద్యార్థి దశనుంచే నాయకత్వ లక్షణాలు, ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తమ ఓటుతో స్కూల్‌లో హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్, అసిస్టెంట్ హెడ్ బాయ్, అసిస్టెంట్ హెడ్‌గర్ల్, స్పోర్ట్స్ సెక్రటరీ, కల్చరల్ సెక్రటరీ, హౌస్‌హెడ్ కెప్టెన్లను సాధారణ ఎన్నికల తరహాలో విద్యార్థులు తమ ఓటు వేసి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డీన్ పీవీ నరసింహారావు మాట్లాడుతూ... ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ఎన్నికల విధానం, నాయకత్వ లక్షణాలపై అవగాహన పెంపొందించుకుని విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. విద్యార్థుల్లో రాజకీయ క్రమశిక్షణ, విలువలు అలవడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ బాధ్యులు విశ్వనాథ్‌రెడ్డి , కుశల్‌కుమార్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాక్ ఓటు వేసేందుకు క్యూ కట్టిన విద్యార్థులు

జిల్లాకు మరో 3.44 లక్షల వ్యాక్సిన్

- డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

అనంతపురం వైద్యం: జిల్లాకు మరో 3.44 లక్షల మీజిల్స్-రుబెల్లా (ఎంఆర్) వ్యాక్సిన్ వచ్చినట్లు డీఎంహెచ్‌ఓ వెంకటరమణ తెలిపారు. మొదటి విడతలో 5.03లక్షలు, రెండవ విడతలో 3.4 లక్షలు.. మొత్తం 8.43లక్షల వ్యాక్సిన్ వచ్చినట్లు తెలిపారు. జిల్లాలో 10,69,348 మంది (9నెలల నుంచి 15సంవత్సరాలలోపు) పిల్లలున్నారన్నారు. ఇప్పటివరకు 2.54 లక్షల మందికి వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. ఈ వ్యాక్సిన్ అమలు పక్రియను మరింత వేగవంతం చేస్తామన్నారు. వైద్యఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రతిఒక్కరూ వ్యాక్సిన్ అమలు ప్రక్రియపై మరింత దృష్టిసారించి విజయవంతం చేసే దిశగా కృషి చేయాలని అయన తెలియజేశారు.

నేడు పీఆర్ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం ఎన్నికలు

అనంతపురం జిల్లాపరిషత్తు: పంచాయతీరాజ్ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లాపరిషత్తు యూనిట్ ఎన్నికలు ఆదివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల నియమావళి మేరకు ధర్మవరం పీఆర్ డివిజన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఎన్నికల పర్యవేక్షకులుగా, అనంతపురం పీఆర్ డివిజన్ సీనియర్ అసిస్టెంట్ ఎల్.శ్రీనివాసులు ఎన్నికల అధికారిగా, జడ్పీ జూనియర్ అసిస్టెంట్ నరేంద్రశర్మ ఎన్నికల సహాయకులుగా వ్యవహరిస్తారని వారు తెలిపారు. ఈ ఎన్నికలకు సంఘం జడ్పీ యూనిట్ సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.


ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

బొమ్మనహాళ్ : ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని కణేకల్లు ఆగ్రో ఫామ్స్ ఏడీఏ సనావుల్లా అన్నారు. శనివారం ఉప్పరహాళ్, శ్రీధరఘట్టలలో రైతు సమావేశాలు ఏర్పాటు చేశారు. బోరుబావుల కింద, హెచ్చెల్సీ ఆయకట్టులోను రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రధానంగా పొలాల్లో జొన్న, మొక్కజొన్న, సజ్జ, పెసర, అలసంద, ఆముదాల పంటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గోవిందరెడ్డి, నాగరాజు, ఏపీఎం రియాజ్‌బేగ్, ఏఈవో వెంకట నారాయణ, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

లోకల్ గైడ్ localguide

ఎమ్మెల్యే డైరీ

రాయదుర్గం : శాసనసభ్యులు, గ్రామీణ గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆదివారం నంద్యాలలో ఉంటారు.



రాయదుర్గం : **మధు :** ఫిదా
కేబీ ప్యాలెస్ : నక్షత్రం
ఎస్వీ సినిమాక్స్ : మాయామాల్
ఉద్దేహాళ్ : **తాజ్** : ఏజెంట్ భైరవ
కణేకల్లు – **శ్రీ చిక్కణ్ణేశ్వర :** గౌతమ్‌నందా

ప్రతిపక్ష నేత దిగజారుడు మాటలు తగవు



జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

రాయదుర్గంరూరల్ : 35 యేళ్ల చరిత్ర గల పార్టీని దిగజారుడు మాటలతో మాట్లాడటం ప్రతిపక్ష నేత జగన్‌కు తగదని టీడీపీ పట్టణ అధ్యక్షులు పసుపులేటి రాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్ జగన్మోహన్‌రెడ్డి అని అందరికీ తెలిసినప్పటికీ నోటికొచ్చినట్టల్లా మాట్లాడితే ప్రజలు నమ్మరన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొమ్మిదేళ్ల ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ హుందాతనంగా వ్యవహరించారన్నారు. నంద్యాలలో జగన్మోహన్‌రెడ్డి సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రినే కాల్చడం తప్పుకాదనడం సబబు కాదన్నారు. ఓటమి భయంతోనే నోటికొచ్చిందల్లా మాట్లాడి నోటిదురుసు తీర్చుకుంటున్నట్లు వారు ఎద్దేవా చేశారు. నంద్యాల ఉప ఎన్నికల్లో పెద్ద మెజార్టీతో తెలుగుదేశం అభ్యర్థి బ్రహ్మానందరెడ్డి గెలుపొందడం ఖాయమన్నారు. అనంతరం వినాయక సర్కిల్‌లో జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కన్వీనర్లు గిరిమల్లప్ప, కౌన్సిలర్లు పొరాళ్ల పురుషోత్తమ్, బళే నాగమణి, ముచ్చుగి నాగరాజు, సంపత్‌కుమారి, టీడీపీ పార్టీ జిల్లా కార్యదర్శి షబ్బీర్, తెలుగు యువత నాయకులు మురళి, ధనార్జున, దేవరెడ్డిపల్లి రాజేష్ పాల్గొన్నారు.

జీవనోపాధి పెంచడమే ప్రభుత్వ లక్ష్యం

రాయదుర్గంరూరల్ : ఎస్సీ, ఎస్టీ జీవనోపాధులను పెంచేందుకు ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తుందని మండల కన్వీనర్ హనుమంతు, వెలుగు ఏపీఎం నల్లప్ప పేర్కొన్నారు. శనివారం వడ్రవన్నూరు, వేపరాల గ్రామాల్లో 11 మంది లబ్ధిదారులకు రాష్ట్ర కృషి వికాస్ యోజన పథకం కింద గేదెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీ పురుషోత్తమ్, రాజశేఖర్, సీసీ అనోక, లబ్దిదారులు మారెక్క, శాంతమ్మ, అనసూయమ్మ, రాధమ్మ, మల్లమ్మ, యర్రమ్మ, రుద్రమ్మ పాల్గొన్నారు.

వర్షం కోసం గాడిదలకు పెళ్లి

రాయదుర్గంరూరల్ : వరుణుడు కరుణించాలని రాయంపల్లి గ్రామస్థులు శనివారం గాడిదలకు పెళ్లి చేసి గ్రామంలో ఊరేగించారు. అనంతరం గ్రామ నడిబొడ్డున ఉన్న బొడ్రాయికి 101 బిందెలతో శుద్ధి చేసి ప్రత్యేక పూజలు చేశారు. వర్షం కురిసి పంటలు బాగా పండాలని దేవున్ని కోరుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేరుశనగ పంటను సాగు చేయగా వరుణుడు కరుణించకపోవడంతో విత్తనాలు మొలకెత్తలేని పరిస్థితిలో నెలకొందని రైతులు అన్నారు. ప్రస్తుత తరుణంలో వర్షాలు కురవకపోతే పూర్తిగా నష్టపోతామన్నారు. గాడిదలకు వివాహం జరిపించి గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తే వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రామస్థులు సందయ్య, గంగన్న, ఆంజనేయులు, శివన్న, పాలయ్య పేర్కొన్నారు.



గాడిదలను ఊరేగిస్తున్న ప్రజలు

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయండి : ఆర్డీఓ



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

రాయదుర్గం : పట్టణంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా చేయాలని ఆర్డీవో రామారావు ఆదేశించారు. శనివారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, మున్సిపల్, ఆర్ అండ్‌బీ అధికారులతో సమీక్షించారు. కోతిగుట్ట వద్ద ఆక్రమణలు తొలగిస్తే పైపులైన్ వేస్తామని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారన్నారు. మూడు రోజుల పాటు సర్వేయర్‌ను విస్తరణ పనులకే పంపుతామని, మార్కింగ్ వేయించుకుని ఆక్రమణలు తొలగించాలన్నారు. అలాగే విద్యుత్‌లైన్ ఏర్పాటు, డ్రైన్ నిర్మాణానికి మార్కింగ్ వెంటనే ఇవ్వాలన్నారు. ప్రధాన డిస్పోజల్ డ్రైన్‌కు సంబంధించి భూసేకరణకు నోటిఫికేషన్ చేసేశామన్నారు. పుట్టప్ప తోట వద్ద మురుగు కాలువ ప్రవహించే భూములను వెంటనే స్వాధీనం చేసుకుని పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పట్టణ శివారు ప్రాంతంలో గృహ నిర్మాణం కోసం అవసరమైన భూములను పరిశీలించారు. సమావేశంలో తహసీల్దార్ నాగరాజు, మున్సిపల్ కమీషనర్ కృష్ణ, డీఈ పొరాళ్ల సురేష్, ఏఈ వీరేష్, ఆర్అండ్‌బీ ఏఈ నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా : చైర్‌పర్సన్



17వ వార్డులో పర్యటిస్తున్న చైర్‌పర్సన్, బాధితులకు బీమా చెక్కులు అందజేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్ : పురపాలక సంఘం పరిధిలో ప్రజాసమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి పేర్కొన్నారు. పట్టణంలోని 17వ వార్డులో శనివారం మున్సిపల్ అధికార యంత్రాంగంతో కలసి ఆమె పర్యటించారు. వార్డులో నెలకొన్న ప్రధాన సమస్యలు గుర్తించారు. ప్రజలతో మమేకమవుతూ ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కడ్డిపూడి మహబూబ్ బాషా, వైస్ చైర్మన్ గాజుల వెంకటేశులు, కౌన్సిలర్ ముచ్చుగి నాగరాజు, మున్సిపల్ కమిషనర్ మోతీ కృష్ణ, డీఈ పొరాళ్ల సురేష్, ఏఈ వీరేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ : కుటుంబ పెద్దను కోల్పోయి నిస్సహాయ స్థితిలో ఉన్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం చంద్రన్న బీమా పథకంతో బాసటగా నిలుస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నారు. పట్టణంలోని ఆమె చాంబర్‌లో శనివారం మృతి చెందిన వారి కుటుంబాలకు చంద్రన్న బీమా పథకం కింద చెక్కులు పంపిణీ చేశారు. 1వ వార్డులో మృతి చెందిన వీరేష్, 2వ వార్డు వెంకటేశులు, 5వ వార్డు జీ తిప్పేస్వామి, 25వ వార్డు తిప్పేస్వామి సాధారణ మృతి చెందారు. వీరి ఒక్కొక్క కుటుంబానికి రూ.30 వేలు చొప్పున రూ.1.20లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మోతీ కృష్ణ, మెప్మా టీపీవో నారాయణ రెడ్డి, మాజీ వైస్ ఛైర్మన్ కడ్డిపూడి మాబూ, కౌన్సిలర్లు అరూడప్ప, తిప్పేస్వామి, బీమామిత్రలు విజయలక్ష్మీ, శారద, అనురాధ పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ శనివార పూజలు

రాయదుర్గంరూరల్ : శ్రావణ మాసం రెండో శనివారం సందర్భంగా మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి, వడ్రవన్నూరు గ్రామ సమీపంలో వెలసిన అపులాపురం ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆలయ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామిజీ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో ఉదయాన్నే స్వామివారికి గంగపూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకు పూజలు, వస్త్రాలంకరణ,పుష్పాలంకరణ పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

గుమ్మఘట్టలో : మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణ శనివార పూజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక ఆకు పూజలు, పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. వరుణ దేవుడి కరుణ కోసం ఆంజనేయస్వామి ఆలయాల వద్ద రైతులు మొక్కులు తీర్చుకున్నారు. వరుణదేవుడు కరుణించాలని రైతులు, మహిళలు ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు జరిపి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

బొమ్మనహాళ్‌లో : మండల కేంద్రంలోని దేవర బావి వద్ద ఉన్న నాగప్రతిమలకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శ్రావణ శనివారం సందర్భంగా మహిళలు ఉదయం నుంచి నాగప్రతిమలకు జలాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. అనేక మంది నువ్వుల దారాలు, పత్తి హారాలు పసుపుకుంకుమలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. నువ్వుల వంటలు, పిండి వంటలు, తీపి వంటలతో భక్తులకు, కుటుంబీకులకు ప్రసాదాలు పంచిపెట్టారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి, ఆంజనేయస్వాములు

బీఎన్ హళ్లిలో తల్లిపాల వారోత్సవాలు

రాయదుర్గంరూరల్ : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని బీఎన్‌హళ్లి, వేపరాల గ్రామాల్లో ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించినట్లు సూపర్‌వైజర్ పద్మావతి తెలిపారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి గర్భవతులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డీ హీరేహాళ్‌లో : మండలంలోని గొడిశలపల్లిలో శనివారం ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మహిళలు గ్రామ వీధులలో ర్యాలీ నిర్వహించారు. అనంరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సూపర్‌వైజర్ ఖాసీమ్‌బీ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కారమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖాసీం బీ, ఆంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, మహిళలు పాల్గొన్నారు.

గుమ్మఘట్టలో : మండలంలోని జే వెంకటాంపల్లి, యర్రంపల్లి, రంగచేడు గ్రామాల్లో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలపై ర్యాలీలు చేపట్టారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతమ్మ, రుద్రమ్మ, శాంతమ్మ, క్రిష్ణవేణి, ఆరోగ్య కార్యకర్తలు నారాయణ స్వామి, మమత, రాజమ్మ, లలిత, యర్రిస్వామి, ఆశా వర్కర్లు ఆయా గ్రామాల్లోని విద్యార్థులచే పురవీధుల్లో ర్యాలీలు చేపట్టి తల్లిపాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఘనంగా మద్దానేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

బొమ్మనహాళ్ : ఉంతకల్లులో జీర్ణోద్ధరణకు గురైన మద్దానేశ్వర స్వామి ఆలయాన్ని పునర్నిర్మించి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి వేదపండితులు రామ్‌ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నూతన విగ్రహాలు, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో వాస్తు హోమం, ప్రతిష్ఠ హోమం, గణపతి హోమం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాపు భారతి, బళ్లారి సప్తగిరి చెన్నప్ప, ఇతర గ్రామాల నుంచి అనేక మంది ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా జిహ్వేశ్వర స్వామి జయంతి



పూజలు చేస్తున్న మహిళలు

రాయదుర్గంటౌన్ : పట్టణంలోని స్వకుళసాలి సమాజం ఆధ్వర్యంలో శనివారం జిహ్వేశ్వర స్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. హటకేశ్వరస్వామి దేవాలయం వద్ద నుంచి నేసేపేట, బళ్లారి రోడ్డు, వినాయక సర్కిల్, గాంధీ సర్కిల్, ఓబుళాచారి రోడ్డు మీదుగా ప్రధాన రహదారుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై జిహ్వేశ్వర స్వామి చిత్రపటంతో ఊరేగించారు. అనంతరం ఛత్రంలో నామకరణం చేశారు. కార్యక్రమంలో సుందర్‌రావు, ఆనందరావు, శశికళ, కార్యదర్శి జీ సునంద పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లోనే విద్యార్థుల టీసీలు

కణేకల్లు : ప్రాథమిక పాఠశాలల్లో చేరే విద్యార్థులతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థుల టీసీలను ఆన్‌లైన్ ద్వారానే ఇవ్వాలని ఎంఈవో బసవరాజుగౌడ్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలో చేరేటప్పుడే తమ ఫొటోతో పాటు కుల ధ్రువీకరణ పత్రాలను హెచ్‌ఎంలు తీసుకుని వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే విద్యార్థులు ఇతర చోటికి వెళ్లే టప్పుడు టీసీలు ఆన్‌లైన్‌లో తీసుకోవాలన్నారు.

బొమ్మనహాళ్‌లో వర్షం

బొమ్మనహాళ్ : రైతులు ఎదురుచూస్తున్న వరుణుడు కరుణించాడు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి అరగంటపాటు ఉద్దేహాళ్, లింగదహాళ్, శ్రీధరఘట్ట, బండూరు తదితర గ్రామాలలో వర్షం కురిసింది. శ్రావణమాసంలో వర్షాలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరితగతిన ఇన్‌పుట్ సబ్సిడీని అందించండి

కణేకల్లు : మండలంలో కరువు పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో రైతులకు అందాల్సిన 2016 ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్మును త్వరితగతిన అందించాలని మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి కోరారు. మండల వ్యాప్తంగా ఇంకా 2400 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్ము అందలేదని, దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు.

గోలీ గుడ్ల సరఫరా

- 50 గ్రాములకు గాను 35 గ్రాములే
- మారని కాంట్రాక్టర్ల తీరు
- పట్టించుకోని అధికారులు
- మంత్రి ఆదేశాలు బేఖాతరు





అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అయిన కోడిగుడ్లు గోలీ ఆకారంలో ఉన్న దృశ్యం

ధర్మవరం అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాలకు నిబంధనలకు విరుద్ధంగా కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారు. 50 గ్రాముల బరువు ఉండాల్సిన కోడిగుడ్లకు బదులు 35 గ్రాముల గోలీ ఆకారంలోని గుడ్లు సరఫరా చేస్తున్నారు. తక్కువ బరువు కలిగిన కోడిగుడ్లు సరఫరా చేస్తే కాంట్రాక్టర్ల పైనా, సీడీపీఓ పైనా చర్యలు తీసుకుంటామని స్త్రీశిశుసంక్షేమశాఖ మంత్రి పరిటాలసునీత ఇటీవల హెచ్చరించిన విషయం విదితమే. అయినా ఆమె ఆదేశాలు ఖాతరు చేయకుండా కాంట్రాక్టర్లు చిన్న సైజు గుడ్లు సరఫరా చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఈ విషయంలో అధికారులతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు కూడా మౌనంగా ఉంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అన్నమృతహస్తం పథకం కింద గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు కోడిగుడ్లు అందజేస్తోంది. పౌష్టిహారం కింద వారికి ప్రభుత్వం కోడిగుడ్లు కూడా అందించాల్సి ఉంది. కోడిగుడ్ల సరఫరా టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు. 50గ్రాముల బరువు గల కోడిగుడ్లు సరఫరా చేయాల్సి ఉంది. అయితే తక్కువ బరువున్న గోలీల్లాంటి కోడిగుడ్లను అంగన్‌వీడీ కేంద్రాలకు సరఫరా చేస్తూ.. నెలవారీ లక్షలాది రూపాయలు దోపిడీ చేస్తున్నారు. వారి అవినీతికి అడ్డూ అదుపు లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చోద్యం చూస్తున్న అధికారులు

అంగన్‌వాడీ కేంద్రాలకు కాంట్రాక్టర్లు గోలీల్లాంటి గుడ్లు సరఫరా చేస్తున్నా స్త్రీశిశుసంక్షేమ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. వారి వ్యవహారం అనుమానాలకు తావిస్తోంది. కాంట్రాక్టర్ల నుంచి అధికారులకు భారీగా ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలోనూ తక్కువ బరువు కోడిగుడ్డు వచ్చిన విషయం తెలిసిందే. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు సక్రమంగా.. నిబంధనల ప్రకారం గుడ్లు అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రజల్లో విశ్వాసం పొందేలా పనిచేయండి

- ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్
- శిక్షణ పొందుతున్న సిబ్బందితో ముఖాముఖి





హాజరైన అధికారులు, సిబ్బంది, మాట్లాడుతున్న ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్

ఆంధ్రజ్యోతి, అనంతపురం: ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా పనిచేయాలని జిల్లా ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. తద్వారానే పోలీస్ ప్రతిష్ఠ పెరుగుతుందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. పోలీస్ సిబ్బందిలో పరివర్తన తీసుకు వచ్చేందుకు తొలి విడతగా కానిస్టేబుళ్ల నుంచి ఏఎస్‌ఐల వరకు స్థానిక డీటీసీలో శిక్షణ ఇస్తున్న విషయం తెలిసిందే. బ్యాచ్ వారీగా తర్ఫీదు ఇస్తున్నారు. శనివారం మూడవ బ్యాచ్ శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ సిబ్బందితో ఎస్పీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారితో ముఖాముఖి మాట్లాడారు. శిక్షణలో ఏమి నేర్చుకున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో పోలీస్ శాఖ విధులు అత్యంత కీలకమైనవన్నారు. మనం చేసే ప్రతి పనినీ ప్రజలు గమనిస్తూనే ఉంటారన్నారు. ప్రజల నుంచి లభించే గౌరవం, విశ్వాసం అనేవి మన ప్రవర్తన, పనితీరుపైనే ఆధారపడి ఉంటాయన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండడం వల్లే ఆ గౌరవం, విశ్వాసం దక్కుతాయన్నారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా మెరుగైన సేవలందించాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కమ్యూనిటీ పోలీసింగ్ చాలా ముఖ్యమన్నారు. ఈ క్రమంలో పోలీసుల శైలి మారిందన్నారు. గతంలో మాదిరి స్టేషన్లకు వచ్చి ఫిర్యాదులిచ్చే వారి సంఖ్య తగ్గిందన్నారు. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక బాధితులు నేరుగా డయల్-100, వాట్సాప్ తదితర పద్ధతుల ద్వారా సమస్యలు పరిష్కరించుకుంటున్నారన్నారు. శిక్షణలో నేర్చుకున్న విధంగా స్టేషన్లకు వచ్చేవారి పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. ప్రజల ఫిర్యాదులు, సమస్యలకు తక్షణమే స్పందించాలన్నారు. నీతి, నిజాయితీగా విధి నిర్వహణ ఉండాలన్నారు. నైతిక విలువలు పెంపొందించుకుని విచక్షణతో మెలగాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ ఖాసీం సాబ్, ఆర్ఐ జాన్‌జోసెఫ్, ఆర్ ఎస్ఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో వర్షం

అనంతపురం కలెక్టరేట్: జిల్లావ్యాప్తంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. నాలుగు మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడగా. మరో 35 మండలాల్లో చిరు జల్లులు పడ్డాయి. గుంతకల్లు 10.2, గుత్తి 13.7, యాడికి 19.5, కూడేరు 16.6 మిమీ వర్షపాతం నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో 1.2 మి.మీల నుంచి 8.3 మిమీలోపు వర్షపాతం నమోదైంది. ఈనెల సాధారణ వర్షపాతం 88.7 మిమీలు కాగా ఇప్పటి వరకు 5.4 మిమీ వర్షపాతం నమోదైంది.

జీసీడీఓ పోస్టుకు దరఖాస్తులు నిల్

అనంతపురం అర్బన్: సర్వశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ)లో అత్యంత కీలకమైన జీసీడీఓ (గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) పోస్టు కోసం దరఖాస్తు చేసుకునేవారే లేకుండా పోయారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల(కేజీబీవీలు) పర్యవేక్షణ మొత్తం జీసీడీఓపై ఆధారపడి ఉంటుంది. అందుకే ఈ పదవి అంటే గతంలో అనేక మంది పోటీపడుతూ వచ్చేవారు. అయితే కొన్నేళ్లుగా కేజీబీవీల్లో జరుగుతున్న ఘటనలకు పీఓలు, జీసీడీఓలు బలైపోతూ వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం జీసీడీఓ పదవిలోకి రావాలంటేనే భయపడిపోతున్నారు. నెలక్రితం పోటీపరీక్షలు నిర్వహించారు. లక్ష్మీశిరీషా అనే మహిళాప్రధానోపాధ్యాయురాలు ఎంపికయ్యారు. అయితే తాజాగా తాడిపత్రి, లేపాక్షి కేజీబీవీల్లో జరిగిన ఘటనలతో ఆమె బాధ్యతలు చేపట్టడానికి వెనకంజ వేశారు. తాను జాయిన్ కాలేనని రాతపూర్వకంగా అధికారులకు తెలియజేశారు. దీంతో జిల్లాస్థాయిలోనే దరఖాస్తులు స్వీకరించి ఎంపిక చేసుకోవాలని ఎస్పీడీ ఆదేశాలు జారీచేశారు. గత నెల 31న జిల్లా కలెక్టర్ ఆమోదం తీసుకుని ఎస్ఎస్ఏ పీఓ సుబ్రహ్మణ్యం జీసీడీఓ పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీచేశారు. శనివారం సాయంత్రం 5 గంటల వరకూ ఆసక్తిగల మహిళా ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు, డైట్ లెక్చరర్లు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఇచ్చారు. కానీ ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. దీంతో ఎస్ఎస్ఏ అధికారులు అవాక్కవుతున్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పీఓ తెలిపారు. మరి ఈ పోస్టును ఎలా భర్తీ చేస్తారో వేచి చూడాల్సిందే.

వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ వసతి గృహాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వీరపాండ్యన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంక్షేమ శాఖల పనితీరుపై సంబంధిత అధికారులతో శనివారం సాయంత్రం ఆయన సమీక్షించారు. 2016-17, 2017-18 సంవత్సరాలకు సంబంధించి ప్రగతి, పెండింగ్ తదితర అంశాలపై చర్చించారు. అర్హులైన వారికి స్కాలర్ షిప్‌లతో పాటు కాస్మొటిక్స్, పుస్తకాలు, దుప్పట్లు ఎప్పటికప్పుడు అందించాలన్నారు. విద్యార్థులకు ఆహారం, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తాను ఆకస్మికంగా తనిఖీలు చేస్తానని, ఎక్కడైనా నిర్లక్ష్యం వహించినట్లు కనిపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్క విద్యార్థి కూడా వెనుకంజలో ఉండకూడదన్నారు. విద్యార్థులకు డిజిటల్ లాకర్‌పై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రోశన్న, బీసీ వెల్ఫేర్ డీడీ రమాభార్గవి, మైనార్టీ సంక్షేమ అధికారి డీఎంకె బాషా, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రాముానాయక్, బీసీ కార్పొరేషన్ ఈడీ నాగముని పాల్గొన్నారు.

సినిమా గైడ్

అనంతపురం

గంగ	: దర్శకుడు
గౌరి	: ఫిదా
గాయత్రి	: దండుపాళ్యం-2
గౌతమి	: వశం
త్రివేణి	: నక్షత్రం
తరంగిణి	: మాయామాల్
తేజస్విని	: నిన్ను కోరి
శాంతి	: జబ్ హ్యారీ మెట్ సెజల్
సుధ	: గౌతమ్‌నంద
స్వప్న	: టక్కర్ ఫంచ్
శ్రీవెంకటేశ్వర	: గౌతమ్‌నంద
నీలిమా	: బాహుబలి-2

దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 6

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): వృత్తి, వ్యాపారాల్లో సృజనాత్మకంగా వ్యవహరించి సత్ఫలితాలు సాధిస్తారు. ప్రముఖులను కలుసుకుంటారు. గౌరవ పదవులు లభిస్తాయి. చిన్నారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): విద్యాసంస్థల్లో ప్రవేశానికి ఏర్పాట్లు చేసుకుంటారు. ప్రయాణాలు, సమావేశాలకు అనుకూలం. బదిలీలకు సంబంధించి కీలక సమాచారం అందుకుంటారు. రియల్‌ఎస్టేట్, ఫర్నిచర్ రంగాల వారు ఆచితూచి వ్యవహరించాలి.

మిథునరాశి:(మే21-జూన్21): పీజులు, స్టేషనరీ కొనుగోలుకు నిధులు సర్దుబాటవుతాయి. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. సన్నిహితుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. పూర్వమిత్రులను కలుసుకుంటారు.

కర్కాటకరాశి:(జూన్22-జూలై23): ప్రియతములకోసం విలువైన వస్తువులు సేకరిస్తారు. స్పెక్యులేషన్లు, పెట్టుబడుల్లో నిదానం అవసరం. భాగస్వామ్యాలు లాభిస్తాయి. పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు.

సింహరాశి:(జూలై24-ఆగస్టు23): కొత్త ప్రాజెక్టుల గురించి ఆలోచిస్తారు. వైద్యం, యోగ, ధ్యానాలు, ఆహార నియమాలపై దృష్టి పెడతారు. వృత్తి, వ్యాపారాలకు సంబంధించి కీలక నిర్ణయాలకు తగిన సమయం కాదు.

కన్యారాశి: (ఆగస్టు24-సెప్టెంబర్23): విద్యార్థులకు శుభప్రదం. విదేశీ విద్య కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. దీర్ఘకాలిక పెట్టుబడులపై దృష్టి సారిస్తారు. ప్రియతములకు సంబంధించిన ఒక సమాచారం కలవరం కలిగిస్తుంది.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): భూమి లావాదేవీలకు అనుకూలం, నిర్మాణరంగం వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. బంధు మిత్రుల కలయికతో ఇంట్లో సందడి నెలకొంటుంది. సమావేశాలు, ప్రదర్శనలకు ఏర్పాట్లలో అసౌకర్యం కలగవచ్చు.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ప్రముఖుల సహకారంతో విద్యాసంస్థలతో పనులు పూర్తి చేస్తారు. ఏజెంట్లు, రిప్రజెంటేటివ్‌లు, బోధనా రంగానికి చెందిన వారికి ప్రోత్సాహకరం. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ఒక వార్త కలవరపెడుతుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): విద్య, ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. వ్యూహాత్మకంగా వ్యవహరించి ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలు, ప్రదర్శనలకు ఏర్పాట్లు చేసుకుంటారు. సంకల్ప సిద్ధికి అధికంగా శ్రమించాలి.

మకరరాశి:(డిసెంబర్22-జనవరి21): నిర్ణయాలను సమీక్షించుకుంటారు. పెట్టుబడులు, బీమా, మ్యూచువల్ ఫండ్ వ్యవహారాలపై ఒక నిర్ణయానికి వస్తారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. విలువైన వస్తువులు కొనుగోలులో జాగ్రత్త అవసరం.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): రాజకీయాలు, సినిమా, టెలివిజన్ రంగాల వారికి ప్రోత్సాహకరం. బంధుమిత్రులతో వేడుకల్లో పాల్గొంటారు. భాగస్వామి వ్యవహారశైలి ఆవేదన కలిగిస్తుంది. ఆధ్యాత్మిక, సాహితీ ప్రముఖుల్ని కలుసుకుంటారు.

మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): వృత్తిపరమైన సమావేశాలు సత్ఫలితాలనిస్తాయి. హోటల్, ఆస్పత్రులు, బ్యాంకులు, సహకార సంఘాల ఉద్యోగులకు ఆర్థికంగా ప్రోత్సాహకరం. విందు వినోదాలకు ఖర్చులు అధికం.

-బిజుమళ్ల బిందుమాధవ శర్మ

బాధ ముంచుకొస్తుంది.. కన్నీళ్లు ఆగకుండా వచ్చేస్తుంటాయి. అంతలోనే ఓ ఆత్మీయ స్పర్శ భుజంపై మెల్లిగా తడుతుంది. ప్రేమతో మాట్లాడే ఆ నాలుగు మాటలతో.. బాధ సగం తగ్గిపోతుంది.

* * *

లంచ్ బెల్ మోగుతుంది. చెట్ల కింద అందరూ కూర్చొంటారు. గబగబా లంచ్‌బాక్సులు తెరుస్తారు. వాళ్లకు దూరంగా ఓ పిల్లోడు బాధ పడుతూ, ఒంటరిగా కూర్చొంటాడు. అటుగా చూసినా ఓ ఇద్దరు.. ఆ పిల్లోడిని గుంపులోకి తీసుకొస్తారు. ప్రేమగా గోరుముద్దలు పెడతారు. అంతే ఎక్కడలేని సంతోషం ఆ చిన్నోడి పెదాలపై వచ్చి చేరుతుంది.

* * *

జీవితం ఎటు పోతోందో తెలియదు. 'ఏం చేయాలనుకుంటున్నావు?' అని నాన్న రోజూ తిడుతుంటాడు. 'కెరీర్ సెట్ చేసుకో రా' అని అమ్మ మెల్లగా మందలిస్తుంది. ఆత్మీయులు 'నెక్ట్స్ ఏంటీ?' అని అడుగుతుంటారు. సరిగా అప్పుడే ఓ చేయి.. ఆ వ్యక్తిని పట్టుకుని.. 'ఇదే నీ దారి! ఇదే నీ జీవితం! కష్టపడు, ఇష్టపడు.. సాధించు' అంటూ దిశానిర్దేశం చేస్తుంది.

* * *

అల్లరి.. ఆనందం.. అనుబంధం



అవసరాల్లో, ఆనందంలో.. ఎప్పుడూ చేయి వీడని స్నేహితులారా! మీ కోసం మళ్లీ వచ్చేసింది.. ఓ పుట్టినరోజు! ఒక పండుగ రోజు! ఏ భేద భావం లేని మనసైన మిత్రుల 'మైత్రీ దినోత్సవం'... ఫ్రెండ్‌షిప్ డే!

జీవితంలో మిత్రులనూ, శత్రువులనూ గుర్తించడం నేర్చుకోవాలి. లేదంటే.. సమస్యల్లో చిక్కుకోవాల్సిందే. కొందరు పైకి గంభీరంగా కనిపించినా అవసరానికి ఆదుకుంటారు. ఇంకొందరు వెన్నంటే ఉంటారు, రాసుకు పూసుకు తిరుగుతారు. కానీ అవసరం వస్తే.. తప్పించుకు తిరుగుతారు. మరికొందరు.. ఆత్మీయ స్నేహితుల మధ్య చిచ్చు పెట్టి, వారిని విడదీయాలని చూస్తుంటారు. అందుకే 'స్నేహితులు తమ మధ్య అపార్థాలు రాకుండా చూసుకుంటూనే.. శత్రువుల వల్ల అనర్థాలు కలగకుండా జాగ్రత్త


"కలిసిమెలిసి ఉండగలగడం, ఒకరి కోసం ఒకరు పోరాడగలగడం, అవసరమైనపుడు తీరిక లేదనో, అలసిపోయాననో అనకుండా, ఆపదలో ఆదుకోవడం - స్నేహంలో ముఖ్య లక్షణాలు."

ఐక్యరాజ్య సమితి మాజీ ప్రధాన కార్యదర్శి కోఫీ అన్నన్ భార్య నానే అన్నన్ 1998లో 'ఫ్రెండిషిప్ డే'గౌరవార్థం 'విన్నీ ద పూ' అనే కార్టూన్ క్యారెక్టర్‌ని ప్రపంచపు స్నేహదూతగా (ఫ్రెండ్‌షిప్ డే అంబాసిడర్)గా ప్రకటిం

2011లో ఐక్యరాజ్య సమితి జూలై 30వ తేదీని 'అంతర్జాతీయ మైత్రీ దినోత్సవంగా అధికారకంగా ప్రకటించింది. అయినా, మన దేశంతో పాటు, మరికొన్ని దేశాలు మాత్రం ఆగస్టు మొదటి ఆదివారాన్ని 'ఫ్రెండ్‌షిప్ డే'గా జరుపుకొంటున్నాయి.

'స్నేహితుల దినోత్సవం' పుట్టింది అమెరికాలో.. 1935లో అయినా.. స్నేహం పుట్టుక మాత్రం మనిషి పుట్టుకంత ప్రాచీనమైంది.

'స్నేహమంటే పాత పరిచయం కాదు. ఎప్పుడూ వీడని అనుబంధం.'




"నేను మారినపుడు మారిపోతూ, నేను తలూపినపుడు తనూ తలూపుతూ ఉండే స్నేహితుడు నాకు అవసరం లేదు. నా నీడ ఆ పనిని ఇంకా మెరుగ్గా చేస్తుంది"
- ప్లుటార్క్, గ్రీకు తత్త్వవేత్త

"నా వెనక నడవకు - నేను నీకు దారి చూపించలేక పోవచ్చు. నా ముందు నడవకు - నేను నిన్ను అనుసరించకపోవచ్చు. నా జతగా నడు, నా స్నేహితుడిగా ఉండిపో"
- ఆల్బర్ట్ కేమస్, రచయిత, తత్త్వవేత్త

"నీ తప్పును, నీ తెలివితక్కువ పనులను నీ ముందుంచేవాడే నిజమైన స్నేహితుడు."
- బెంజిమిన్ ఫ్రాంక్లిన్

"నీవుంటే వేరే కనులెందుకు
నీకంటే వేరే బతుకెందుకు
నీ బాటలోని అడుగులు నావి
నా పాటలోని మాటలు నీవి"
- సి. నారాయణరెడ్డి

చుక్కలు కలపండి



టంగ్ ట్విస్టర్స్



1. It's not the cough that carries you off,it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.

సూక్తి

వందమంది స్నేహితులు ఉండక్కర్లేదు...
వంద సమస్యలు వచ్చినా అండగా ఉండే స్నేహితుడు ఒకరు ఉంటే చాలు!

నవ్వుల్ నవ్వుల్



సోని : నాన్నా! శిఖరాగ్ర సమావేశాల్లో అంతా శిఖరాలపై కూర్చొని మాట్లాడుకుంటారా? పడిపోరా మరి?
మిస్టర్ మేధావి : అప్పుడు అక్కడ చదును చేస్తారు రా!
సోని : అవునా!

* * *

పార్థు : నాకు వంద రూపాయలు దొరికాయోచ్!
సోము : ఆ వంద నాదే రా!
పార్థు : నాకు దొరికింది రెండు యాభై రూపాయల నోట్లు.
సోము : అవునా! నా వంద కింద పడినప్పుడు రెండు ముక్కలైనట్లు ఉంది.
పార్థు : !!!!!!!!!!!!!

చెప్పగలరా?

పాతికలో ఉన్నాను, కానీ రతికలో లేను
పావులో ఉన్నాను కానీ, పాకలో లేను
రంగంలో ఉన్నాను కానీ, గంగలో లేను
అయితే నేనెవర్నో చెప్పగలరా?

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. హవానం ▸ ....
2. స్వాతంగ ▸ ....
3. కిపల్ల ▸ ....

పదాలు గుర్తించండి

buddy caring forever friends laughter
listen love share together trust

f r i e n d s k f l n s
o t o g e t h e r u s n
r o m r w a a b v y u i
e g j l l t r u s t r e
v h m u r t e v f w q b
e b v t e h j n r e p u
r p o l h c b n l d i d
l i s n y a u c o z z d
p r e w n r d m v v c y
l o y e l i s t e n s s
b e c z i n s h a m u l
t t l a u g h t e r n e

a cupcake for the teacher

జవాబులు

జంతర్‌మంతర్ : 1. వాహనం 2. స్వాగతం 3. పల్లకి
చెప్పగలరా? : పావురం

పండిట్ల రీ కౌన్సెలింగ్ పూర్తి

- సర్వర్ సమస్యతో నత్తనడకన ప్రక్రియ
- 752 మందికి పోస్టింగ్‌లు





కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈఓ లక్ష్మీనారాయణ, తమవంతు కోసం చెట్ల కింద వేచి ఉన్న ఉపాధ్యాయులు



కౌన్సెలింగ్ కేంద్రం వద్ద వర్షపు జల్లుల నుంచి గొడుగు నీడలో చిన్నారిని చూసుకుంటున్న టీచర్

అనంతపురం అర్బన్: లాంగ్వేజ్ పండిట్ల రీ కౌన్సెలింగ్ ఎట్టకేలకు ముగిసింది. నాలుగైదు రోజులుగా వివిధ సమస్యలతో వారు కౌన్సెలింగ్‌కు వచ్చి వెళ్లిపోతున్న విషయం విదితమే. శుక్రవారం మరోసారి కౌన్సెలింగ్ వాయిదా వేయడంతో వారు తిరుగుబాటు చేశారు. ఈ క్రమంలో శనివారం జిల్లా సైన్స్ సెంటర్‌లో పండిట్లకు రీ కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఈఓ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో ప్రక్రియ చేపట్టారు. పదోన్నతులు పొందిన వారిని జాబితా నుంచి తొలగించి మిగిలిన వారికి రీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇక్కడ వివిధ ఆరోపణలు రావడంతో జాబితాలో ఎలాంటి మార్పులూ లేకుండా విద్యాశాఖాధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. పాత సీనియారిటీ జాబితాను విడుదల చేసి అందులో పదోన్నతి పొందిన టీచర్ల పక్కన ప్రమోటెడ్ అంటూ ఇండికేషన్ పెట్టి ఇతరులను యథాతథంగా సీనియారిటీలో ఉంచారు. ఆ తరువాత ఎల్‌పీ తెలుగు, ఎల్‌పీ హిందీకి వేర్వేరుగా కౌన్సెలింగ్ కొనసాగించారు. ఎల్‌పీ తెలుగులో 450 మందికి, ఎల్‌పీ హిందీలో 302 మందికి రీకౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే సర్వర్ సమస్య ఏర్పడడంతో కొన్ని సందర్భాల్లో బ్రేక్‌పడుతూ నత్తనడకన కౌన్సెలింగ్ కొనసాగింది. రాత్రివరకూ ప్రక్రియ కొనసాగడంతో వందలాది మంది పండితులు, వారి బంధువులు సైన్స్‌సెంటర్‌లోనే పడిగాపులు కాయాల్సి వచ్చింది. కొందరు మహిళాఉపాధ్యాయులు చంటిబిడ్డలను తీసుకుని రావడంతో ఇబ్బందులు పడ్డారు. ఎల్‌పీ తెలుగు, ఎల్‌పీ హిందీలో మొత్తమ్మీద 752 మందికి రీ కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు కల్పించారు. స్పౌజ్ పాయింట్ల విషయంలో నిబంధనల మేరకు ప్లేస్‌లు కేటాయించాలని కొంతమంది రగడకు దిగారు. డీఈఓ జోక్యం చేసుకుని సమస్యను సద్దుమణిచారు. ఇలా ఎట్టకేలకు రీ కౌన్సెలింగ్ ముగియడంతో భాషాపండితులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంకోవైపు ఎస్‌ఏ తెలుగు, హిందీ ఉపాధ్యాయులకు రిలీవింగ్ సమస్య తొలగనుంది.

ఖాళీల పొరపాట్ల సర్దుబాటు..

ఎల్‌పీ తెలుగు, ఎల్‌పీ హిందీ ఖాళీల్లో జరిగిన పొరపాట్లను జిల్లా విద్యాశాఖ సర్దుబాటు చేసింది. తొలి కౌన్సెలింగ్‌లో రేషనలైజేషన్‌లో వజ్రకరూరు మండలం కొనకొండ్ల, బుక్కపట్నం బాలికల ఉన్నత పాఠశాలల్లో ఎల్‌పీ హిందీ పోస్టులు పోయాయి. దీంతో ఇక్కడ 8 ఏళ్లు పూర్తయిన ఇద్దరు టీచర్లు బదిలీ కావాల్సి ఉంది. అయితే రేషనలైజేషన్‌లో వెళ్లిన పోస్టు ఖాళీ చూపడంతో ఒకరు కోరుకుని వెళ్లారు. రాప్తాడు ఉన్నత పాఠశాల, కూడేరు మండలం ఉదిరిపికొండ, పుట్టపర్తి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో రేషనలైజేషన్‌లో ఎల్‌పీ తెలుగు పోస్టులు పోయినా ఖాళీగా చూపడంతో తొలి కౌన్సెలింగ్‌లో కోరుకుని వెళ్లారు. ఈ విషయం గుర్తించిన విద్యాశాఖ ఆ తప్పులను సరిదిద్ది రీ కౌన్సెలింగ్‌లో ఆ పాఠశాలల్లో అక్కడ ఖాళీలు తొలగించింది. దీనిపై తొలుత కొంత వివాదం తలెత్తినా అధికారులు వివరించడంతో చివరికి పండితులు శాంతించారు.

మిగులు ఉపాధ్యాయులు 61 మంది

- డీఈఓ పూల్‌లో నిల్వ..
- అవసరం మేరకు సర్దుబాబు

అనంతపురం అర్బన్: ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ పూర్తయింది. ప్రస్తుతం అందరి దృష్టీ మిగులు టీచర్లపై పడింది. జిల్లాలో మొత్తమ్మీద 61 మంది ఉపాధ్యాయులు మిగిలిపోయారు. ఇందులో ఎల్‌పీ తెలుగులో 18 మంది, ఎల్‌పీ హిందీలో 11 మంది ఉండగా.. 32 మంది పీఈటీలు ఉన్నారు. ప్రస్తుతం వీరిని డీఈఓ పూల్‌లో నిల్వ ఉంచారు. అయితే వీరిని ఎక్కడ..ఎలా నియమిస్తారు.. ఎలా వినియోగించుకుంటారు? అనే విషయమై రాష్ట్రశాఖ నుంచి ఎలాంటి స్పష్టతా లేదు. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ సైతం ఎలాంటి చర్యలూ తీసుకోలేని పరిస్థితిలో ఉండిపోయింది. దీంతో మిగులు టీచర్లలో ఆందోళన మొదలైంది. డీఈఓ పూల్‌లో ఉన్నందున అనుకూలమైన ప్రాంతాలకు నియమింపజేసుకోవచ్చునని కొందరు ఆనందపడుతున్నారు. ఎక్కడికి పంపుతారోనని మరికొందరు టెన్షన్ పడుతున్నారు. ఈ విషయంపై డీఈఓ లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లగా.. జిల్లాలో 61 మంది ఉపాధ్యాయులు మిగిలి ఉన్న విషయం వాస్తవమేనన్నారు.

ప్రస్తుతం వీరంతా తన పర్యవేక్షణలో ఉంటారన్నారు. రాష్ట్రశాఖ నుంచి వీరిని ఎక్కడ సర్దుబాటు చేయాలో ఉత్తర్వులు రాలేదన్నారు. వచ్చిన వెంటనే మార్గదర్శకాల మేరకు ఆయా పాఠశాలలకు పంపి విధులు నిర్వర్తించేలా చూస్తామన్నారు.

చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని

రేపు నెట్టికంటి ఆలయం మూసివేత

గుంతకల్లు రూరల్: చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని సోమవారం మధ్యాహ్నం నుంచే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ ఏఈఓ మధు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం రాత్రి 10-52 గంటల నుంచి 12-48 గంటల వరకు చంద్రహణం ఉంటుందన్నారు. అందువల్ల గ్రహణం ప్రారంభానికి తొమ్మిది గంటల ముందుగానే స్వామివారి మూలవిరాట్టుకు పూజలు, నైవేద్య కార్యక్రమాలు పూర్తిచేసి ఆలయం మూసివేస్తారన్నారు.

మంగళవారం ఉదయం ఆలయశుద్ధి, సంప్రోక్షణ, ఉదకశాంతి కార్యక్రమాలు నిర్వహించి 6 గంటలకు స్వామివారికి అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. 7 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తారన్నారు. ఈ విషయం భక్తులు గమనించి ఆలయ అధికారులకు, అర్చకులకు సహకరించాలని ఆ ప్రకటనలో కోరారు.

తుంగభద్ర జలాశయ సమాచారం

5-8-17	ప్రస్తుతం	గత ఏడాది
నీటిమట్టం (అడుగులు)	1613.18	1612.32
సామర్థ్యం (టీఎంసీలు)	41.704	39.883
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	4,757	4,664
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	120	7,641







సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పరిటాల సునీత, అనంతరం చంద్రన్న బీమా పత్రాలు అందిస్తున్న దృశ్యం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- లాభసాటి పంటలు సాగుచేయాలి
- రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు చెక్కుల పంపిణీ

రాప్తాడు: కరువు రైతుల సంక్షేమమే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయమని స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. స్థానిక పంగల్‌రోడ్డు సమీపంలోని టీటీడీసీ కార్యాలయంలో వెలుగుసిబ్బంది, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలూ కృషి చేస్తున్నారన్నారు. వర్షాభావంతో ఎండిపోతున్న వేరుశనగ పంటను కాపాడేందుకు రెయిన్‌గన్ల ద్వారా రక్షక తడులిస్తున్నారని, ఇన్‌పుట్ సబ్సిడీ అందజేసి ఆదుకున్నారని గుర్తు చేశారు. వరుస కరువుల నేపథ్యంలో అన్నదాతలను ఆదుకునేందుకు రైతుఉత్పత్తిదారుల సంఘాల సభ్యులకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అన్నదాతలు లాభసాటిపంటలు సాగుచేయాలన్నారు. బోర్లలో ఉన్న అరకొర నీటిని వృథాచేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందించే డ్రిప్పు పరికరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధిక దిగుబడి సాధించేందుకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. గ్రామాల్లో రైతులందరూ ఒకే రకం పంటలు కాకుండా వేరువేరు రకాల పంటలు సాగు చేయాలన్నారు. వేరుశనగతోపాటు అంతరపంటలైన కంది, జొన్న, పెసర వంటివి సాగుచేసి అధిక దిగుబడులు సాధించాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపడతామన్నారు. రైతుల అభిప్రాయం మేరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో మార్కెట్‌యార్డుల నిర్మాణాలు చేపట్టేలా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతామన్నారు. డ్వాక్రా మహిళాసంఘాలు స్థాపించి.. మహిళల జీవనోపాధులు మెరుగుపరిచేందుకు కోట్లాది రూపాయల రుణాలు మంజూరు చేస్తూ సీఎం అండగా నిలుస్తున్నారన్నారు. అనంతరం సెర్ప్ ఆధ్వర్యంలో 12 మండలాల్లోని 525 రైతు ఉత్పత్తి దారుల సంఘాల సభ్యులకు రూ.1.85 కోట్ల చెక్కు పంపిణీ చేశారు. ఈ రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వెంకటేశ్వర్లు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు రామసుబ్బమ్మ, డీపీఎం నరసయ్య, వెలుగు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా పేదలకు వరం

నిరుపేదలకు చంద్రన్న బీమా వరంలాంటిదని మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులకు చెక్కుల పంపిణీ అనంతరం రాప్తాడు నియోజకవర్గంలోని 31 మందికి రూ.30.40 లక్షల చంద్రన్న బీమా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సునీత మాట్లాడుతూ.. ప్రమాదవశాత్తు మరణించిన వ్యక్తుల కుటుంబ సభ్యులకు చంద్రన్న బీమా సొమ్ము ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జిల్లాకు 17 మంది వైద్యుల కేటాయింపు

అనంతపురం వైద్యం: జిల్లాకు 17 మంది వైద్యులను కేటాయించినట్లు వైద్యవిధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ రమేష్‌నాథ్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గల ఏపీ వైద్యవిధాన పరిషత్ పరిధిలోని ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులకు ఈనెల 2న విజయవాడలో కమిషనర్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారన్నారు. ఇందులో జిల్లాకు 17మంది వైద్యులను కేటాయించినట్లు తెలిపారు. విభాగాల వారీగా వైద్యుల వివరాలు ఇవీ.. ఎండీ జనరల్ మెడిసిన్-3, ఛాతీవైద్యనిపుణులు-1, జనరల్ సర్జరీ-6, ఆర్థోపెడిక్ -1, ఈఎన్‌టీ-1, ఆప్తమాలజీ-1, పెథాలజీ-1, గైనకాలజీ-1, చిన్నపిల్లల వైద్యులు-1, అనస్థీషియా-1 ఉన్నట్లు ఆశాఖ అధికారులు తెలియజేశారు. కౌన్సెలింగ్‌లో అధికారులు సూచించిన స్థానాల్లో కొందరు వైద్యులు ఇప్పటికే చేరారని, మరికొందరు సోమ, మంగళవారాల్లో చేరనున్నారని సమాచారం. ఏదిఏమైనా జిల్లాలోని వైద్యవిధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రులకు 17మంది నూతన వైద్యులు రావడంతో కొంత మేరకు వైద్యుల కొరత తీరనుంది.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

అనంతపురం సెంట్రల్: అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన ఉండాలని స్టేషన్ అగ్నిమాపక అధికారి లింగమయ్య సూచించారు. జిల్లా కేంద్రంలోని స్థానిక అరవిందనగర్ శ్రీ వెంకటపద్మావతి నర్సింగ్ కళాశాలలో శనివారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు, సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై డెమోతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులను ఇబ్బంది పెట్టొద్దు: పీఓ

అనంతపురం సప్తగిరిసర్కిల్: తమ పనులపై కార్యాలయంకు వచ్చే కార్మికులను ఇబ్బందిపెట్టకుండా పనులు చేయాలని ఆర్టీసీ పీఓ చంద్రాయుడు పేర్కొన్నారు. శనివారం ఆర్ఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో హెడ్ క్లర్క్‌ల సమావేశం నిర్వహించారు. నెలవారి ప్రగతిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో హెడ్ క్లర్క్‌లు పాల్గొన్నారు.

విశ్వజన మండలి జిల్లా కమిటీ ఎన్నిక

అనంతపురం ప్రెస్‌క్లబ్: విశ్వజన మండలి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విరువూరు సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టబోయిన వెంకటేశ్వర్లు యాదవ్ అధ్యక్షతన శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విశ్వజన మండలి అనంతపురం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు పెనుకొండ సూర్యనారాయణ, ఉపాధ్యక్షులుగా ఆది ఆంధ్ర మురళీ, గిద్దలూరి విశ్వనాథ్, జనరల్ సెక్రటరీ మండల చిన్నరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మర్రిపాడు అబుబకర్, జాయింట్ సెక్రటరీ సాకే నాగార్జున, మండల బాలరాజు, ట్రెజరర్ ఆదిఆంధ్ర కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లును ఎన్నుకున్నారు.

10న విద్యాసంస్థల బంద్

అనంతపురం సెంట్రల్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న విద్యార్థి సంఘాల మధ్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ చేపడుతున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధు, జాన్సన్‌బాబులు పేర్కొన్నారు. అందులో భాగంగా శనివారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణంలో విద్యార్థి సంఘాల నేతలు విద్యాసంస్థల బంద్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కుల్లాయిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం చేసుకోవద్దు: డీఎస్పీ

ఎస్కేయూ: ర్యాగింగ్ చేసి జీవితాలను అంధకారంలో నెట్టుకోవద్దని అనంతపురం డీఎస్పీ మల్లికార్జున వర్మ పేర్కొన్నారు. అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్, దాని పర్యావసానాలపై శనివారం డీఎస్పీ మల్లికార్జున వర్మ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇటుకలపల్లి ఎస్ఐ కరీం ర్యాగింగ్ చట్టాలను చదివి వినిపించారు. కళాశాల డైరెక్టర్ ఎం. రమేష్‌నాయుడు, విభాగాల అధిపతులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ కన్వెన్షన్ హాల్లో నేడు.. అనంతపురం పోలీస్ కాంప్లెక్స్‌లో ఉన్న పోలీస్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం ఉదయం 10.30 గంటలకు యాంటి ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎస్కేయూ రిజిస్ట్రార్ ఆచార్య రాజగోపాల్ పేర్కొన్నారు.

ఒక్క పరుగు తేడాతో
అనంతపురం గెలుపు

అనంతపురం స్పోర్ట్స్: ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆంధ్రా క్రికెట్ సంఘం అండర్-16 గ్రూప్‌బి అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో అనంతపురం జట్టు 1 పరుగు తేడాతో అవుట్‌రేట్ విజయం సాధించింది. మూడు రోజులు మ్యాచులో అనంతపురం జట్టు మొదటిఇన్నింగ్స్‌లో 211 పరుగులు చేయగా.... ప్రకాశం జట్టు 209 పరుగులు చేసింది. తరువాత రెండో ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు ఓవర్‌నైట్ స్కోరు 70-4 స్కోరుతో ప్రారంభించి శనివారం 181 పరుగులు చేసి ఆలౌటైంది. అనంతరం 184 పరుగులు విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు ఆరంభంలో చక్కగా ఆడి 2 పరుగులు చేయాల్సిన తరుణంలో మూడు వికెట్లు కోల్పోయి దీంతో ఒక్క పరుగు తేడాతో మ్యాచ్‌ను చేజార్చుకున్నారు. ఈ విజయం పట్ల జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు మాంఛోఫెర్రర్, కార్యదర్శి కేవీ షాహాబుద్దీన్ అభినందనలు తెలిపారు.

అసభ్య ప్రవర్తనపై మహిళ ఫిర్యాదు

అనంతపురం ఆంధ్రజ్యోతి: బళ్ళారి బైపాస్ కూడలిలో నివాసముంటున్న షరీఫ్ అనే వ్యక్తి తనపట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు అదే ప్రాంతానికి చెందినపోలమ్మ అనే మహిళ శనివారం నాలుగవపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అర్ధరాత్రి సమయంలో తాను పడుకుని ఉండగా... ఆ సమయంలో షరీఫ్ మంచం వద్దకు వచ్చి అసభ్యంగా ప్రవర్తించాడని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నాలుగవపట్టణ సీఐ శ్యామ్‌రావ్ తెలిపారు.

పోలీస్ సంక్షేమంలో భాగమే...
పెట్రోల్ బంకు నిర్వహణ: డీఐజీ




పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న డీఐజీ ప్రభాకర్‌రావు, ఎస్పీ అశోక్‌బాబు, డీజిల్ పడుతున్న డీఐజీ

ఆంధ్రజ్యోతి అనంతపురం : పోలీసుల సంక్షేమంలో భాగంగానే నూతనంగా పోలీస్ పెట్రోల్ బంక్ నిర్వహణ అని డీఐజీ ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. తద్వారా వచ్చే ఆదాయంలో ప్రతి రూపాయి పోలీసుల సంక్షేమానికి ఉపయోగపడుతుందన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ మైదానం పక్కన కోర్టు రోడ్డులో నూతనంగా పెట్రోల్ బంక్‌ను నిర్మించారు. శనివారం ఈ పెట్రోల్ బంకు కార్యకలాపాలను డీఐజీ ప్రభాకర్‌రావు ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ముందుగా ప్యూయల్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పూజలు చేశారు. ఆ తరువాత ప్రజలు పోలీస్ పెట్రోల్ బంక్ సేవలను కోరుతూ సుమో వాహనానికి డీఐజీ డీజిల్ పట్టగా.... ద్విచక్రవాహనానికి ఎస్పీ పెట్రోలు నింపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మాల్యాద్రి, డీఎస్పీలు మల్లికార్జున, మల్లికార్జున వర్మ, నరసింగప్ప, మహబూబ్‌బాషా, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, చిన్నికృష్ణ, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సాకే త్రిలోక్‌నాథ్, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ శ్యామలమ్మ

అనంతపురం వైద్యం: జన్మించిన పిల్లలందరికి తల్లిపాలను మాత్రమే పట్టడంతో ఆ పిల్లలు ఏలాంటి అనారోగ్యానికి గురికాకుండా ఆరోగ్యం శ్రేయస్కరంగా ఉంటుందని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఇన్‌చార్జి పీడీ శ్యామలమ్మ పేర్కొన్నారు. ఈ మేరకు తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శనివారం అనంతపురం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని 1,2,3,4,5 సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రాంతాల్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆశాఖ ఇన్‌చార్జి పీడీ శ్యామలమ్మ హాజరయ్యారు. ముందుగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని తల్లిపాల వారోత్సవాల ఆవశ్యకత.. అంగన్‌వాడీ సేవలపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా కేంద్రాల సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ ఎంఆర్ వ్యాక్సిన్ వేయాలి

- అదనపు వైద్యశాఖాధికారి అనిల్‌కుమార్, డీఐఓ పురుషోత్తం

అనంతపురం వైద్యం : ప్రభుత్వం పిల్లల ఆరోగ్యం కోసం నూతనంగా అమలు చేస్తున్న మీజిల్స్‌వ రుబెల్లా వ్యాక్సిన్‌ను అర్హులైన పిల్లలందరికి వేయాలని జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అదనపు వైద్యశాఖాధికారి అనిల్‌కుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి పురుషోత్తం పేర్కొన్నారు. ఈమేరకు శనివారం నగరంలోని ముఖ్యమంత్రి పట్టణ ఆరోగ్య కేంద్రాలు, తదితర ప్రభుత్వసుత్రులు వైద్యులు, వైద్యసిబ్బందికి మీజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్ ఆవశ్యకత.. అమలు తీరుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై ఎంఆర్ వ్యాక్సిన్ పిల్లలకు వేసే విధానం.. ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 9నెలల నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లల్లో తట్టు, రుబెల్లా తదితర వ్యాధులు రాకుండా రక్షణ కోసం ప్రభుత్వం ఈ వ్యాక్సిన్‌ను అందిస్తోందన్నారు. ప్రతిఒక్కరూ మీజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్ అమలు ప్రక్రియను ప్రణాళిక బద్ధంగా అమల చేసి తమ పరిధిలోని పిల్లలందరికి తప్పనిసరిగి వ్యాక్సిన్ వేయడంతో తగిన ఆరోగ్యవిషయాలపై అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా ఆసుపత్రికి వచ్చే గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో వైద్యమందించి వారి ఆరోగ్యాల ను కాపాడాలన్నారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్ఓ రీతీష్‌బజాజ్, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఎంహెచ్ఓ ఆదిశేషు, వేమారెడ్డి, సీహెచ్ఓ క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సురేంద్రబాబు జన్మదినోత్సవం సందర్భంగా అన్నదానం

అనంతపురం టౌన్ : ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత అమిలినేని సురేంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం నగరంలోని వృద్ధాశ్రమాలతోపాటు ప్రభుత్వాస్పత్రి, మదరసాలలో దాదాపు 2వేల మందికి అన్నదానం చేశారు. అనంతరం ప్రభుత్వ సర్వజనాస్పత్రి, నేషనల్ హైవే వద్దనున్న మదరసా, పలు వృద్ధాశ్రమాల్లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సురేంద్రబాబు తనయుడు యశ్వంత్, అవినాష్ చౌదరి, రమేష్, రంజిత్, బాలు, రాకేష్, తిమ్మానాయుడు, సుంకన్న, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దృశ్యం

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

అనంతపురం సెంట్రల్: వ్యవసాయ కూలీల వలసలు నివారణపై ఈ నెల 7న సోమవారం నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగయ్య, కేశవరెడ్డిలు కోరారు. ఈ సదస్సు జిల్లా కేంద్రంలోని స్థానిక సంగమేశ్వర హాల్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్ రామాంజనేయులు, సామాజిక హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ రామకృష్ణ, జిల్లా కన్వీనర్ జగదీష్, రిడ్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ భానుజా హాజరై వ్యవసాయ కూలీల సమస్యలపై ప్రసంగించడం జరుగుతుందన్నారు. సదస్సుకు వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

జేఎన్‌టీయూ ఫైనాన్స్ ఆఫీసర్‌గా రంగానాయక్

జేఎన్‌టీయూ: జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయ తొలి ఫైనాన్స్ ఆఫీసర్‌గా ఎస్. రంగానాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... రిజిస్ట్రార్ ఎస్. కృష్ణయ్య నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించారని, వాటిని సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య సుబ్బారావు, నాన్ టీచిం గ్ అధ్యక్షుడు ఎండీ నాగభూషణం, రామ్మోహన్, బాలకృష్ణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ లింగప్ప తదితరులు అభినందనలు తెలిపారు.

జాతీయస్థాయి ఫెన్సింగ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల సత్తా

అనంతపురం అర్బన్: జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలలో రామ్‌నగర్ బ్రాంచ్ శ్రీచైతన్య విద్యార్థులు సత్తా చూపారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన పోటీల్లో పావని, రవిత్రేణి పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఇందులో పావని భారతదేశ జట్టుకు ఎంపికైంది. ప్రస్తుతం సింగపూర్‌లో ఈ నెలలో జరుగుతున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. వీరిని కళాశాల యాజమాన్యం అభినందించింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనంతపురం సప్తగిరిసర్కిల్: విద్యుత్‌లైన్ల మరమ్మతుల్లో భాగంగా ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉన్నట్లు ఏడీఈ శ్రీనివాసులు తెలిపారు. కోర్టురోడ్డు, క్లాక్‌టవర్, ప్రకాష్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

నేడు 'మన్నేమాతరం' పుస్తకావిష్కరణ

అనంతపురం టౌన్ : హెచ్చెల్సీ కాలనీలోని ఇంజనీర్స్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు తాను రచించిన 'మన్నేమాతరం' కవితాసంపుటితోపాటు 'వారపోస్టు' పుస్తకాల ఆవిష్కరణ సభను నిర్వహిస్తున్నట్లు కవి యాములపల్లి నరసిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాహితీప్రియులు, కళాకారులు, కవులు, హాజరై జయప్రదం చేయాలని కోరారు.

'సీఎంను విమర్శించే స్థాయి జగన్‌కు లేదు'

అనంతపురం జిల్లా పరిషత్తు : రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును విమర్శించే స్థాయి జగన్‌మోహన్‌రెడ్డికి లేదని వడ్డెర ఫెడరేషన్ చైర్మన్ దేవళ్ల మురళి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నాయకులు చంద్ర, షరీఫ్, శివ, వెంకటరమణ, సిద్ధ తదితరులు పాల్గొన్నారు.

నేడు తల్లిపాల వారోత్సవాలపై ప్రత్యేక కార్యక్రమం

అనంతపురం వైద్యం : నేషనల్ ఆయుష్ అసోసియేషన్ (నామా), జాయింట్ హ్యాండ్స్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యం లో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక పాతూరులోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఉదయం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నామా రాష్ట్ర నాయకులు పోగుల కుమారయ్య, నల్లపాటి తిరుపతినాయుడు, ఆ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఉమాదేవి శనివారం ప్రకటనలో తెలిపారు.

డీఈఓను సత్కరించిన భాషాపండితులు

అనంతపురం అర్బన్: జిల్లా విద్యాశాఖాధికారి లక్ష్మీనారాయణను భాషాపండితులు సత్కరించారు. పదోన్నతులు కల్పించడంతో పాటు పండిట్లకు రీ కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగులు కల్పించడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి సైన్స్‌సెంటర్‌కు వచ్చి డీఈఓను కలిశారు. అనంతరం డీఈఓను శాలువా కప్పి మొమెంటో అందించి సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు, హిందీ, పండిట్స్ నాయకులు, పండితులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగులకు విశేష పూజలు

అనంతపురం టౌన్: శ్రావణ శనివారాన్ని పురస్కరిం చుకుని నగరంలోని వివిధ ప్రాంతాల్లో నాగులకు విశేష పూజ లు నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పుట్టలోకి పాలు పోశారు. అనంతరం నైవేద్యాన్ని సమర్పిం చారు. ఒకరికొకరు కంకణాలు కట్టుకుని నాగులను దర్శిం చుకుని మొక్కులు మొక్కుకున్నారు. అనంతరం ఒకరికొ కరు వాయనాల రూపంలో ప్రసాదాలను ఇచ్చిపుచ్చుకు న్నారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- ఏపీ మెడికల్ కాంట్రాక్టు అండ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్
- నేడు ఐఎంఏ హాల్‌లో సమావేశం

అనంతపురం వైద్యం: ప్రభుత్వం వైద్యఆరోగ్యశాఖలో పనిచే స్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి తగిన సదుపాయాలను కల్పించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్టు అండ్ వర్కర్స్ (ఏఐటీయూసీ) అనుబంధ యూనియన్ నాయకు లు డిమాండ్ చేస్తున్న శనివారం ప్రకటన విడుదల చేశారు. ఇం దులో భాగంగా సుప్రీంకోర్టు తీర్పు మేరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా లు ప్రభుత్వస్పత్రుల్లో ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, వైద్యఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ తదితర సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చే యడాన్ని నిరసిస్తూ ఆదివారం 11గంటలకు స్థానిక ఐఎంఏహాల్ లో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆందోళన చేయడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమానికి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగు లందరూ పెద్దఎత్తున హాజరుకావాలని వారు పేర్కొన్నారు.

ఆర్టీసీ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎంపిక



ఎస్‌హెచ్‌ఆర్ ఖాన్, జిలాన్ బాషా, నూర్

అనంతపురం సప్తగిరిసర్కిల్: ఏపీఎస్ఆర్టీసీ మైనార్టీ ఎంప్లా యిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎంపిక శనివారం జరి గింది. నగర శివారులోని నూర్ ఫంక్షన్ హాల్‌లో ఆ యూనియన్ నాయకులు కేఎండి రఫీ అధ్యక్ష సమావేశం నిర్వహించారు. సమా వేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు నిషాద్ అహమ్మద్, ప్రధాన కార్యదర్శి ఎస్ఏ షరీఫ్, ఏపీఎస్ఆర్టీసీ చీఫ్ అడ్వైజర్ ఎస్ ఎండీ రఫీ, రీజినల్ కమిటీ గౌరవాధ్యక్షులు చమన్‌సాబ్ హాజర య్యారు. సమావేశంలో రీజినల్ కమిటీని ఎంపిక చేశారు. రీజినల్ అధ్యక్షులు బాబా(హిందూపురం), రీజినల్ కార్యదర్శిగా ఎస్‌హెచ్ ఆర్ ఖాన్(అనంతపురం), ఉపాధ్యక్షులుగా జిలాన్ బాషా, కోశాధి కారిగా నూర్‌ను ఎంపిక చేశారు.

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు





పూజలందుకుంటున్న శనీశ్వరుడు, హోమం నిర్వహిస్తున్న భక్తులు

అనంతపురం టౌన్: శనిత్రయోదశిని పుర స్కరించుకుని శనివారం నగరంలోని వివిధ ఆల యాల్లో వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బెంగుళూరురోడ్డులోని శివకోటి ఆలయం, మొద టిరోడ్డులోని కాశీ విశ్వేశ్వర కోదండ రామాల యం, హెచ్చెల్సీ కాలనీలోని చాముండేశ్వరి దేవా లయం, ఆరవరోడ్డులోని శివాలయంలలో నవగ్ర హాలకు విశేష పూజలు నిర్వహించారు. శనీశ్వరు నికి భక్తులు తైలాభిషేకం చేయడంతోపాటు పు వ్వుల దీపాలు వెలిగించి మొక్కులు మొక్కుకు న్నారు. శివకోటి ఆలయంలో ప్రత్యేకంగా శనేశ్వ ర్య హోమం నిర్వహించారు. అనంతరం అర్చ కులు శనేశ్వరునికి ప్రత్యేక అలంకరణలు, పూజా దికార్యక్రమాలు చేశారు.

పారిశుధ్యం మెరుగు అందరి బాధ్యత

- చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేస్తే ఫైన్: మేయర్ స్వరూప

అనంతపురం వైద్యం : నగరంలోని ప్రతి ప్రాంతాను అత్యంత సుందరంగా, ఆహ్లాదకరం గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం.. అ లాంటి పనులకు ఏమాత్రం ఆటంకం కల్పిం చకుండా ప్రతిఒక్కరూ పారిశుధ్యం మెరుగును అందరి బాధ్యతగా భావించి ముందుకుసాగాలని న గర మేయర్ స్వరూప పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం మేయర్, కమిషనర్ పీవీవీఎస్ మూర్తి, డిప్యూటీ కమిషనర్ సన్యాసిరావుతో కలిసి నగరంలోని రాజురోడ్డు, ఆర్ఎఫ్‌రోడ్డు తదితర ప్రధాన రహదారుల సమీపంలోని మురుగు కాలువలను పరిశీలించారు. దీంతో అక్కడక్కడ అడ్డంకులు ఉన్న ప్రాంతాల్లో తక్షణమే పారి శుధ్య కార్మికులను పిలిపించి శుభ్రం చేయిం చారు. అదేవిధంగా ము రుగుకు అడ్డంగా వ్యర్థ పదార్థాలను వేసి కొందరి షాపుల యాజమాను లకు అక్కడిక్కడే అపరాధ రుసుం వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త చెదా రంను ఎక్కడపడితే అక్కడ వేసి నగర ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కల్పించకూడదని ఆయా షాపుల యాజమానులను హెచ్చరిం చారు.

అదేవిధంగా పూడికతీత పనుల్లో నూతన పద్ధతులను చేస్తు సిబ్బందిలో మార్పు తీసుకురా వడంతో పాటు నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దా లని ప్రజాఆరోగ్యాధికారులను ఆదేశించారు. అంతేకాకుండా రాంనగర్ బ్రిడ్జి కింద పెద్దకాలు వను హైట్ చేసి పాదచారులకు ఇబ్బందులు కల్గ కుండా తగిన కల్వర్టు బిల్లలను ఏర్పాటు చే యడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నగరపా లక సంస్థ ఏఈ హేమచంద్ర, శానిటరీ ఇన్‌స్పె క్టర్ సురేంద్ర, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ రాంమోహన్, కార్పొరేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొ న్నారు.

రాహుల్‌పై రాళ్లదాడి సరికాదు...

కాంగ్రెస్ నాయకులు

అనంతపురం సెంట్రల్: దేశంలో బీజేపీ మతతత్వ శక్తు లను రెచ్చగొడుతూ ఆర్ఎస్ఎస్ భావాలతో దాడులకు పాల్పడు తున్నారు. దాడులు కొనసాగింపులో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. దేశాన్ని ఏ దిశగా తీసుకెళ్తున్నారో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా సమాధానం చెప్పాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. రాహుల్‌పై దాడికి క్షమాపణ చెప్పాలన్నారు. ఇక రాష్ట్రంలో అధికార పార్టీ తెలుగు దేశం, ప్రతిపక్ష పార్టీ వైసీపీలు రెండు దారుణంగా తయార య్యాయన్నారు. ఒక ఎమ్మెల్యే అభ్యర్థిని గెలపించుకోవడానికి 12 మంది మంత్రులు, 30 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు నంద్యాలలో మకాం వేయాల్సిన దుస్థితిపై మండిపడ్డారు. తమి ళనాడులో ఉప ఎన్నికను రద్దు చేసిన విధంగా నంద్యాల ఉప ఎన్నికను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నాగరాజు, కిరణ్‌కుమార్, హరి, క్రిష్ణ, గోవర్దన్ తది తరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

- డీఎస్‌డబ్ల్యూఓలను ఆదేశించిన డీడీ రోసన్న

అనంతపురం సెంట్రల్: వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎలాంటి సమ స్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సాంఘిక సంక్షేమ డీ డీ రోసన్న డీఎస్‌డబ్ల్యూఓలను ఆదేశించారు. శనివారం సాంఘి క శాఖ కార్యాలయంలోని తమ చాంబర్‌లో డీఎస్ఓలతో సమా వేశం నిర్వహించారు. శాఖాపరమైన పలు అంశాలపై చర్చించా రు. అనంతరం వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు మౌలిక సదు పాయాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రతి విద్యార్థికి సకాలంలో స్కాలర్‌షిప్ అందేలా వివరాలు న మోదు చేయించాలన్నారు.

వాహనాల తనిఖీ ముమ్మరం

ఆంధ్రజ్యోతి, అనంతపురం: రోడ్డుభద్రతా చర్యల్లో భాగంగా నాల్గవ పట్టణ పోలీసులు శనివారం వాహనాల తనిఖీలు ము మ్మరం చేశారు. సీఐ శ్యామ్‌రావు ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది ఆ స్టేషన్ పరిధిలోని పలు కూడళ్లలో వాహనాలు తనిఖీ చేప ట్టారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతుండగా.... 16 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ. 2100 జరిమానా విధించారు.

వర్గీకరణ లేనపుడు ఆంక్షలేమిటి..?

-ఎరుకుల సంక్షేమ సంఘం

అనంతపురం సెంట్రల్: గిరిజన విద్యార్థులకు కేటాయించిన సీట్లలో 481 సీట్లకుగానూ 313 సుగాలీలకు, కేవలం 144 మాత్రమే ఎరుకులకు మరో 24 సీట్లు ఇతర గిరిజనులకు కేటాయించినట్లు అధి కారులు చెబుతున్నారు. వర్గీకరణ లేన పుడు ఇలాంటి చర్యలు ఎలా చేపడతారని ఎరుకుల హక్కుల సంక్షేమ సంఘం అ ధ్యక్షుడు వెంకటన్న ప్రశ్నించారు. గతంలో చేపట్టిన విధంగానే సుగాలీలకు, ఎరుకు లకు సమానంగా ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జ నా భా ప్రాతిపదికన సుగాలీలతో పాటు ఎరు కలు ఉన్నారని సమానంగా సీట్లను కేటా యించాలన్నారు. అలాకాకుండా ఇష్టారా జ్యంగా చేయడం తగదన్నారు. ఇరువురికి సమాన న్యాయం జరిగేలా అధికారులు ని ర్ణయం తీసుకోవాలన్నారు.

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

- ఏపీ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

అనంతపురం టౌన్ : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లా లో వేసిన పంటలు వర్షాల్లేక ఎండిపోతున్నా యని, వాటిని ప్రభుత్వమే కాపాడాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కా ర్యదర్శి పెద్దిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆ సం ఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జిల్లా లో 63 మండలాల్లో, రాష్ట్రవ్యా ప్తంగా మొత్తం 240 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నా రు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత పుష్కరాలు, రాజధాని శంకుస్థా పన పేరుతో కరువుగురించి కేంద్రానికి లేఖలు పంపకుండా నిధులు త క్కు వగా రావడానికి కారణమయ్యాడన్నారు. సకాలంలో నివేదికలు పంపిన కర్ణా టక, తమిళనాడు, ఒడిస్సా రాష్ట్రాలకు నిధులు సరిపడా వచ్చాయన్నారు. ఇప్ప టికైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఖరీఫ్‌లో వేసి ఎండిపోతున్న పంటలు, వర్షాల్లేక సాగుచేయని రైతులగురించి ఆలోచించి ఆదుకోవాల్సిన అ వసరముందన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నా గరాజు, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనలు

ధర్మవరంఅర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో శ్రావణ మాసం సందర్భంగా శనివారం అన్నమయ్యసేవా మండలి ఆధ్వర్యంలో సభ్యులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తలు భక్తులకు ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రాకారోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అన్నమయ్యసేవా మండలి సభ్యులు పొరాళ పుల్లయ్య, మామిళ్ల శ్రీనివాసులు, చామంతి గోవిందరాజులు, కాటాబత్తిని మారుతి, పామిశెట్టి నాగార్జున, నరేంద్రరెడ్డి, పోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేలరాలని చినుకు



ఎండుతున్న పంటలు - ఆందోళనలో రైతన్నలు



ఎండుతున్న వేరుశనగ పంట

ధర్మవరంఅర్బన్: చిరుజల్లులే తప్ప.. పదునయ్యే వర్షాలు కురవకపోవడంతో జిల్లాలో వ్యవసాయం భారంగా మారింది. రుతు పవనాలు ప్రారంభమైనా, ఆశించిన వర్షాలు కురవకపోవడంతో నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు, వాగులు నీరన్నదే కనిపించని పరిస్థితి. ప్రస్తుత సీజన్‌లో మండలంలో 18,500 హెక్టార్లలో వేరుశనగ పంట సాగుచేయాల్సి ఉండగా, ఇందులో కేవలం 2200 హెక్టార్లలో మాత్రమే వేరుశనగపంటను సాగుచేశారు. అంతేకాకుండా కొందరు రైతులు బోర్ల కింద అంతర్‌పంటలు సాగుచేసుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో భూగర్భజలాలు అడుగంటడంతో వందలాది బోర్లు నిరుపయోగంగా మారాయి. ఎన్ని అడుగులు వేసినా నీటి జాడ కనిపించడం లేదు. గతంలో నాలుగు ఇంచుల నీరువచ్చే బోర్లలో ప్రస్తుతం అర ఇంచుకూడా రావడంలేదని రైతులు వాపోతున్నారు. అనేక గ్రామాల్లో బోర్ల ఆధారంగా సాగుచేసిన పంటలకు తడులందించేందుకు కష్టాలు పడుతున్నారు.

కరుణించని వరుణుడు

జూలై 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని ఇటీవల వాతావరణశాఖ తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనంతో రాయలసీమ జిల్లాలో వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయని ఆశపడ్డారు. కానీ చిరుజల్లులకే పరిమితంకావడంతో అశలు ఆవిరయ్యాయి.

బోర్లకు నీరు తగ్గింది : వెంకటరాముడు, గొట్లూరు



నాకున్న పొలంలో ఐదు ఎకరాల్లో వేరుశనగను సాగుచేశా. మాకు ప్రదాన నీటి వనరులు బోర్లే. రెండేళ్లుగా వర్షాలు లేకపోవడంతో బోర్లలో నీరు రావడంలేదు. సాగుచేసిన పంటలు దెబ్బతింటున్నాయి. రైతులు నష్టపోతున్నారు.

కరువు తాండవిస్తోంది : నారాయణ, చిగిచెర్ల



సకాలంలో వర్షాలు కురవకపోవడంతో బోరు బావులు ఎండిపోతున్నాయి. దీంతో కరువు తాండవిస్తోంది. నాకున్న మూడెకరాలలో రూ.30వేలు అప్పు చేసి వేరుశెనగపంట సాగుచేశా. అయితే సకాలంలో వర్షాలు రాకపోతే పంటలు ఎండి తీవ్రంగా నష్టపోతాం.

లోకల్ గైడ్

localguide

ఎమ్మెల్యే డైరీ

ధర్మవరం: ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆదివారం నియోజకవర్గంలో అందుబాటులో ఉంటున్నారు. ధర్మవరంలోని పార్టీ కార్యాలయంలో ఉంటూ ప్రజాసమస్యలు స్వీకరించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తారు.

ధర్మవరం మార్కెట్‌లో కూరగాయల ధరలు



పచ్చిమిర్చి 50, వంకాయలు 30, కాకర 50 టమోట 60, క్యారెట్ 60, బీన్స్ 50, ఎర్రగడ్డలు 20, బంగాళాదుంప 20, ముల్లంగి 20, క్యాబేజి 40, చౌడేకాయలు 30, బీరకాయలు 40, బీట్‌రూట్ 30, బెండ 40.

ధర్మవరం సినిమాలు

సిద్ధార్థ: ఫిదా, **లక్ష్మీనారాయణ:** రాధా, **లక్ష్మీచక్రవర్తి:** వైశాఖ, **వరలక్ష్మి:** డీజే, **విజయలక్ష్మి:** బాహుబలి-2, **రంగా సెంట్రల్:** నిన్నుకోరి, గౌతమ్‌నంద దండుపాళ్యం-2, నక్షత్రం

ధర్మవరం డిపో నుంచి ఆర్టీసీ బస్ సర్వీస్‌లు

ధర్మవరం-హైదరాబాద్ : ఉదయం 11.30 గంటలకు, మధ్యాహ్నం 1.30, 3.30, రాత్రి 8.30, 9.30, ధర్మవరం-చెన్నై: రాత్రి 8 గంటలకు, ధర్మవరం-విజయవాడ: సాయంత్రం 4.30, 6.30 గంటలకు, ధర్మవరం-నెల్లూరు: సాయంత్రం 6.15కు, ధర్మవరం-ఒంగోలు : మధ్యాహ్నం 3.30గంటలకు, ధర్మవరం-తిరుపతి : సాయంత్రం 4.30గంటలకు

వాహనాల తనిఖీ

ముదిగుబ్బ: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా శనివారం రాళ్లనంతపురంక్రాస్ సమీపంలో జాతీయ రహదారిపై ఎస్ఐ మగ్బుల్‌బాషా వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు సరిగా లేని వాహనాలకు, ఓవర్‌లోడ్, స్పీడ్‌గా వెళ్లే వాహనాలకు జరిమానా విధించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంవీఐ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష ఖాయమని హెచ్చరించారు. కావున డ్రైవర్లు నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలని, నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఎస్ఐ భాస్కర్‌రాజు, పీసీలు రంజిత్, హరిలాల్ నాయక్ పాల్గొన్నారు.

సూక్ష్మపోషకాలతో అధిక దిగుబడి

ముదిగుబ్బ: సూక్ష్మపోషకాలతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి మల్లేశ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మలకవేమల పంచాయతీ, నాగారెడ్డిపల్లిలో రైతులకు శనివారం జింక్ సల్ఫేట్, జిప్సం, బోరాన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ... భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో సూక్ష్మపోషకాలు అందిస్తోందని, పంటసాగు చేసిన రైతులు స్థూల పోషకాలతో పాటు సూక్ష్మపోషకాలు వాడితే పంటదిగుబడి ఎక్కువగా వస్తుందన్నారు. కావున ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన ఈ సబ్సిడీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ దేవేంద్రనాథ్ రెడ్డి, సర్పంచ్ రమణమ్మ, నాగారెడ్డిపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలపై సమీక్ష

ధర్మవరంఅర్బన్: మండలంలోని దర్శినమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులను జరపలేదని, నెలకు ఐదు కాన్పులైన జరపాల్సిందేనని డిప్యూటీ డీఎంహెచ్ఓ యుగంధర్ వైద్యులకు ఆదేశించారు. దర్శినమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యుగంధర్ మాట్లాడుతూ ఆస్పత్రిలో కాన్సులు జరగలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. అదే విదంగా తాగునీటి కోసం రోగులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. అదే విధంగా రోగులు ఆస్పత్రికి వస్తే కూర్చొవడానికి కుర్చీలు కూడా లేవని తదితర సమస్యలపై సమావేశంలో చర్చించి వాటిని వెంటనే అమలు పరిచేవిధంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ క్రిష్ణమూర్తి, డాక్టర్ చెన్నారెడ్డి, కమిటీ సభ్యులు నడిమిగడ్డపల్లి పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

కేహెచ్ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛభారత్

ధర్మవరంఅర్బన్: పట్టణ సమీపంలోని తారక రామాపురం వద్ద ఉన్న కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలో మట్టిదిబ్బలు, ముళ్లకంపలు తొలగించడంతో పాటు కళాశాలలోని ల్యాబ్‌లు, గ్రంథాలయం, జిమ్‌గదిని శుభ్రం చేశారు. ఉన్నత విద్యాశాఖ కమీషనర్ ఆదేశాల మేరకు కళాశాలలో స్వచ్ఛబారత్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్ సురేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చాంద్‌బాషా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు క్రిష్ణయ్య, శివప్రసాద్, రఘురామమూర్తి, అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, శశాంకమౌళి, షామీర్‌బాషా, శ్రీరాం, పుష్పవతి, ఉషారాణి, జీవన్‌కుమార్, కిరణ్ కుమార్, ఆదినారాయణ, ఖాదర్‌వలీ, అంజినరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



మట్టిదిబ్బలను తొలగిస్తున్న విద్యార్థులు

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ఆకుపచ్చ దుస్తులతో ఉన్న కాకతీయ విద్యార్థులు

ధర్మవరంఅర్బన్: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాద్యత అందరిపై ఉందని కాకతీయ విద్యానికేతన్ ఫౌండర్ శెట్టిపి రామిరెడ్డి సూచించారు. పట్టణ సమీపంలోని కాకతీయ విద్యానికేతన్‌లో శనివారం గ్రీన్‌డే వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆకుపచ్చదుస్తులు దరించి చెట్లను పెంచడం వల్ల కలిగే లాబాలను గురించి నాటిక రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శెట్టిపి నిర్మలా జయచంద్రారెడ్డి, డైరెక్టర్ శెట్టిపి సూర్యప్రకాశ్‌రెడ్డి, శెట్టిపి పద్మ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

యశోద పాఠశాల చిన్నారుల వనభోజనాలు

ధర్మవరంఅర్బన్: స్థానిక యశోద కాన్సెప్ట్ పాఠశాల సమీపంలోని తోటలో చిన్నారులకు ఆటవిడుపుగా వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పాఠశాల డైరెక్టర్ రవీంద్ర పేర్కొన్నారు. ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని వివిధ ఆట పాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వన భోజనాల్లో పాల్గొన్న చిన్నారులు ←

విద్యార్థులకు ప్రత్యేక బస్సు సర్వీసు : డీఎం ప్రశాంతి

ధర్మవరంఅర్బన్: విద్యార్థుల సౌకర్యార్థం ధర్మవరం నుంచి వయా మల్లేనిపల్లి, తుమ్మల, అప్రాచెరువు గ్రామాలకు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం ప్రశాంతి తెలిపారు. కేవలం విద్యార్థుల సౌకర్యార్థం పట్టణానికి పాఠశాలలు, కళాశాలలకు వచ్చే విద్యార్థులకు ఉదయం బత్తలపల్లి నుంచి ఆయా అప్రాచెరువు, తుమ్మల, మల్లేనిపల్లి గ్రామాల మీదుగా ధర్మవరం చేరుకుంటుందన్నారు. అదే విధంగా సాయంత్రం ధర్మవరం నుంచి ఆయా గ్రామాల మీదుగా బస్సు సర్వీసును ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదే విధంగా ధర్మవరం నుంచి న్యామద్దెలకు కూడా విద్యార్థుల కోసం బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల సంక్షేమానికి మరింత కృషి చేస్తామని ఆమె తెలిపారు.

చేనేతను జీఎస్టీ నుంచి మినహాయించాలి

ధర్మవరంఅర్బన్: చేనేతను జీఎస్టీ నుండి మినహాయించాలని నవ్యాంధ్రచేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్యూల్ పేర్కొన్నారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత పరిశ్రమ గత రెండు దశాబ్దాల నుంచి సంక్షోభంలో కూరుకుపోయి చేనేత కార్మికులు అప్పుల ఊబిలోకి కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ తరుణంలో చేనేతపై జీఎస్టీని విధించడం ఎంతవరకు సమంజసమన్నారు. కావున కేంద్ర ప్రభుత్వం స్పందించి చేనేతను జీఎస్టీనుంచి మినహాయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ చంద్రశేఖర్, లక్ష్మణ స్వామి, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, సుధాకర్ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

ధర్మవరంఅర్బన్: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాతమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగలూరు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సుజాతమ్మ మాట్లాడుతూ బిడ్డపుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వాలన్నారు. 6నెలల వరకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగేశ్వరి,ఆయా రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండలంలోని రాళ్లనంతపురంలో శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రాజామణి తల్లిపాల విశిష్ఠత గురించి గర్భిణీలు, బాలింతలకు వివరించారు. ముర్రుపాలు పట్టడం వల్ల శిశువు ఆరోగ్యంగా ఉంటుందని సూచించారు. అంగన్‌వాడి కార్యకర్త రజియా పాల్గొన్నారు. ఉప్పలపాడు, సంకేపల్లి అంగన్‌వాడి కేంద్రాల్లో కూడా వారోత్సవాలు నిర్వహించినట్టు కార్యకర్తలు రమాదేవి, సుగుణమ్మ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ

కార్పొరేట్ తరహా విద్య



పుస్తకాలను అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ధర్మవరంఅర్బన్: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ పిల్లలకుకూడా కార్పొరేట్ విద్యను ప్రభుత్వం అందించాలన్న ఉద్దేశ్యంతోనే అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీస్కూల్స్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో భాగంగా చంద్రబాబునగర్‌లోని అంగన్ వాడీ సెంటర్‌లోని నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలలోని 12మంది పిల్లలకు ఆంగ్లమాధ్యమం పుస్తకాలను అంగన్‌వాడీ కార్యకర్తలు బారతి, రమాదేవిలు పంపిణీ చేశారు. కార్పొరేట్ పాఠశాలలో మాదిరిగా నాణ్యమైన విద్యతోపాటు అన్ని సౌకర్యాలు ప్రభుత్వం అందిస్తోందన్నారు. అదే విధంగా గర్భణీలకు మధ్యాహ్నం భోజనాన్ని కూడా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అట్టహాసంగా సౌత్‌జోన్ కరాటే టోర్నీ



కరాటె పోటీలో తలపడుతున్న దృశ్యం

ధర్మవరంఅర్బన్: అనంతపురానికి చెందిన మార్షల్‌ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జేపీఆర్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన సౌత్‌జోన్ కరాటెపోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు గౌరీబిదనూరు, బెంగుళూరుకు చెందిన కరాటెమాస్టర్లు, క్రీడాకారులు హాజరయ్యారు. టోర్నీ నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని గెలుపొందాలన్నారు. ఈ పోటీల వల్ల ఏకాగ్రత, మానసిక దృఢత్వం లభిస్తుందన్నారు. అనంతరం టోర్నీలో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రామచంద్ర, అఖిల్‌సాయి, శ్యాంకుమార్ రాయల్, గోరకాటి మహేశ్వర్‌రెడ్డి, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను సొంతబిడ్డల్లా చూసుకోండి

ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్





సౌకర్యాలపై విద్యార్థులతో ఆరా తీస్తున్న కమిషనర్ - వంటకు సరుకులను పరిశీలిస్తున్న దృశ్యం

ధర్మవరంఅర్బన్: వసతిగృహాల్లోని విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గుర్రం రవి వార్డెన్లకు సూచించారు. పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని మున్సిపల్ కమిషనర్‌తో పాటు మలేరియా సబ్‌యూనిట్ అధికారి జయరాం నాయక్‌లు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ చుట్టుపక్కల ఉన్న రాళ్లను, ముళ్లకంపలను తొలగించాలని వార్డెన్‌ను ఆదేశించారు. అనంతరం మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా వంటకు ఉపయోగించే సరుకులను పరిశీలించారు. నాణ్యత గల కూరగాయలను వంటకు ఉపయోగించాలన్నారు. కుళ్లిపోయినవి వంటకు ఉపయోగించరాదన్నారు. అనంతరం విద్యార్థులతో హాస్టల్ లోని సమస్యలను అడిగితెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా తదితర వాటిపై ఆరా తీశారు. రాత్రి సమయాల్లో దోమలు హాస్టల్‌లోకి రాకుండా కిటికీలు వేసుకోవాలన్నారు. డెంగీ, మలేరియా వ్యాధులు రాకుండా మిలాథిన్ పౌడర్‌ను స్ప్రేయింగ్ చేయించారు. మధ్యాహ్నం గుట్టకిందపల్లిలోని బీసీ హాస్టల్‌ను సందర్శించి అక్కడ కూడా మిలాథిన్ పౌడర్‌ను స్ప్రే చేయించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీ నారాయణశర్మ, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా ఏడు శనివారాల వ్రతం

ధర్మవరంఅర్బన్: శ్రీనివాసుడికి అత్యంత ప్రీతి పాత్రమైన శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక శ్రీనివాసనగర్‌లోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఏడు శనివారాల వ్రతాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదవ శనివార వ్రతాన్ని వెంకటేశ్వర దేవాలయాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి నిర్మాల్య విసర్జన గావించి, పంచామృతాభిషేకం, అర్చనలు, తులసీమాలలతో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా వ్రతం నిర్వహించారు. మహిళలు విశేషంగా హాజరై భక్తిశ్రద్దలతో కుంకుమార్చనలు నిర్వహించడంతోపాటు సామూహికంగా వ్రతం ఆచరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బృందం చెన్నంశెట్టి జగదీశ్, జింకా రాజేంద్ర ప్రసాద్, వెంకటరాముడు, బీరే నాగేశ్వరరావు, వేల్పుల తులసీదాసు, దేవతా కృష్ణమూర్తి, బద్దన రమణ, అన్నంరామాంజి తదితరులు పాల్గొన్నారు.అదే విధంగా సోమవారం తిరుమంజనసేవ, రక్షాభందన కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు.



వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళలు

ముగిసిన వేంకటేశ్వరస్వామి పవిత్ర ఉత్సవాలు

ధర్మవరంఅర్బన్: స్థానిక కొత్తపేట లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం పవిత్ర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ధ్వజకుంభపూజ, మహాసుదర్శణయాగం తదితర కార్యక్రమాలు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఆధ్వర్యంలో జరిగాయి. టీటీడీ ఆగమపండితులు వినోద్ కుమార్, తిరుమలతిరుపతి దేవస్థాన అర్చకులు కృష్ణమాచార్యులు, రవిశాస్త్రీ, రమేశ్, నరసింహస్వాములు ప్రత్యేక అలంకరణ చేశారు. వేదమంత్రోచ్ఛారణల మధ్య కన్నులపండువగా నిర్వహించారు. అదే విధంగా సాయంత్రం మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, ప్రాకార హోమం, శేషవాహనంపై స్వామి వారిని పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతులకు సబ్సిడీపై జిప్సం పంపిణీ

బత్తలపల్లి: మండలంలోని గంటాపురం రైతులకు శనివారం వందశాతం సబ్సిడీతో జిప్సంను పంపిణీ చేశారు. ఈసందర్భంగా బత్తలపల్లి రెవిన్యూవిలేజ్ గ్రామాలకు 840 బ్యాగుల జిప్సంను పంపిణీ చేశామని ఏఓ పెన్నయ్య తెలిపారు. మండల వ్యాప్తంగా 240 టన్నుల జిప్సం వచ్చిందని, రైతులందరికీ పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు

బత్తలపల్లి: మండలంలోని ఎం.చెర్లోపల్లి, సంజీవపురం ఎస్సీ కాలనీలో వర్షం కోసం శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఎం.చెర్లోపల్లి రామాలయంలో విరాటపర్వం చదివించారు. ఇలా చేయడం వల్ల వర్షాలు కురుస్తాయని గ్రామీణుల నమ్మకం. ఈ పూజాకార్యక్రమాలకు గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొని భజనలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ జరిగింది.

పరిశుభ్రత పాటించండి : ఎంపీడీఓ

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలో ఎంపీడీఓ లక్ష్మీబాయి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది శుభ్రం చేస్తున్న కాలువలను పరిశీలించి వారికి సలహాలు, సూచనలు ఇచ్చారు. గ్రామస్థులు ఆరోగ్యంగా ఉండాలంటే అందుకు మీరే ప్రధాన కారణమని, కావున డ్రైనేజిలను వారానికి ఒకసారి శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కలశ మహోత్సవం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పాతవూరిలో వెలసిన పెద్దమ్మస్వామి ఆలయ కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమం శనివారంతో ముగిసింది. ప్రతిష్ఠకు హాజరైన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. 40 రోజులు ఆలయంలో హోమం జరుగుతుంది కావున దేవాలయం వద్ద జంతుబలులు నిషేధించడమైందని, 40 రోజుల తరువాత జ్యోతులు, బోనాల కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ తెలిపింది. భక్తులు దీనిని గమనించి సహకరించాలని కోరారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ధర్మవరంఅర్బన్: తొగటవీరక్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అనంతపురానికి చెందిన సవీర ఆస్పత్రి సహకారంతో ఆదివారం మెగా ఉచితవైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్యశిబిరాన్ని ఈరే పార్వతమ్మ జ్ఞాపకార్థం కుమారులు బీరేగోపాలక్రిష్ణ, బీరే ప్రసాద్, బీరే ప్రకాశ్ దాతలుగా వ్యవహరించనున్నారు. ఈ శిబిరాన్ని డాక్టర్ అన్నం జగన్నాథం ప్రారంభించడం జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథులుగా జేఎన్‌టీయూ విశ్రాంత ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, తొగగటవీర క్షత్రియ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు హాజరవుతారన్నారు.

ఇసుక ట్రాక్టర్లకు జరిమానా

ధర్మవరంఅర్బన్: అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 12 ట్రాక్టర్లకు తహసీల్దార్ మహబూబ్‌బాషా జరిమాన విధించారు. ప్రభుత్వ నింబందనలకు విరుద్ధంగా ఇసుకను తరలించే ట్రాక్టర్లను రెవిన్యూ సిబ్బంది పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించి ఒక్కొక్కదానికి రూ.5వేలు చొప్పున జరిమాన వేశారు. మరోసారి అక్రమంగా ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

గూడ్స్‌షెడ్ కొట్టాలలో నాకాబందీ

ధర్మవరంఅర్బన్: పట్టణంలోని గూడ్స్‌షెడ్ కొట్టాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ జయానాయక్ ఆధ్వర్యంలో స్పెషల్‌పార్టీ పోలీసులు శనివారం నాకాబందీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్ఐ జయానాయక్, స్పెషల్‌పార్టీ పోలీసులు ఇంటింటికి వెళ్లి సోదాలు నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ కాలనీలో ఎవరూ ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే అటువంటివారిపై కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు.

9 మంది జూదరుల అరెస్టు

ముదిగుబ్బ: మండలంలోని గుంజేపల్లి శివారులో పేకాట ఆడుతున్న 9 మందిని ఎస్ఐ మగ్బుల్‌బాషా శనివారం అరెస్టు చేశారు. పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి ఆ స్థావరంపై దాడి చేసి 9 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1520 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టుకు హాజరుపరుస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మట్కా, కోడిపందాలు, పేకాట తదితర జూదాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



పేకాట స్థావరంపై దాడి చేస్తున్న ఎస్ఐ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పామిడి: మండలంలోని గజరాంపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గార్లదిన్నె మండలం కల్లూరు ఆగ్ర హారానికి చెందిన శ్రీనివాసులు గాజుల వ్యాపారం చేస్తు జీవిస్తున్నాడు. వ్యాపారంలో భాగంగా గుత్తికి వెళ్లి వ్యాపా రం ముగించుకుని ద్విచక్రవాహనంపై కల్లూరుకు వెళ్తుండగా గుత్తి నుంచి అనంతపురం వెళ్తున్న ఐచర్ వాహనం వెనక నుంచి ఢీ కొట్టడంతో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని పామిడి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. ప్రమాదానికి కారణమైన ఐచర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



స్వామివారిని అలంకరించిన దృశ్యం

గుంతకల్లుటౌన్: స్థానిక రాజేంద్రనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం రెండవ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామి వారి మూలవిరాట్టుకు అభిషేకాలు, అర్చనలు, విశేష పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. ఆలయ అవరణంలో మట్టితో చేసిన కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి, మురడి, నేమకల్లు ఆంజనేయ స్వామి విగ్రహాలను కొలువు దీర్చారు. అర్చకులు జనార్ధన శాస్త్రి, వేణగోపాల్ మన్యసూక్త హోమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బొలికొండ రంగనాథుడికి...



స్వామివారికి హారతినిస్తున్న అర్చకులు

గుత్తిరూరల్: మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ శ్రావణమాసం రెండవ శనివారం సందర్భంగా వేకువజామున స్వామి వారికి పంచామృతాభిషేకం, వివిధ పుష్పాలతో అలంకరించి ఆకు పూజలను నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగేంద్రరావు, ఆలయ కమిటీ చైర్మన్ విజయలక్ష్మి, రంగస్వామి రెడ్డి యాదవ్, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లోకల్ గైడ్

ఎమ్మెల్యే డైరీ

గుంతకల్లు: స్థానిక ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ ఎన్నికల ప్రచారం కోసం నంద్యాలకు వెళ్లారు. ఆదివారం ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండరు.

కూరగాయల ధరలు



కిలో.. టమోట రూ. 40, మిరప రూ. 40, బీరకాయ రూ. 30, ఉర్లగడ్డ రూ. 20, వంకాయ రూ. 40, బెండకాయ రూ. 30, క్యారెట్ రూ. 60, ఉల్లిగడ్డ రూ. 30

సినిమా గైడ్

గుంతకల్లు
వాసవి : గౌతమ్‌నందా
చైతన్య : నక్షత్రం
కేపీఎస్ : ఫిదా

గుత్తి
అమృత్: ఫిదా
కేపీఎస్ : గౌతమ్‌నంద

పామిడి
మంజు: ఫిదా
హనుమాన్ : గౌతమ్‌నందా

పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

పామిడి: మండలంలోని నీలూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను శనివారం తహసీల్దార్ బాలాజీరాజు ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. మధ్యాహ్న భోజనం రుచిగా ఉండడంపై, పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచడంపై సంతృప్తి చెందారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వో వెంకటరమణ, సర్పంచు కుమారుడు వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌కేపీ డిగ్రీ కళాశాలలో రక్త గ్రూపు నిర్ధారణ శిబిరం



ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్‌ను సన్మానిస్తున్న ఆత్మీయ సేవా ట్రస్ట్ సభ్యులు

గుంతకల్లుటౌన్: స్థానిక ఎస్‌కేపీ డిగ్రీ కళాశాలలో ఆత్మీసేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి రూరల్ ఎస్ఐ బాబాజాన్, యోగా శిక్షకులు చింతామునిస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత రక్తదానంపై అపో హలు పెట్టుకోకూడదన్నారు. ప్రతి ఒక్కరూ రక్తం దానం చేయడానికి ముందుకు రావాలన్నారు. విద్యార్థులకు రక్తనిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆత్మీయసేవా ట్రస్ట్ సభ్యులు కేశవ, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

లాకర్ సౌకర్యాన్ని కల్పించిన వీహెచ్‌పీ



లాకర్‌గదిని ప్రారంభిస్తున్న ఆలయ ఈఓ

గుంతకల్లురూరల్: శ్రావణమాసం రెండవ శనివారం సందర్భంగా కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శనానికి తరలివచ్చిన భక్తులకు వీహెచ్‌పీ, భజరంగదళ్ నాయకులు లాకర్ గదిని ఏర్పాటు చేశారు. ఈ గదిని ఆలయ ఈఓ ముత్యాలరావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు తమ వస్తువులను ఎక్కడ భద్రపరుచుకోవాలో తెలియక ఇబ్బందులుపడుతుండగా వీహెచ్‌పీ, భజరంగదళ్ నాయకులు లాకర్ గదిని ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరిటెండెంట్ వెంకటేశ్వర్లు, వీహెచ్‌పీ విభాగ్ అధ్యక్షుడు విశ్వనాథ్, భజరంగదళ్ జిల్లా కార్యదర్శి రవి, భూపాల్, జయచంద్ర, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువలు నిర్మించాలని ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గుంతకల్లుటౌన్: పాతగుంతకల్లులోని అంకాలమ్మ కాలనీలో మురుగు కాలువలు నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు మురళీకృష్ణ పేర్కొన్నారు. ఏఐఎస్ఎఫ్, కాలనీవాసులు ఆధ్వర్యంలో శనివారం పాతగుంతకల్లులోని అంకాలమ్మ దేవాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాలువలు నిర్మించడానికి 2013వ సంవత్సరంలో ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. ఆ నిధులను ఖర్చు చేయడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలం చెందారన్నారు. అంకాలమ్మ దేవాలయం ముందు మురుగు నీరు రోడ్డు మీద ప్రవహించడంతో ఆలయానికి వచ్చే భక్తులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం మున్సిపల్ అసిస్టెంట్ సీటీ ప్లానర్ శివన్నారాయణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్‌యాదవ్, పవన్‌కుమార్ రెడ్డి, నాయకులు నవీన్‌కుమార్, పవన్, కాలనీవాసులు ప్రసాద్, సూరి, లింగన్న పాల్గొన్నారు.

చంద్రన్న బీమా చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కే అపర్ణ

గుంతకల్లుటౌన్: రోడ్డు ప్రమాదాల్లో, సహజ మరణం కింద చనిపోయిన బాధిత కుటుంబాలకు శనివారం చంద్రన్న బీమా చెక్కులను మున్సిపల్ చైర్‌పర్సన్ కే అపర్ణ అందజేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. వైటీ చెరువుకు చెందిన అనంతలక్ష్మి, గుంతకల్లుకు చెందిన పీ నాగరాజు ప్రమాదంలో మృతి చెందారు. సాధారణ మరణం కింద మృతి చెందిన బీ శ్రీనివాసులు, నెట్టికల్లు, రాజశేఖర్, ఈరన్న, వెంకటేశ్ కుటుంబ సభ్యులకు ఒక్కోక్కరికి రూ. 30 వేల చెక్కులను అందజేశారు. మెప్మా ప్రాజెక్టు అధికారి రామాంజినేయులు, కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, బీమా మిత్ర సభ్యులు లత, నళిని, జయలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ గృహాలపై గ్రామ సభలు



తంబళ్లపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్

పామిడి: మండలంలోని రామరాజుపల్లి, గజరాంపల్లి, నీలూరు, ఎదరూరు గ్రామ పంచాయతీలలో శనివారం తహసీల్దార్ బాలాజీరాజు, ఎంపీడీఓ రమేష్ నాయక్, ఈఓఆర్‌డీ చంద్రమోహన్ మండల అధికారులతో కలిసి గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బాలాజీరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పల్లెల్లోని నిరుపేదలకు గృహాలను నిర్మించేందుకు ఎన్టీఆర్ రుణాల మంజూరుకు అర్హులను గుర్తించేందుకు ఈ సభలు నిర్వహిస్తోందన్నారు. స్థలం ఉన్న వారు, స్థలం, ఇళ్లులేని వారిని గుర్తించి జాబితాను తయారు చేసి ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, వీఆర్వోలు తిమ్మప్ప, నిరంజన్‌రెడ్డి, వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును పరిశీలించిన వైసీపీ నాయకులు



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న వైసీపీ నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణ శివారు ఆలూరు రోడ్డులో ఉన్న రైల్వే డంపింగ్ యార్డును శనివారం వైసీపీ నాయకులు పరిశీలించారు. వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జి వై వెంకటరామిరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి రామలింగ, ఎస్సీసెల్ రాష్ట్రకార్యదర్శి జింకల రామాంజినేయులు డంపింగ్ యార్డుకు వెళ్లారు. డంపింగ్ యార్డులో గొర్రెలు, పశుల కళేబరాలు, చికెన్ వ్యర్థాలు పడి ఉండటాన్ని పరిశీలించారు. డంపింగ్ యార్డు నుంచి రోజూ పొగ, చనిపోయిన పశువుల కళేబరాల నుంచి దుర్వాసన వస్తోందని, పొగ వల్ల ఆటోలు, ద్విచక్ర వాహనాల ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు మహిళల వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దుర్వాసన వల్ల పాఠశాలలో ఇబ్బందులు పడుతున్నామని పలువురు విద్యార్థులు ఆయనకు తెలిపారు. ఇక్కడి నుంచి యార్డుకు తరలించాలని కోరారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఈ విషయాన్ని డీఆర్ఎంతో మాట్లాడి యార్డు తరలించేందుకు మున్సిపాలిటీ అధికారులు కృషి చేయకపోవడం శోచనీయమన్నారు. తాము వెంటనే డీఆర్ఎంతో సమస్యపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో వైసీపీ కౌన్సిలర్లు రంగన్న, నగేశ్, అహమ్మద్ బాష, ఫ్లయింగ్ మహబుబ్ బాషా, నాగరత్న, సర్పంచు తిక్కస్వామి, మైనార్టీ నాయకులు జమీల్ పాల్గొన్నారు.

19 మంది బైండోవర్

పామిడి: మండలంలోని జీ కొట్టాలకు చెందిన 19 మందిని శనివారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు ఎదుట శనివారం 11 మంది రౌడీ షీటర్లను, 8 మంది పొలం విషయంలో గొడవపడిన వారిని బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.

నేడు బొలికొండ రంగనాథస్వామి కల్యాణోత్సవం

గుత్తిరూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగేంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, సహస్రనామార్చనలు, కలశ స్థాపన, గణపతి పూజ, ఉదయం 11-05 గంటలకు శ్రీదేవి, భూదేవి సహిత బొలికొండ రంగనాథస్వామి కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మధ్యాహ్నం మహామంగళ హారతి, తీర్థప్రసాదాల వితరణ, సాయంత్రం స్వామివారి పల్లకి ఊరేగింపు, ఊంజలసేవ కార్యక్రమాలు, రాత్రికి రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

మూణ్ణాళ్ల ముచ్చటేనా..?

- శిథిలమవుతున్న ఎస్‌ఎస్ ట్యాంకు గట్లు
- నిర్వహణ లోపంతో పెరుగుతున్న సమస్య



అదనపు ఎస్‌ఎస్ ట్యాంకు

గుంతకల్లు: పట్టణానికి తాగునీటి అవసరాలను తీరుస్తున్న నూతన సమ్మర్ స్టోరేజి ట్యాంకును నిర్మించి, వినియోగంలోకి తెచ్చిన ఆరేళ్లకే మట్టికట్ట చీలిపోయి శిథిలావస్థకు చేరుకుంది. గుంతకల్లు జనాభాకు తగ్గట్టు నీటి వనరులను నిల్వ చేసుకోవడానికి అదనపు సమ్మర్ స్టోరేజి ట్యాంకు అవసరమౌతుందని భావించి ప్రతిపాదించారు. మొదటి ట్యాంకు 1,900 మిలియన్ లీటర్ల నిల్వ సామర్థ్యమున్న ట్యాంకుకు అదనంగా 3,800 మిలియన్ లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉండేలా ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భూసేకరణ అడ్డంకులను తొలగించుకుని ఆలస్యంగా రూ. 53 కోట్లతో పనులను ప్రారంభించారు. 2011లో పనులు పూర్తికాగా ఈ ట్యాంకుని వినియోగంలోకి తెచ్చారు. ఈ ట్యాంకును నిర్మాణ సంస్థ అయిన ఇంజనీరింగ్ ప్రాజెక్టు ఇండియా లిమిటెడ్ సంస్థ రెండేళ్లపాటు నిర్వహించింది. దాని మెయిన్‌టెనెన్స్ కాలం పూర్తవడంతో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో దాని నిర్వహణా కార్యక్రమం చేపట్టారు. కానీ నిర్వహణా లోపాల కారణంగా సమ్మర్ స్టోరేజి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంటోంది.

చీలిపోయిన ట్యాంకు గట్టు

కొత్త సమ్మర్ స్టోరేజి ట్యాంకు నిర్వహణ విషయంగా పురపాలక సంఘం నిర్లక్ష్యం చేయడంతో ట్యాంకు గట్లపై కంపచెట్లు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయాయి. ట్యాంకు



ఎస్‌ఎస్ ట్యాంకు గట్టు చీలిపోయిన దృశ్యం

దక్షిణం వైపు ఉన్న మట్టి కట్ట సగానికి చీలిపోయింది. చీలికలను ముందే పసిగట్టి ఎప్పటికప్పుడు మరమ్మతులను చేసుకోవాల్సిన అధికారులు తాత్సారం చేసిన కారణంగా నెర్రులు వచ్చి సమస్య పెద్దదవుతోంది. ట్యాంకు మట్టి గట్టు మధ్యలో నల్లరేగడి మట్టిని వేసి, తర్వాత పైవైపున ఎర్ర మట్టిని వేస్తారు. ఎండావాన, చలి వేడిమిల కారణంగా నల్లరేగడి మట్టి స్వభావంలో కాస్త మార్పు రావడం సహజంగానే జరుగుతుందని ఇంజనీర్లు తెలుపుతున్నా రు. కానీ ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సి ఉండగా, నిర్లక్ష్యం చేయడంతో చీలిక పెద్దదై ప్రమాదకరంగా మారింది. దాదాపు వంద మీటర్ల మేర గట్టు లోతుగా సగానికి చీలింది. కాగా ఎస్‌ఎస్ ట్యాంకుకు ఉన్న నాలుగు గట్లలో దక్షిణపు గట్టుపై మాత్రమే కంపచెట్లను తొలగించారు. మిగిలన గట్లపై కంపలు భారీగా పెరిగిపోయాయి. దీని వల్ల కట్ట బలహీనపడే అవకాశాలున్నాయి.

మరమ్మతులు చేస్తాం : ఈశ్వరయ్య, మున్సిపల్ ఇంజనీరు



సమ్మర్ స్టోరేజి ట్యాంకు గట్టుకు చీలికలు రావడం సహజమే. అలాగే ఆ చీలికలను ఎప్పటికప్పుడు సరి చేయాల్సిందే. కిందటి నెలలో వెళ్లి నప్పుడు గట్టు చీలిపోయిన విషయం నా దృష్టికి వచ్చింది. వీలైనంత త్వరలో నిధులను కేటాయించి చీలికను పూడ్చడానికి మరమ్మతులను చేపడతాం.

పరిశుభ్రతపై దృష్టి పెట్టండి

- మున్సిపల్ ఛైర్మన్ గౌస్‌పీరా



సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నాసీర్‌హుసేన్

పామిడి :నగర పంచాయతీలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ ఛైర్మన్ గౌస్‌పీరా, కమిషనర్ నాసీర్ హుసేన్ మున్సిపల్ సిబ్బందికి సూచించారు. శనివారం నగర పంచాయతీ పరిధిలోని 1, 2, 4, 9, 10, 11, 12వ వార్డులలో కాలువల్లో తీసిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించేలా జాగ్రత్తలు వహించాలన్నారు. చెత్తను ఇష్టారాజ్యంగా వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మేస్త్రీ నాగరాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ దిష్టిబొమ్మ దహనం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి బీజేపీ దిష్టబొమ్మను ఊరేగింపుగా ఎన్టీఆర్ సర్కిల్ వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పీ లక్ష్మీనారాయణ యాదవ్ మాట్లాడుతూ గుజరాత్‌లో రాహుల్‌గాంధీపై రాళ్లురువ్వడం బీజేపీ మతతత్వ శక్తుల దుండగమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ సూర్యనారాయణ, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు ఆలం నావాజ్, మండల కార్యదర్శి షాషావలి, రైతు సంఘం నాయకుడు విజయమోహన్‌రెడ్డి, గోవిందు, లాజారస్ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం హేయం

గుంతకల్లుటౌన్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంకాల్‌రెడ్డి దిష్టిబొమ్మను హిందూ ధర్మ రక్షాదళ్ ఆధ్వర్యంలో దహనం చేయడం హేయమైన చర్య అని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలిమి రామాంజినేయులు పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ రోడ్డులోని గోపాల కృష్ణ భవన్‌లో బీజేపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత విమర్శలతో బీజేపీ నాయకులను విమర్శించి వారి దిష్టిబొమ్మను దహనం చేయడం నీచమైన చర్య అన్నారు. బీజేపీ పట్టణ అ ధ్యక్షుడు పట్నం రామాంజినేయులు, ప్రధాన కార్యదర్శి జీ కృష్ణమూర్తి,రాష్ట్ర సభ్యుడు రంగన్న, జిల్లాకార్యవర్గ సభ్యుడు కట్టా శ్రీనివాసులు, చంద్రశేఖర్, తిరుపాల్ పాల్గొన్నారు.

ముతవల్లిగా రహీంసాబ్

పామిడి: పట్టణంలోని ఖిల్లా జామియా మసీదు ముతవల్లిగా బీకే రహీంసాబ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ మసీదు కమిటీ, జమాత్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తనపై నమ్మకముంచి ముతవల్లిగా నియమించినందుకు మసీదు కమిటీకి, ముస్లింలకు రహీంసాబ్ కృతజ్ఞతలు తెలిపారు.

రెండో శనివారం ప్రత్యేక పూజలు

బెళుగుప్ప : శ్రావణమాసం సందర్భంగా రెండవ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మాసంలో ఒక్కో శనివారం ఒక్కో సామాజిక వర్గం నాగులకు ప్రత్యేక పూజలు జరిపి పండుగను చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. బూదిగుమ్మలో సంజీవరాయ స్వామికి ఉదయం పంచామృత అభిషేకం, పూజలు నిర్వహించారు.



విగ్రహాలకు పాలు పోస్తున్న మహిళలు

శనీశ్వరుడికి...

గుత్తి: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శని త్రయోదశి పర్వదినం సందర్భంగా శనీశ్వరుడికి పూజలుచేశారు. ఈ సందర్భంగా వేదపండితులు వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తైలాభిషేకం, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు.

కాగా గుత్తి ఆర్‌ఎస్‌లో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రావణమాసం రెండవ శనివారాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారిని అరటిపండ్లతో అలంకరించారు. స్వామివారికి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.



నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

హజ్‌యాత్ర ఎంతో పవిత్రమైనది

గుంతకల్లుటౌన్: హజ్‌యాత్ర ఎంతో పవిత్రమైనదని రాయచూరుకు చెందిన ముఫ్తి అతీఫ్ ఉర్ రహిమాన్, అనంతపురంకు చెందన అల్‌హజ్ మహబూబ్ సాహెబ్ లతీఫ్, గుంతకల్లుకు చెందిన హాఫీజ్ ఇబ్రహీం సాబ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఈద్గా మైదానం ఎదురుగా ఉన్న షాదీ ఖానాలో శనివారం గులామానే ఔలి యా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రికులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు హజ్‌లో పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. అనంతపురం, హిందూపురం, కదిరి, ఉరవకొండకు చెందిన వంద మంది హజ్‌యాత్రకులు శిక్షణా తరగతుల్లో పాల్గొన్నారు.

దళిత సంఘాల ఐక్య వేదిక గుంతకల్లు కమిటీ ఏర్పాటు

గుంతకల్లుటౌన్: స్థానిక ఎన్జీఓ హోంలో శనివారం దళితసంఘాల నాయకులు సమావేశం ఏర్పాటుచేసి దళిత సంఘాల ఐక్యవేదిక గుంతకల్లు కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ఎం రామాంజినేయులు, అధ్యక్షుడిగా కేవెల్ స్వామిదాస్, ప్రధాన సలహాదారుడి గా జేబీ సురేష్, కార్యనిర్వాహక అధ్యక్షు డిగా ఎం మహదేవ్, ఉపాధ్యక్షులుగా జీ పోలయ్య, కే ఆనంద్, ధనుంజయ, ఎన్ చంద్రశేఖర్, ఎం తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శులుగా ఎం భీమలింగ, సీ రామాంజినేయులు జే మస్తానయ్య, వై శ్రీరాములు, బాబురావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా టీ వెంకటేష్, టీ లక్ష్మణస్వామి, కే నాగేంద్ర, ఎం శంకర్, జీ భాగ్యరాజ్, గౌరవ సలహాదారులుగా జింకల రామాంజినేయులు, బావన్న, జగ్గిలి రమేశ్, ఎం మహేంద్ర, కోరి చంద్రశేఖర్, ఎం రామాంజినేయులు, క్రిష్ణమూర్తి, దశరథరాంలను ఎన్నుకున్నారు.

కబేళాకు పశువులు కొన్నా.. అమ్మినా కఠిన చర్యలు : డీఎస్పీ

బెళుగుప్ప : పశువులను విక్రయించినా.. కొనుగోలు చేసినా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటరమణ హెచ్చరించారు. మండలంలోని గుండ్లపల్లి క్రాస్ వద్ద ప్రతి శనివారం పశువుల సంత జరుగుతుంది. వందలాది పశువులు మార్కెట్‌కు తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న డీఎస్పీ శనివారం ఎస్ఐ నాగస్వామితో కలిసి సంతను పరిశీలించారు. అక్కడ రైతులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. పశుపోషణ భారమై రైతులు మార్కెట్‌కు అమ్మకుండా వాటిని కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ధనార్జనతో వ్యాపారులు పశువులను కొనుగోలు చేసి మార్కెట్‌కు తరలించకూడదన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డీఎస్పీ ఆదేశాతో 30మందిని ఎస్ఐ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

పేదలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం

ఉరవకొండ: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆసుపత్రి కమిటీ ఛైర్మన్ యేళ్ల శంకరప్ప, ఎంపీపీ సుంకురత్నమ్మ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. రూ. 9 కోట్లతో ఏపీఎంఎస్ ఐడీసీ నిధులతో పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఉరవకొండ ఆసుపత్రిని మోడల్ ఆసుపత్రిగా తీర్చిదిద్దడానికి ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రేగాటి నాగరాజు, రామాంజినేయులు, దండా మల్లికార్జున, కో-ఆప్షన్ సభ్యుడు ఆసిఫ్, ప్యారం కేశవానంద, బాబు, రఫి, రాంబాబు, లాలుస్వామి, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, ఆసుపత్రి కమిటీ ఛైర్మన్, టీడీపీ నాయకులు

ఓటరు నమోదుకు 1441 దరఖాస్తులు : తహసీల్దార్

పరిగి : మండల వ్యాప్తంగా జూలై 31 వరకు 1441 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ సుబ్బారెడ్డి తెలిపారు. ఇటీవల ఓటరు నమోదు కోసం ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించగా జూలై 1నుంచి 31వరకు మండల వ్యాప్తంగా బీఎల్‌ఓలచే ఓటరు నమోదు దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. మొత్తం 1,441 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. వాటిలో పురుషులు 744, స్త్రీలు 697 వచ్చినట్లు వివరించారు. ఇప్పటి వరకు 1,164దరఖాస్తులను అప్‌లోడ్ చేశామని ఆయన తెలిపారు. మిగిలిన 277 దరఖాస్తులను అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు.

సారు లేక... ఆగిన 1బీలు


APOnline RECEIPT AA 2145425
1బీ కోసం మీసేవాలో పొందిన రసీదు

- నెల రోజులు సెలవులో డీటీ
- సమస్యలపై స్పందించని రెవెన్యూ సిబ్బంది
- కార్యాలయం చుట్టూ రైతుల చక్కర్లు

లేపాక్షి : 1బీల కోసం 'మీ సేవా'లో దరఖాస్తు చేసకొని నెలలు గడుస్తున్నా అవి పరిష్కారానికి నోచుకోవడం లేదు. వాటిని పరిష్కరించాల్సిన రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని మండలంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1బీ, అడంగల్, ఆన్‌లైన్ పాసుపుస్తకాల కోసం మండలంలోని పలువురు రైతులు మీ సేవా కేంద్రంలో రుసుము చెల్లించి రసీదులు తీసుకున్నారు. అయితే నెలలు గడిచినా వాటి పరిష్కారంలో మాత్రం అధికారులు చొరవ చూపలేకపోతున్నారు. వాటి కోసం కార్యాలయానికి వెళ్లిన రైతులతో... సారు లేదని, రాగానే పనిచేస్తామని కింది స్థాయి సిబ్బంది వారిని ముఖద్వారం నుంచి వెనక్కు పంపుతున్నారు. బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు పొందాలంటే రైతులకు పట్టాదారు పాసుపుస్తకం, 1బి, అడంగల్ తప్పనిసరి. అయితే ఇవేమీ పట్టని రెవెన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇక్కడ పనిచేసే డిప్యూటీ తహసీల్దార్ నెల రోజుల నుంచి మెడికల్ లీవ్‌లో ఉన్నందున రైతుల సమస్యలు కుప్పలు తెప్పలుగా మూలానపడ్డాయని కార్యాలయ సిబ్బంది గుసగుసలాడుతున్నారు. అయితే వాటిని పరిష్కరించే సాహసం ఎవరూ చేయలేకపోతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందుకు మండలపరిధిలోని బిసలమానేపల్లి కి చెందిన రైతు నంజుండప్ప పరిస్థితే నిదర్శనం. ఆయన తన ఆవేదన వెళ్లగక్కుతూ... 1బీ కోసం ఏప్రిల్‌లో మీ సేవలో రుసుము చెల్లించి రసీదు పొందానని తెలిపాడు. ఇప్పటి వరకు తన సమస్యకు పరిష్కారం చూపలేదన్నాడు. కార్యాలయానికి వెళ్లినప్పుడల్లా డిప్యూటీ తహసీల్దార్ లేరని రాగానే పరిష్కారం చేస్తామని సిబ్బంది తెలుపుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదిలా ఉండా పూర్తయిన పట్టాదారు పాసుపుస్తకాలు కార్యాలయంలోనే ఉన్నట్లు సమాచారం. వీటిని పోస్టు ద్వారా రైతులకు చేరవేయాల్సి ఉండగా అలాగే బీరువాలో భద్రపరిచినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా అటువంటిదేమీ లేదన్నారు. సమస్యలను సాధ్యమైనంత మేరకు పరిష్కరిస్తున్నామన్నారు.


ఖాళీగా ఉన్న డిప్యూటీ తహసీల్దార్ చాంబర్


లోకల్ గైడ్

హిందూపురం మార్కెట్‌లో కూరగాయల ధరలు



టమోట రూ.60, ఉల్లి 15, మిరప 60-80, బీరకాయ 40, ఉర్లగడ్డ 30, వంకాయ 20, బెండకాయ 60, క్యారెట్ 60, బీన్స్ 60, కోసు 30, మునగ 80, ముల్లంగి 30, బఠాణి 120, సీమవంకాయ 60, నెమలికోసు 80, దొండకాయ 60, బీట్‌రూట్ 20, క్యాబేజీ 30, తెల్లగడ్డలు 120, కాకరకాయ 60, సొరకాయ 30, గోరు చిక్కుడు 60, చిక్కుడు 60, క్యాప్సికమ్ 60, అల్లం : 80

పట్టుగూళ్ల ధరలు



కనిష్ఠం (సీబీ) రూ.200.00, (బైవోల్టిన్) 287.00,గరిష్ఠం (సీబీ)380.00,(బైవోల్టిన్) 464.00, సగటు (సీబీ) 330.00, (బైవోల్టిన్) 391.00.

చింతపండు ధరలు

కర్పూలి 10 కిలోలు రూ.600-1575, ఫ్లవర్ రకం రూ.350-850, బోటురకం రూ.200-250

హిందూపురంలో సినిమాలు

శ్రీనివాస - దండుపాళ్యం -2, **విష్ణు** - పిదా, **గురునాథ్**- గౌతమ్‌నంద, **అమృత్** - జబ్ హరీ మీట్ సెజల్
లక్ష్మి - డీజే దువ్వాడ జగన్నాథం, **బాలాజీ** - బాహుబలి -2

ఎనిమిది ఆటోల సీజ్

పరిగి : ప్రత్యేక తనిఖీల్లో భాగంగా శనివారం సేవామందిరం చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ శరత్‌చంద్ర ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. అందులో ఓవర్‌లోడ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్, సీటు బెల్ట్ తదితర అంశాలను పాటించని వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిబంధనలు పాటించని ఎనిమిది ఆటోలను సీజ్‌చేసి వాటిని ఆర్టీఏకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ నిబంధనలకు అనుకూలంగా రహదారులపై వాహనాలను నడపాలని నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. నెంబర్ ప్లేట్లపై నెంబరు తప్ప పేర్లు, రాతలు ఉండకూడదన్నారు. ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, సీటుబెల్ట్, హెల్మెట్ తదితర వాటిని తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు.

తాగునీటి కోసం రోడ్డుపై బైఠాయింపు


డిమాండ్లతో కూడిన వినతిని డీఈకి అందిస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్: ప్రస్తుతం పట్టణంలో ఏ ప్రాంతంలో చూసినా నీటి సమస్య తాండవిస్తోందని, సమస్యను వెంటనే పరిష్కరించాలంటూ శనివారం మేళాపురం సర్కిల్‌లో 34వ వార్డు ప్రజలు రాస్తారోకో చేశారు. వైసీపీ కౌన్సిలర్ శివకుమార్ ఆధ్వర్యంలో ఆవార్డు ప్రజలు, వైసీపీ కౌన్సిలర్లతో కలిసి ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 33,34,35 వార్డుల్లో నెలకొన్న తీవ్ర నీటి ఎద్దడిపై కమిషనర్‌కు అనేక మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వైసీపీ కార్యకర్తలు రోడ్డుపక్కన వర్షం నీటిలో ముఖం కడుక్కుని వినూత్న నిరసన తెలిపారు. దాదాపు గంటపాటు రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంభించి ప్రయాణికులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ డీఈ సురేష్‌కుమార్, ఏఈ నీరజ అక్కడకు చేరుకుని వార్డుకు నీరు సరఫరా చేస్తామని వాగ్దానం చేయడంతో నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కౌన్సిలర్లు నాగభూషణ్‌రెడ్డి, ఆసీఫ్, రజినీ, జయమ్మ, జబీవుల్లా,కార్యకర్తలు సమద్, రియాజ్, రమేష్, రామాంజి, వెంకటేష్‌రెడ్డి, సాంబశివ వార్డు ప్రజలు ఉన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు పోషక విలువలు

అంగన్‌వాడీ కార్యకర్తల అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్



సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ కేశవులు, మానవహారం ఏర్పాటు చేసిన దృశ్యం

హిందూపురం అర్బన్: తల్లిపాలతోనే బిడ్డకు పోషక విలువలు అందుతాయని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ కేశవులు పేర్కొన్నారు. సీడీపీఓ నాగమల్లీశ్వరి ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని హిందూపురం, రూరల్‌లో పనిచేసే అంగన్‌వాడీ కార్యకర్తలకు శనివారం స్థానిక ఏఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బీపీఎస్‌ఐ ప్రతినిధి కేశవులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డపుట్టిన గంటలోపలే ముర్రుపాలు తాపితే... బిడ్డకు రోగనిరోధక శక్తి లభించడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మొదటి ఆరునెలలు తల్లిపాలు మాత్రమే అందించాలని, దీంతో తల్లికి కూడా రొమ్ముక్యాన్సర్ రాదని పేర్కొన్నారు. అంగన్ వాడీ కార్యకర్తలు ప్రతి గర్భిణికి తల్లిపాల విశిష్టత తెలియజేయాలన్నారు. ఆరు నెలల తరువాత ఇంట్లో వండిన పౌష్టికాహారం మాత్రమే అందించాలన్నారు. తల్లిపాలు అందించడంతో మానవ సంబంధాలు కూడా పెరుగుతాయన్నారు. అనంతరం దర్మపురం వీధుల్లో ప్రజలతో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. ఎంజీఎం భగత్‌సింగ్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ శ్రీలత, సూపర్‌వైజర్లు పుల్లమ్మ, దస్తగిరియమ్మ, వార్డుకౌన్సిలర్ రహిమాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడిని కలిసిన 'పురం' బీజేపీ నాయకులు

హిందూపురం టౌన్ : భారత ఉప రాష్ట్ర పతిగా ఎన్నికైన వెంకయ్యనాయుడును పురం బీజేపీ నాయకులు శనివారం కలిశారు. ఢిల్లీలోని ఆయన నివాసంలో వెంకయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపి ఆయనను సత్కరించారు. స్వాతంత్ర్యం ఏర్పడ్డాక ఉప రాష్ట్రపతిగా తెలుగు రాష్ట్రానికి చెందిన వ్యక్తి కావడం రెండు తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమన్నారు. వెంకయ్యనాయుడిని కలిసిన వారిలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు పురం నాయకులు రమేష్‌రెడ్డి, పార్థసారథి, వరప్రసాద్ ఉన్నారు.


వెంకయ్యనాయుడును సత్కరిస్తున్న పురం బీజేపీ నాయకులు

ఆఫ్‌లైన్‌లో పింఛన్ల పంపిణీకి ప్రతిపాదనలు

చిలమత్తూరు : సర్వర్ సమస్యవల్ల మండలంలోని కంబాలపల్లి, దిగువపల్లి తండా గ్రామాల్లో... బయోమెట్రిక్ ద్వారా పింఛన్ల పంపిణీలో ఇబ్బందులు తలెత్తుతుండటంతో కోడూరు గ్రామపంచాయతీని ఆఫ్‌లైన్‌లో పెట్టాల్సిందిగా ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీడీఓ శివానందనాయక్ తెలిపారు. మండల వ్యాప్తంగా 1154మందికి పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. సర్వర్ సమస్య కారణంగా ఇప్పటికే మండలంలోని చిలమత్తూరు, వీరాపురం, టేకులోడు, గ్రామ పంచాయతీల్లో పింఛన్ల పంపిణీ ఆఫ్‌లైన్‌లో ఉంచినట్లు తెలిపారు. ఎక్కడైనా పింఛన్ల పంపిణీలో సమస్యలు తలెత్తితే సంబంధిత సిబ్బంది తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

హిందూపురం అర్బన్: అనాధ శవానికి అంత్యక్రియలు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు పురంలోని సామాజిక సేవాకర్తలు. ప్రభుత్వ ఆసుపత్రిలో మూడు రోజుల క్రితం మార్చురిగది వద్ద గుర్తుతెలియని వ్యక్తి చెనిపోయాడు. ఆసుపత్రి సిబ్బంది వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించగా వ్యు తుడి బంధువులు ఎవరైనా వస్తారేమోనని పోలీసులు చూశారు. ఎవరూ రాకపోవడంతో శనివారం సామాజిక సేవాకర్తలకు సమాచారం అందించారు. వారు ఆటోలో శ్రీకంఠపురం శ్మశానవాటికలో అంత్యక్రియలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ జయలత, బీఎస్‌పీ శ్రీరాములు, ఉమర్‌ఫారుక్, నిజీమ్‌పటేల్, క్రిష్టప్ప, అమర్‌నాథ్, టైలర్‌గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి ప్రత్యక్ష ఆనందోత్సవ శిక్షణ శిబిరం

హిందూపురం టౌన్ : ఎస్‌డీజీఎస్ కళాశాల సెమినార్ హాల్‌లో ఈనెల 18నుంచి 22వరకు రవిశంకర్ గురూజీచే ప్రత్యక్ష ఆనందోత్సవ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు వీవీకెజి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమం ఐదు రోజులపాటు జరుగుతుందని పాల్గొనేవారు పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఉదయం 5.30నుంచి 8గంటల వరకు ప్రత్యక్ష హ్యాపినెస్ కార్యక్రమం, సాయంత్రం 5.30నుంచి 8వరకు ఉంటుందన్నారు. యోగా, ప్రాణాయామం, జ్ఞానంతో పాటు ప్రపంచ ప్రసిద్ధిగాంచిన సుదర్శన క్రియ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, వెంకటస్వామి తెలిపారు.

ఘనంగా శ్రావణ శనివారం పూజలు



విశేషాలంకరణలో కనుమ శ్రీలక్ష్మీనరసింహస్వామి

చిలమత్తూరు : శ్రావణ శనివారం పురస్కరించుకుని మండలంలోని వివిధ ఆలయాల్లో శనివారం విశేష పూజలు నిర్వహించారు. కనుమ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, ఆకుపూజ, అష్టావధాన సేవ, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టి అన్నదానం చేశారు. అలాగే చిలమత్తూరులోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేషాలంకరణ, సహస్రనామార్చన, మహామంగళహారతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకుందాం

- రోజుకు 2గంటలు రోడ్డు భద్రతకు కేటాయించాలి
- శాంతిసంఘం సమావేశంలో ఎస్పీ



శాంతి సంఘం సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

హిందూపురం టౌన్ : వినాయక చవితి, బక్రీదు పండగలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో వినాయకచవితిని పురస్కరించుకుని వినాయక విగ్రహాల ఏర్పాటులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత కమిటీ నిర్వాహకులపై ఉంటుందన్నారు. హిందూ, ముస్లింలు ఐక్యంగా ఉంటూ రెండు పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో డీజే ఏర్పాటు చేయరాదన్నారు. యువత విగ్రహాలు ఉన్నంతవరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఆ ప్రాంతంలోని వారే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే పట్టణంలో ఎనిమిది వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలోని వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసేవారిని గ్రూప్‌లో చేర్చామన్నారు. ఏ చిన్న సమస్య తలెత్తినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పోలీసులు అక్కడికే వెళ్లి అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలన్నారు. వీటితో పాటు కులమతాలకు అతీతంగా పండగల రోజున సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. త్యాగరాజ్ నగర్‌లో విగ్రహం ధ్వంసం చేసిన నిందితులు త్వరలోనే పట్టుకోవడానికి ప్రయత్నిస్తామన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గోళ్ల బాదన్న హత్యపై లోతుగా విచారణ జరుగుతోందని దీనిలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి స్టేషన్‌లోనూ ఎస్‌హెచ్‌ఓగా ఉన్నవారు రోజు 2గంటలపాటు రోడ్డు భద్రతకే కేటాయించాలన్నారు. ఇప్పటికే రోడ్డు భద్రత పై పలు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేశామని ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కరీముల్లాషరీఫ్, సీఐలు మధుభూషణ్, రాజగోపాల్‌నాయుడు, ఈదుర్‌బాషా, ఎస్ఐలు ఆంజనేయులు మహబూబ్‌బాషా, రాజశేఖర్ రెడ్డి, వినాయక విగ్రహాల కమిటీ సభ్యులు, శాంతి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గురు పాదుకల రథయాత్రకు ఘన స్వాగతం



గురుపాదుకల రథానికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

పరిగి : హిందూ ధర్మం సంస్కృతిని ఊరూరా ప్రచారం చేసేందుకు సాగుతున్న.. బెంగళూరుకు చెందిన ఉత్తరాది మఠం పీఠాధిపతి సత్యాత్మ తీర్థ సత్యప్రమోద గురువుల పాదుకల రథయాత్రను సేవామందిరంలో శనివారం వినాయక కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. యేడాదిపాటు శతకోటి గాయత్రీ జపం, దశకోటి రామకృష్ణ మంత్ర జపాలు నెరవేర్చేందుకుగాను, హిందూధర్మ ప్రచార నిమిత్తం ఏడాదిపాటు రథయాత్ర నిర్వహిస్తున్నట్లు శిష్యబృందం మహిషి ఆనందాచార్, రాధకృష్ణాచార్, వెంకటేశచార్, శేషగిరిచార్, జీవేశాచార్ తెలిపారు. వీరికి పరిగి, సేవామందిరంలో ఘనంగా స్వాగతించారు.

ఎంపీడీఓగా సులోచన బాధ్యతల స్వీకరణ

లేపాక్షి : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కొంతకాలం నుంచి ఎంపీడీఓ లేకపోవడంతో ఆ స్థానం ఖాళీగా ఉంది. కర్నూలు జిల్లా మదికెర మండలంలో ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న సులోచన బదిలీపై లేపాక్షికి వచ్చారు. శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

నికర జలాల కేటాయింపునకు కృషి చేయండి

ఎమ్మెల్యే బాలకృష్ణకు జలసాధన సమితి విన్నపం

హిందూపురం టౌన్ : రాయలసీమకు ఆయువుపట్టైన హంద్రీనీవా, గాలేరునగరి ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపు కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పురం జలసాధన సమితి నాయకులు విన్నవించారు. కర్ణాటకలోని బాగేపల్లిలో జరిగిన వివాహ వేడుకలకు శనివారం ఎమ్మెల్యే బాలయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా జలసాధన సమితి నాయకులు ఓపీడీఆర్ శ్రీనివాసులు, వెంకటరామిరెడ్డి, రామచంద్రారెడ్డి, సిద్దారెడ్డి, ఆదినారాయణ, జమీల్ కలిశారు. క్రిష్ణానది జలాల నుంచి ప్రాజెక్టులవారీ పంపకాలు అనే అంశాన్ని తొలగించి రెండు రాష్ట్రాలకు కేటాయింపులు జరపాలని అందుకు విభజన చట్టం సెక్షన్ 89కి సవరణ చేయాలన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జలవనరులశాఖ మంత్రి తో చర్చించి రాయలసీమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. బ్రిజేష్ ట్రిబ్యునల్ వ్యాఖ్యాను తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయని, హంద్రీ నీవాను త్వరితగతిన పూర్తిచేసి చెరువులకు నీరు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానన్నారని తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

చిలమత్తూరు : మండలంలోని దేమకేతేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీ అయిన 11మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. స్థానిక సర్పంచు ఉమాదేవి, గ్రామస్థుల ఆధ్వర్యంలో శనివారం పాఠశాల ఆవరణలో బదిలీ అయిన ఉపాధ్యాయుల గౌరవార్థం వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేశారు. ఉపాధ్యాయులు కేశవరెడ్డి, అరుణ, నాగమణి, నాగరాజు, ఈశ్వరప్ప, కృష్ణవేణి, లోకేశ్వరి, పవన్‌కుమార్‌రెడ్డి, ఫణిభూషణ్, నాగలక్ష్మి, వనజలను శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచు ఉమాదేవి మాట్లాడుతూ... బదిలీ అయిన ఉపాధ్యాయులసేవలు మరువరానివని ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ ఛైర్మన్ సోమయ్య, టీడీపీ నాయకులు రామనాథ్ రావు, ఆదినారాయణరెడ్డి, ఆదినారాయణప్ప, ఆనందయ్య, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పావుగంటలో పాసుపుస్తకం మోడల్ ప్రింట్

పరిగి : గతంలో పట్టాదారు పాసుపుస్తకం తీసుకోవాలంటే నెలల తరబడి పట్టేది. ఇప్పుడా ఆ వ్యయప్రయాసలు తీరిపోయాయి. పాసుపుస్తకాలను పావుగంటలోపు రైతులకు అందించే వినూత్న సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. మీసేవా ద్వారా రూ.25చెల్లించి రైతులు ఎలక్ట్రానిక్ పట్టాదారు పాసుపుస్తకాన్ని పొందవచ్చు. దీనిపై శనివారం పరిగి గ్రామానికి చెందిన రైతు శంకరప్ప మీసేవాద్వారా ఎలక్ట్రానిక్ పట్టాదారు పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. పావుగంట తరువాత మీసేవా ద్వారా ఎలక్ట్రానిక్ పట్టాదారు పాసుపుస్తకం రైతు అందుకున్నాడు. ఇతన్ని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుబ్బారెడ్డి చేతులమీదుగా మండలంలో తొలి పాసుపుస్తకాన్ని రైతు శంకరప్పకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హారతి, సీనియర్ సహాయకులు అంజినరెడ్డి, మీసేవా నిర్వాహకుడు బాలు పాల్గొన్నారు.



చిలమత్తూరు జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మీనారాయణరెడ్డి కుమార్తె మౌనిక, శివరామిరెడ్డి వివాహ వేడుక కర్ణాటక రాష్ట్రంలోని బాగేపల్లిలో ఉన్న సూర్య కన్వెన్షన్‌హాల్‌లో శనివారం ఘనంగా జరిగింది. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యుడి కుటుంబ సభ్యులు, బంధువులు, బాలకృష్ణకు ఘనంగా స్వాగతం పలికారు. - చిలమత్తూరు

వెలుగు అవకతవకలపై విచారణ

లేపాక్షి : స్థానిక వెలుగు కార్యాలయంలో కొంతమంది సిబ్బంది అవకతవకలతో అక్రమాలు జరిగాయని మండల సమాఖ్య మాజీ లీడర్ మంజుల కలెక్టర్‌కు, వెలుగు పీడీకి ఫిర్యాదు చేశారు. అక్రమాలపై విచారణ జరపాలని పలుమార్లు మీకోసం కార్యక్రమంలో కూడా తహసీల్దార్‌ను కోరారు. ఇందుకు స్పందించిన జిల్లా స్థాయి అధికారులు ఎట్టకేలకు విచారణ చేపట్టారు. ఫైనాన్స్ మేనేజర్ రాధ, జిల్లా ఉపాధి ఫైనాన్స్ మేనేజర్ రామ్మోహన్, ఏపీ ప్రసాద్, పది మంది డీజీఎంల బృందంతో మండలంలోని అన్ని గ్రామాల్లో విచారణ చేపట్టినట్లు తెలిసింది. రెండు రోజులుగా విచారణ రహస్యంగా కొనసాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. మండలంలోని కొన్ని వెలుగు సంఘాలకు సంబంధించి పుస్తకాలు లేకపోవడంతో విచారణ ముందు సాగనట్లు తెలిసింది. 30శాతం విచారణ పూర్తయిందని, మిగిలింది త్వరలోనే సిబ్బందితో కలిసి కొనసాగిస్తామని ఏపీ ప్రసాద్ తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛభారత్

కదిరిఅర్బన్ : స్థానిక ఎస్‌టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ ఏక్తా కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించి, మొక్కలు నాటారు. లాబొరేటరీలు, తరగతి గదులు శుభ్రం చేశారు. కళాశాల ఆడిటోరియం చుట్టూ చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజ్‌మహమ్మద్, ప్రిన్సిపాల్ శ్రీనివాసులనాయుడు, అధ్యాపకులు శ్రీదేవీ, మోహన్‌బాబు, శ్రీనివాసులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఊరిస్తున్న మేఘం - చింతిస్తున్న రైతు



ఊరిస్తున్న మేఘాలు



ఎండిపోతున్న వేరుశనగ పంట

నల్లచెరువు : ప్రతి సంవత్సరం వ్యవసాయ జూదంలో ఓడిపోతున్న రైతుకు ఈయేడు తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ప్రయత్నించాడు. వ్యవసాయం తప్ప మరో పని చేతకాని రైతన్న అప్పులు చేసి విత్తనం వేశాడు. అయితే ప్రారంభంలో కురిసిన వర్షాలు మళ్లీ రాకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. మేఘాలు ఊరిస్తూ తమతో దోబుచులాడుతున్నాయని చింతిస్తూ బతుకుదెరువు కోసం వలస బాట పడుతున్నారు. మండల వ్యాప్తంగా ఆరు వేల ఎకరాల్లో వేరుశనగ పంట, రెండు వేల ఎకరాల్లో ఆముదం, మినుము, కందిపంటలు సాగు చేశారు. అయితే కొన్ని ప్రాంతాల్లో మొలకెత్తాయి, మరి కొన్ని ప్రాంతాల్లో భూమిలోనే మొలకలు ఉన్నాయి.

నీలిమేఘాలు ఊరించడం చూసి గంపెడు ఆశలు పెట్టుకున్న రైతులకు ఆఖరికి నిరాశ మిగిలింది. పశువులకు గ్రాసం లేక కబేళాలకు తరలిస్తున్నారు. దీంతో కొందరు వలస బాటకు సిద్ధమవుతుండగా... మరి కొందరు ఉన్న ఊరును వదిలి వెళ్లలేక ఎలా బతకాలని మదనపడు తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా రైతుల తల రాతలు మారలేదని వివిధ గ్రామాలకు చెందిన రైతులు వెంకటరమణ, మహబూబ్‌బాష, లక్ష్మీపతి, చలపతి, రామక్రిష్ణ, నారాయణప్ప, లక్ష్మన్న, అంజనే యులు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కురవక ఒక వైపు వేసిన పంటలు ఎండిపోతుండగా.. మరో వైపు సాగు చేయడానికి సిద్ధం అవుతున్న రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని, పంటల కోసం చేసిన అప్పులు తీర్చేదెలా అని రైతులు దిగులు చెందుతున్నారు. మండలంలోని కే పూలకుంట, సుబ్బరాయునిపల్లి, ఉబిచెర్ల, నీలంవాండ్లపల్లి, తెల్లగుట్లపల్లి, ఓరువాయి, జోగన్నపేట, పెద్దయల్లంపల్లి, దేవిరెడ్డిపల్లి, నల్లచెరువు తదితర గ్రామాల రైతులు వర్షాధారం కింద విస్తారంగా వేరుశనగ పంటలు సాగు చేశారు. పంట సాగు చేసి 50 రోజులు అవుతున్నా.. వరుణుడు కరుణించక పోవడంతో రైతులు కన్నీళ్ల పర్యంతమవుతున్నారు. ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరెకరాల్లో పంట ఎండుతోంది



ఖరీఫ్ ప్రారంభంలో వర్షం రావడంతో నాకున్న ఆరెకరాల్లో వేరుశనగ సాగుచేశా. అప్పటి నుంచి చినుకుజాడలేక పోవడంతో పంట ఎండుమొహం పట్టింది. సాగు పెట్టుబడులకు ఎకరాకు రూ. 20 వేలు ఖర్చు అయింది. చినుకుజాడ కనిపించక పోడంతో చేసిన అప్పులు తీర్చలేక పోతున్నాము.

-మాధవరెడ్డి, రైతు, ఉప్పార్లపల్లి

వారం రోజుల్లో వర్షం రాకపోతే.. అంతే..



నాకున్న నాలుగు ఎకరాల్లో ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేశాను, పంట సాగు చేసిన రోజు నుంచి నేటి వరకు వర్షం జాడ లేక పోవడంతో సాగుచేసిన పంట కాస్తా ఎండి పోతోంది. వారం రోజుల్లో వర్షం రాకపోతే.. పంట సాగుకోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలా అని ఆందోళన చెందుతున్నాము.

- రామక్రిష్ణ, రైతు, తెల్లగుట్లపల్లి

లోకల్ గైడ్

localguide

కదిరి మార్కెట్‌లో కూరగాయల ధరలు



వంకాయ కిలో రూ.35, టమోటా 50, బెండ 40, బీరకాయ 30, కాకరకాయ 50, క్యారెట్ 80, బీట్‌రూట్ 40, బీన్స్ 60, ముల్లంగి 40, పచ్చిమిర్చి 40, ఉర్లగడ్డ 22, కోసుగడ్డ 25, మునగ 60, కాప్సికమ్ 60

కదిరి సినిమాలు

సంగం - గౌతమ్‌నంద, **రాధిక** - నక్షత్రం
,**వేమల** - ఫిదా , **మౌనిక -** డీజే దువ్వాడ జగన్నాథం

ఎమ్మెల్యే డైరీ

కదిరిటౌన్ : స్థానిక ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాష ఆదివారం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారు.

అర్హులందరికి పక్కా భవనాలు : ఎంపీడీఓ

నంబులపూలకుంట : దారిద్ర్య రేఖకు దిగువన ఉండి అర్హులైన నిరుపేద కుటుంబాలకు పక్కా భవనాలు మంజూరు చేస్తామని ఎంపీడీఓ యోగానందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పీ కొత్తపల్లి, తూర్పు నడింపల్లి, గౌకనపల్లిల్లో శనివారం పక్కా గృహాల లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు మహేశ్వరమ్మ, సర్పంచు శ్రీరాములనాయుడు, ఎంపీటీసీ సభ్యులు పౌల్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీరామరాజు, ఎంఈఓ గోపాల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండలంలోని కదిరిపూలకుంట, జోగన్నపేట గ్రామాల్లో శనివారం సర్పంచుల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మక్బుల్‌బాషా గృహ లబ్ధిదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జశ్వంత్‌కుమార్, వీఆర్ఓ నారాయణరెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు తిరుపాల్, కానుగల ఆదెప్ప, అబ్దుల్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి'

నల్లచెరువు : గృహ నిర్మాణ లబ్ధిదారులు గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ దాదెంశివారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గూడులేని ప్రతి వ్యక్తికి ఇల్లు నిర్మించాలని దృఢ సంకల్పంతో గ్రామ సభలు ఏర్పాటు చేసిందన్నారు. అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తారన్నారు.

జీఎస్‌టీపై వ్యాపారులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న జీఎస్‌టీ జాయింట్ కమిషనర్ కల్పన

కదిరిటౌన్ : పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం పట్టణానికి చెందిన వ్యాపారులకు జీఎస్‌టీపై ఆంధ్రప్రదేశ్ స్టేట్ ట్యాక్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు స్టేట్ కమిటీ మెంబర్ సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా కదిరి ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, జీఎస్‌టీ జాయింట్ కమీషనర్ కల్పన హాజరయ్యారు. జీఎస్‌టీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గుడిసె దేవానంద్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ట్యాక్స్ అసోషియేషన్ అధ్యక్షుడు క్రిష్ణమోహన్, స్టేట్ సెక్రటరీ సీతాపతిరావు, జిల్లా కమిటీ అధ్యక్షుడు చెన్నూరావు, ఆడిటర్లు కరుణాకర్, జయచంద్ర, కే లక్ష్మయ్య, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన జీఎస్‌టీ అసోషియేషన్

జీఎస్‌టీపై అవగాహన సమావేశానికి హాజరైన జీఎస్‌టీ అసోషియేషన్ సభ్యులు కదిరి ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషాను శనివారం సన్మానించారు. దుశ్శాలువలు, పూల మాలలతో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

సిమెంట్ రోడ్ల నిర్మాణం, వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా

కదిరిటౌన్ (గాండ్లపెంట) : రాష్ట్రం అభివృద్ధి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందని కదిరి ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాష పేర్కొన్నారు. శనివారం గాండ్లపెంట మండలంలోని సోమాలగొంది పంచాయతీ బయారెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రం విభజన సమయంలో ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. రాష్ట్ర ప్రజల కోసం ఎన్నో ప్రభుత్వ పథకాలు ప్రవేశపెట్టి, కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేశారన్నారు. అనంతరం బయారెడ్డిపల్లిలో సీఆర్ఎఫ్ కింద రూ. 4 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. హరిజనవాడలో రూ. 3.40 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గుడిసే దేవానంద్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అరవింద్‌బాబు, సర్పంచు రమణమ్మ, టీడీపీ మండల నాయకులు హైదర్‌వలి, మాజీ ఎంపీటీసీ ఫయాజ్ అలీ, అత్తార్ అల్లాబకష్, ఫారుక్, చలపతి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఇంటి పెద్దకొడుకులా ఆదుకుంటున్న సీఎం

కదిరిటౌన్ : రాష్ట్రంలో ఏ కుటుంబానికి కష్టం వచ్చినా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అండగా ఉంటూ పెద్దకొడుకులా ఆదుకుంటున్నారని కదిరి ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా పేర్కొన్నారు. స్థానిక మేదరవీధికి చెందిన దస్తగిరిఖాన్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేయించిన రూ. 94,858 చెక్కును శనివారం టీడీపీ కార్యాలయంలో బాధితుడికి అందజేశారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షిద్దాం

కదిరిఅర్బన్ : నాటిన ప్రతిమొక్క వృక్షంలా ఎదిగేలా సంరక్షించి పర్యావరణాన్ని కాపాడుదామని కదిరి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ డీవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. వనం - మనం కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ పై విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ మాట్లాడుతూ విద్యార్థులు తమ పుట్టిన రోజున ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ సాంబశివారెడ్డి, ఎఫ్ఎస్ఓలు లక్ష్మప్ప, బడ్డెప్ప, బీట్ ఆఫీసర్లు భాస్కర్, హరిప్రసాద్, రామాంజులరెడ్డి, తిమ్మారెడ్డి, రామచంద్రారెడ్డి, పాఠశాల హెచ్ఎం శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కదిరి పట్టణ సీఐ శ్రీనివాసులు బదిలీ

కదిరి : పట్టణ సీఐ శ్రీనివాసులు పెనుకొండకు బదిలీ అయ్యారు. ఆయన 2015 సంవత్సరంలో కదిరికి సీఐగా వచ్చా రు. ప్రస్తుతం రూరల్ సీఐ శ్రీధర్‌ను ఇన్ చార్జ్‌గా నియమించినట్లు పోలీసు వర్గాలు చర్చించుకుంటున్నారు.

ఏపీఓ హారున్‌రషీద్...

తలుపుల : మండల ఉపాధి హామీ పథకం ఏపీఓ హారున్‌రషీద్ గాండ్లపెంట మం డలానికి బదిలీ అయ్యారు. సీనియర్ టీఏ మోహన్ ఇన్‌చార్జ్‌గా ఏపీఓగా నియమించారు.

'మత్తుతో జీవితాలు చిత్తు'

కదిరిఅర్బన్ : మత్తుపదార్థాలు సేవించడం వల్ల అనారోగ్యాల పాలై జీవితాలు అంధకారమవుతాయని ఐక్వాడ్స్ శారదాంబ కళాకారుల సంఘం అధ్యక్షుడు గాలివీడు బాలరాజు పేర్కొన్నారు. శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని 14 వ వార్డులో మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే అనర్థాల పై స్థానికులకు కళాకారులచే అవగాహన కల్పించారు. సంఘం ఆధ్వర్యంలో రోజుకు ఒక వార్డు చొప్పున పట్టణంలోని అన్ని వార్డులలో కళాకారులచే అవగాహన కార్యక్రమం చేపట్టి ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో నాగయ్య, శివగంగాధర్, శ్రీనివాసులు, నాగసుబ్బయ్య, బాలయ్య, షుకూర్, తదితరులు పాల్గొన్నారు.

పక్కా గృహాల కోసం గ్రామ సభలు

తలుపుల : మండలంలోని ఓదులపల్లి, పెద్దన్నవారిపల్లి, ఓబుళరెడ్డిపల్లి గ్రామ సచివాలయాల్లో శనివారం పీఎంఏవై పథకం క్రింద లబ్ధిదారుల ఎంపికకు గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలు సర్పంచులు వెంకటరమణ, పూల వేణుగోపాల్‌రెడ్డి, జయరామ్ అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ గ్రామ సభలలో ఎంపీడీఓ కే పోలప్ప, తహసీల్దార్ శివయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి, హౌసింగ్ ఏఈ కులచంద్రారెడ్డి, ఎంఈఓ వెంకటరాముడు, రామక్రిష్ణ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ శనివార శోభ

నంబులపూలకుంట : మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాలు శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకారాలతో శోభిల్లాయి. ఉదయం నుం చే మహిళా భక్తులు ఆలయానికి ఆయా దేవతలకు ప్రత్యేక అభిషేకాలు, ఆకుపూజ, అర్చ నలు చేయించారు. మండల కేంద్రంలోని శివాలయం, కొత్తరోడ్డు, దనియానిచెరువు, పెడబల్లి, పీ కొత్తపల్లి, తూర్పు నడింపల్లి, వెలిచెలమల, తిమ్మమ్మ మర్రిమాను, మేకలచెరువు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు.

తలుపుల : మండలకేంద్రంలోని ఓబీఆర్‌రోడ్డు, కదిరిరోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసంలో రెండవ శనివారం సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓబీఆర్ రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ పూజారి గోపీశర్మ ఉదయం అభిషేకం, హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రామాలయంలో అఖండ రామభజన

నంబులపూలకుంట : మండల కేంద్రానికి సమీపంలోని ఎన్ రెడ్డివారిపల్లి వెలసిన రామాలయంలో శనివారం అఖండ రామభజన కార్యక్రమం చేపట్టారు. ఉదయం ప్రారంభమైన భజన ఆదివారం ఉదయం వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని గ్రామస్తులు తెలిపారు. రామనామ స్మరణలతో భజన కార్యక్రమాలు నిర్వహించారు. అఖండ రామభజన నిర్వహిస్తే వర్షాలు కురుస్తాయని, అలాగే ప్రతి ఏటా వరుణదేవునికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మండలం నుంచి అనేక భజన బృందాలు అఖండ రామభజనలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రత్యేక పూలతో అలంకరించారు. భక్తులకు ఉచితంగా అన్నదానం చేపట్టారు.

ఖాళీ బిందెలతో అధికారులను అడ్డుకున్న ఓదులపల్లి గ్రామస్తులు

తలుపుల : మండలంలోని ఓదులపల్లిలో తాగునీరు కోసం గ్రామస్తులు ఎంపీడీఓ కే పోలప్పను ఖాళీబిందెలతో అడ్డుకున్నారు. శనివారం పక్కా గృహాల గ్రామ సభ కోసం ఎంపీడీఓ ఓదులపల్లికి వెళ్లగా అక్కడ మహిళలు, గ్రామస్తులు ముందుగా తమకు తాగునీరు సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో అధికారులను అడ్డుకున్నారు. రెండు నెలల నుంచి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. వ్యవసాయ బోరు బావుల నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నామన్నారు. స్పందించిన ఎంపీడీఓ ఆదివారం నుంచి ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తారని హామీనివ్వడంతో అడ్డుతొలిగారు.

కబ్జా స్థలంలో బంకుల తొలగింపు

కదిరిటౌన్ : పట్టణంలోని ఇండేన్ గ్యాస్ కార్యాలయం సమీపంలో కబ్జాకు గురైన స్థలంలో కొందరు బంకులను వేశారు. మరికొందరు తోపుడు బండ్లు పైన దుకాణాలు ఏర్పాటు చేశారు. వాటిని తొలగించాలని నిజాంవలి కాలనీ వాసులు తహసీల్దార్ పీవీ రమణకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్, ఎస్ఐ రాజేష్ కబ్జా స్థలంలో ఏర్పాటు చేసిన బంకులను, తోపుడు బండ్లను వ్యాన్‌లో తరలించారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించినా, ఆ స్థలాల్లో బంకులు కానీ, దుకాణాలు కానీ ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓలు చంద్రశేఖర్, మనూల్లాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు

కదిరిటౌన్ : మున్సిపాల్టీ పరిధిలోని కోటన్నగారిపల్లిలో శనివారం గ్రామీణ కృషి అనుభవ పథకం కింద తిరుపతి వ్యవసాయ కళాశాలకు చెందిన 20 మంది విద్యార్థులు, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్‌కుమార్, రామసుబ్బయ్య పరిశీలించారు. కంది, చిరుధాన్యాలు, టమోటా, వరి పంట పొలాలను వారు సందర్శించారు. వాటి సాగుపై వ్యవసాయ విద్యార్థులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. విద్యార్థులకు కేటాయించిన పట్నం, కాళసముద్రం గ్రామాల్లో కూడా రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్రీహరినాయక్, ఎంపీఈఓలు, తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

పాలపాటిదిన్నెకు పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి


దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

నల్లచెరువు : శ్రావణమాస రెండో శనివారం పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలు, తులసీ మాలలతో అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నల్లచెరువు, తనకల్లు, కదిరి మండలాల నుంచే కాకుండా కడప, చిత్తూరు జిల్లాలు, కర్ణాటక రాష్ట్రం నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తోపులాట జరుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా మొలకలచెరువుకు చెందిన ఎంఎస్ ఆర్ శేషారెడ్డి అనే భక్తుడు తన తండ్రి జ్ఞాపకార్థం భక్తులకు అన్నదాన కార్యక్రమం

ఆంజనేయ స్వామికి విశేషపూజలు

ఏర్పాటు చేశారు. కదిరి ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దేవానంద్ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎమ్మెల్యే రూ. 5 లక్షలు కేటాయించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషాకు ఆలయ అర్చకులు స్వామి వారి వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేయగా, కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. భక్తులు సాయంత్రం ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. భజన బృందం భజనలు చేసింది. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా నల్లచెరువు, తనకల్లు ఎస్ఐలు ప్రసాద్‌బాబు, శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పడుచూరి నగేష్, రామ్‌నాథ్, గౌరవాధ్యక్షుడు వనం గంగిరెడ్డి, వై రామాంజనేయులు, బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.


పల్లకిలో ఊరేగుతున్న ఆంజనేయస్వామి

మూడు నెలల క్రితం మాటలు ఏమయ్యాయి?

- రాజకీయం కోసం మతకల్లోలాలు సృష్టిస్తావు
- జగన్‌పై కందికుంట ఆగ్రహం

కదిరి : మూడు నెలల క్రితం జగన్ బహిరంగ సభలు పెట్టి ప్రత్యేక హోదా ఇవ్వక పోతే తమ పార్టీ ఎంపీలతో రాజీనామా చేయిస్తానని చెప్పి.. ఇప్పుడు ఆ మాట ఏమైందని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తెలుగుదేశం పార్టీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కందికుంట మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై ఆయన చేసిన వ్యాఖ్యలపై కందికుంట తీవ్రంగా మండిపడ్డారు. ప్రత్యేక హోదా సాధించే వరకు పోరాడుతామని... ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ మెడలు వంచుతామంటూ ప్రత్యేక హోదా కోసం బహిరంగ సభలు పెట్టిన వైఎస్ జగన్ ప్రత్యేక హోదా ఇవ్వక పోతే తన ఎంపీలతో రాజీనామా చేయిస్తానని పదే పదే చెప్పారన్నారు. ఇప్పుడు ఆ ప్రత్యేక హోదా ఏమైందని ప్రశ్నించారు. ఆయన ముస్లింల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. జిల్లాలో ఎన్నికల ముందు రెండు ఎంపీ స్థానాలు బీసీ అభ్యర్థులకే కేటాయిస్తామని చెప్పి మోసం చేశావన్నారు. స్వార్థ రాజకీయాల కోసం జగన్ కుల, మత ఘర్షణలు సృష్టిస్తారని, దీనిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. దీనికి నంద్యాల ప్రజలు తగిన గుణపాఠం చెప్పి, నీకు బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీకుంట ఎంపీటీసీ సభ్యుడు పోలిరెడ్డి, మాజీ ఎంపీపీ చక్రవర్తన్‌రెడ్డి, టీడీపీ నాయకులు అశ్వత్థనాయుడు, దాదెం శివారెడ్డి తదితరులు ఉన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట

అర్హులు పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోవాలి

కదిరి : అర్హులందరికీ పక్కా గృహాలు అందిస్తామని, అర్హత గల అభ్యర్థులు సంబంధిత గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన నివాస గృహంలో విలేకరుల సమావేశంలో హౌసింగ్ ఫర్ ఆల్ పథకం కింద తెలుగుదేశం ప్రభుత్వం అందరికి పక్కా గృహాలు మంజూరు చేస్తోందన్నారు. గతంలో మండలానికి, నియోజకవర్గానికి పరిమితంగా ఇళ్లు మంజూరు చేసేవారని, ఇప్పుడు అర్హులందరికి మంజూరు చేస్తోందన్నారు. ఇల్లు కావాలిసిన వారు గ్రామ సభల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పట్టణంలో అర్బన్ హౌసింగ్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. వర్షాలు రాక భూగర్భ జలాలు అడుగంటి పట్టణంలో తాగునీరు సరఫరా లో అంతరాయం ఏర్పడుతోందన్నారు. రెండు రోజుల్లో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్లు కౌన్సిలర్లతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

'చంద్రబాబును విమర్శించే అర్హత జగన్‌కు లేదు'

నల్లచెరువు : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును విమర్శించే అర్హత వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేదని ఎంపీపీ తాటిచెర్ల మాబూసాబ్, టీడీపీ మండల కన్వీనర్ దాదెంశివారెడ్డి, పేర్కొన్నారు. శనివారం నల్లచెరువు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నంద్యాల సభలో వైఎస్ జగన్ అధికార పార్టీ నేతలను నడిరోడ్డుపై చంపాలంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. జగన్ మాటతీరును ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిపై మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు ఎద్దుల అంజనప్ప, జక్కా లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు : ఎస్ఐ

మడకశిర రూరల్: మండలంలో బెల్టుషాపులు, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలుతీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ లింగన్న తెలిపారు. శనివారం మండల వ్యాప్తంగా పోలీసులు బెల్టుషాపులు, మట్కాపై మెరుపుదాడులు చేశారు. గౌరీపురం మల్లయ్య కర్నాటక మాల్డ్ విస్కి, మద్యం పాకెట్లు అమ్ముతుండడంతో అతనిని అదుపులో కి తీసుకుని అరెస్ట్‌చేశారు.

రేపు రక్షాబంధన్

మడకశిర అర్బన్: పట్టణంలోని హిందూపురం రోడ్డులోని సరస్వతీ విద్యా మందిరం ఉన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం 5.30 గంటలకు ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సరస్వతీ విద్యామందిరం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖులు సర్వే శ్వరన్ హాజరవుతున్నట్లు తెలిపారు.

చంద్రన్న బీమా పేదలకు వరం : ఎంపీపీ



చెక్కును పంపిణీ చేస్తున్న ఎంపీపీ

మడకశిర టౌన్: పేదల అభ్యున్నతి కోసం ముఖ్య మం త్రి చంద్రబాబునా యుడు అనేక సంక్షేమ కార్యక్ర మాలు చేపట్టారని, చంద్రన్నబీమా పథకం పేదలకు వరమని ఎంపీపీ బొజ్జప్ప అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాల యంలో ఏడు కుటుం బాలకు చంద్రన్నబీమా యోజన పథకం కింద మంజూరైన రూ.6.31 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. సహజమరణం చెందిన వారికి రూ. 6.31 లక్షలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆదినారాయణ, సర్పంచు రాధమ్మ ఆంజనేయులు, ఏపీఎం గోవిందప్ప పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి బదిలీ ఆపాలని గ్రామస్థుల వినతి

అమరాపురం: మండల పరిధిలోని కరిదాసనహట్టి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మహేష్ బదిలీని వెంటనే ఆపాలని గ్రామ ప్రజలు కోరుతూ శనివారం ఎంఈఓ సత్యనారాయ ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు మల్లికార్జున, రత్నమ్మ, నాగమ్మ, శివన్న, జగన్నాథ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పావగడకు గాయిత్రీ పాదయాత్ర బృందం

మడకశిర టౌన్: మడకశిర పట్టణంలో గాయిత్రీ పాదయాత్ర బృందం ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి యేడాది మొదటి శ్రావణ శనివారం మడకశిర నుంచి కర్ణాటక రాష్ట్రం పావగడ వరకు పాదయాత్ర వెళ్తున్నారు. బృందం వారు ప్రతి యేడాది కొంత మొత్తాన్ని విరాళంగా ఆలయంతో పాటు పలు కార్య క్రమాలకు ఉపయోగిస్తున్నారు. శనివారం ఉదయం కూడా మడకశిర నుంచి పావగడ వరకు పాదయాత్ర నిర్వహించారు. బృందం సభ్యులు మనోహర్, సీపీ కదిరి నారాయణ, రవికుమార్, మారుతీప్రసాద్, ఓబన్న, రంగనాథ్, తదితరులు ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

మడకశిర అర్బన్: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ కేఎం లింగన్న పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పావగడ రోడ్డులో వాహనా తనిఖీ చేశారు. మండల పరిధిలోని కదిరేపల్లి రోడ్డు అధిక లోడుతో వెళ్తున్న రెండు ఆటోలను సీజ్‌చేసి హిందూపురం ఆర్టీఓకు పంపినట్లు తెలిపారు. ఆటో డ్రైవర్లు, వాహనదారులు అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఘనంగా శ్రావణమాస పూజలు





అలంకరణలో మిట్టబండ ఆంజనేయస్వామి,, రొళ్లలో రంగనాథస్వామిని ఊరేగిస్తున్న భక్తజనం

మడకశిర: మడకశిర పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలో కావలికొండపై వెలసిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాస పూజలు ఘనంగా నిర్వహించారు. రెండవ శ్రావణ శనివారం సందర్భంగా భక్తులు స్వామి వారికి ఆకుపూజా, అభిషేకం, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు మడకశిర చుట్టు పక్కల గ్రామాల నుంచే కాక కర్ణాటకలోని బెం గు ళూరు, తుమకూరు వంటి ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు చేయించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

రొళ్ల: మండలంలో శనివారం ఘనంగా శ్రావణమాస పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని శని మహా త్ముని దేవాల యం, లక్ష్మీనరసింహస్వామి, కాలువేపల్లి రంగనాథ స్వామి, పిల్లి గుండ్లు భగవంతునిగుడిలో ఘనంగా పూజ లు నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అంద జేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మడకశిర టౌన్: శ్రావణమాసం పురస్కరించుకుని మొదటి శ్రావణశనివారం కావడంతో పట్టణంలోని అన్నిదేవాలయాల్లో శ్రావణమాస పూజలు కన్నుల పండువగా నిర్వహించారు. పట్టణ సమీపంలోని మిట్టబండ ఆంజనే యస్వామి, అభయాంజ నేయస్వామి చంద్రమౌళేశ్వర స్వామి, షిర్డిసాయినాథుడు, వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది మంది భకు ్తలు భక్తిశ్రద్ధలతో పూజాకార్యక్రమాలు నిర్వహించారు.

అమరాపురం: మండల కేంద్రంలోని స్థానిక బస్టాండు సమీపంలోని శనీశ్వరస్వామికి శ్రావణమాసం రెండవ శనివారాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజాకార్యక్ర మాలు నిర్వహించారు. ఉదయం 8 గంటలకు ఆలయంలో స్వామి వారికి అభిషేకం, తైలాభిషేకం, నవగ్రహపూజా వంటి పూజాకార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని బసవనపల్లి, ఆలదపల్లి, వలస, దేవగానపల్లి, హేమావతి, కే.శివరం తదితర గ్రామాలలలో స్వామి వారికి విశేష పూజ లునిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అగళి: మండలంలోని ఆలూడి, కోడిపల్లి, అగళి, హుళ్లీకెర, దేవరహళ్లి గ్రామాలలో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయాల్లో శ్రావణమాసం సందర్భంగా శనివారంప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో స్వామి వారికి ఆకుపూజలు చేయించారు. స్వామివారికి అభిషేకాలు, పంచామృతాభిషేకాలు వివిధ పూజలు చేశారు. మండల వ్యాప్తంగా ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించి మొ క్కుబడులు తీర్చుకున్నారు.వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పావగడ: చరిత్ర ప్రసిద్ధిగాంచిన పావగడ శనిమహాత్ముని ఆలయంలో రెండవ శ్రావణశనివారం శ్రావణమాస పూజా మహోత్సవాలు వైభ వంగా జరిగాయి. ఉదయం 5 గంటల నుంచే స్వామి వారికి ఎంతో ఇష్టమైన నవగ్రహ పూజలు చేయించి తైలాభిషేకంతో స్వామి వారిని శనిమహాత్మా తమ జోలికి రావద్దంటూ కొలిచారు.

అనంతరం 8 గంటల నుంచి దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దాదాపు కిలోమీటర్ దూరం వరకు స్వామి వారి దర్శనం కోసం క్యూకట్టారు. భక్తు ల తాకిడికి ఆలయ ప్రాంగణం ఎన్నడూలేని విధంగా కిట కిటలాడింది.50వేలకు పైగా ఈ శనివారం స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, డైరెక్టర్ శ్రీరామగుప్తలు తెలిపారు. అయితే భక్తులకు స్నానపు గదులు లేక కొంత ఇబ్బంది పడాల్సి వచ్చింది.

వర్షం కోసం కంబాల నరసింహస్వామికి జ్యోతులు



వెండిరథంపై ఊరేగుతున్న కంబాల నరసింహస్వామి

మడకశిర రూరల్: వర్షాలుబాగా కురిసి పంటలు బాగా పండాలని మండల పరిధిలోని జిల్లడగుంట గ్రామానికి చెందిన గ్రామస్థులు కంబాలనరసింహస్వామికి శనివారం జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లడ గుంట ఆంజనేయస్వామి గ్రూపుదేవాలయాల చైర్మన్ రామచంద్రగౌడుల ఆధ్వర్యంలో జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. దేవాదాయశాఖ ఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

తులసీదామ వృద్ధాశ్రమంలో అఖండ భజన: వర్షం కురిసి పంటలు బాగా పండాలనే ఉద్దేశంతో తులసీదామ వృద్ధాశ్రమంలో గంగాధరేంద్రస్వామీజీ ఆధ్వర్యంలో అఖండ శ్రీరామ కీర్తన భజనలు నిర్వహించారు. వారం రోజుల పాటు ఈ భజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తులసీదామ వృద్ధాశ్రమ కార్యదర్శి తిమ్మప్ప ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా సామూహిక సీమంతాలు



సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది

రొళ్ల: మండలంలోని కొత్తపల్లిలో శనివారం ఘనంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా రంగనపల్లి,రత్నగిరి గొల్లహట్టి, రంగాపురం, బాజయ్యపాళ్యం, అప్పేపల్లి, రత్నగిరి-1,2,3 అంగన్‌వాడీ కేంద్రాలలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈకా ర్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వన జాక్షి, భారతి, రత్న కుమారి, లక్ష్మీదేవి, రత్నమ్మ, సిద్ధగంగమ్మ, రమాదేవి, రాజ మ్మ, శివలింగమ్మ, ఎంపీటీసీ గిరిజమ్మ, హెల్త్‌అసిస్టెంట్ రామ చంద్ర, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మడకశిర రూరల్: గర్భవతులు,బాలింతలు తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీ ఓ ఇందిరాదేవి, సర్పంచు సావిత్రమ్మ, ఎంపీటీసీ రామప్పలు తెలిపారు. శనివారం గుర్రపుకొండ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పుట్టబోయే పిల్లల కూడా ఆరోగ్యంగా ఉండడంతో పాటు వారిలో రోగనిరోదకశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సునితమ్మ, శ్రీదేవి, అంజమ్మ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలకు తాళాలు వేసి నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఉపాధ్యాయుల కొరతను తీర్చండి

రొళ్ల: మండలంలోని అలుపనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను పరిష్కరిం చాలని డిమాండ్ చేస్తూ శనివారం విద్యార్థుల తల్లిదం డ్రులు పాఠశాలకు తాళం వేసి నిరసన తెలిపారు. పాఠశాలలో 6 నుంచి 10వ తర గతి వరకు దాదాపు 260 మంది విద్యార్థులు విద్యన భ్యసి స్తున్నా రు. ప్రస్తుతం తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఫిజికల్‌సైన్స్, సోషియల్ సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. దీంతో ఉపాధ్యాయుల కొరత నెలకొంది. అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించి తమ పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేయాలని డిమాండు చేశారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

అమరాపురం: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని అప్పుడే పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు తాగిం చాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల, ప్రధానో పాధ్యాయురాలు గాయిత్రిలు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పుల్లీకుంట గ్రామంలో జరిగిన తల్లిపాల వారోత్సవాలలో వారు పాల్గొని మాట్లాడారు.

సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు: ఏడీ



తేమశాతాన్ని పరిశీలిస్తున్న ఏడీ మల్లికార్జున

అగళి: మండలంలోని రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు అందించనున్నట్లు ఏడీ మల్లికార్జున శనివారం తెలిపారు. మండలంలోని ఎంఎంపాళ్యం గ్రామంలో వేరుశనగ పంట పొలాలను పరిశీలించారు. తేమశాతాన్ని తేమసూచిక యంత్రం తో పరిశీలించారు. ఏడీ మాట్లాడు తూ మడకలు, గొర్రులు, గుంటకలు, కలుపుతొలగించే యంత్రాలు తదితర వాటిని సబ్సిడీతో అందించనున్నట్లు తెలిపారు మండలానికి 8 ట్రాక్టర్లు మంజూరైనట్లు ఏడీ మల్లికార్జున తెలిపారు. పెద్ద ట్రాక్టర్లకు రూ.2 లక్షల సబ్సిడీ ఉంటుందని, మిగతా మొత్తాన్ని రైతు చెల్లించాల్సి ఉంటుం దన్నారు. ప్రత్యామ్నాయ పంటలైన రాగి,జొన్న, సజ్జ, ఉలవ, పెస ర వంటి పంటలను సాగుచేసుకోవా లన్నారు. వేరుశనగ సాగుచేసి క్రాప్‌బుక్కింగ్ చేయించిన రైతులకు ఉచితంగా జిప్సం, బోరాన్, జింక్ అందజేయ నున్నట్లు తెలిపారు. ఏడీ వెంట ఏఓ బాలానాయక్, ఏఈఓ అంబరీష్‌రెడ్డి, ఎంపీఈఓలు మోహన్, హరీష్‌రెడ్డి, రఘు, ప్రశాంత్, రైతులు రమేష్, కిష్టప్ప, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వాహనాల తనిఖీ

అగళి: మండల కేంద్రంలోని విజ్ఞానభారతి, కేజీఏ గుప్త పాఠశాలల్లోని వాహనాల కండీషన్‌ను ఎస్ఐ రాంబాబు శనివారం పరిశీలించారు. వాహనాల రికార్డులను, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రికార్డులను పరిశీలించారు. వాహనాల నిర్వహణపై సంబంధిత యాజమాన్యాలకు పలు సూచనలిచ్చారు. పాఠశాల విద్యార్థులను జాగ్రత్తగా తీసుకువెళ్లి తీసుకురావాలన్నారు. వాహనాలు కండీషన్ లేకపోతే వాటిని సీజ్ చేయనున్నట్లు తెలి పారు. ఎస్ఐ వెంట సిబ్బంది ఉన్నారు.

మైక్రో ఇరిగేసన్ టెక్నీషియన్లకు సర్టిఫికెట్ల అందజేత

అనంతపురం కలెక్టరేట్ : మైక్రో ఇరిగేషన్ టెక్నీషియన్లకు ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వర్లు సర్టిఫికెట్లను అందించారు. ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో 30 మంది అభ్యర్థులకు నెల రోజుల పాటు డ్రిప్ నిర్వహణపై శిక్షణనిచ్చారు. ఐదు రోజుల శిక్షణా తరగతులు, 25 రోజులు క్షేత్ర స్థాయిలో అవగాహణ కల్పించారు.

వర్షం కోసం సీతారాముల చిత్రపటం ఊరేగింపు

రొద్దం : తురకలాపట్నం గ్రామంలో వర్షం కోసం శనివారం సీతారాముల చిత్రపటం ఊరేగింపు నిర్వహించారు. చిత్రపటాన్ని భజనలతో గ్రామంలో ఊరే గింపు నిర్వహించి అనంతరం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రి కంటి వైద్యులు శ్రీనివాసులుయాదవ్, విరాటపర్వం చదివి వినిపించారు. కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాళ్ల దాడిపై కాంగ్రెస్‌పార్టీ ఖండన

గోరంట్ల రూరల్ : కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్‌గాంధీ కాన్వాయిపై రాళ్లదాడి సంఘటనపై గోరంట్ల కాంగ్రెస్ నాయకులు స్పందిస్తూ శనివారం ఖండిం చారు. గుజరాత్ పంచాయతీ ఎన్నికల్లో ఘోర పరాజయం పొందిన బీజేపీ మతిభ్రమించి రాళ్లదాడికి పాల్పడటం హేయమైన చర్యగా పేర్కొ న్నారు. పార్టీ నాయకులు నర్సిం హులు, హసేన్ ఖాన్, సుబ్బ న్న, రాజారెడ్డి, లక్ష్మీనారాయణ, నర్సిం హప్ప, రామ్మోహన్‌లు పేర్కొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనుకొండ రూరల్ : మండల పరిధిలోని పెద్దచెరువుకట్ట ఆంజనేయ స్వామి దేవాల యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. శ్రావణ మాసం శనివారం స్వామికి ప్రత్యేక పూజలు, ఆకుపూజ, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించు కున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కార్యదర్శులకు సిమ్‌కార్డులు

గోరంట్ల రూరల్ : మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఎయిర్‌టెల్ సిమ్‌కార్డులను డీపీఓ సుధాకర్‌రెడ్డి శనివారం పంపిణీ చేశారు. గోరంట్ల గ్రామ పంచాయతీ కార్యాల యంలో కార్యదర్శులు రామక్రిష్ణ, గౌసియా బాను, కేశవమూర్తిలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆజాద్, ఈఓఆర్డీ అంజినప్పలు హాజరయ్యారు. పంచాయతీ నిధులతో కార్యదర్శులకు ఆన్‌లైన్ ద్వారా కొత్త సెల్‌ఫోన్ పొందే వెసలుబాటు ప్రభుత్వం కల్పించిందని ఈఓఆర్డీ తెలిపారు. సిమ్ కార్డు విని యోగానికి ప్రతినెలా రూ.150 పంచాయతీ నిధుల నుంచి చెల్లిస్తుందన్నారు.

తాగునీటి సమస్యపై స్పందించిన కలెక్టర్

- పరిశీలనాధికారిగా డీపీఓ

గోరంట్ల రూరల్ : పట్టణంఓల మంచినీటి ఎద్దడి తీవ్రం కావడంతో పరిష్కారం కోసం జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రెడ్డి శనివారం గోరంట్లలో పరిశీలించారు. మంత్రుల పర్యటన కోసం వచ్చిన జిల్లా కలెక్టర్ వీర పాండ్యన్‌కు స్థానిక విలేకరులు గోరంట్లలో తాగునీటి పరిస్థితిని వివరించారు. 90రోజుల కోసారి కొళాయిలకు నీరు వదులుతున్న వైనంపై స్పందించిన కలెక్టర్ పరిశీలనకోసం వెంటనే డీపీఓను ఆదేశించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో డీపీఓ ఆధ్వ ర్యంలో జరిగిన సమావేశానికి సర్పంచ్ మంజుళ, ఉప సర్పంచ్ సుబ్బరా యుడు, డీఎల్ పీఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ ఆజాద్, ఈఓ ఆర్డీ అంజినప్ప, కార్య దర్శి రామక్రిష్ణ, పంచాయతీ కార్యదర్శులు హాజర య్యారు. 86రో జులకు బిల్లులు చేస్తూ అధికారులు రూ.14.90లక్షలు మం జూరు చేసినా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఓబు లేసు నిర్లక్ష్యం కారణంగా తమకు అందలేదని ఆరోపించారు. పెండింగ్ బిల్లులను వెంటనే అం దేలా చూస్తానని అవసరమైతే జిల్లా కలెక్టర్ ద్వారా అద నపు నిధులు గోరంట్లకు తీసుకొస్తామన్నారు.ఇందుకోసం అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలంటూ సభ్యుల సల హాలు అడిగి తెలుసుకున్నారు. తమ నివేదికను ఇదేరోజు సాయంత్రం కలెక్టర్‌కు అందజేయాల్సి ఉందని డీపీఓ తెలిపారు.

నత్తనడకన అభివృద్ధి పనులు

- రాయల ఉత్సవాలు వచ్చే యేడాదే..!



పెనుకొండ టౌన్ : పెనుకొం డ పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చేపడుతున్న లక్ష్మీనర్సింహస్వామి ముఖ ద్వారం, రాయలపార్కు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ప్రతియేటా ఆగస్టులో నిర్వహించే రాయల ఉత్సవాలకు అభివృద్ధి ఆటంకంగా మారింది. ఇటీవల పెనుకొండ ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీకే పార్థసారథిని ఉత్స వాల గురించి ప్రస్తావించగా అభివృద్ధి పనులు పూర్తయిన తరువాత వచ్చే యేడాది ఘనంగా రాయల ఉత్సవాలను నిర్వహిస్తామని చెప్పడం గమనార్హం. కొండ రోడ్డు, విద్యుత్, తదితర అభివృద్ధి పనులు పూర్తిచేసిన అనంతరం ఉత్స వాలు చేపడతామని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ యేడాది ఉత్స వాలు ప్రశ్నార్థకంగా మారాయి. గత యేడాది కాంగ్రెస్ నాయకులు భిక్షాటన చేసి ఉత్సవాలను జరిపించారు. అయితే ఈ సారి ఉత్స వాల నిర్వహణ గత యేడాది మాదిరిగానే కాంగ్రెస్ శ్రే ణులు ముందుకొచ్చి చేపడతారా లేదా అనే అంశంపై పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఏదైతేనేం ఈ యేడాది ఉత్సవాలు లేనట్లేనని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

మట్టి వినాయకులతో పర్యావరణ పరిరక్షణ



మట్టితో విగ్రహాలు తయారు చేస్తున్న విద్యార్థులు

రొద్దం : వినాయక చవితి సందర్భంగా ఉపయోగించే వినాయక విగ్రహాలు మట్టితో తయారు చేయడంవల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని కల్లుకుంట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కల్లుకుంట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మట్టితో విగ్రహాలు తయారు చేయడంపై విద్యార్థులు శిక్షణ ఇచ్చి తయారు చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణపతి, శివ లింగం, ఆట వస్తువులను మట్టితో తయారుచేశారు. విద్యార్థులకు మట్టి విగ్రహాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గిరీష్‌స్వామి, తేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు

రొద్దం : అంగనవాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల నుంచి వైఎస్ఆర్ సర్కిల్‌లో నినాదాలతో ర్యాలీ కొనసాగించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తల్లిపాల విశిష్టత, ఉపయోగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లమాడ : మండలంలోని దొన్నికోట సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపర్‌వైజర్ విష్ణువర్ధని హాజరై మాట్లాడారు. తల్లి పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాపాలన్నారు. తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు , ఆయాలు పాల్గొన్నారు.

కియా పనులు పరిశీలించిన ఏపీఐఐసీ చీఫ్ ఇంజనీర్



పనులను పర్యవేక్షిస్తున్న ఏపీఐఐసీ చీఫ్ ఇంజనీర్ చంచయ్య

పెనుకొండ రూరల్ : మండల పరిధిలోని అమ్మవారిపల్లి సమీపంలో కార్లపరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి జరుగుతున్న పనులను ఏపీఐఐసీ చీఫ్ ఇంజనీర్ చంచయ్య బుధవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఎల్‌అండ్‌టి సంస్థ ఆధ్వర్యంలో భూమి చదును పనులు చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. అనుకున్న సమయంకంటే ముందుగానే ఫేస్-1, ఫేస్-2 పనులు పూర్తవడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ హరినాథ్ తెలిపారు. ఆయన వెంట ఏపీఐఐసీ జెడ్ఎం రఘునాథ్‌రావు, ఎల్‌అండ్‌బి సైట్ ఇంజనీర్ సంగమేశ్, డిప్యూటీ జోనల్ మేనేజర్ హరినాథ్‌రావు ఉన్నారు.

అంగన్‌వాడీ ఆధ్వర్యంలో సామూహిక సీమంతం

రొద్దం : పి.రొప్పాల గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివా రం సామూహిక సీమంతాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బూదిపల్లి కాలనీ, పీ.రొప్పాల, పెద్దమంతూరు, పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన గర్భిణీలకు సీమంతాలు ఏర్పాటుచేశారు. మండలంలో పూలు, పళ్లు, పసుపుకుంకుమ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ ఎంలు ఓబుళమ్మ, జయమ్మ, ఆశ వర్కర్ జయలక్ష్మీ, తదిత రులు, గర్భిణీలు, మహిళలు పాల్గొన్నారు.



సీమంతం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

బెల్ట్‌షాపులు నిర్వహించం.. నిర్వహించనీయం



ప్రజలచేత ప్రమాణం చేయించిన ఎక్సైజ్ అధికారులు

పెనుకొండ : ప్రభుత్వం బెల్ట్‌షాపు నిర్వహణను రద్దు చేయించడంతో గ్రామాల్లో ఎక్కడా బెల్ట్‌షాపులు నిర్వహించమని ఎవరైనా నిర్వహిస్తే అడ్డుకుని అధికారులకు తెలియజేస్తామని గ్రామస్థులచేత ఎక్సైజ్ అధికారులు ప్రమాణం చేయించారు. శనివారం పెనుకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోన రొద్దం, సోమందేపల్లి, పెనుకొండ, కొత్తచెరువు మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఎక్సైజ్ సీఐ రేవతి, ఎస్ఐ శ్రీధర్, వారి సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. పెనుకొండ మండలంలోని అడదా కుల పల్లి, రొద్దం మండలం ఎల్‌జిబి నగర్, కోగిర, సోమందేపల్లి మండలం గుడిపల్లి, ఎస్.కొత్తపల్లి, కొత్తచెరువు మండలం అప్పుల వాండ్లపల్లి, బైరాపురం, ఎర్రంపల్లి, బండ్లపల్లి, క్రాస్‌లో గ్రామసభలు నిర్వహించి బెల్ట్ షాపులు నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలచేత ప్రమాణం చేయించారు.

ఫీల్డ్ ఆఫీసర్‌కు సన్మానం



ఫీల్డ్ ఆఫీసర్ మనోహర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

రొద్దం : పెద్ద మంతూరు ప్రగతి గ్రామీణబ్యాంక్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీకావడంతో శనివారం సన్మానించారు. ఆయనకు వీడుకోలు సమావేశం ఏర్పాటుచేసి పూలమాలలువేసి దుశ్శాలువలతో సత్కరించారు. ఈ సమావేశంలో ఫీల్డ్ ఆఫీసర్ మనోహర్ చేసిన సేవలను కొనియాడారు.

పాత పట్టాలున్నవారికే ఇళ్లు మంజూరు చేయండి

- గ్రామసభలో అధికారులతో సీపీఐ నాయకుల వాగ్వాదం

పెనుకొండ : పట్టణంలోని అర్బన్ కాలనీలో గత కాంగ్రెస్ ప్రభుత్వంలో 900మందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారని వాటిని రద్దుచేసి కొత్త వారికి పట్టాలు ఇవ్వాలని అధికారులు ప్రయత్నిస్తున్నారని పాత పట్టా ఉన్నవారికి మాత్రమే ఇళ్ల మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ సభలో పంచాయతీ అధికారులతో సీపీఐ నాయకులు వాగ్వాదానికి దిగారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో సీపీఐ నాయకులు శ్రీరాములు ఆధ్వర్యంలో పాత పట్టాలు పొందిన లబ్ధిదారులు సర్పంచ్ అశ్వర్థనారాయణ, ఎంపీడీఓ శివశంకరప్ప, ఈఓఆర్డీ సుమనాజయంతి, కార్యదర్శి అశ్వర్థప్పతో నాయకులు వాగ్వాదానికి దిగారు. 2010లో కాంగ్రెస్ ప్రభుత్వంలో 900 మంది నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేశారని కానీ ఇంతవరకు స్థలాలు చూపలేద న్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వాటిని రద్దుచేసి కొత్తవారికిపట్టాలు ఇవ్వాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇలా చేస్తే తీవ్ర ఆందోళనలు చేపడతా మన్నారు. గతం లో పట్టా పొందిన లబ్ధిదారులకే ఇంటి స్థలాలు చూపించి ఎన్టీఆర్ గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సర్పంచ్ సమాధా నమిస్తూ ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి తీసుకెళ్లి పాతవారికే పట్టాలు పొందేలా చర్య లు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



సర్పంచ్, సీపీఐ నాయకుల వాగ్వాదం

అగ్నిప్రమాదాలపై అవగాహన

బుక్కపట్నం: అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు వాటి ని ఏవిధంగానివారించుకోవాలోఅనే అంశంపై శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఐకేపీ కార్యాలయంలో అగ్నిమాపక శాఖ అధికారులు మహిళలకు, విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. అగ్నిమాపక అధికారులు పుష్ప రాజ్, బాలపుచ్చయ్యలుగ్యాస్‌పై ఫైర్‌అయినప్పుడు, అదే విధంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వాటిని ఏ విధంగా ప్రత్యక్షంగా తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో ప్రిన్సి పల్ శంకర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఓబుళేశు, ఏపీ ఎం అనసూయమ్మ, అధ్యాపకులు రామన్న తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనానికి నిధులు విడుదల

ఓబుళదేవరచెరువు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాలు నిర్వహిస్తున్న ఏజన్సీ నిర్వాహకులకు జూన్, జులై మాసాలకు సంబంధించి నిధులు విడుదల అయినట్లు ఎంఈఓ లలితమ్మ తెలిపారు. సంబంధిత నిర్వాహకులు పాఠశాల హెడ్ మాస్టర్ ద్వారా బిల్లులు సమర్పిస్తే ఆ బిల్లులను వారి వారి ఖాతాల్లోకి జమ చేస్తారన్నారు. బాలప్పగారిపల్లి, కొక్కంటి వారిపల్లి, కోనపల్లివారిపల్లి, గౌరాపురం, ఎంబీక్రాస్ పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారానికి మూడు రోజులు తప్ప కుండా ఏజన్సీ నిర్వాహకులు కోడిగ్రుడ్లు సరఫరా చేయాలని, అలా చేయని నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆమెతో పా టు సీఆర్‌పీలు సుధాకర్, చెన్నక్రిష్ణ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికి పక్కా గృహాలు

ఓబుళదేవరచెరువు : అర్హులు అందరికి పక్కా గృహాలు మంజూరు అయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎంపీడీఓ కావలి నాగరాజు, తహసీల్దార్ ఎల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని తంగేడుకుంట, మామిళ్ళకుంట్లపల్లిలో పక్కా గృహాల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సంపత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌మాస్టర్ల నియామకం

ఓబుళదేవరచెరువు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్‌గా భాస్కర్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీక రిం చారు. గతంలో పనిచేస్తున్న హెడ్‌మాస్టర్ అనసయమ్మ స్థానంలో ఎన్పీకుంట మండలం ధనియాని చెరువు జిల్లా పరిషత్ పాఠ శాల లో హెచ్‌ఎంగా పనిచేస్తున్న భాస్కర్‌రెడ్డి బదిలీపై ఓ.డీ.చెరువు వచ్చారు. అమడగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ ఎంగా రమణ శని వారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న వెంకటాచలం నంబులపూలకుంట మండలం, ధనియాని చెరువు హైస్కూల్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో మడకశిర ప్రాంతంలోని మోరుబాగల్ లో పనిచేస్తూ బదిలీపై వచ్చారు. నూతనంగా వచ్చిన ప్రధానోపాధ్యాయుడికి పాఠ శాల ఉపాధ్యాయులు స్వాగతం పలికారు.

రాయితీ రుణాల మంజూరు

పుట్టపర్తిరూరల్: చేనేతలకు చేయూతనివ్వడంలో భాగంగా వారికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రాయితీ రుణాలను వెంగళమ్మచెరువు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పంపిణీ చేసింది. బ్యాంకు మేనేజర్ రవికుమార్‌రెడ్డి శనివారం మాట్లాడు తూ చేనేతలకు రాయితీ రుణాలను మంజూరు చేసి ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం యూనిట్లను పంపిణీ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా 14 మంది చేనేత కార్మికులు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున పదిశాతం సబ్సిడీతో రుణాలను పంపిణీ చేశారు. ఈ రుణాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో పుట్టపర్తి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శ్రీరామిరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ నాగేంద్రప్రసాద్, క్యాషియర్ చంద్రశేఖర్, లబ్దిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

కొత్తచెరువు: ప్రతిఒక్క విద్యార్థి కష్టపడేతత్వాన్ని అలవరచుకోవడంతో పాటు ఇష్టపడి చదివితే ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక శివసాయి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే కరస్పాండెంట్ ఆదిశేషప్ప ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ బాలగురప్ప, సాయిబాబా కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, లెక్చరర్ నాగభూషణ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చే శారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్, లెక్చరర్లు ప్రకాశ్, గోవింద, దివాకర్, జనార్ధన పాల్గొన్నారు.



కార్యక్రమంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

సల్లవాండ్లపల్లిని వణికిస్తున్న జ్వరాలు

- ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్న రోగులు..
- ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున బాధితులు





జ్వరాలు , నొప్పులతో మండలంలోని సల్లవాండ్లపల్లి వాసులు అల్లాడిపోతున్నారు. ప్రభుత్వ వైద్యం అందక అప్పు , సప్పులు చేసి ప్రైవేటు వైద్యశాలలకు ఆశ్రయిస్తున్నారు. గత నాలుగు రోజులుగా విపరీతమైన జ్వరంతో పాటు చేతులు, కాళ్ళు నొప్పులు, వాపులు రావడంతో రోగులు మంచం పై నుండి కిందకు దిగని పరిస్థితి ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున జ్వరాలు, నొప్పులతో అల్లాడి పోతున్నారు. గ్రామంలో రామక్క, కొడుకు ఆనంద్, కోడలు రమాదేవీతో పాటు బండి గంగరాజు, ఎం. మంజుల, సీ.ఉమాదేవీ, రామచం ద్రారెడ్డి, చిన్నరా జప్ప, చిన్నవీరప్ప, అలివేలమ్మతో పా టు చిన్నా రులు సైతం జ్వరంతో ముక్కుతూ మూలు గుతూ ప్రైవేటు వైద్యశాలలకు వెళ్తున్నారు. వైద్యశా లకు వెళ్ళిన ప్రతి సారీ రూ. 500 నుండి రూ. 800 వర కు ఖర్చు వస్తోందని రోగులు వాపో తున్నారు. ప్రభుత్వ వైద్యశాఖ వారు స్పందించి గ్రామాలలో జ్వరాలు తగ్గేంత వరకు వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

: ఓబుళదేవరచెరువు

ర్యాగింగ్ వద్దు...చదువే ముద్దు


మాట్లాడుతున్న డీఎస్పీ ముక్కా శివరామిరెడ్డి

పుట్టపర్తి: ర్యాగింగ్ పేరుతో తోటి విద్యార్థులను వేధించి ఇబ్బందులు పడటం కంటే చదువుపై శ్రద్ధ ఉంచితే భవిష్యత్తు బాగుంటుందని డీఎస్పీ ముక్కా శివరామిరెడ్డి సూచించారు. శని వారం స్థానిక సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ర్యాగింగ్ పరిణా మాల గురించి అవగాహన కల్పించారు. కొత్తగా కళాశా లలో చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యా ర్థులు సంతోషంగా సాదరస్వాగతం పలకాలని కానీ, ర్యాగింగ్ పేరుతో వికృతచేష్టలు, అవమానించడం చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, వెస్ఐ వెం కటే శు నాయక్, కళాశాల చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ నారా యణ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం..




అమడగూరు, ఓబుళదేవరచెరువు మండలాల్లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఓబుళదేవరచెరువు : తల్లిపాలు బిడ్డలకు అమృతంతో సమానమని పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాపిం చా లని ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగరత్నమ్మ , అమడగూరు సూపర్ వైజర్ లక్ష్మీదేవమ్మలు పేర్కొన్నారు. శనివారం ఓ.డీ.సీ మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని అం గన్‌వాడీ కేంద్రం - 3 కార్యకర్త ఆశీర్వాదమ్మ, కళావతి, జయమ్మ, అఖిలల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. వడ్డివారిపల్లిలో కార్యకర్త విజయలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. అమడగూరు మండల కేంద్రంలో వారోత్సవ ర్యాలీ నిర్వహించి బాలింతలు, గర్భిణులకు తల్లిపాల విశిష్టతను వివరించారు.జేకేపల్లి, పూలకుంటపల్లి పంచాయతీల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించినట్లు సూపర్‌వైజర్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ నాగలక్ష్మీ, హెల్త్ సూపర్‌వైజర్ రమాదేవీ, ఆరోగ్య కార్యకర్తలు జానకీ, శ్రీనివాసన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

నల్లమాడ : మండలంలోని పోలంవాండ్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు ఎంఈఓ వేమ నారాయణ ఆధ్వర్యంలో యూనిఫామ్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీ హనీఫ్ ఖాన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పేద విద్యార్థుల విద్యా భ్యాసం కోసం కోట్లాది రూపా యలు ఖర్చు పెడుతోందన్నారు. ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదివి పాఠశా లకు , తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. పాఠశా లలో చదువుతున్న 25 మంది విద్యార్థిని, విద్యార్థులకు యూని ఫామ్‌లను పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమంలో ఉపాధ్యాయు రాళ్ళు ఏపీపీ లక్ష్మీకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మెన్ జీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయులు

గడ్డివిత్తనాల పంపిణీ

కొత్తచెరువు: రైతులు పశుగ్రాసం సాగు చేసుకోవడానికి 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలను శనివారం పంపిణీ చేసినట్లు పశుసంవర్ధకశాఖ ఏడీ మల్లేశుగౌడ్, పశువైద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. మండలానికి 10 టన్నుల గడ్డి విత్తనాలు మంజూరయ్యాయి. ఒక్కొక్క రైతుకు 20 కిలోల చొప్పున కిలో రూ.14.10 ధరతో 450 మంది రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రాము, నిఖిత, చంద్ర, వినోద్, నారాయణ పాల్గొన్నారు.

నేడు మిలిటరీ వెంకటేశు సంతాపసభ

పుట్టపర్తి: బలిజసంఘం మండలాధ్యక్షుడిగా ఉంటూ బలిజల అభివృద్ధికి కృషి చేయడమేకాక సమాజానికి తనవంతు సేవలందించి అకాలమరణం పొందిన మిలిటరీ వెంకటేశు సంతాపసభను ఆదివారం ఉదయం 10 గంటలకు సాయిమహేశ్వర అపార్ట్‌మెంటులో నిర్వహిస్తున్నట్టు బలిజ సంఘం నాయకులు తెలిపారు.

టీకాలతో వ్యాధులు దూరం

బుక్కపట్నం: ఎంఆర్ టీకాలను వేయించుకోవడం వల్ల తట్టు, రూబెల్లా వ్యాధులను నివారించవచ్చని డాక్టర్ సునీల్ తెలిపారు. శనివారం డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు ఎంఆర్ టీకాలను వేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ లింగా రామ్మోహన్ చౌదరి, హెల్త్‌అసిస్టెంట్ షపీ, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

పుట్టపర్తి: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన దీక్షలు శనివారం 13వ రోజూ కొనసాగాయి. తమ పోరాటం ఆగదంటూ కౌన్సిలర్ ఓబిలేశు, బేకరి గంగాధర్, తిప్పన్న పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వర్గీకరణకు హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదంటూ విమర్శించారు. సత్తెన్న, నరసింహులు, ఓబిలేశు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలాలు


బ్రహ్మకమలాలు చూపుతున్న మహిళలు

ఓబుళదేవరచెరువు : మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవస్థానం సమీపంలోని ఉపేంద్రం రమాదేవి, సుగుణ, పద్మావతి నివాసాల వద్ద , ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో ఉన్న బాలాజీ, మీనాక్షీల గృహంలో శనివారం బ్రహ్మకమలాలు వికసిం చాయి. రెండవ శ్రావణ శనివారం రోజున బ్రహ్మకమలం వికసించడంతో వాటిని తిలకించడానికి చుట్టుప్రక్కల వారు వచ్చి ప్రత్యేక పూజాలు నిర్వహించుకున్నారు.



రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ లైన్‌మన్‌కు గాయాలు

రాప్తాడు: మండలంలోని పంగల్‌రోడ్డు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ లైన్‌మన్ లక్ష్మన్న గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు లక్ష్మన్న ఎస్కేయూలో నివాసం ఉంటున్నాడు. శనివారం 3 గంటల సమయంలో ద్విచక్ర వాహనంలో ఎస్కేయూ నుంచి అనంతపురానికి బయలుదేరాడు. పంగల్‌రోడ్డు వద్దకు రాగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన లక్ష్మన్నను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎంఆర్ వ్యాక్సిన్ లక్ష్యాన్ని
వందశాతం పూర్తిచేయాలి

చెన్నేకొత్తపల్లి: రుబెల్లా, మీజిల్స్ వ్యాధులకు గురి కాకుండా వందశాతం పిల్లలకు ఎంఆర్ టీకాను వేయడం జరుగుతుందని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ యుగంధర్ పేర్కొన్నారు. మండలంలోని నాగసముద్రంగేటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం దీనిపై సిబ్బందితో సమీక్షించారు. ప్రస్తుతం ఎంత వరకు కార్యక్రమం జరిగిందని ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ...రామగిరి, సీకేపల్లి, కనగానపల్లి మండలాల్లో 9నెలల-15 సంవత్సరాల్లోపు వయసు గల పిల్లలు 19 వేల మందిని గుర్తించడం జరిగిందన్నారు. ఇప్పటికి 70 శాతం ప్రక్రియ పూర్తి అయిందని, మరో రెండురోజుల్లో మిగిలిన 30 శాతం కూడా పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

బీఏఎస్ కోసం బారులు తీరిన విద్యార్థులు
లాటరీ ఆధారంగా ప్రవేశాలు: డీఎస్‌టీఓ

అనంతపురం సెంట్రల్: బీఏఎస్(బెస్ట్ అవైలబుల్ స్కూల్స్) పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థులు బారులు తీ రుతున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో విద్యనభ్యసించడానికి ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు 481 సీట్లు కేటా యించింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కావడం తో గిరిజన సంక్షే మ కార్యాలయానికి విద్యార్థులు, తల్లిదండ్రులు బారులు తీరారు. దీంతో దరఖాస్తుల స్వీకరణకు డీఎస్‌టీఓ కొండలరావు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. రికార్డుల్లో నమోదు చేసుకుని దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈనెల 10వ తేదీ వరకు గడువు ఉన్నప్పటికీ ఇప్పటికే విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలైంది. కాగా, 19న ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి జాబితా ప్రకటించనున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 16 స్కూళ్లలో బీఏఎస్ కింద గిరిజన విద్యార్థులను చేర్చుకోవడానికి అనుమతి లభించింది.

లాటరీ ఆధారంగానే ఎంపిక ప్రక్రియ: డీఎస్‌టీడబ్ల్యూ
దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. 10వ తేదీ వరకూ అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం. అనంతరం దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి 19న లాటరీ పద్ధతిలో ఎంపిక ప్రక్రియ చేపడతాం.

విజయనగర కాలనీ బాధితులకు
పక్కాగృహాలు నిర్మించాలి
- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్



ఇన్‌చార్జి ఆర్డీఓ ఆనంద్‌తో మాట్లాడుతున్న గేయానంద్

అనంతపురం టౌన్: కలెక్టరేట్‌కు కూతవేటుదూరంలో వున్న విజయనగరకాలనీలో గృహాల కూల్చివేతకు గురైన బాధితులకు ప్రభుత్వం తక్షణం స్పందించి పక్కాగృహాలు మంజూరు చేయాలని, లేనిపక్షంలో ప్రజాసంఘాలు, వామపక్షాలను కలుపుకుని ఉద్యమాలు చేపడతామని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. శనివారం విజయనగర కాలనీలో కూల్చివేతకు గురైన ప్రాంతాన్ని డాక్టర్ గేయానంద్‌తోపాటు సీపీఎం నగర కార్యదర్శి నాగేంద్రకుమార్, కాంగ్రెస్‌పార్టీ నాయకుడు రమణ సందర్శించి, బాధితులను పరామర్శించారు. అనంతరం ఇన్‌చార్జి ఆర్డీఓ ఆనంద్‌ను కలిసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు నాగరాజు, ఉపేంద్ర, లక్ష్మీనారాయణ, సూరి, బాధిత ప్రజలు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ

రామగిరి: మండలంలోని కొండాపురం గ్రామంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష

రామగిరి: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, గ్రామాల సమస్యలపై స్థానిక నేతలతో స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత శుక్రవారం సమీక్షించారు. శనివారం వెంకటాపురంలోని స్వగృహంలో మంత్రిని కలవడానికి వచ్చిన స్థానిక నేతలు, కార్యకర్తలతో మంత్రి మాట్లాడారు. ఎల్.నారాయణచౌదరి, రామ్మూర్తినాయుడు, మాజీ ఎంపీపీ రంగయ్య, ఎంపీపీ బడిగోర్ల ఆంజనేయులు తదితరులతో మంత్రి మాట్లాడారు. గ్రామాల వారీగా అభివృద్ధిపై చర్చించారు. ఇంకా ఏయే సమస్యలున్నాయి, పరిష్కరించాలని సూచించారు. ఈసందర్భంగా తనయుడు పరిటాల శ్రీరామ్ నిశ్చితార్థంపై కూడా వారితో మాట్లాడారు. అంతేకాకుండా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. మనం చేపట్టిన అభివృద్ధి పనులే విజయానికి నాంది కావాలని ఆమె తెలిపారు.



స్థానిక నేతలతో మాట్లాడుతున్న మంత్రి సునీత

అర్హులను గుర్తించడానికే గ్రామసభలు

అనంతపురం సప్తగిరిసర్కిల్: అనంతపురం రూరల్ మండలం పరిధిలోని నర్సనేకుంటలో గ్రామసభ నిర్వహించారు. ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ, హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర హాజరై ప్రజాధికార సర్వేలోని లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు దరఖాస్తు చేసుకున్నారు.

రామగిరి: గృహనిర్మాణాలు చేపట్టడానికి అర్హులైనవారి జాబితాను సిద్ధం చేయడానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొండాపురం, నసనకోట, కుంటిమద్ది గ్రామాల్లో సభలు నిర్వహించారు. పల్స్ సర్వే ఆధారంగా గృహాలు లేనివారిని గుర్తించి ఎంపిక చేస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆదినారాయణ, ఎంపీడీఓ పూల నరసింహులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి, వీఆర్‌ఓలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కనగానపల్లిలో... సర్వే ఆధారంగా గుర్తించిన అర్హులను గృహనిర్మాణాలకు ఎంపిక చేస్తామని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి పేర్కొన్నారు. శనివారం తూంచెర్ల గ్రామంలో గృహనిర్మాణ పథకం లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఈఓఆర్డీ మమతాదేవి, కార్యదర్శి నరసింహారెడ్డి, చిట్టెమ్మ, ఎంపీటీసీ అరుణమ్మ, హౌసింగ్ ఏఈ చిరంజీవి, సర్పంచ్ రామసుబ్బయ్య, బంగి మల్లేశు, చంద్రకళ పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లిలో... సర్వే చేపట్టి అర్హులైన లబ్ధిదారులను గుర్తించిన తరువాత వారికి ఎన్టీఆర్ గృహ పథకం కింద గృహాలను మంజూరు చేయడం జరుగుతుందని ఎంపీడీఓ రామాంజినేయులు పేర్కొన్నారు. మండలంలోని ప్యాదిండి గ్రామంలో శనివారం లబ్ధిదారుల ఎంపిక సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

బోగినేపల్లి (రాప్తాడు): గ్రామాల్లో అర్హులైన నిరుపేదలందరికి విడతలవారీగా ఎన్టీఆర్ గృహాలు మంజూరు చేస్తామని తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. గ్రామాల్లో గృహ నిర్మాణ లబ్ధిదారులను గుర్తించేందుకు మూడు గ్రూపులుగా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. శనివారం పాలచెర్ల, బోగినేపల్లి, తదితర గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు.

విద్యార్థులందరూ స్నేహభావంతో మెలగాలి
సీఐ కృష్ణమోహన్.. ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు

అనంతపురం సప్తగిరిసర్కిల్: అనంతపురం రూరల్ మండలం పరిధిలోని రుద్రంపేట సమీపాన గల పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా అనంతపురం రూరల్ సీఐ కృష్ణమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ... 1997 ఆంధ్రప్రదేశ్ ర్యాగింగ్ నిరోధక చట్టం 26 పట్ల జాగ్రత్తగా ఉండమని విద్యార్థులకు సూ చించారు. ర్యాగింగ్ అంటే విద్యార్థులను అవమానించడం, భయపెట్టడం, చికాకుపెట్టడం, దౌర్జన్యంచేయడం, నిర్బంధించడం లేదా గాయపరచడం ఇవన్నీ ర్యాగింగ్ పరిధిలోకి వస్తాయన్నారు.

ఈ రోజుల్లో ర్యాగింగ్ ఒక ఫ్యాషన్‌గా మారింది. ఒక హీరోహిజంగా భావిస్తున్నారు. దీని వలన తమ జీవితాలతోపాటూ ఇతరుల జీవితాలను కూడా నాశనం చేస్తున్నారు. ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, జరిమానాల గురించి వివరంగా తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... విద్యాసంస్థల్లో ర్యాగింగ్ బె డదని అరికట్టడానికి డాక్టర్ ఆర్‌కె రఘువన్ నేతృత్వంలో కమిటీ సిఫారసులను చేసిందని తెలిపారు. ర్యాగింగ్ విభాగాలు - ర్యాగింగ్ వ్యతిరేక క మిటీలు, ర్యాగింగ్ వ్యతిరేక తనిఖీ దళం, ర్యాగింగ్ వ్యతిరేక పర్యవేక్షణ కమిటీ, సహాయ కేంద్రం, ఎమర్జెన్సీ కాల్ యూనిట్ ఇలా ఎన్నో సిఫార్సు చేసింది. వీటన్నింటిని కళాశాలలో అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ ఎస్‌ఐ జగదీష్, పీవీకేకే ఐటీ యాజమాన్యం ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, కళాశాల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించండి

అనంతపురం వైద్యం: విద్యార్థులందరూ క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నతస్థాయికి ఎదగాలని సీఐ మురళీకృష్ణ, ఎస్సై శివగంగాధరరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, ప్రైవేట్ ఎస్వీ డిగ్రీ కళాశాలలో శనివారం విద్యార్థులకు ర్యాగింగ్ నివారణ-ర్యాగింగ్ పాల్పడితే ఎలాంటి చర్యలు తదితర విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు త్రీటౌన్ సీఐ మురళీక్రిష్ణ, టూటౌన్ ఎస్సై శివగంగాధర్‌రెడ్డి హాజరై ర్యాగింగ్ నివారణ, ర్యాగింగ్‌కు పాల్పడితే తగిన శిక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ రంగస్వామి, తదితరులు విద్యాబోధకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి సునీత రాక

కనగానపల్లి: రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత నేడు ఆదివారం కనగానపల్లికి రానున్నట్టు టీడీపీ నాయకులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా పార్టీ కార్యకర్తలతో సమావేశం, అనంతరం సర్పంచ్ బాలయ్య గృహ ప్రారంభోత్సవంలో పాల్గొంటారని తెలిపారు.

'పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం'

అనంతపురం సప్తగిరిసర్కిల్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ పేర్కొన్నారు. శనివారం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని సిండికేట్ నగర్‌లో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మధుసూదన్ పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

రామగిరి: మండలానికి అదనంగా మంజూరైన 95 కొత్త పింఛన్లను శనివారం ఆయా గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. రామగిరిలో సర్పంచ్ శ్రీనివాసులు పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు పింఛన్లను మంజూరు చేయడం పట్ల లబ్ధిదారులు సీఎంకు, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పీఎస్ఓ రాప్తాడు కమిటీ ఎంపిక

అనంతపురం సప్తగిరిసర్కిల్: స్థానిక ప్రోగ్రెస్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో రాప్తాడు కమిటీని రాష్ట్ర సహాయ కార్యదర్శి బండారు శివ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షుడిగా రవిచంద్ర, ఉపాధ్యక్షులుగా బాల ప్రణీత్‌ను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ భాను, ఉపాధ్యక్షుడు రాజశేఖర్ యాదవ్, కార్యదర్శి గణేష్, ప్రధాన కార్యదర్శి బాలసాయి, జిల్లా ఉపాధ్యక్షుడు లింగమయ్య, కార్యదర్శి మోహన్‌కుమార్, శింగనమల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

బదిలీలు ప్రశాంతంగా ముగించడం పట్ల అభినందించిన ఏపీటీఎఫ్ (హెచ్)

అనంతపురం అర్బన్: ఉపాధ్యాయులు బదిలీలు, రేషనలైజేషన్ ప్రక్రియను దిగ్విజయంగా ముగించినందుకు జిల్లా విద్యాశాఖకు ఏపీటీఎఫ్(హెచ్)జిల్లా అధ్యక్షుడు కులశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఇందుకు కృషి చేసిన డీఈఓ లక్ష్మీనారాయణ, సిబ్బందికి ఏపీటీఎఫ్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

తెలంగాణ టెట్‌లో సాయిగంగ విద్యార్థుల ప్రతిభ

అనంతపురం వైద్యం: ఇటీవల ప్రకటించిన తెలంగాణా టెట్ ఫలితాలతో నగరంలోని సాయిగంగ కోచింగ్ సెంటర్‌కు చెందిన 5గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ కోచింగ్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ కురుబ నారాయణ స్వామి పేర్కొన్నారు. ఈ మేరకు ఆ విద్యార్థులను కోచింగ్ సెంటర్‌లో అభినందించారు. టీఎస్ టెట్‌లో ప్రతిభ కనబరిచినా వారిలో మణిమాల- 121, భాస్కర్-118, కష్టకాంత్-116, శివగంగిరెడ్డి-116, హేమావతి-115 లు ఉన్నారని ఆయన తెలియజేశారు.

మైక్రో ఇరిగేషన్ టెక్నీషియన్లకు సర్టిఫికెట్లు

అనంతపురం కలెక్టరేట్: మైక్రో ఇరిగేషన్ టెక్నీషియన్లకు ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వర్లు సర్టిఫికెట్లను అందించారు. ఏపీఎంఐపీ ఆధ్వర్యంలో 30 మంది అభ్యర్థులకు నెల రోజుల పాటు డ్రిప్ నిర్వహణపై శిక్షణనిచ్చారు. ఐదు రోజులు శిక్షణా తరగతు లు, 25 రోజులు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. శిక్షణ ముగించుకున్న అభ్యర్థులకు శనివారం స్థానిక ప్రాంతీయ ఉ ద్యా న శిక్షణ కేంద్రంలో సదరు అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందించా రు. ఈ కార్యక్రమంలో ఏపీడీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అండర్-14 జిల్లా జట్టు ఎంపిక

అనంతపురం స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న అండర్-14 అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో పాల్గొనే అనంతపురం జిల్లా జట్టును ఆదివారం ఉదయం 9 గంటలకు అనంత క్రీడా గ్రామంలో అండర్-14 సెలెక్షన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి కేఎస్ షాహబుద్దీన్ తెలిపారు. 1.9.2003 తరువాత పుట్టిన వారు అర్హులన్నారు. ఆసక్తి గలక్రీడాకారులు తమ వయస్సు ధ్రువీకరణ పత్రం వెంట తీసుకుని, క్రికెట్ యూనిఫాం, సొంత క్రికెట్ కిట్టు హాజరుకావాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండండి

గార్లదిన్నె: రోడ్డు ప్రమాదాల పట్ల జాగ్రత్తలు పాటించాలని వాహన డ్రైవర్లకు ఎస్ఐ ప్రదీప్‌కుమార్ హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం ఆత్మకూరు రూరల్ సర్కిల్ సీఐ శివనారాయణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పోలీసులు మూడు బృందాలుగా ఏర్పాడి గార్లదిన్నె, కల్లూరు, మార్తడు క్రాస్ వద్ద వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించారు. లగేజీ జీపులను, ఆటోలను నిలిపి రికార్డులు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దయచూపని వరుణుడు

- ఎండుతున్న వేరుశనగ పంట
- రక్షకతడులు అందించని అధికారులు
- దిక్కుతోచని స్థితిలో రైతులు

నార్పల: ఖరీఫ్ సీజన్‌లో ముంగారు వర్షాలు బాగా కురవడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ప్రభుత్వం పంపిణీ చేసిన విత్తన వేరుశనగను పొలాల్లో విత్తారు. అయితే జూలై మాసం మొత్తంలో వర్షం జాడ కనిపించలేదు. దీంతో వేసిన విత్తనాలు మొలకెత్తి ఎండు దశకు చేరాయి. వర్షం కురవాలని రైతులు చేయని పూజలు లేవు. అమ్మవార్లకు జంతుబలులు ఇవ్వడంతో పాటు బొడ్రాయికి 101 బిందెలతో జలాభిషేకం, కప్పలు, గాడిదలకు పెళ్లిళ్లు చేసినా వరుణదేవుడు కరుణించలేదు. మండల వ్యాప్తంగా 3100 ఎకరాల్లో వేరుశనగ విత్తారు. ఇప్పటికే నడిమిదొడ్డిపల్లి, నార్పల, పులసలనూతల, కర్ణపొడికి, బొందలవాడ, తదితర గ్రామాల్లోని వేసిన వేరుశనగ ఎండిపోతోంది. వర్షాలు వస్తాయన్న ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. వ్యవసయాధికారులు కళ్ల ముందు వేరుశ నగ పంట ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. తమ పంటలకు రక్షకతడులు అందించాలని రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా కనికరం చూపడం లేదని అంటున్నారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే జింక్, జిప్సం పంపిణీలో బిజీగా ఉన్నామని కుంటి సాకులు చెబుతున్నారని రైతులు అంటున్నారు. ఓ వైపు వానదేవుడు కరుణించక, అధికారులు కనికరం చూపకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వ్యవసాయాధికారులు వేరుశనగ పంటకు రక్షకతడులు అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఎండుతున్న వేరుశనగ పంట

అప్పులే మిగులుతున్నాయి - మల్లికార్జున



ఈ ఏడాది వేసిన వేరుశనగ పంటకు సకాలంలో వర్షాలు రాకపోతే అప్పులపాలవుతాం. గత ఏడాది నష్టపోయాం. ప్రతి ఏటా వేరుశనగ సాగులో నష్టాలే మిగులుతున్నాయి. రక్షక తడులు ఇవ్వమని అధికారులు అడిగితే నీరు అందుబాటులో లేవంటున్నారు. ఆ దేవుడిపైనే భారం వేశాం.

సమావేశాలప్పుడే రక్షకతడులు ఇస్తున్నారు: శేఖరా



ఎక్కడైనా సమావేశాలు జరిగినప్పుడు మాత్రమే వ్యవసా యాధికారులు పంటలకు రక్షక తడులు ఇస్తున్నారు. వేరుశనగ పంటను కాపాడాలని అధికారులను వేడుకుంటున్నా పట్టించుకునేవారు లేరు.

ఎన్టీఆర్ గృహాల మంజూరుకు గ్రామసభలు



గ్రామసభలో పాల్గొన్న అధికారులు, రైతులు

గార్లదిన్నె: మండల పరిధిలోని గార్లదిన్నె, కొప్పలకొండ, కేశవాపురం గ్రామాల్లో శనివారం ఎన్టీఆర్ గ్రామీణ గృహాల మంజూరు కోసం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభల్లో ఎంపీడీఓ, ఎంఈఓ, తహసీల్దార్ మూడు టీంలుగా ఏర్పడి రెండు మూడు రోజుల నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ఎంపీడీఓ భాస్కర్ రెడ్డి మాట్లాడతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాసాధికారిక సర్వేలో గ్రామాల్లో ఇళ్లులేని వారిని గుర్తించామన్నారు. వారిని గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు గట్టు ఉషారాణి, సువర్ణమ్మ, పంచాయతీ కార్యదర్శి ముత్యాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పుట్లూరులో : మండలంలోని కుమ్మనమలలో శనివారం ప్రజా సాధికారిక సర్వేలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో సొంతిల్లు లేని అర్హులైన వారిని గుర్తించేందుకు గ్రామసభ ఏర్పాటు చేశారు. సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్నవారి గురించి సర్వే చేశామని అధికారులు తెలిపారు.

యల్లనూరులో : మండలంలో శనివారం ఎన్టీఆర్ గృహాలపై చింతకాయమంద పంచాయతీలో సర్వే నిర్వహించినట్లు ఈఓఆర్‌డీ శివాజీరెడ్డి తెలిపారు. సాధికారిక సర్వేలో గృహాలు లేవని నమోదు చేసిన కుటుంబాలను విచారించారు. గృహాలు లేనివారి ఆధార్ కార్డు, రేషన్‌కార్డు వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



ట్యాంకర్ నీటిని పట్టుకుంటున్న ప్రజలు

గార్లదిన్నె: మండల కేంద్రంలో టీడీపీ నాయకులు గేటుక్రిష్ణారెడ్డి రెండు నెలలు నుంచి గ్రామస్థులకు ట్యాంకుల ద్వారా ఉచితంగా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వేసవిలో తీవ్ర వర్షభావంతో ప్రజలకు తాగునీరు లభించని పరిస్థితి. సర్పంచు ఉషారాణి, ఆర్డీటీ సంస్థ వారు, టీడీపీ నాయకులు గేటుక్రిష్ణారెడ్డి ప్రజల నీటి సమస్య పరిష్కరించేందుకు ట్యాంకుల ద్వారా నీటిని చేస్తున్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ



నోటుపుస్తకాలను పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

పుట్లూరు : మండలంలోని సూరేపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం టీఎన్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 55 మంది విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపీనాథ్, ట్రస్టు సభ్యులు భాస్కర్‌రెడ్డి, రంగప్ప, రాము, ఉపాధ్యాయులు వనజాక్షి, మధు పాల్గొన్నారు.

చంద్రన్న బీమా పేదలకు అండ : విప్





బుక్కరాయసముద్రం, యల్లనూరు బాధితులకు బీమా చెక్కులను అందజేస్తున్న యామినీబాల

బుక్కరాయసముద్రం : చంద్రన్న బీమా పథకం నిరుపేదలకు అండ అని విప్ యామినీబాల పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గంలోని 22 మంది పేదలు, రోడ్డు ప్రమాదాలు, ప్రమాదవశాత్తూ, సహజ మరణాలు కుటుంబాలకు రూ.30 లక్షలు చెక్కులను విప్ బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టని సంక్షేమ పథకాలను టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలల్లో ఇంటి పెద్ద మృతి చెందితే ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. సహజ మరణాలకు కూడా ఆర్థిక సహాయం అందిస్తున్న ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. బుక్కరాయసముద్రం 2, గార్లదిన్నె 5, నార్పల 4, పుట్లూరు 3, శింగనమల 4, యల్లనూరు 4 కుటుంబాలకు చంద్ర న్న బీమా చెక్కులను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరు మండలాల ఎంపీఎంలు పాల్గొన్నారు.

యల్లనూరులో : మండలంలోని నలుగురికి చంద్రన్నబీమా ద్వారా క్లెయింలను ఎమ్మెల్యే యామినీబాల పంపిణీ చేశారని ఏపీఎం సాంబశివుడు తెలిపారు. శనివారం అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి నరేంద్రనాయుడు వీ రికి ఎమ్మెల్యే చేతులమీదుగా అందించారు. బుక్కా పురానికి చెందిన శ్యామలకు రూ.35,436, బాబుకు రూ.30వేలు, మనోహర్‌కు రూ.30వేలు, యల్లనూరుకు చెందిన నాగలక్ష్మికి రూ.30వేలు మంజూరైంది.

ఘనంగా శ్రావణ శనివార పూజలు

శింగనమల: మండలంలోని ఆలయాల్లో శ్రావణ మాసం రెండో శనివారం కావడంతో పూజలు ఘనంగా నిర్వహించారు. నాగులకట్ట, పుట్టల వద్ద భక్తులు పాలుపోసి పూజలు చేశారు. మండల కేంద్రంలో ఆత్మారాయుడు, దుర్గాంజనేయస్వామి, గంపయ్య స్వామి, చిన్నజలాలపురం దోన రామేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు స్వామివార్లకు అభిషేకాలు చూసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యల్లనూరులో : మండలంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని శనివారం ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. యల్లనూరు, చిలమకూరు, జంగంపల్లి ఆలయాల్లో ఉదయాన్నే స్వామివారికి ఆకుపూజసేవలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.







శింగనమల, ప్రత్యేక అలంకరణలో దుర్గాంజనేయస్వామి, ఆత్మారాముడు, ఆంజనేయస్వామి

వాష్ అండ్ గో కార్యక్రమం

పుట్లూరు : మండలంలోని ఏ కొండాపురం గ్రామం వద్ద శనివారం పోలీసులు వాష్ అండ్ గో కార్యక్రమం నిర్వహించారు. నిద్రమత్తులో ఉన్న లారీడ్రైవర్లకు ముఖాలు కడిగించి పంపారు. ప్రమాదాల నివారణలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు.

గంపమల్లయ్యకు ప్రత్యేక పూజలు

శింగనమల: శ్రావణ మాసం రెండో శనివారం సందర్భంగా గంపమల్లయ్య కొండపై స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఏడు కొండల్లో వెలసిన గంపమల్లయ్య స్వామికి శనివారం ఉదయం నుంచి భక్తులు టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కోళ్ల పెంపకం ద్వారానే జీవనోపాధి



లబ్ధిదారులకు కోళ్లను పంపిణీ చేస్తున్న సావిత్రమ్మ

శింగనమల: గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి వద్దనే కోళ్ల పెంపకం ద్వారా జీవనోపాధి పొందవచ్చని మండల సమైఖ్య సంఘం అధ్యక్షురాలు కే సావిత్రమ్మ తెలిపారు. శనివారం ఐకేపీ శాఖ ఆధ్వర్యంలో పెరటికోళ్ల పెంపకం పథకం కింద మండలంలో 101 మందిలో ఒక్కొక్కరికి 45 కోడిపిల్లలు మంజూరు కాగా వాటిని లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం నీలామణి, టీడీపీ నాయకులు మారుతినాయుడు, చితంబరిదొర, నిదనవాడ భాస్కర్‌రెడ్డి, పీ వెంకటేశ్, జుబేదా, ఫకృద్దీన్, బాషా, తిరుపతయ్య, బండి పరశురాం, శంకర్, మసూల ప్రకాశ్, హరిప్రసాద్, ఎర్రిస్వామి, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్లూరులో : మండలకేంద్రంలో కోళ్ల పెంపకం దారులకు శనివారం తహసీల్దార్ పుల్లన్న గింజల బాక్సులను పంపిణీ చేశారు. 12 మంది లబ్ధిదారులకు 300 బాక్సులను అందచేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఉదయ్, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పూర్తి

శింగనమల: మండల వ్యాప్తంగా ఉన్న పింఛన్ లబ్ధిదారులందరికీ సొమ్ము అందజేశామని ఎంపీడీఓ ఆర్ జయరామలుఉ తెలిపారు. మండలంలో 4,956 మంది పింఛనుదార్లు ఉండగా అందరికీ సొమ్ము ఇచ్చేశామన్నారు.

వైభవంగా కొత్త వేంకటరమణస్వామి కల్యాణం

యాడికి : మండలంలోని చింతలాయపల్లి గ్రామం వద్దనున్న కొత్త వేంకటరమణస్వామి కల్యాణోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీస మేత వేంకటరమణస్వామికి ఉదయం నుంచి ప్రత్యేకపూజలు నిర్వహించి అనంతరం కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉగాది పండుగ రోజున కమలపాడు గ్రామంలో ఊరేగింపు చేసేటపుడు పొరపాటున ఉత్సవ విగ్రహాలు కిందపడడంతో అరిష్టంగా భావించి పురోహితుల సలహాతో తిరిగి కల్యాణం జరిపించినట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం కమలపాడు గ్రామంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



విశేషాలంకరణలో నందలపాడు, పుట్లూరు రోడ్డు, జింకావారి వీధి, ఏటిగడ్డ ఆంజనేయస్వాములు

ఆలయాల్లో శ్రావణ శనివార పూజలు

తాడిపత్రిటౌన్ : శ్రావణమాసం రెండో శనివారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. పట్టణంలోని నందలపాడు, పుట్లూరురోడ్డు, అశోక్‌పిల్లర్ వద్ద నున్న అభయాంజనేయస్వామి, రైల్వేస్టేషన్, నంద్యాలరోడ్డు, జింకావీధిలోని పంచముఖ ఆంజనేయస్వామి, ఏటిగడ్డ ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. స్వామివార్లకు విశేష అలంకరణ చేశారు. ఆకు పూజలు, అర్చనలు, మహామంగళహారతి తదితర ప్రత్యేకపూజలు నిర్వహించారు. రూరల్ పరిధిలోని చుక్కలూరు ఆంజనేయస్వామి, ఆలూరు కోనలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. టెంకాయలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఏడువారాల వ్రతం : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం వేంకటేశ్వరస్వామి ఏడువారాల వ్రతాన్ని మహిళలు ఆచరించారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.



పంచముఖ ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు, అమ్మవారిశాలలో ఏడు శనివారాల వ్రతం ఆచిస్తున్న మహిళలు

టీడీపీ విజయంలో కాపులది కీలకపాత్ర

తాడిపత్రి : నంద్యాల ఉప ఎన్నికల్లో టీడీపీ విజయంలో కాపులు కీలకపాత్ర వహించనున్నారని టౌన్ బ్యాంకు అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు దద్దం సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీ టూరిజం డైరెక్టర్ రాముతో పాటు తాడిపత్రి ప్రాంతానికి చెందిన కాపు నాయకులతో కలిసి నంద్యాల ప్రచారానికి వెళుతున్నామన్నారు. అక్కడ కాపుల ఓటింగ్ శాతం ఎక్కువగా ఉందన్నారు. ఈ ఓట్లన్నీ టీడీపీకి పడేందుకు శక్తివంచన లేకుండా కృషిచేయనున్నామన్నారు. కాపు నేతలతో సమావేశమై వారితో పాటు ఇంటింటి ప్రచారం చేస్తామన్నారు. మొదటి నుంచి టీడీపీకి కాపులు వెన్నంటి ఉన్నారన్నారు. కొన్ని రాజకీయ శక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వేరు చేయాలన్న ఆలోచనతో ఉన్నారన్నారు. వీరి ఆటలు సాగవని అన్నారు.

సుధీర్‌రెడ్డికి ఘన సన్మానం

పెద్దవడుగూరు : మండలంలోని భీమునిపల్లి గ్రామంలో ఉచితంగా తాగునీటి బోరును ఏర్పాటుచేసిన గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల అధినేత వీకే సుధీర్‌రెడ్డిని గ్రామప్రజలు శనివారం ఘనంగా సన్మానించారు. ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతో రూ.లక్ష వెచ్చించి బోరు ఏర్పాటుచేయడం హర్షణీయమని గ్రామస్థులు తెలిపారు. ఇలాంటివేకాక మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామప్రజలు పాల్గొన్నారు.



సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్థులు



సజ్జలదిన్నె వంక నుంచి పెన్నాకు వస్తున్న నీరు

ఫలించిన ఎమ్మెల్యే జేసీ కల

తాడిపత్రి : మండలంలోని సజ్జలదిన్నె వంక నుంచి పెన్నానదికి నీటి మళ్లింపులో ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి కృషి ఫలించింది. పెన్నానదిలో అడుగంటిన భూగర్భజలాల వద్ద మున్సిపాలిటీకి తాగునీరందించడం కష్టంగా మారింది. గండికోట నుంచి వచ్చే నీటి వల్ల మున్సిపాలిటీకి నీటి అవసరాలు పూర్తిగా తీరే అవకాశం లేకపోవడంతో ఎమ్మెల్యే నీటి మళ్లింపునకు శ్రీకారం చుట్టారు. ఇందులోభాగంగా నీరు-చెట్టు కింద దాదాపు రూ.12లక్షల వ్యయంతో సజ్జలదిన్నె వంక నుంచి పెన్నానదికి నీటి డైవర్షన్ కింద కాలువ తవ్వించారు. ఈ కాలువ తవ్వకం వల్ల గురువారం సజ్జలదిన్నె ప్రాంతంలో పడిన వర్షాల వల్ల వంక నుంచి పెన్నానదికి నీరు వచ్చి చేరింది. ఈ నీటి రాక పట్ల అధికారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యే చేసిన కృషి వల్ల నీళ్లు రావడంతో కార్యకర్తల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

చైనా వస్తువులు బహిష్కరించాలని ర్యాలీ

తాడిపత్రిటౌన్ : చైనా వస్తువులు బహిష్కరించాలని శనివారం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. 200 మంది విద్యార్థులు జూనియర్ కాలేజీ నుంచి యల్లనూరు రోడ్డు సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. చైనాకు ఛీ కొట్టు, భారత్‌కు జై కొట్టు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ధర్మజాగరణ సమితి రాష్ట్ర సభ్యుడు కత్తి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ చైనా పాకిస్థాన్‌కు ఆర్థికసాయం చేస్తూ మన దేశం మీదకు ఉసిగొలుపుతోందన్నారు. బోర్డర్‌లో ప్రతిరోజూ ఒక జవాను చనిపోతున్నాడని, ఇది కేవలం చైనా, పాకిస్థాన్ ప్రోద్బలంతోనే జరుగుతోందన్నారు. దీంతో చైనాను మనం అడ్డుకోవలసిన అవసరం ఉందన్నారు. చైనాకు భారత్ అతి పెద్ద మార్కెట్ అని, ఆదేశ వస్తువులను భారత్‌లో బహిష్కరిస్తే ఆర్థికంగా దెబ్బతీసి దాని అహంకారాన్ని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా కళాశాల విద్యార్థి ప్రముఖ్ సూర్యప్రకాష్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ తాడిపత్రి శారీరక ప్రముఖ్ లోకేష్, తాడిపత్రి నగర కళాశాల విద్యార్థి ప్రముఖ్ మణికంఠ, శివ, శీను, రవి, శ్రీధర్, దినేష్, ఏబీవీపీ నాయకులు వీరేష్, రవి, అక్బర్, రాయుడు పాల్గొన్నారు.



ర్యాలీలో మాట్లాడుతున్న కత్తి రామచంద్రారెడ్డి

లోకల్ గైడ్



తాడిపత్రి మార్కెట్‌లో కూరగాయల ధరలు

పచ్చి మిరపకాయలు-రూ.50, టమోట-60, ఉల్లిగడ్డలు-20, ఉర్లగడ్డలు-20, అంకుర వంకాయలు- 30, ముల్లంకాయలు: 40, చిక్కుడుకాయలు-40, మొటిక్కాయలు- 25, బెండకాయలు-25, బీరకాయలు-30, కాకరకాయలు-40, క్యారెట్-50, క్యాబేజీ-20, క్యాలీఫ్లవర్-25, బీట్ రూట్- 25, దోసకాయలు:20, ముల్లంగి : 20, బీన్సు - రూ.40.

తాడిపత్రి సినిమాలు

బీహెచ్ మహల్ : మాయామాల్ (సెల్ ఫోన్ :08558222772), లక్ష్మీనారాయణ : డీజే (సెల్‌ఫోన్: 9848957005), విజయలక్ష్మి: నిన్నుకోరి (సెల్‌ఫోన్: 08558-223078), వరలక్షి: బాహుబలి-2 (సెల్‌ఫోన్:08558-223078), జయలక్ష్మి: ఫిదా (సెల్‌ఫోన్: 08558-223078), సాయితేజ: నిన్నుకోరి (సెల్‌ఫోన్: 08558 -221100), దాదా: నక్షత్రం

యాడికి: లక్ష్మీప్రియ: నిన్నుకోరి (సెల్‌ఫోన్: 90592 90284)

మాంసం ధరలు

చికెన్ (కేజీ) : రూ.150, స్కిన్‌లెస్ చికెన్ : 170, మటన్ : 440, చేప: 120, గుడ్లు (100) : రూ.410

గ్యాస్ సమాచారం

అందుబాటులో ఉన్న సిలిండర్లు
ఇండియన్ : 355 హెచ్‌పీ గ్యాస్ : 340

ఎమ్మెల్యే డైరీ

తాడిపత్రి : ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి శనివారం ప్రజలకు అందుబాటులో ఉంటారు.

బదిలీపై వెళ్లిన బ్యాంకు మేనేజర్‌కు సన్మానం



బ్యాంకు మేనేజర్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, పారిశ్రామికవేత్తలు

యాడికి : మండలంలోని రాయలచెరువు గ్రామంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు బదిలీపై వెళ్లగా ఎంపీపీ రంగయ్య, స్థానిక పారిశ్రామికవేత్తలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ మేనేజర్ పొదుపు సంఘాల సభ్యులకు, రైతులకు, నిరుద్యోగులకు రుణాలు మంజూరు చేసి వారి స్వయం సంపాదనకు దోహదపడ్డారని కొనియాడారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన స్మితాపాటిల్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో వెలుగు ఏపీయం హేమలత, టీడీపీ నాయకులు నాగమునిరెడ్డి, పారిశ్రామికవేత్త భీమలింగప్ప పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్ఐ

యాడికి : ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ కత్తిశ్రీనివాసులు సూచించారు. మండలకేంద్రంలోని రిజిస్టర్ కార్యాలయం వద్ద శనివారం ద్విచక్రవాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది రామయ్య, రామాంజనేయులు, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

వలసల నివారణపై రాష్ట్ర సదస్సు

పెద్దవడుగూరు : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో 7వ తేదీన వలసల నివారణపై రాష్ట్ర సదస్సును అనంతపురంలోని సంగమేశ్వర ఫంక్షన్ హాలులో నిర్వహిస్తామని తాడిపత్రి వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి వెంకటరాముడుయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులను అధిగమించడానికి ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేశామన్నారు. రైతులు, రైతుకూలీలు సదస్సుకు హాజరుకావాలన్నారు.

ఇంటి నుంచి పొగ



మంటలు ఆర్పేందుకు వచ్చిన ఫైరింజన్

తాడిపత్రిటౌన్ : పట్టణంలోని అన్నపూర్ణ టాకీస్ రోడ్డులో శనివారం ఓ తాళం వేసిన ఇంటి నుంచి దట్టమైన పొగలు వెలువడ్డాయి. స్థానికులు గమనించి తాళాలు పగులకొట్టి ఏం జరిగిందోనని తెలుసుకునేందుకు ప్రయత్నించారు. పొగ పెద్ద ఎత్తున వస్తుండడంతో ఫైర్‌స్టేషన్‌కు సమాచారమిచ్చారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పారు. లోపలికి వెళ్లి పరిశీలించగా వెలిగించిన దీపం పక్కనున్న పరుపునకు అంటుకొని పొగలు వ్యాపించినట్లు సిబ్బంది తెలిపారు. ఇంట్లోని వారు తాళాలు వేసి బయటకు వెళ్లినపుడు ఈ సంఘటన చోటు చేసుకుంది.

మట్కా బీటర్ల అరెస్టు



బీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

తాడిపత్రిరూరల్ : మండలంలోని గన్నెవారిపల్లికాలనీలో శనివారం మట్కా రాస్తున్న ఇద్దరిని అరెస్టుచేసి వారినుంచి రూ.6,100 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. అరెస్టయిన నారాయణరెడ్డి, వడ్డే పుల్లయ్యలపై కేసు నమోదు చేశామని తెలిపారు.

వ్యక్తిపై దాడి

తాడిపత్రిటౌన్ : స్థానిక అశోక్‌పిల్లర్ సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద శనివారం జయవంశిపాల్‌రెడ్డి, సూర్యనారాయణలు పరస్పరం రాళ్లతో దాడిచేసుకున్నారు. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల మేరకు చుక్కలూరుకు చెందిన సూర్యనారాయణ, పట్టణానికి చెందిన జయవంశిపాల్‌రెడ్డి ఐచర్ వాహనాల యజమానులు. బాడుగ విషయంలో ఇరువురూ గొడవపడి ఒకరిపై ఒకరు రాళ్లతో దాడిచేసుకున్నారు. దాడిలో జయవంశిపాల్‌రెడ్డి గాయపడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువురిపై కేసునమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



దాడిలో గాయపడ్డ వంశిపాల్‌రెడ్డి

గృహ లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు

పెద్దవడుగూరు : మండలంలోని విరుపాపురం, వెంకటాంపల్లి, చిన్నవడుగూరు గ్రామాల్లో అర్హులైన వారికి ప్రభుత్వం మంజూరు చేసే గృహాల లబ్ధిదారుల ఎంపిక కోసం మండలస్థాయి అధికారులు శనివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు ముఖ్యఅతిథిగా ఎంపీపీ దేవమ్మ హాజరయ్యారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఇల్లు మంజూరు చేస్తామని, ఇల్లు లేనివారు తమ రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు వంటి వివరాలను అధికారులకు అందచేస్తే త్వరలోనే గృహాలు మంజూరు చేస్తామన్నారు. విరుపాపురం గ్రామంలోని కొందరు ప్రజలు ఏళ్ల తరబడి ప్రభుత్వ గృహాల కోసం దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నామని, గతంలో ఇళ్లు మంజూరైనవారికి మళ్లీ మంజూరవుతున్నాయే తప్ప గృహాలు మంజూరు చేయడంలేదని అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటాచలపతి, హౌసింగ్ అధికారి వెంకటేశ్వర్లు, ఎంఈఓ రాముడు, టీడీపీ సీనియర్ నాయకుడు బాలిరెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

యాడికిలో : మండలంలోని పుప్పాల గ్రామంలో శనివారం ఎన్టీఆర్ గృహాలకు అర్హుల ఎంపిక కోసం గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభల్లో తహసీల్దార్ బ్రహ్మయ్య సొంతిల్లు లేని వివరాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో నిర్వహించిన సాధికారిక సర్వే ఆధారంగా లబ్ధిదారుల వివరాలు సేకరించారు. సమావేశంలో వీఆర్వోలు వెంకటేష్, నరసింహులు, వెంకటరమణ పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ఎన్నికపై హర్షం

తాడిపత్రిటౌన్ : భారత 13వ ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ఎంపికవడం పట్ల స్థానిక బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు, పలువురు నాయకులు స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ దేశంలోనే రెండో అత్యున్నత పదవికి మన తెలుగు బిడ్డ ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టి విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పుణికితెచ్చుకొని అంచెలంచెలుగా ఎదగడం స్ఫూర్తిదాయకమన్నారు. ఉపరాష్ట్రపతి పదవికే ఆయన వన్నె తెస్తారని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగేంద్రప్రసాద్, రంగనాథరెడ్డి, జయచంద్ర, బాలు, సాహితి, వీరేష్ పాల్గొన్నారు.



స్వీట్లు తినిపించుకుంటున్న బీజేపీ నాయకులు

దళితవాడలో సీఐ పర్యటన

తాడిపత్రిటౌన్ : స్థానిక దళిత వాడలో శనివారం సీఐ భాస్కర్‌రెడ్డి, సిబ్బంది పర్యటించారు. అనంతరం కాలనీవాసులతో సమావేశమయ్యారు. కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే గొడవలకు పోకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలని, అవసరమైతే పోలీసులను సంప్రదించాలన్నారు. చెడు వ్యసనాలకు గురికాకుండా పిల్లలను బాగా చదివించుకుని మంచి భవిష్యత్తును ఏర్పరచాలన్నారు. పిల్లలు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. సమస్యలు సృష్టించేవారి గురించి సమాచారమివ్వాలని, అలాంటివారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ వెంట ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న సీఐ

తల్లిపాల వారోత్సవాలు

యల్లనూరు : మండలకేంద్రంలోని పాతపేటలో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఏసీడీపీఓ ధనలక్ష్మి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బాలింతలు, గర్భవతులు పాల్గొన్నారు. తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వారికి సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి వివరించారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు అత్యంత అవసరమని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 30 గొర్రెపిల్లల మృతి

యాడికి : మండలంలోని గుడిపాడు గ్రామంలో శనివారం కుక్కల దాడిలో 30 గొర్రెపిల్లలు మృత్యువాత పడ్డాయి. యజమాని చిన్నకాశప్ప గొర్రెపిల్లలను గూటి కింద పెట్టి గొర్రెల మందను మేతకు తీసుకెళ్లాడు. ఈ సమయంలో కుక్కలు దాడి చేసి 30పిల్లలను తీవ్రంగా గాయపరిచి చంపాయి. తిరిగి వచ్చేసరికి పిల్లలు మృతి చెంది ఉండడం చూసి చిన్నకాశప్ప హతాశయుడయ్యాడు. ఒకేసారి 30 గొర్రెపిల్లలు మృతిచెందడంతో బోరుమన్నాడు. తనకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలన్నాడు.



మృతిచెందిన గొర్రె పిల్లలు

సజ్జలదిన్నె వంకకు వర్షపునీరు



వంకలో పారుతున్న వర్షపునీరు

తాడిపత్రిరూరల్ : మండలంలోని సజ్జలదిన్నె వంకకు వర్షపు నీరు వచ్చిచేరింది. ఎగువప్రాంతంలో కురిసిన వర్షాల వల్ల వంకకు నీరు వచ్చింది. నీటి రాకతో చుట్టు పక్కల ఉన్న బండల పాలిష్, గ్రానైట్ యూనిట్ల బోర్లలో భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది.

ఒక్క పరుగు తేడాతో

అనంతపురం గెలుపు

అనంతపురం స్పోర్ట్స్: ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆంధ్రా క్రికెట్ సంఘం అండర్-16 గ్రూప్‌బి అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో అనంతపురం జట్టు 1 పరుగు తేడాతో అవుట్‌రేట్ వి జయం సాధించింది. మూడు రోజులు మ్యాచులో అనంతపురం జట్టు మొదటిఇన్నింగ్స్‌లో 211 పరుగులు చేయగా.... ప్రకాశం జట్టు 209 పరుగులు చేసింది. తరువాత రెండో ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు ఓవర్‌నైట్ స్కోరు 70-4 స్కోరుతో ప్రారంభించి శనివారం 181 పరుగులు చేసి ఆలౌటైంది. అనంతరం 184 పరుగులు విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు ఆరంభంలో చక్కగా ఆడి 2 పరుగులు చేయాల్సిన తరుణంలో మూడు వికెట్లు కోల్పోయి దీంతో ఒక్క పరుగు తేడాతో మ్యాచ్‌ను చేజార్చుకున్నారు. ఈ విజయం పట్ల జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు మాంఛోఫెర్రర్, కార్యదర్శి కేఎస్ షాహాబుద్దీన్ అభినందనలు తెలిపారు.

అసభ్య ప్రవర్తనపై మహిళ ఫిర్యాదు

అనంతపురం ఆంధ్రజ్యోతి: బళ్ళారి బైపాస్ కూడలిలో నివాసముంటున్న షరీఫ్ అనే వ్యక్తి తనపట్ల అసభ్యంగా ప్ర వర్తించినట్లు అదే ప్రాంతానికి చెందినపోలమ్మ అనే మహిళ శనివారం నాలుగవపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అర్ధరాత్రి సమయంలో తాను పడుకుని ఉండగా... ఆ సమయంలో షరీఫ్ మంచం వద్దకు వచ్చి అసభ్యంగా ప్రవర్తించారని ఆమె పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నాలుగవపట్టణ సీఐ శ్యామ్‌రావ్ తెలిపారు.

సినిమాగ్రాఫ్

ఉరవకొండ

మల్లేశ్వరి	:	ఫిదా
వెంకటేశ్వర	:	దువ్వాడ జగన్నాథమ్
బాలాజీ	:	గౌతమ్‌నందా

ఉరవకొండ సీఐగా చిన్నగౌస్

ఉరవకొండ: ఉరవకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా చిన్నగౌస్ నియమితులయ్యారు. శుక్రవారం పోలీసు ఉన్నతాధికారులు కర్నూలు జిల్లా సీఐడీగా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఉరవకొండ సీఐగా విధులు నిర్వహిస్తున్న సూర్యనారాయణను నాలుగు నెలల క్రితం వీఆర్‌కు పంపగా అప్పటి నుంచి సీఐ పోస్టు ఖాళీగా ఉంది. చిన్నగౌస్ కర్నూలు సీఐడీ నుంచి ఉరవకొండకు బదిలీ అయ్యారు.

ముట్టుకుంటే షాకే..!

కిటికీ ఊచలు, దుస్తులు ఆరేసే తీగలు ఏది పట్టుకున్నా ప్రమాదమే
జీడిపల్లిని వెంటాడుతున్న విద్యుదాఘాతాలు
ఆందోళనలో గ్రామస్థులు

బెళుగుప్ప: ఇంటి గోడలు ముట్టుకుంటే షాక్. కిటికీ ఊచలు పట్టుకున్నా... తడిగుడ్డ ఇంటి ముంగిట తంతిపై ఆరేయాలన్నా భయమే.. కారణం విద్యుత్ షాక్. ఈ కారణాలతో మృతి చెందిన వారు ఉన్నారు. గాయపడ్డవారూ ఉన్నారు. దీంతో ఆ ఊరి ప్రజలు భయం..భయంగా కాలం వెల్లదీస్తు న్నారు. ఆ గ్రామమే మండలంలోని జీడిపల్లి. విద్యుత్ తీగలు చెట్ల కొమ్మ లు తాకడం, అనధికారికంగా స్తంభాలు, తీగలకు రాళ్ల వేసి విద్యుత్ కనెక్షన్ ఇచ్చుకోవడం తదితర సమస్యల తో గ్రామంలో తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయి. విద్యుత్ షాక్‌తో ఇప్పటికే ముగ్గు రు మృతి చెందారు. స్థానికంగా విద్యుత్ శాఖ లైన్‌మన్, హెల్పర్‌లను నియమించకుం డా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు. ఈదు రు గాలులతో విద్యుత్ తీగలు ఒకదానిపై మరొకటి పడి ఇళ్లకు విద్యుత్ సరఫరా అ వుతోంది. వర్షం వచ్చి ఈదురు గాలులు వీ చాయంటే భయంతో బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. గ్రామంలో ఏర్పాటుచేసిన సింగిల్ ట్రాన్స్‌ఫార్మర్‌కు బిగించిన అర్త్‌వైర్లకు విద్యుత్ సరఫరా అవుతుండడంతో ఇళ్లలోని తలుపులు, గుడ్డలు ఆరేసేందుకు బిగించుకున్న ఇనుప కడ్డీలకు కూడా విద్యుత్ సరఫరా అయ్యి వాటిని తాకితేనే షాక్‌కు గురవుతున్నారు. ఇలా 2011 డిసెంబర్‌లో వెంకటస్వామి స్నానం చేసి కిటికీ వద్ద ఉన్న కడ్డీకి గుడ్డలు ఆరేస్తుండగా షాక్‌కు గురయ్యారు. అలాగే 2015 నవంబర్‌లో మారెన్న కూతురు మణికుమారి తోటలో ఆటలు ఆడు కుంటుండగా, రెండు స్తంభాల మధ్య ఉన్న విద్యుత్ తీగ తాకి షాక్‌కు గురైంది. గత నెల 24న మారెన్న అనే వ్యక్తి కూడా స్నానం చేసి గుడ్డలను ఇంటి వద్ద బిగించిన కడ్డీపై ఆరవేస్తుండగా షాక్‌కు గురయ్యారు. ఇలా ప్రమాదాలు జరుగుతుండడంతో గ్రామస్థులు ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయంతో ఉన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలం టూ పలుమార్లు అధికార్లకు విన్నవించుకు న్నా ప్రయోజనం లేకుండా పోయిందంటూ గ్రామస్థులు తెలిపారు.కాగా లైన్‌మన్‌ను నియమిం చినట్టు ట్రాన్స్‌కో ఏఈ సలీం తెలిపారు.



జీడిపల్లి గ్రామం



విద్యుత్ స్తంభం తీగలకు తగిలించిన రాళ్లు

అధికారుల నిర్లక్ష్యమే..



ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంతోనే మా గ్రామంలో విద్యుత్‌షాక్‌తో గ్రామస్థులు మృతిచెందుతున్నారు. బోర్లలో నీరు ఉన్నా విద్యుత్ సమస్యతో పైర్లు ఎండిపోతున్నాయి. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి.

- ఆంజనేయులు, రైతు, జీడిపల్లి.

సిబ్బందిని నియమించాలి



మూడేళ్లుగా మా గ్రామానికి ట్రాన్స్‌కో లైన్‌మన్, హెల్పర్‌ను నియమించలేదు. దీంతో వ్యవసాయ తోటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వెంటనే సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకోవాలి.

- బ్రహ్మయ్య, రైతు, జీడిపల్లి.

ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ

వజ్రకరూరు: మండలంలోని ఎన్ఎన్ పీతండా, గంజికుంట, తట్రకల్లు ప్రభుత్వ పాఠశాలలను శనివారం ఎంఈఓ ఎర్రిస్వామి తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని ఆయా పాఠశాలల హెచ్ఎంలను అడిగి తెలుసుకున్నారు. తట్రకల్లు గ్రామంలో పాఠశాలపై విద్యుత్ వైర్లు వేలాడుతున్న విషయాన్ని తెలుసుకుని విద్యుత్ అధికారులను పిలిపించి వైర్లను తొలగించారు. విద్యార్థులందరికీ ఎమ్మార్ టీకా వేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

వర్షం కోసం పూజలు

కూడేరు: మండలంలోని అరవకూరు, మరుట్ల గ్రామాల్లో వర్షం కోసం స్థానికులు పూజలు నిర్వహించారు. వరుణ దేవుడు కరుణించి వర్షాలు బాగా కురిపించాలని స్థానికులు గంగమ్మతల్లికి పూజలు చేశారు.

అర్థమయ్యేలా బోధించండి టీచర్లకు ఎంఈఓ సూచన



వార్షిక క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్

కూడేరు: విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని ఎంఈఓ చంద్రశేఖర్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం కూడేరు ఎంఆర్‌సీ సెంటర్‌లో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు తగ్గకూడదని, ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొడితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. బదిలీల్లో పాఠశాలలకు కేటాయించిన టీచర్లు విధులకు హాజరు కావాలని ఆయన కోరారు. అనంతరం పాఠశాల వార్షిక క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు.

చంద్రన్న బీమాతో కార్మికులకు ధీమా

పామిడి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చంద్రన్న బీమా పథకం కార్మికుల కుటుంబాలకు ఎంతో ధీమానిస్తోందని మున్సిపల్ చైర్మన్ గౌస్‌పీరా పేర్కొన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం బాధిత కుటుంబాలకు బీమా మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రన్న బీమాతో బాధిత కుటుంబాలకు ఓ భరోసా కలుగుతోందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ టీటీ రమణారావు, టీడీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మామోహన్‌కృష్ణ, పత్రాశ్రీనివాసులు, పట్టణ బీమా మిత్ర కే ఆదిలక్ష్మి, సీఎల్ఆర్‌పీ జయలక్ష్మి, ఆర్పీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ

ఉరవకొండ: మండలంలోని రేణుమాకులపల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించా రు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ హెప్సిబారాణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ముర్రుపాలే బిడ్డలకు శ్రేయస్కరమన్నారు. కోడిగుడ్డు, ఆకు కూరలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మి, చాంముండేశ్వరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉరవకొండ సీడీపీఓ అరుంధతి ఆధ్వర్యంలో శనివారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు ఆరోగ్య కరమైనవి, శ్రేష్ఠకరమన్నారు. అన్నప్రాసన చేసే వరకు పిల్లలకు తల్లిపాలను ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్ణమ్మ, గౌసియా, మంజులా, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే పక్కా గృహాలు

బెళుగుప్ప : అర్హులైన నిరుపేదలందరికి ప్రభుత్వం పక్కా గృహాల మంజూరుకు చర్యలు తీసుకుంటుందని తహసీల్దార్ వెంకటాచలపతి తెలిపారు. మండలంలోని ఎర్రగుడి, గంగవరం, నరసాపురం గ్రామాల్లో గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఎర్రగుడిలో తహసీల్దార్ వెంకటాచలపతి, గంగవరంలో హౌసింగ్ ఏఈ హరినాయక్, నరసాపురంలో ఎంఈఓ తిరుపాల్‌రెడ్డిలు గ్రామసభల్లో పాల్గొని అర్హులైన లబ్ధిదారులను ఎంపికచేసేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రజాసాధికారిక సర్వే నిర్వహించగా, సొంత ఇల్లు లేని వారు తమకు ఇల్లు మంజూరుచేయాలంటూ దరఖాస్తు చేసుకోవడంతో జాబితాను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఆర్ఐ భాగ్యమ్మ, ఎర్రగుడి సర్పంచ్ అనిత, గ్రామకార్యదర్శులు తిప్పేస్వామి, శ్రీరాములు, జగదీష్, వీఆర్ఓ గంగన్న పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో హనుమంతరాయుడు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని సొప్పరం ఆంజనేయస్వామి, కోటలో ఆంజనేయస్వామి, మొలకతాళ్ల ఆంజనేయస్వామి, కొనకొండ్ల గ్రామంలోని హనుమంతరాయుడు దేవాలయాల్లో శ్రావణమాసం రెండవ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో ఉదయం మూలవిరాట్టుకు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, అర్చనలు, మహామంగళ హారతి చేపట్టారు. ఈఓ కృష్ణయ్య, ఆలయ అర్చకులు, భక్తులు, పాల్గొన్నారు.

ఎన్టీఆర్ గృహాల కోసం 275 దరఖాస్తులు

విడపనకల్లు: మండల కేంద్రంలో ఎన్టీఆర్ గృహాల నిర్మాణంపై ఏర్పాటు చేసిన గ్రామసభలో 275 దరఖాస్తులు వచ్చినట్లు ఏఈ రామక్రిష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ శనివారం నిర్వహించిన గ్రామసభలో ఐఏవై, ఎన్టీఆర్ గృహాలకు 275 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని పరిశీలించి అర్హత ఉన్న వారి జాబితాను తయారు చేసి జిల్లా అధికారులకు పంపుతామన్నారు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డు నెంబర్ల ఆధారంగా అర్హులను గుర్తిస్తామన్నారు.కార్యక్రమంలో ఎంపీడీఓ షకిలాబేగం, డీటీ చంద్రశేఖర్, వీఆర్వోలు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సంజప్పతాత రథోత్సవం





రథాన్ని లాగుతున్న భక్తులు, ఉత్సవమూర్తిని అలంకరించిన దృశ్యం

ఉరవకొండ: మండలంలోని మోపిడి గ్రామంలో శనివారం సాయంత్రం సంజప్పతాత రథోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక వివాహాలను చేపట్టారు. ఉదయం మడుగు తేరును నిర్వహించారు. ఉత్సవమూర్తిని రథంపై కొలువుదీర్చారు. మేళాతాళాల మధ్య ఆలయం నుంచి బొడ్రాయి వరకు రథాన్ని లాగారు. ఈ రథోత్సవాన్ని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. రథంపైకి భక్తులు అరటిపళ్లను విసిరి మొక్కులు తీర్చుకున్నారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

నేడు రాతి దూలం లాగుడు పోటీలు

మండలంలోని మోపిడి గ్రామంలో సంజప్పతాత రథోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం రాతి దూలం లాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి బహుమతి రూ. 20 వేలు, రెండవ బహుమతి రూ. 15 వేలు, మూడవ బహుమతిగా రూ. 5 వేలను దాతలు అందజేయడం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనదలచినవారు ఉదయం పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.